www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 5-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 6

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి మ. 1.30 తదుపరి ద్వాదశి; నక్షత్రం: ధనిష్ఠ సా. 6.08 తదుపరి శతభిషం; వర్జ్యం: రా.12.35-2.01; దుర్ముహూర్తం: ఉ.8.38-9.27, మ.12.43-1.32; అమృతఘడియలు: ఉ.8.38-10.05; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.11; సూర్యాస్తమయం: 6.26

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భయంకరి



మరో రైతును తొక్కిచంపిన ఏనుగు

ఆసిఫాబాద్ జిల్లా కొండపల్లిలో ఘటన

మరో వ్యక్తిని 2 కిలోమీటర్లు వెంబడించిన వైనం

పలు మండలాల్లో 144 సెక్షన్

3

ఛత్తీస్‌గఢ్ ఏనుగు మహారాష్ట్ర నుంచి తప్పిపోయి వచ్చింది.. దానికి హాని కలిగించొద్దు

వైల్డ్ లైఫ్ పీసీసీఎఫ్ పర్గేన్

ధూం ధాం..!

బలం, బలగం చాటేలా తుక్కుగూడ సభ



తుక్కుగూడలో సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఎం, శ్రీధర్‌బాబు

లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి ఊపు తెచ్చే వ్యూహం

విజయవంతంగా ఆరు హామీల అమలుపై వివరణ

కేంద్రంలో అధికారంలోకి వస్తే పాంచ్ న్యాయ్ అమలు!

జన జాతర సభలోనే మ్యానిఫెస్టో విడుదలకూ చాన్స్

సభ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి, ఇతర నేతలు

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల ముందు గత ఏడాది సెప్టెంబరు 17న తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ భారీఎత్తున విజయ భేరి బహిరంగ సభను నిర్వహించింది. ఆరు గ్యారెంటీలను ప్రకటించింది! తెలంగాణలో అధికారాన్ని హస్తగతం చేసుకుంది! ఇప్పుడు అదే సెంటిమెంటుతో లోక్‌సభ ఎన్నికల ముందు కూడా శనివారం (ఏప్రిల్ 6) తుక్కుగూడలోనే 'జన జాతర' పేరిట భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయనుంది. పార్టీ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే తదితరులు హాజరు కానున్న ఈ సభను ధూం ధాంగా నిర్వహించాలని కసరత్తు చేస్తోంది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆనాడు చెప్పిన ప్రతి హామీనీ అమలు చేస్తున్నామని వివరించనుంది! ఆరు గ్యారెంటీల తరహాలోనే.. కేంద్రంలో అధికారంలోకి వస్తే 'పాంచ్ న్యాయ్'ను అమలు చేస్తామని స్పష్టం చేయనుంది. వెరసి, తమ బలం, బలగం చాటేలా తుక్కుగూడ జన జాతర సభను నిర్వహించాలని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఊపు తెచ్చే విధంగా దీనిని నిర్వహించాలని నిర్ణయించారు. జన జాతర సభకు పెద్ద ఎత్తున

మిగతా 13వ పేజీలో...

పది లక్షలకు మించి..!

- జన జాతర సభకు భారీగా ప్రజలను తరలించాలి
- పాంచ్ న్యాయ్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
- తెలంగాణలో కాంగ్రెస్ గాలి.. అధిక సీట్లు ఖాయం
- అప్పుడు రాహుల్ ప్రధానమంత్రి అవుతారు
- ఇన్‌చార్జులు, అభ్యర్థులతో సమీక్షలో సీఎం రేవంత్

13

కదం తొక్కుదాం.. తడాఖా చూపుదాం

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

తుక్కుగూడ సభ ఏర్పాట్ల పరిశీలన

బీఆర్ఎస్ నేతలు ప్రతిపక్షంలోనూ పనికిరాని ధ్వజం



ట్యాపింగ్‌తో పసిగట్టి..

స్టింగ్ ఆపరేషన్!

మళ్లీ తెరపైకి ఫాంహౌస్‌లో ఎమ్మెల్యేల కొనుగోలు కుట్ర కేసు

ప్రత్యేక విమానంలో దర్యాప్తు అధికారుల ప్రయాణాలు?

అదనపు డీజీపీ స్టీఫెన్ రవీంద్రపై సీఎం రేవంత్‌కు డీఎస్పీ ఫిర్యాదు

వారం రోజుల పోలీస్ కస్టడీకి రాధాకిషన్ రావు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐబీ వేదికగా జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో పోలీసుల దర్యాప్తు రోజుకో మలుపు తిరుగుతోంది. హార్డ్‌డిస్క్‌ల ధ్వంసం నుంచి మొదలైన ఈ కేసు.. విపక్ష నేతల ఫోన్ల ట్యాపింగ్, ఎన్నికల సమయంలో డబ్బు తరలింపు, బెదిరింపులు వంటి అంశాల చుట్టూ తిరగ్గా.. తాజాగా మొయినాబాద్ ఫాంహౌస్‌లో ఎమ్మెల్యేల కొనుగోలు కుట్ర కేసుతోనూ లింకులు బయటపడ్డాయి. దీంతో.. మరికొందరు పోలీసు అధికారుల మెడకు ఉచ్చు బిగుసుకుంటున్నట్లు తెలుస్తోంది. 2022 నవంబరులో మొయినాబాద్ ఫాంహౌస్ వేదికగా అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పైలట్ రోహిత్‌రెడ్డి, గువ్వల బాలరాజు, రేగా కాంతారావు, హర్షవర్ధన్‌రెడ్డి ఈ ఎపిసోడ్‌తో హాట్‌టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే.! అయితే.. ఈ నలుగురి ఫోన్లను ఎస్ఐబీ డీఎస్పీ హోదాలో ప్రణీత్ అండ్ కో ట్యాప్ చేయడం వల్లే.. అప్పటి బీఆర్ఎస్ సర్కారు ఈ విషయాన్ని ముందుగా

మిగతా 14వ పేజీలో...

ట్యాపింగ్‌కు బాధ్యత కేసీఆర్‌దే



ఆయన ఆదేశాల్లేకుండా జరిగే చాన్స్ లేదు.. కేసీఆర్‌తోపాటు కుటుంబీకుల ప్రత్యక్ష ప్రమేయం

ఉన్నతస్థాయి విచారణ జరపాలని రాష్ట్ర గవర్నర్‌ను కోరతాం

దర్యాప్తు సంస్థలు, న్యాయస్థానాలు, ఎన్నికల సంఘం, గవర్నర్ సుమోటోగా తీసుకోవాలి

బీఆర్ఎస్ గుర్తింపు రద్దుపై నిర్ణయం తీసుకోవాలి.. ఫాంహౌస్ ఫైల్స్‌కు నిర్మాత, డైరెక్టర్ కేసీఆరే

ఫిరాయింపులు ప్రోత్సహించడమే రేవంత్ ఎజెండా.. బీఆర్ఎస్ అలవాట్లనే కొనసాగిస్తున్నారు

కేసీఆర్, రేవంత్‌పై కిషన్‌రెడ్డి మండిపాటు.. రుణ మాఫీపై ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): "అప్పటి ముఖ్యమంత్రిగా చట్టబద్ధంగా కేసీఆరే ఫోన్ ట్యాపింగ్‌కు బాధ్యత వహించాలి. కేసీఆర్ ఆదేశాలు లేకుండా ఇంతమంది వ్యక్తుల ఫోన్లు ట్యాపింగ్ జరిగే అవకాశం లేదు. రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి" అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో కేసీఆర్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యుల ప్రత్యక్ష ప్రమేయం ఉందని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ ప్రభుత్వం దేశ సమగ్రతకు భంగం కలిగించేలా వ్యవహరించిందని, అందుకే ఈ వ్యవహారంపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని గవర్నర్‌ను కోరతామని తెలిపారు. దర్యాప్తు సంస్థలు, న్యాయస్థానాలు, ఎన్నికల సంఘం, గవర్నర్ ఈ వ్యవహారాన్ని సుమోటోగా తీసుకోవాలని కోరారు. అవసరమైతే కేంద్రానికి ఫిర్యాదు చేస్తామన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఒకవైపు రాజకీయ లబ్ధి కోసం, మరోవైపు కొంతమంది ప్రైవేటు వ్యక్తుల నుంచి కోట్ల రూపాయలు దోపిడీ చేసేందుకే ఈ వ్యవహారం

మిగతా 14వ పేజీలో...

ట్యాపింగ్ వల్లే పల్లా గెలుపు

ఎన్నికల టైంలో జనగామ, చేర్యాలలో నా ఇళ్లకు వంద మీటర్ల దూరంలోనే ఆఫీసులు

ముగిశాక ఖాళీ చేసి వేరే చోటుకు మార్చారు

ఆయనపై అనర్హత వేటేయాలి: ప్రతాప్‌రెడ్డి

ట్యాపింగ్ ఆరోపణలు మిలీనియం జోక్: పల్లా

14

లీగల్ నోటీసుల పేరిట కేటీఆర్ బెదిరింపులు

ఫోన్ ట్యాపింగ్‌తో అధికార దుర్వినియోగం

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరినీ అనర్హులుగా ప్రకటించాలి: ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

సాక్షులపై ఒత్తిడి తెచ్చారు

వాంగ్మూలం మార్చుకోవాలని వేధించారు.. సాక్ష్యాలనూ ధ్వంసం చేశారు

మద్యం కేసులో కవితది ముఖ్య పాత్ర.. బెయిల్ ఇస్తే దర్యాప్తునకు ఆటంకం

ప్రత్యేక కోర్టులో ఈడీ వాదనలు.. కొడుక్కి ఎగ్జామ్స్.. బెయిల్ ఇవ్వండి

ఈ సమయంలో తన వెంట ఉండాల్సిన అవసరం ఉంది

మధ్యంతర బెయిల్ కోసం కవిత విజ్ఞప్తి.. తీర్పు రిజర్వు.. 8వ తేదీన వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసే అంశంపై తీర్పును ఈడీ ప్రత్యేక కోర్టు రిజర్వ్ చేసింది. కవిత కుమారుడికి త్వరలో పరీక్షలు జరగనున్నాయని, ఈ సమయంలో ఒక తల్లిగా కుమారుడితో ఉండాల్సిన అవసరం ఆమెకు ఉందని కవిత తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదించారు. అయితే, రాజకీయ నేరస్థులకు ఇలాంటి భావోద్వేగపూరిత కారణాలు వర్తించబోవని ఈడీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇరుపక్షాల

మిగతా 11వ పేజీలో...

2

కేజ్రీవాల్‌ను సీఎం పదవి నుంచి తొలగించలేం

అది ఆయన వ్యక్తిగత నిర్ణయం

సీఎం అరెస్టుతో పాలన స్తంభించిందని చెప్పలేం

పిల్ కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు

పులిలా వచ్చి..

భూతంలా మారి..

అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియా డబ్బు ఆర్థిక వ్యవస్థలోకి రాకుండా

ఆపేందుకు 2002లో నగదు అక్రమ చలామణీ నిరోధక చట్టం

సవరణలతో ఆ చట్టానికి పదునైన కోరలు తొడిగిన ప్రభుత్వాలు

రాజకీయ ప్రత్యర్థులు, సామాజిక కార్యకర్తలపై దుర్వినియోగం

క్రూరంగా మారిన ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్

2



ద ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ).. అంతర్జాతీయ డ్రగ్ ట్రాఫికింగ్ ద్వారా పోగుపడ్డ అక్రమ సొమ్ము తప్పుడు మార్గాల ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థలోకి చేరకుండా నిరోధించడానికి 2002లో నాటి కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టమిది! ప్రపంచ ఆర్థిక వ్యవస్థకే ముప్పుగా పరిణమించిన మాదకద్రవ్యాల క్రయవిక్రయాల నగదు అక్రమ చలామణీపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఐరాస చేసిన తీర్మానం ఆధారంగా వాజ్‌పేయీ సర్కారు ఈ చట్టాన్ని తెచ్చింది. దాని అసలు ఉద్దేశం అది కాగా.. అనంతరకాలంలో ఏర్పాటైన ప్రభుత్వాలు పలు సవరణలతో ఆ చట్టానికి పదునైన కోరలు తొడుగుతూ వచ్చాయి. రైతులు, యాక్టివిస్టుల నుంచి రాజకీయ ప్రత్యర్థుల దాకా.. తమకు అడ్డొచ్చిన అందరిపైనా ప్రయోగించే క్రూరమైన చట్టంగా దాన్ని మార్చేశాయి. స్థాయీభేదాలు ఉండొచ్చుగానీ.. ఈ చట్టాన్ని ఇంత క్రూరంగా మార్చడంలో అటు యూపీఏ, ఇటు ఎన్డీయే సర్కార్లు కీలకపాత్ర పోషించాయి. ప్రత్యర్థులను అణచివేయడానికి ఆ ఆయుధాన్ని వాడుకుంటున్నాయి.



ఈశాన్యం వైపు గేటు వద్ద ర్యాంపు నిర్మిస్తున్న దృశ్యం

బీఆర్ఎస్ కార్యాలయంలో

వాస్తు మార్పులు

తెలంగాణ భవన్‌కు ఇక ఈశాన్య గేటు!.. వాయవ్యం వైపు గేటుతో దోషమనే భావన

వాహనాలన్నీ ఇక ఈశాన్య గేటులోంచే లోపలికి.. అక్కడ ర్యాంపు నిర్మాణం

పార్కింగూ అక్కడే.. ఈ మార్పునకు ట్రాఫిక్ సమస్యలు, చలానాలు కారణమట!

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భవన్‌కు వాస్తుపరంగా ఏదైనా లోపం ఉందా? అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి అదే కారణమా? పార్టీ నేతలు ఇతర పార్టీల్లోకి తరలుతుండటానికీ ఆ వాస్తు దోషమే కారణమా? ఇవే భావనలతో బీఆర్ఎస్ పెద్దలు ఉన్నట్లుగానూ.. వాస్తు పరమైన ఆ దోషాన్ని సరిచేసేందుకు నడుం బిగించినట్లుగానూ సమాచారం! ఈ మేరకు బీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయానికి వాస్తు సరి చేయడంలో భాగంగా ఈశాన్యం వైపు గేటును పూర్తిస్థాయిలో తెరిచారు. ఇక నుంచి ఈ గేటులోంచే నేతల రాకపోకలు

మిగతా 13వ పేజీలో...



వరంగల్ ఆర్డీవో ఆఫీసును జప్తు చేయండి

పరిహారం కోసం హైకోర్టును ఆశ్రయించిన రైతుకు అనుకూలంగా ఉత్తర్వులు

3

ప్రతిని కార్యాలయానికి అంటించిన కోర్టు అధికారులు

స్కూళ్లకు వేసవి సెలవులు

11

24 నుంచి

15 నుంచి వార్షిక పరీక్షలు

కొలువు ఆశలు.. ఆవిరి

- ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో భారీగా తగ్గిన క్యాంపస్ ప్లేస్‌మెంట్లు
- గత ఏడాదితో పోలిస్తే ఈసారి నాలుగోవంతు కూడా లేవు
- ఎన్ఐటీ వరంగల్‌లో నిరుడు 95 శాతం ప్రాంగణ నియామకాలు
- ఈ ఏడాది 40 శాతమే.. ఐఐటీ హైదరాబాద్‌లో 50 శాతం లోపే
- ఉస్మానియా, జేఎన్‌టీయూ, ఇతర యూనివర్సిటీల్లోనూ ఇదే పరిస్థితి



హైదరాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఏటా ఫిబ్రవరి, మార్చి నెలల్లో యూనివర్సిటీలు, కళాశాలల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ల జోష్ కనిపిస్తుంది. అత్యుత్తమ మానవ వనరులను చేజిక్కించుకునేందుకు బహుళజాతి కంపెనీలు విద్యాసంస్థల ప్రాంగణాలకు వచ్చి పోటీ పడతాయి. ప్రతిభ ఉన్న విద్యార్థులకు భారీ ప్యాకేజీలు ఇచ్చి ముందుగానే ఆఫర్ లెటర్లు అందిస్తాయి. కానీ.. ఈసారి పరిస్థితి అంత ఉత్సాహంగా ఏమీ లేదు. గత డిసెంబరుతో ముగిసిన మొదటి విడత ప్రాంగణ నియామకాల్లో.. రెండోవిడత ఫిబ్రవరి, మార్చి నెలల్లోనూ కంపెనీలు నిరాసక్తంగానే ఉన్నాయి. అత్యధిక నియామకాలు, భారీ ప్యాకేజీల్లో రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఉంటూ వస్తున్న ఎన్ఐటీ వరంగల్‌లోనూ ఈసారి నియామకాలు సగానికి పైగా తగ్గాయి. ఇక్కడ బీటెక్ సీఎస్ఈ, ట్రిపుల్ ఈ, ఈసీఈ, కెమికల్, మెకానికల్ ఇంజనీరింగ్ చదివే విద్యార్థులను కంపెనీలు ఏడాది ముందుగానే ఎంపిక

మిగతా 3వ పేజీలో...



ఉప్పల్ స్టేడియానికి కరెంట్ కట్

రూ.1.67 కోట్ల మేర బిల్లు బకాయిలు

2015లోనే విద్యుత్తు చౌర్యం కేసు నమోదు

అప్పై రెండుసార్లు బిల్లు కట్టాలని నోటీసులు

ఎట్టకేలకు గురువారం రాత్రి పునరుద్ధరణ

నేడు సన్‌రైజర్స్-చెన్నై సూపర్‌కింగ్స్ మ్యాచ్

జోరుగా ఐపీఎల్ టికెట్ల బ్లాక్ దందా

14

ఒక్కోటి రెండు, మూడు రెట్లకు విక్రయం

ఇళ్ల అమ్మకాలు అదుర్స్

12



మార్చి త్రైమాసికంలో 9 శాతం అప్.. రూ.కోటి పైన ఉండే ఇళ్లకు డిమాండ్

43% పెరిగిన ఆఫీస్ స్పేస్ లీజింగ్.. హైదరాబాద్‌లో మూడింతల పెరుగుదల

రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదికలో వెల్లడి

బిల్డాక్స్ సంస్థకు రూ. 3.96 కోట్ల జరిమానా

ఫేస్‌బుక్ ద్వారా తప్పుడు సమాచారం చేరవేస్తున్నందుకు రెరా ఫైన్

3

తండ్రిపై పెట్రోలు పోసి.. నిప్పంటించి..

3

డ్రగ్స్‌కు బానిసైన కుమారుడి ఉన్మాదం.. తండ్రి సజీవదహనం

రంగారెడ్డి జిల్లా తుర్కయాంజాల్‌లో ఘోరం

కేజ్రీవాల్‌ను సీఎం పదవి నుంచి తొలగించలేం

» ఢిల్లీ హైకోర్టు స్పష్టీకరణ.. పిల్ కొట్టివేత



న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ ముఖ్యమంత్రి పదవి నుంచి అరవింద్ కేజ్రీవాల్‌ను తొలగించాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్‌ను) విచారణకు స్వీకరించటానికి గురువారం ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. సీఎంగా కొనసాగాలా? వద్దా? అనేది కేజ్రీవాల్ వ్యక్తిగత నిర్ణయమని తెలిపింది. కోర్టు ద్వారా రాష్ట్రపతి పాలన విధించిన దాఖలాలు లేవని, పదవికి కేజ్రీవాల్ రాజీనామా చేయాలా? వద్దా? అన్నది న్యాయపరమైన అంశం కాదని.. ఆయన అరెస్టుతో ప్రభుత్వం స్తంభించిపోయిందని చెప్పలేమని పేర్కొంది. పరిపాలన కొనసాగించడంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జీ) పూర్తిగా సమర్థుడని, ఆయనకు తమ మార్గదర్శకత్వం అవసరం లేదని వెల్లడించింది. ఈ సమస్యకు పరిష్కారం న్యాయస్థానాల్లో లేదని, ఇతర రాజ్యాంగ సంస్థలు నిర్ణయం తీసుకోవాల్సి ఉందని సూచించింది. ఈ మేరకు హిందూసేన అధ్యక్షుడు విష్ణుగుప్తా దాఖలు చేసిన పిల్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. ఇంతకుముందు కూడా ఇటువంటి పిల్ ఒకటి దాఖలు కాగా.. దానిని కూడా హైకోర్టు విచారణకు తీసుకోలేదు. మార్చి 21న కేజ్రీవాల్ అరెస్టు తర్వాత ఢిల్లీలో పాలన స్తంభించిందని, రాజ్యాంగ ప్రతిష్టంభన ఏర్పడిందని విష్ణుగుప్తా తన పిటిషన్‌లో పేర్కొన్నారు. మరోవైపు, కేజ్రీవాల్ జైలులో ఉదయం, సాయంత్రం గంటన్నర చొప్పున ధ్యానం, యోగా చేస్తున్నారని అధిక సమయం పుస్తక పఠనంలో గడుపుతున్నారని తిహాడ్ జైలు వర్గాలు తెలిపాయి. రామాయణం, భగవద్గీత, హౌ ప్రైమినిస్టర్స్ డిసైడ్ పుస్తకాలను కేజ్రీవాల్ తెప్పించుకున్న విషయం తెలిసిందే. కాగా, ప్రతి రోజూ నియోజకవర్గాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆప్ ఎమ్మెల్యేలకు కేజ్రీవాల్ సూచించారు. ఈ మేరకు కేజ్రీవాల్ సందేశాన్ని ఆయన భార్య సునీత ఓ వీడియోలో చదివి వినిపించారు.


నా ప్రియుడు మనతోనే ఉంటాడు!

» వివాహేతర బంధం బయటపెట్టిన భర్తకు విచిత్రమైన ప్రతిపాదన చేసిన భార్య

» ఒప్పించేందుకు విద్యుత్తు స్తంభం ఎక్కిన వైనం.. యూపీలో ఘటన

లఖ్‌నవూ, ఏప్రిల్ 4: తాను నెరుపుతున్న వివాహేతర సంబంధాన్ని భర్త బట్టబయలు చేసినా ఆ భార్య కంగారుపడలేదు. పైగా ప్రియుడిని విడిచి తాను ఉండలేనని.. అలా అని వైవాహిక బంధాన్నీ తెంచుకోలేనని భర్తకు తేల్చి చెప్పింది. యూపీలోని గోరఖ్‌పూర్ సమీపంలోని పిప్రైచ్ గ్రామంలో బుధవారం జరిగిన ఈ ఘటన స్థానికులను నోరెళ్లబెట్టేలా చేసింది. ఈ గ్రామానికి చెందిన 34 ఏళ్ల మహిళ, రామ్ గోవింద్ భార్యాభర్తలు. వీరికి ముగ్గురు పిల్లలు. రామ్ గోవింద్ కూలీ పనులను వెళుతుంటాడు. అతడి భార్య పొరుగూరుకు చెందిన ఓ వ్యక్తితో ఏడేళ్లుగా వివాహేతర సంబంధం నడుపుతోంది. విషయం తెలిసిన భర్త ఆమెతో గొడవ పడ్డాడు. అదేమీ పట్టించుకోని ఆమె.. ప్రియుడిని విడిచి తాను ఉండలేని భర్తకు తేల్చి చెప్పింది. పైగా ప్రియుడిని ఇంట్లోనే పెట్టుకుందామని.. ఇంటి ఆర్థిక అవసరాలకు అండగా ఉంటాడని నచ్చజెప్పే ప్రయత్నం చేసింది. ఈ ప్రతిపాదన విని చిర్రెత్తిపోయిన భర్త ఆమెను ఇంట్లోంచి వెళ్లగొట్టాడు. ఆమె.. తన మాట నెగ్గించుకోవాలనే పట్టుదలతో సమీపంలోని విద్యుత్తు స్తంభాన్ని ఎక్కింది. రంగంలోకి దిగిన పోలీసులు ఆమెను కిందకు తీసుకొచ్చేందుకు హైరానా పడాల్సి వచ్చింది. ఘటన తాలూకు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

లోకం తీరు





రాజ్యసభ సభ్యురాలిగా
సోనియా ప్రమాణం

తెలంగాణ నుంచి రవిచంద్ర, ఏపీ నుంచి మరో ముగ్గురు..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణతోపాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 14 మంది రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ తన చాంబర్‌లో గురువారం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ రాజస్థాన్ నుంచి తొలిసారిగా పెద్దల సభకు ఎన్నికైన విషయం తెలిసిందే. ఆమెతోపాటు తెలంగాణ నుంచి వద్దిరాజు రవిచంద్ర(బీఆర్ఎస్), ఏపీ నుంచి వైసీపీ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబురావు, మేడా రఘునాథ్ రెడ్డి, ఒడిశా నుంచి కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్(బీజేపీ), సుభాశిశ్ కుంతియా(బీజేడీ), దేబాశిశ్ సామంతరాయ్(బీజేడీ), కర్ణాటక నుంచి కాంగ్రెస్ అధికార ప్రతినిధి అజయ్ మాకెన్, సయ్యద్ నజీర్ హుస్సేన్, యూపీ నుంచి ఆర్‌పీఎన్ సింగ్(బీజేపీ), పశ్చిమబెంగాల్ నుంచి సామిక్ భట్టాచార్య(బీజేపీ), బిహార్ నుంచి సంజయ్ కుమార్ ఝా(జేడీయూ), మదన్ రాథోర్(బీజేపీ)లు ప్రమాణ స్వీకారం చేశారు.

అమేఠీలో ప్రియాంక భర్త వాద్రా పోటీ?

న్యూఢిల్లీ/వయనాడ్, ఏప్రిల్ 4: కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ భర్త, వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా రాజకీయాల్లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని అమేఠీ నుంచి బరిలోకి దిగే చాన్స్ ఉందని ఆయన సూచనప్రాయంగా వెల్లడించారు. ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. 'స్మృతీ ఇరానీని గెలిపించి తప్పు చేశామని అమేఠీ ప్రజలు కలత చెందుతున్నారు. మళ్లీ గాంధీ కుటుంబం నుంచే మరొకరు రావాలని కోరుకుంటున్నారు. అమేఠీ కోసం గాంధీ కుటుంబం ఎంత కష్టపడిందో అందరికీ తెలుసు. నేను ఎంపీగా పోటీ చేయాలనుకుంటే.. అమేఠీ నుంచే పోటీ చేస్తే బాగుంటుందని అక్కడి ప్రజలు భావిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. సుదీర్ఘ కాలం అమేఠీ నుంచి ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గత ఎన్నికల్లో స్మృతి చేతిలో ఓడిన సంగతి తెలిసిందే.

రాహుల్ ఆస్తులు రూ.20 కోట్లు

కేరళలోని వయనాడ్ నుంచి లోక్‌సభకు పోటీ చేస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన ఆస్తుల విలువను రూ.20 కోట్లుగా పేర్కొన్నారు. నామినేషన్ దాఖలు సమయంలో ఇచ్చిన అఫిడవిట్‌లో వాటి వివరాలను రాహుల్ వెల్లడించారు. తన చరాస్తుల విలువ రూ.9.24 కోట్లుగా, స్థిర ఆస్తులు రూ.8 కోట్లుగా ఆయన పేర్కొన్నారు. తన చేతిలో ప్రస్తుతం రూ.55 వేల నగదు ఉన్నట్లు అఫిడవిట్‌లో వివరించారు.

ఓటరు కార్డు లేకున్నా ఓటు వేయచ్చు: ఈసీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: ఓటరు తన ఓటు హక్కును కోల్పోకూడదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ఎన్నికల అధికారులకు పలు సూచనలు చేసింది. ఓటర్ల జాబితాలోని ఓటరు పేరులో అక్షర దోషాలు ఉన్నాయన్న కారణంగా ఓటును నిరాకరించవద్దని పేర్కొంది. ఓటరు ఐడీ కార్డు ఆధారంగా ఓటు వేయడానికి అనుమతించాలని తెలిపింది. ఓటరుకు, జాబితాలోని ఫొటోకు సంబంధం లేదని భావిస్తే.. ఈసీ గుర్తించిన ఏదో ఒక ఫొటో ఐడీ కార్డును చూపించినట్లయితే ఓటు వేయడానికి అనుమతించాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్‌కు ఢోకా లేదు

ప్రభుత్వ ఉద్యోగులు ఈసారి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే హక్కును కోల్పోతారంటూ వాట్సా్ప్‌లో జరుగుతున్న ప్రచారాన్ని కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) గురువారం ఖండించింది. ఇటువంటి తప్పుడు వార్తలు నమ్మొద్దని తెలిపింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులంతా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు వేయవచ్చని స్పష్టం చేసింది.

పామును నమ్మొచ్చుగానీ.. బీజేపీని నమ్మొద్దు

» స్థానికులపై విదేశీ ముద్ర వేసేందుకే సీఏఏ: మమత

కూచ్‌బెహార్, ఏప్రిల్ 4: విష సర్పాన్నయినా నమ్మొచ్చు, పెంచుకోవచ్చుగానీ, కాషాయ దళాన్ని (బీజేపీని) ఎంత మాత్రం నమ్మకూడదంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఘాటు విమర్శలు చేశారు. ఆ పార్టీ దేశాన్ని నాశనం చేస్తోందని వ్యాఖ్యానించారు. గురువారం కూచ్‌బెహార్, మాల్‌బజార్‌ల్లో జరిగిన ఎన్నికల బహిరంగ సభల్లో ఆమె ప్రసంగించారు. రక్షణ బలగాలైన బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ దళాలతో పాటు, ఆర్మీ ఆస్పత్రులను కూడా తనకు అనుకూలంగా వాడుకుంటోందని ఆరోపించారు. పౌరసత్వ సవరణ చట్టా (సీఏఏ)న్ని వ్యతిరేకించిన మమత.. స్థానికులపై విదేశీయులు అన్న ముద్ర వేయడానికే దీన్ని బీజేపీ తీసుకొచ్చిందని ఆరోపించారు. అందువల్ల ఈ చట్టం ప్రకారం పౌరసత్వం కోసం ఎవరూ దరఖాస్తు చేయకూడదని కోరారు.

3,6 తరగతులకు కొత్త పాఠ్య పుస్తకాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: మూడు, ఆరు తరగతులకు కొత్త సిలబస్‌తో పాఠ్య పుస్తకాల విడుదల తేదీలను జాతీయ విద్యా పరిశోధనా, శిక్షణ సంస్థ (ఎన్‌సీఈఆర్టీ) గురువారం ప్రకటించింది. మూడో తరగతి పాఠ్య పుస్తకాలు ఈ నెల చివరి వారంనాటికి, ఆరో తరగతి పుస్తకాలు మే మధ్యకాలంనాటికి అందుబాటులో ఉంటాయని పేర్కొంది. అలాగే 1, 2, 7, 8, 10, 12 తరగతులకు సంబంధించిన 2023-24 ఎడిషన్స్ పాఠ్యపుస్తకాలు దేశవ్యాప్తంగా 1.21 కోట్ల కాపీలు విడుదల చేసినట్టు తెలిపింది. మరోవైపు మారిన కరికులమ్‌కు అనుగుణంగా ఆరో తరగతి విద్యార్థులను ప్రిపేర్ చేయడానికి వీలుగా ఉపాధ్యాయుల కోసం ఈ తరగతికి సంబంధించి బ్రిడ్జ్ కోర్సును ఎన్‌సీఈఆర్టీ పోర్టల్‌లో అందుబాటులో ఉంచినట్టు పేర్కొంది.

అగ్ని-ప్రైమ్ క్షిపణి ప్రయోగం సక్సెస్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: దేశ రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక ముందడుగు పడింది. అణ్వాయుధ సామర్థ్యం కలిగిన కొత్త తరం బాలిస్టిక్ క్షిపణి 'అగ్ని-ప్రైమ్'ను భారత్ విజయవంతంగా పరీక్షించింది. ఒడిసా తీరంలోని అబ్దుల్ కలాం ద్వీపం నుంచి బుధవారం రాత్రి 7 గంటల సమయంలో ఈ ప్రయోగం చేపట్టినట్టు రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. పరీక్ష సందర్భంగా డౌన్‌రేంజ్ నౌకలతో సహా వివిధ ప్రదేశాల్లో మోహరించిన అనేక సెన్సర్ల ద్వారా సేకరించిన డేటా ఆధారంగా అగ్ని-ప్రైమ్ దాని విశ్వసనీయ పనితీరుని ధ్రువీకరించే అన్ని లక్ష్యాలనూ పూర్తిచేసిందని రక్షణ శాఖ పేర్కొంది. 1000 నుంచి 2000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం కలిగిన ఈ మిస్సైల్‌ను స్ట్రాటిజిక్ ఫోర్సెస్ కమాండ్ (ఎస్ఎఫ్‌సీ), రక్షణ రంగ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) కలిసి పరీక్షించాయి.

పులిలా వచ్చి.. భూతంగా మారి

అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియా డబ్బు ఆర్థికవ్యవస్థలోకి రాకుండా ఆపేందుకు 2002లో పీఎంఎల్ఏ

» రాజకీయ ప్రత్యర్థులు, సామాజిక కార్యకర్తలపై.. దుర్వినియోగం

» అత్యంత క్రూరంగా మారిన ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్

(సెంట్రల్ డెస్క్)



తమిళనాడుకు చెందిన కన్నయ్యన్ (72), కృష్ణన్ (66) అనే ఇద్దరు దళిత రైతులకు ఈడీ 'ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్' కింద 2023 జూలైలో నోటీసులు జారీచేసింది. వారి పొలం చుట్టూ వేసిన విద్యుత్ తీగలు తగిలి రెండు ఎద్దులు చనిపోయాయన్నది కేసు! దానికీ ఈడీకీ.. ఎద్దులు చనిపోవడానికి, నగదు అక్రమ చలామణి నిరోధక చట్టానికీ సంబంధం ఏమిటంటారా? వారికి ఈడీ సమన్లు రావడం వెనుక ఇంకో కారణం ఉంది. ఆ రైతులకు, స్థానిక బీజేపీ నాయకుడికి పొలంగట్టు తగాదాలేవో ఉన్నాయి. అదీ విషయం. కానీ, దీనిపై ప్రజాగ్రహం తీవ్రస్థాయిలో వెల్లువెత్తేసరికి ఈడీకి విషయం అర్థమై ఆ నోటీసులను ఉపసంహరించుకుంది. 'ఇసింటా రమ్మంటే.. ఇల్లంతా నాదే' అన్న చందంగా ఒక ఉదాత్తమైన ఉద్దేశంతో రెండు దశాబ్దాల క్రితం చేసిన పీఎంఎల్ఏ చట్టం ఇప్పుడు ఏస్థాయిలో దుర్వినియోగం అవుతోందో చెప్పే చిన్న ఉదాహరణ ఇది. అంతర్జాతీయంగా మాదక ద్రవ్యాల క్రయవిక్రయాల ద్వారా వచ్చిన సొమ్మును డ్రగ్స్ మాఫియా వివిధ మార్గాల ద్వారా పలు దేశాల ఆర్థిక వ్యవస్థలోకి చొప్పించడం వల్ల ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలు దెబ్బతినడాన్ని ఐక్యరాజ్యసమితి 1988లో గుర్తించింది. ఇది ఆయా దేశాల సార్వభౌమత్వానికే విఘాతం అని అభిప్రాయపడింది. దీన్ని తీవ్రంగా పరిగణించి ఆ ఏడాది 'యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఎగైనెస్ట్ ఇల్లిసిట్ ట్రాఫిక్ ఇన్ నార్కోటిక్ డ్రగ్స్‌అండ్‌సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్' సమావేశాన్ని ఏర్పాటు చేసింది. దానికి హాజరైన అన్ని దేశాల ప్రతినిధులూ మాదకద్రవ్యాల నేరాలకు సంబంధించిన నగదు అక్రమ చలామణికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. 1989 జూలైలో ప్రపంచంలోనే పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన 7 అతిపెద్ద దేశాలు పారిస్‌లో సమావేశమై ఇదే అంశంపై చర్చించాయి. మనీ లాండరింగ్ సమస్యను సమర్థంగా ఎదుర్కొనేందుకు 'ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఫ్యాట్‌ఎఫ్)'ను ఏర్పాటు చేశాయి. 1990లో ఐరాస.. 'ద పొలిటికల్ డిక్లరేషన్ అండ్ గ్లోబల్ ప్రోగ్రామ్ ఆఫ్ యాక్షన్' పేరుతో ఓ తీర్మానం చేసింది. దీనికింద సభ్యదేశాలన్నీ మాదక ద్రవ్యాల నగదు అక్రమ చలామణిని నిరోధించే చట్టాలు చేయాలని పిలుపునిచ్చింది. 1998లోనూ 'కౌంటరింగ్ వరల్డ్ డ్రగ్ ప్రాబ్లమ్' అనే థీమ్‌తో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఇదే సూచన చేసింది. ఆమేరకే అప్పటి వాజపేయీ సర్కారు నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం చేసింది. 2003లో దానికి రాష్ట్రపతి ఆమోదం లభించినా ఆ చట్టంలో కొన్ని లోపాలుండడంతో తర్వాత వచ్చిన యూపీఏ సర్కారు వాటిని సవరించి 2005నుంచి అమల్లోకి తెచ్చింది.

మరికొన్ని నేరాలూ..

ప్రధానంగా మాదకద్రవ్యాల విక్రేతల పాలిట పులిలా ఏర్పాటైన పీఎంఎల్ఏ చట్టం.. దరిమిలా అధికార పార్టీ రాజకీయ ప్రత్యర్థులు, సామాజిక కార్యకర్తల పాలిట భూతంలా మారిందంటే అతిశయోక్తి కాదు. భారత శిక్షాస్మృతి(ఐపీసీ)లోని కొన్ని నేరాలను, నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్డీపీఎస్) యాక్ట్‌లోని కొన్ని నేరాలను కూడా అందులోకి తేవడమే ఇందుకు కారణమని లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ పీడీటీ ఆచారి వంటివారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజ్యాంగంలోని 253వ అధికరణం ప్రకారం కేంద్రం ఈ చట్టం చేసింది. అంతర్జాతీయ ఒడంబడికల అమలుకనుగుణంగా చట్టాలు చేసే వీలు కల్పించే ఆర్టికల్ అది. ఏదైనా అంతర్జాతీయ సంస్థ చేసిన తీర్మానాన్ని/నిర్ణయాన్ని అమలు చేసే క్రమంలో ఈ ఆర్టికల్ కింద చట్టం చేసేటప్పుడు అది ఆ తీర్మానానికి అనుగుణంగా మాత్రమే లోబడి ఉండాలని 253వ అధికరణం చెబుతోంది. అంటే పీఎంఎల్ఏ యాక్ట్ అంతర్జాతీయ డ్రగ్స్, ఇతరత్రా నేరపూరిత లావాదేవీలతో పోగుపడే నల్లధనాన్ని అరికట్టడానికే పరిమితమై ఉండాలి. కాబట్టి.. డ్రగ్ ట్రాఫికింగ్‌కు పాల్పడే కరడుగట్టిన, ప్రమాదకరమైన నేరగాళ్లతో వ్యవహరించాలి. కానీ, ఈ చట్టానికి చేసిన సవరణలతో ఐపీసీ జాబితాలో డబ్బు ప్రమేయం ఉన్న కొన్ని నేరాలు, ప్రత్యేక చట్టాల ద్వారా శిక్షించదగ్గ నేరాలు సైతం దీంట్లోకి చేరాయి. ఉదాహరణకు.. పబ్లిక్ సర్వెంట్స్ అవినీతి కట్టడికి చేసిన 'అవినీతి నిరోధక చట్టం' కిందకు వచ్చే కేసులనూ 2009లో పీఎంఎల్ఏలోని షెడ్యూల్ ఆఫ్ అఫెన్సెస్‌లోకి చేర్చారు (ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టయింది దీని కిందే). ఎవరైనా ఒక పబ్లిక్ సర్వెంట్ అవినీతి కేసులో అరెస్టయితే అందులో డబ్బు ప్రమేయం ఉంది కాబట్టి ఈడీ అందులో వేలు పెడుతుంది. అంతర్జాతీయ డ్రగ్స్ మాఫియాకు చెందిన నేరగాడితో సమానంగా అతడితో వ్యవహరిస్తుంది. 2019లో ఈ చట్టానికి చేసిన సవరణలతో మనీలాండరింగ్ నేరానికి పాల్పడేవారికి, ఇతర షెడ్యూల్డ్ నేరాలు చేసినవారికి మధ్య గీత దాదాపుగా చెరిగిపోయింది. ఈ చట్టంలో ఉన్న మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే.. సాధారణ నేరాలకు సంబంధించిన కేసుల్లో అరెస్టయితే, నేరం రుజువయ్యే దాకా నిందితులను నిర్దోషులుగానే వ్యవహరిస్తారు. కానీ పీఎంఎల్ఏ అందుకు విరుద్ధం. ఈ చట్టం కింద అరెస్టయ్యేవారు తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకునేదాకా దోషులే అవుతారు. అరెస్టయినవారికి ఈసీఐఆర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్వెస్టిగేషన్ రిపోర్ట్-ఫిర్యాదు) కాపీ కూడా ఇవ్వరు. ఈ చట్టం కింద ఈడీ రాష్ట్రాల అనుమతి అవసరంలేకుండా దేశంలో ఎక్కడైనా దర్యాప్తు చేపట్టవచ్చు. ఇది సమాఖ్య స్ఫూర్తికి భంగం కలిగిస్తోందనే ఆందోళన ఉంది.

చివరాఖరు: అధికార పార్టీ రాజకీయ ప్రత్యర్థుల విషయంలో సుద్దపూసలా, కఠినంగా వ్యవహరించి పీఎంఎల్ఏ కింద కేసులు పెట్టి, బెయిల్ ఇవ్వడానికి వీల్లేదంటూ వాదించే ఈడీ.. మరికొందరి విషయంలో చాలా ఉదారంగా వ్యవహరిస్తోంది. వారు నిజంగానే అంతర్జాతీయ స్థాయిలో నగదు అక్రమ చలామణీకి పాల్పడినా.. విదేశాల్లో పోగేసుకున్న నల్లధనాన్ని తప్పుడు మార్గాల్లో దేశంలోకి తెచ్చి తెల్లధనంగా మార్చుకుంటున్నా వారిపై కేసులు అంగుళం ముందుకు కదలకపోయినా.. ఏళ్లతరబడి వారు బెయిల్‌పైనే తిరుగుతున్నా తనకేమీ పట్టనట్టే వ్యవహరిస్తోంది!

బెయిల్.. దాదాపు అసాధ్యం!

పీఎంఎల్ఏలోని అత్యంత కఠినమైన సెక్షన్ 45. ఈ చట్టం కింద అరెస్టయిన వారికి బెయిల్ దొరకడం అత్యంత కష్టతరం. కొన్ని సందర్భాల్లో దాదాపు అసాధ్యం. పీఎంఎల్ఏ కింద అరెస్టయినవారు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయిస్తే జడ్జి సంతృప్తి చెందిన సందర్భాల్లో మాత్రమే బెయిల్ మంజూరవుతుంది. అందుకే ఈ చట్టం కింద అరెస్టయినవారు బెయిల్ లేకుండా ఏళ్లతరబడి జైళ్లల్లో మగ్గిపోతుంటారు. ఈ సెక్షన్ రాజ్యాంగంలోని 14, 21 అధికరణాలకు విరుద్ధమంటూ 2018లో ఇద్దరు సభ్యుల సుప్రీం ధర్మాసనం తీర్పునిచ్చింది. కానీ పార్లమెంటు కొన్ని సవరణల ద్వారా ఆ సెక్షన్‌ను సజీవంగా ఉంచింది. దాన్ని సవాల్ చేస్తూ దాఖలైన కేసును విచారించిన ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఆ సవరణలను సమర్థిస్తూ 2022లో తీర్పునిచ్చింది. ఈడీ అధికారులు ఈ చట్టం కింద ఎవరినైనా అరెస్ట్ చేస్తే వారికి ఈసీఐఆర్ ఇవ్వాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పింది. ఇది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులకు విరుద్ధమంటూ ఆ తీర్పుపై వేసిన రివ్యూ పిటిషన్ ప్రస్తుతం సుప్రీంలో పెండింగ్‌లో ఉంది.

ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నిజామాబాద్	41.4	27.4
ఆదిలాబాద్	41.3	27.5
మహబూబ్‌నగర్	41.0	27.5

యూపీఏ హయాంలో
దేశానికి చెడ్డపేరు

» ప్రధాని మోదీ విమర్శ



జాముయి (బిహార్), ఏప్రిల్ 4: పాకిస్థాన్ నుంచి ఎదురయిన ఉగ్రవాద ముప్పును ఎదుర్కోలేక గత యూపీఏ ప్రభుత్వం దేశానికి చెడ్డపేరు తీసుకొచ్చిందని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. ఆ కారణంగా భారతదేశం బలహీనమైనది, పేదది అన్న ముద్రపడిందని వ్యాఖ్యానించారు. గురువారం బిహార్‌లోని జాముయిలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించారు. "అవినీతికి పాల్పడ్డ వారిని జైలుకు పంపించవద్దా? నేను అవినీతిని నిర్మూలించాలని అంటుంటే వారు మాత్రం మోదీని ఓడించాలని పిలుపునిస్తున్నారు" అని వ్యాఖ్యానించారు. ఇది బిహార్‌లో ఎన్డీఏ పక్షాన నిర్వహించిన తొలి ప్రచార సభ కావడంతో ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ కూడా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మొత్తం 40 స్థానాలను గెలుస్తామని, 400 సీట్లను సాధించాలన్న మోదీ లక్ష్యాన్ని నెరవేరుస్తామని చెప్పారు.

ఐయూఎంఎల్ మద్దతు రాహుల్‌కు ఇష్టం లేదు

» స్మృతి ఇరానీ

వయనాడ్, ఏప్రిల్ 4: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కేంద్రమంత్రి స్మృతి ఇరానీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేరళలోని వయనాడ్‌లో బీజేపీ అభ్యర్థి సురేంద్రన్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు స్మృతి ఇరానీ పాల్గొన్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎమ్ఎల్) మద్దతు పొందడం రాహుల్ తలవంపుగా భావిస్తున్నారన్నారు. అందుకే ఆయన చేపట్టిన ర్యాలీలో ఆ పార్టీ జెండా ఒక్కటి కూడా కనబడలేదని చెప్పారు.

అమెరికా ఓటర్ల మద్దతు ట్రంప్‌నకే

» 7 కీలక రాష్ట్రాల సర్వేల్లో బైడెన్ కంటే ఆయనే ముందంజ

వాషింగ్టన్, ఏప్రిల్ 4: ఈ ఏడాది చివర్లో జరిగే ఎన్నికల్లో అమెరికా అధ్యక్షుడు, డెమొక్రాటిక్ అభ్యర్థి జో బైడెన్‌కు షాక్ తగిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. అమెరికా ఓటర్ల నమ్మకాన్ని ఆయన కోల్పోతున్నట్లు తెలుస్తోంది. తాజాగా నిర్వహించిన ఓ సర్వేలో బైడెన్ తన ప్రత్యర్థి, రిపబ్లిక్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్ కంటే వెనుకంజలో ఉన్నట్లు తేలింది. అమెరికాలోని అత్యంత కీలకమైన ఏడు రాష్ట్రాల్లో నిర్వహించిన ఒపీనియన్ పోల్‌లో ఆరు రాష్ట్రాలలోని ఓటర్లు ట్రంప్‌పై విశ్వాసం వ్యక్తం చేయగా.. కేవలం ఒక రాష్ట్రంలో మాత్రమే బైడెన్‌కు మద్దతుగా నిలిచారు. పెన్సిల్వేనియా, మిచిగాన్, అరిజోనా, జార్జియా, నెవెడ, నార్త్ కరోలినా రాష్ట్రాలలో బైడెన్ కంటే ట్రంప్ 2 నుంచి 8 పాయింట్లతో ముందంజలో ఉన్నారు. ఒక్క విస్కాన్సిన్‌లో మాత్రం బైడెన్ మూడు పాయింట్ల ఆధిక్యంలో ఉన్నారు. ముఖ్యంగా దేశ ఆర్థిక పరిస్థితిపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని, బైడెన్ సామర్థ్యం, విధి నిర్వహణపై కూడా సందేహంతో ఉన్నారని సర్వేలో వెల్లడైంది. కాగా ఈసారి అధ్యక్ష ఎన్నికల్లో బైడెన్, ట్రంప్ మధ్య పోరు హోరాహోరీగా ఉంటుందని 'రియల్ క్లియర్ పాలిటిక్స్' అనే సంస్థ వెల్లడించింది.

నల్లమందు తిని నిద్రపోతున్నావా?

» చైనా ఆక్రమణలపై స్పందించడంలేదేమిటి?

» మోదీపై ఖర్గే ఘాటు వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఘాటుగా విమర్శించారు. దేశం గురించి పట్టించుకోకుండా 35ఏళ్లుగా ఎలాంటి పదవిలోలేని గాంధీ కుటుంబంపై విమర్శలు చేయడానికే పరిమితం కావడం ఏమిటని నిలదీశారు. రాజస్థాన్‌లోని చితోర్‌ఘడ్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఖర్గే ప్రసంగిస్తూ "మోదీ చెప్పుకుంటారు.. 'నాకు 56 ఇంచీల ఛాతీ ఉందని.. ఎవరికీ భయపడనని..' నిజంగా భయపడకపోతే చైనా భారీగా భూభాగాన్ని ఆక్రమిస్తున్నా ఎందుకు విడిచిపెట్టారు? వారు లోపలికి చొచ్చుకు వస్తున్నారు.. మీరేమో నిద్రపోతున్నారు. మీరేమైనా నిద్ర మాత్రలు మింగారా? లేదంటే రాజస్థాన్‌లో పండిన నల్లమందును తీసుకొచ్చి వారేమైనా మీకు తినిపించారా?" అని ప్రశ్నించారు. మోదీని 'అబద్ధాల సర్దార్' అని విమర్శించారు.

ముస్లింలకు విడాకులు మంజూరు అధికారం ఫ్యామిలీ కోర్టుకు ఉంది

» కర్ణాటక హైకోర్టు ధర్మాసనం

బెంగళూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): వివాహం రద్దు చేసుకోవాలని పరస్పరం నిర్ణయించుకున్న ముస్లిం దంపతులకు విడాకులు ఇచ్చే అధికారం ఫ్యామిలీ కోర్టుకు ఉందని కర్ణాటక హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. షబనం, పర్వీన్ అహ్మద్ అనే దంపతులు దాఖలు చేసుకున్న పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అనుశివరామన్, జస్టిస్ అనంత రామనాథ హెగ్డేల ధర్మాసనం గురువారం విచారించింది. ముబారత్ ఒప్పందం ప్రకారం దంపతులు వివాహాన్ని రద్దు చేసుకోవాలని భావిస్తే ఫ్యామిలీ కోర్టు విడాకులను మంజూరు చేయవచ్చునని సూచించింది. ఇందుకు సంబంధించి గతంలో ఇచ్చిన కొన్ని తీర్పులను ప్రస్తావించింది.

కాంగ్రెస్‌లో ఐదు 'పవర్ సెంటర్లు'

» సోనియా, రాహుల్, ప్రియాంక మల్లికార్జున ఖర్గే, వేణుగోపాల్

» ఎవరి వర్గం.. ఎవరి రాజకీయ వారిదే

» అధిష్ఠానానికి తీవ్ర అహంకారం

» బహిష్కృత నేత సంజయ్ ఆరోపణలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి తీవ్ర అహంకారమని ఆ పార్టీ బహిష్కృత నేత సంజయ్ నిరుపమ్ అన్నారు. కాంగ్రెస్‌లో ఐదు అధికార కేంద్రాలు ఉంటాయని.. ఎవరి వర్గం వారికి ఉంటుందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌లో గతంలో ఒకే ఒక్క అధికార కేంద్రం ఉండేదని.. ఇప్పుడు మాత్రం ఐదు ఉన్నాయని చెప్పారు. ఇందులో మొదటిది సోనియా, రెండోది రాహుల్, మూడు ప్రియాంక, నాలుగు మల్లికార్జున ఖర్గే, ఐదు కేసీ వేణుగోపాల్ అని.. ఈ ఐదుగురూ ఎవరికి వారు తమదైన పంథాలో రాజకీయం చేస్తారని ఆరోపించారు. వీరి మధ్య లక్షలాది మంది కార్యకర్తలు నలిగిపోతున్నారన్నారు. క్షేత్రస్థాయితో సంబంధంలేని నేతలంతా రాహుల్ చుట్టూ చేరారని సంజయ్ పేర్కొన్నారు. "కాంగ్రెస్ ప్రస్తుతం పూర్తిగా చెల్లాచెదురైపోయిన పార్టీ. కాంగ్రెస్ నేతలు గతంలో పార్టీ సిద్ధాంతాలు దశాదిశా లేకుండా ఉన్నాయని ఆరోపించేవారు. ఇప్పుడు మాత్రం పార్టీ అనుసరిస్తున్న విధానాల వల్లే వారంతా చెల్లాచెదురైపోతున్నారు" అని వ్యాఖ్యానించారు. తనను పార్టీ నుంచి బహిష్కరించడంపై స్పందిస్తూ.. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేనతో కలిసి కాంగ్రెస్ కూటమి కట్టిన తీరు తనకు ఆగ్రహం తెప్పించిందని సంజయ్ చెప్పారు. సేనకు ఎక్కువ సీట్లు అప్పగించేయడం సరికాదన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ బలహీనమవుతుందని, ముంబైలో నెమ్మదిగా భూస్థాపితం అయిపోతుందని చెప్పారు. సేనకు ఎక్కువ సీట్లు ఇవ్వడం సరికాదని చెప్పడాన్ని 'పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు'గా అభివర్ణించి, తనను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారని తెలిపారు. బుధవారమే తన రాజీనామా లేఖను ఖర్గేకు పంపానని సంజయ్ వెల్లడించారు. ఆ లేఖ అందిన తర్వాత కూడా స్పందించకపోతే బాగుండదనే.. తనను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటన విడుదల చేశారని తెలిపారు. మొత్తం మీద వారు ఒక ఏ4 సైజు కాగితాన్ని వృథా చేశారని ఎద్దేవా చేశారు. భవిష్యత్తు కార్యాచరణపై విలేకరులు ప్రశ్నించగా.. "ఏ పార్టీలో చేరతాననేది త్వరలోనే చెబుతా. ఇక దేశంలో ప్రధాని మోదీకి ఇప్పటికీ అత్యధిక ప్రజాదరణ ఉంది" అని సంజయ్ చెప్పారు.

20గంటల తర్వాత మృత్యుంజయుడిగా..

» కర్ణాటకలో బోరుబావిలో పడ్డ రెండేళ్ల బాలుడు

» రంగంలోకి ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక దళాలు

» బాలుడు క్షేమం.. మిన్నంటిన సంబరాలు

బెంగళూరు, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు బోరుబావిలో పడిపోయిన రెండేళ్ల బాలుడిని రెస్క్యూ బృందాలు సమర్థంగా కృషి చేసి సురక్షితంగా బయటకు తీశాయి. 20 గంటల పాటు మృత్యువుతో పోరాడిన ఆ చిన్నారి చివరికి క్షేమంగా బయటికి రావడంతో తల్లిదండ్రుల ఆనందానికి హద్దుల్లేవు. ఘటనా స్థలంలో సంబరాలు మిన్నంటాయి. కర్ణాటక రాష్ట్రంలోని విజయపుర జిల్లా, ఇండి తాలూకా లచ్యాణ గ్రామంలో జరిగిన ఈ సంఘటన వివరాలివీ.. గ్రామానికి చెందిన రైతు సతీష్ పొలంలో నిమ్మసాగు చేసేందుకు రెండు బోరుబావులు తవ్వారు. రెండింటిలోనూ నీరు లభించలేదు. వాటిని పూడ్చకుండా అలాగే వదిలేశారు. సతీష్ కుటుంబం పొలంలోనే ఇల్లు నిర్మించుకుని జీవిస్తోంది. సతీష్ కుమారుడు సాత్విక్ బుధవారం సాయంత్రం ఆడుకుంటూ వెళ్లి.. ఒక్కసారిగా బోరుబావిలో పడ్డాడు. బోరుబావిలో నుంచి ఏడుపు విన్న స్థానికులు కొందరు బాలుడి కుటుంబసభ్యులకు తెలిపారు. ఆ తర్వాత గ్రామస్థులంతా అక్కడికి చేరారు. సమాచారం అందుకున్న జిల్లా యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగింది. బోరుబావి 16 అడుగుల లోతులో బాలుడి కాలును కెమెరాల సాయంతో నిపుణులు గుర్తించారు. తలకిందులుగా పడినట్లు నిర్ధారించుకున్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వైద్య బృందం బాలుడికి పైపుల ద్వారా ఆక్సిజన్ అందే ఏర్పాటు చేశారు. ఆ వెంటనే ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ అధికారులు రెండు ఎక్స్‌కవేటర్లతో బోరుబావికి సమాంతరంగా గొయ్యి తవ్వడం ప్రారంభించారు. బాలుడు ఏడుస్తున్న శబ్దాలను గురువారం ఉదయం గుర్తించిన నిపుణులు, సహాయక చర్యలను వేగవంతం చేశారు. గురువారం మధ్యాహ్నం సుమారు 2.30 గంటల సమయంలో బాలుడిని బోరుబావి నుంచి బయటకు తీశారు. అంబులెన్స్‌లో విజయపుర ఆస్పత్రికి తరలించారు. బాలుడు క్షేమంగా ఉన్నాడని వైద్యులు తెలిపారు. అయితే 20 గంటలకు పైగా బోరుబావిలోనే ఉన్నందున.. ఆహారం లేక నీరసంగా ఉన్నట్లు పేర్కొన్నారు. బాలుడిని సురక్షితంగా బయటకు తీసిన 32 మంది బృందం గల రెస్క్యూ బృందానికి సాత్విక్ కుటుంబీకులు, గ్రామస్థులు ధన్యవాదాలు తెలిపారు.



బోరుబావి నుంచి సురక్షితంగా బయటపడ్డ బాలుడు

తండ్రిపై పెట్రోలు పోసి.. నిప్పంటించి..

- డ్రగ్స్‌కు బానిసైన కుమారుడి ఉన్మాదం
- తీవ్రగాయాలతో తండ్రి సజీవదహనం
- రంగారెడ్డిలో తుర్కయాంజాల్‌లో ఘోరం


రవీందర్(ఫైల్)

ఆదిభట్ల, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పనీపాటా లేకుండా ఖాళీగా తిరుగుతూ డ్రగ్స్‌కు బానిసైన ఆ యువకుడు.. కన్నతండ్రితో గొడవపడి ఆయనపై పెట్రోలు పోసి నిప్పంటించాడు. మంటల్లో చిక్కుకొని ఆయన సజీవదహనమయ్యాడు. రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పరిధిలోని తుర్కయాంజాల్‌లో గురువారం ఈ ఘోరం జరిగింది. సీఐ రాఘవేందర్ రెడ్డి, స్థానికుల వివరాల ప్రకారం.. తిరుపతి రవీందర్ (60) ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఆయనకు భార్య సుధ.. కుమారులు అనురాగ్ (27), అభిషేక్ ఉన్నారు. ఈ కుటుంబం తుర్కయాంజాల్‌లోని ఆరెంజ్ అవెన్యూ కాలనీలో నివాసం ఉంటోంది. రవీందర్ చిన్న కుమారుడు అభిషేక్ డిగ్రీ చదువుతున్నాడు. పెద్ద కుమారుడు అనురాగ్ డిగ్రీ పూర్తిచేసినా ఏళ్లుగా ఏ పనీ చేయకుండా స్నేహితులతో జులాయిగా తిరుగుతున్నాడు. మద్యానికి, డ్రగ్స్‌కు అలవాటు పడి తరచూ ఇంట్లో తల్లిదండ్రులతో గొడవపడుతున్నాడు. పనీపాటా లేకుండా ఎందుకు తిరుగుతున్నారంటూ ఇటీవల తనను, తన స్నేహితులను తండ్రి మందలించడంతో అనురాగ్ కోపం పెంచుకున్నట్లు సమాచారం. గురువారం మధ్యాహ్నం తల్లి గదిలో ఉండగా అనురాగ్ పథకం ప్రకారం బయట నుంచి గడియ పెట్టాడు. తర్వాత అప్పటికే ఆవల ఉన్న తండ్రి రవీందర్‌తో గొడవపడ్డాడు. రవీందర్ గట్టిగా మందలించడంతో కోపంలో ఊగిపోయిన అనురాగ్.. అప్పటికే బాటిల్‌లో తెచ్చిపెట్టుకున్న పెట్రోల్‌ను తండ్రి ఒంటిపై చల్లేందుకు యత్నించాడు. ప్రాణభయంతో వణికిపోయిన రవీందర్ అక్కడి నుంచి కాలనీలోని రోడ్డుపై పరుగులు తీస్తూ ఓ చోట కింద పడిపోయాడు. తండ్రిని వెంబడిస్తూ వచ్చిన అనురాగ్.. ఆయన అరుస్తుండగానే ఒంటిపై పెట్రోలు పోసి నిప్పంటించాడు. మంటల్లో శరీరమంతా కాలిపోవడంతో రవీందర్ ఘటనాస్థలిలోనే మృతిచెందాడు. పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు! నిందితుడు అనురాగ్ పరారీలో ఉన్నట్లు వెల్లడించారు.

కొలువు ఆశలు.. ఆవిరి

(మొదటి పేజీ తరువాయి)

చేసుకునేవి. ఐఐటీ హైదరాబాద్‌లోనూ పరిస్థితి ఇలాగే ఉండేది. కానీ ఈసారి ఆ సందడి లేదు.

ఎన్ఐటీ, ఐఐటీలకూ రాలే!

ప్రాంగణ నియామకాల్లో ఏటా కొత్త రికార్డులు సృష్టిస్తున్న వరంగల్ ఎన్ఐటీలో బీటెక్, ఎంటెక్, సీఎస్ఈలో నియామకాల శాతం దేశంలోనే అత్యధికంగా నమోదవుతోంది. గత ఏడాది అక్కడ బీటెక్ చదివేవారిలో 99.4శాతం, ఎంటెక్‌లో 100 శాతం మందిని ప్రముఖ బహుళజాతి కంపెనీలు ఎంపిక చేసుకున్నాయి. బీటెక్ ట్రిపుల్ ఈలో 94 శాతం మంది ఎంపికవగా.. గరిష్ఠ ప్యాకేజీ రూ.53 లక్షలుగా ఉంది. కెమికల్ ఇంజనీరింగ్‌లో ప్రాంగణ నియామకాలు 91.6%, ఈసీఈలో 90%, మెకానికల్‌లో 90%, సివిల్‌లో 82% ఉండగా.. ఇతర బ్రాంచిల్లో సరాసరిగా 60-80శాతం విద్యార్థులు ఎంపికయ్యారు. ఎన్ఐటీలో నియామకాలకు ఏటా దాదాపు 300 కంపెనీలు వస్తాయి. వాటిలో గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా, అమెజాన్ వంటి అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలుంటాయి. కానీ, ఈసారి ప్రముఖ కంపెనీలన్నీ ఇక్కడ కొత్త నియామకాలకు ముఖం చాటేశాయి. వచ్చిన కంపెనీలు కూడా మధ్యతరహా దేశీయ కంపెనీలే. వీటి సంఖ్య ఈ రెండు విడతల్లో వందలోపే ఉన్నాయని అక్కడి విద్యార్థులు పేర్కొంటున్నారు. అత్యుత్తమ విద్యాసంస్థగా పేరుగాంచిన ఎన్ఐటీలో ఇలాంటి పరిస్థితి గతంలో ఎన్నడూ లేదు. ఈసారి అక్కడ సీఎస్ఈ బ్రాంచిలో దాదాపు 60శాతం మాత్రమే ఎంపికవగా.. ఇతర కోర్సుల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ వచ్చినవారి సంఖ్య 20-40శాతం లోపే ఉంది. ఐఐటీ హైదరాబాద్‌లోనూ ఇలాంటి పరిస్థితే నెలకొంది. ఆ క్యాంపస్‌ను గత ఏడాది 335 ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు సందర్శించి విద్యార్థులను ఎంపిక చేసుకోగా.. ఈసారి అలా వచ్చిన కంపెనీల సంఖ్య వందలోపే ఉంది. నిరుడు అక్కడ నియామకాలు 80 శాతానికి పైగా ఉండగా.. ఈసారి 50శాతం లోపే ఉన్నట్టు తెలిసింది. కంపెనీల సందర్శన, నియామకాలు, గరిష్ఠ వార్షిక ప్యాకేజీల వివరాలను ఎన్ఐటీ వరంగల్, ఐఐటీ హైదరాబాద్ ఏటా



మార్చిలో ప్రకటిస్తాయి. కానీ, ఈసారి ఇంతవరకు అధికారికంగా ప్రకటించలేదు. ఈ విషయంపై ఆ విద్యాసంస్థలను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా.. స్పందించేందుకు నిరాకరించాయి. ఉస్మానియా, జేఎన్టీయూ, ఇతర వర్సిటీల్లోనూ క్యాంపస్ ప్లేస్‌మెంట్ల పరిస్థితి ఇలాగే ఉంది. ఐఐటీ బాంబేలో ఈ ఏడాది తొలి దశలో 2400 మంది విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్ల కోసం రిజిస్టర్ చేసుకోగా.. 1187 మంది మాత్రమే ఎంపికయ్యారు. నిరుడు ఈ సంఖ్య 2174 రిజిస్ట్రేషన్లకుగాను.. 1451 నియామకాలుగా ఉంది. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో 2,644 మందికిగాను 1,259 మంది (నిరుడు 2,486 మందికిగాను 1600 మంది), ఐఐటీ భువనేశ్వర్‌లో 298 మందికిగాను 212 మంది ఎంపికయ్యారు.

సగానికి పడిపోయిన ప్యాకేజీలు..

ఈసారి ప్రాంగణ నియామకాలు భారీగా తగ్గడంతో పాటు కంపెనీలు వార్షిక ప్యాకేజీలనూ భారీగా తగ్గించేశాయి. వరంగల్ ఎన్ఐటీలో గతేడాది గరిష్ఠ వార్షిక ప్యాకేజీ రూ.88లక్షలుగా ఉంది. దాదాపు 40 మందికి పైగా విద్యార్థులు రూ. 75-80 లక్షల ప్యాకేజీలను అందుకున్నారు. సరాసరి వార్షిక ప్యాకేజీ రూ. 30.8 లక్షలుగా నమోదైంది. కానీ, అక్కడ ఈసారి గరిష్ఠ ప్యాకేజీయే రూ.30 లక్షలు దాటలేదని తెలిసింది. ఎంపికైన విద్యార్థుల్లో అత్యధికులకు రూ.8-10 లక్షలు మించలేదు. ఐఐటీ హైదరాబాద్‌లో నిరుడు గరిష్ఠ వార్షిక ప్యాకేజీ రూ. 51.03 లక్షలుగా ఉండగా.. ఎంపికైన విద్యార్థుల సరాసరి వార్షిక ప్యాకేజీ రూ.27.11 లక్షలుగా ఉంది. ఈసారి ఇక్కడ గరిష్ఠ ప్యాకేజీ రూ.25 లక్షలు.. సగటు వార్షిక ప్యాకేజీ రూ. 8-10 లక్షలుగా ఉండడం గమనార్హం.

3 నెలలు పనిచేసినా గ్యారంటీ లేదు

ఈసారి ఎంతో కొంతమంది ప్రాంగణ నియామకాల్లో ఎంపికైనా.. వారిలో చాలా మందికి ఉద్యోగం దక్కుతుందన్న నమ్మకం లేకుండా పోతోంది. ఈసారి ఎంపిక చేసుకున్న అనేక కంపెనీలు ఎలాంటి ఉద్యోగ హామీ ఇవ్వడం లేదు. కనీసం మూడు నెలలపాటు ఉచితంగా పనిచేయాలని, పని తీరు ఆధారంగా తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెబుతున్నారు. ఇలా అనేకమందిని నెల రోజుల్లోపే తొలగిస్తున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. నగరంలోని ఓ ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీ నుంచి 10 మందిని ఎంపిక చేసుకున్న ఓ దేశీయ ఐటీ కంపెనీ నెల తిరక్కుండానే అందరినీ తొలగించింది.

అమెరికా ప్రభావంతోనే..

అగ్రరాజ్యం అమెరికాలో ఐటీ రంగం ఏడాదిన్నరగా నష్టాల్లో ఉండటం ఇక్కడ ప్రభావం చూపుతోందని నిపుణులు పేర్కొంటున్నారు. అమెజాన్, మెటా, గూగుల్, మైక్రోసాఫ్ట్ లాంటి కంపెనీలు ఉన్న ఉద్యోగులనే భారీసంఖ్యలో తొలగిస్తుండడంతో అక్కడఎన్నో ఏళ్లుగా స్థిరపడ్డ భారత టెకీలు కొలువులను కోల్పోతున్నారు. అవకాశాల్లేక అనేకమంది భారత్‌కు తిరుగుముఖం పడుతున్నారు. దేశీయ ఐటీ దిగ్గజాలైన టీసీఎస్, టెక్ మహీంద్రా, విప్రో లాంటి కంపెనీలు సైతం అక్కడి ఐటి కంపెనీల బాటలో నడుస్తున్నాయి. ఇప్పటికే ఇక్కడి కంపెనీలు గత ఏడాది వేలాదిమంది ఉద్యోగులను తొలగించాయి. ఈ పరిస్థితుల్లో అనేక కంపెనీలు కొత్త నియామకాలనూ పక్కనబెట్టడటంతో క్యాంపస్ ప్లేస్‌మెంట్లపై తీవ్ర ప్రభావం పడిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. మరో ఏడాది పాటు ఇలాంటి పరిస్థితే ఉంటుందని ఐటీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

వరంగల్ ఆర్డీవో కార్యాలయ జప్తునకు హైకోర్టు ఆదేశం

- పరిహారం కోసం ఆశ్రయించిన రైతుకు అనుకూలంగా ఉత్తర్వులు
- ప్రతిని కార్యాలయానికి అంటించిన కోర్టు అధికారులు

వరంగల్ సిటీ, ఏప్రిల్ 4: తాము ఉత్తర్వులిచ్చినా రైతుకు నష్ట పరిహారం చెల్లించకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో ఏకంగా ఆర్డీవో కార్యాలయాన్ని జప్తు చేయాలని హైకోర్టు ఆదేశాలిచ్చింది. రైతుకు డబ్బు చెల్లించలేకుంటే ఆర్డీవో కార్యాలయాన్ని రైతుకు స్వాధీనం చేయాలని పేర్కొంది. గురువారం హైకోర్టు నుంచి వచ్చిన ప్రత్యేకాధికారి ఈ మేరకు ఉత్తర్వులున్న కాపీని వరంగల్ కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల గోడలకు అంటించి వెళ్లారు. వరంగల్‌లో ఆజంజాహి మిల్లు మూతపడి భూములను కూడా అమ్ముకోవడంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు. దాంతో గత ప్రభుత్వం 2016లో వరంగల్‌కు సమీపంలోని శాయంపేటలో సుమారు 1400 ఎకరాల భూమిలో టెక్స్‌టైల్ పార్క్ నిర్మించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ప్రభుత్వ భూమితో పాటు రైతుల నుంచి భూములను సేకరించింది. రైతుల నుంచి తీసుకున్న భూమికి ఎకరానికి నష్టపరిహారంగా రూ.9.90లక్షల ధర నిర్ణయించి చెల్లింపులు చేసింది. కాని 20 ఎకరాల భూమి ఇచ్చిన శాయంపేటకు చెందిన సముద్రాల యాకస్వామికి ఆయన కూతురికి మాత్రం తక్కువ నష్టపరిహారం అందింది. యాకస్వామికి చెందిన 12 ఎకరాల భూమికి రూ.8.90లక్షల చొప్పున మాత్రమే చెల్లిస్తామని అధికారులు చెప్పడంతో దానికి ఆయన అంగీకరించలేదు. తన భూమిని టెక్స్‌టైల్ పార్కుకు ఇవ్వనని చెప్పినా అధికారులు వినకుండా స్వాధీనం చేసుకున్నారు. దాంతో యాకస్వామి 2022లో హైకోర్టును ఆశ్రయించారు. ఆ తర్వాత వాదనలు, ప్రతివాదనలు విన్న హైకోర్టు ఆరు నెలల క్రితం యాకస్వామికి సంబంధించిన భూమికి గాను రూ.2.40కోట్లు చెల్లించాలని వరంగల్ ఆర్డీవోను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులను తీసుకుని రైతు యాకస్వామి పలుమార్లు ఆర్డీవోతో పాటు జిల్లా ఉన్నతాధికారులను కలిసినా ఫలితం లేకుండా పోయింది. దాంతో ఆయన మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. ఆర్డీవో, ఇతర అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన హైకోర్టు యాకస్వామికి వెంటనే డబ్బులు చెల్లించాలని లేదంటే ఆర్డీవో కార్యాలయాన్ని జప్తు చేసి ఆయనకు అప్పగించాలని ఉత్తర్వులు జారీ చేసింది.

బిల్డాక్స్ సంస్థకు 3.96 కోట్ల జరిమానా

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న బిల్డాక్స్ సంస్థకు రెరా రూ.3.96 కోట్ల అపరాధ రుసుం విధించింది. ఫేస్‌బుక్ ద్వారా ప్రజలకు తప్పుడు సమాచారం చేరవేస్తూ కొనుగోలుదారుల నుంచి నగదు వసూళ్లకు పాల్పడుతున్నట్లు గ్రహించి ఈ అపరాధ రుసుం విధించినట్లు రెరా చైర్మన్ ఎన్. సత్యనారాయణ తెలిపారు. బిల్డాక్స్ ప్రాజెక్టు విషయంలో రెరా ట్రిబ్యునల్ గురువారం విచారణ చేపట్టింది. బిల్డాక్స్ తరఫు న్యాయవాదులు కౌంటర్ దాఖలు చేయడానికి 3 వారాల సమయం కావాలని కోరినప్పటికి సామాజిక మాధ్యమాల్లో బిల్డాక్స్ ప్రకటన కొనసాగించడాన్ని తీవ్రంగా పరిగణించి, కొనుగోలుదారులు మోసాల బారిన పడకుండా వారిని అప్రమత్తం చేసేలా ఈ అపరాధ రుసుం విధించినట్లు రెరా తెలిపింది.

భయం కరి

- ఆసిఫాబాద్ జిల్లాలో మరో రైతును తొక్కి చంపిన ఏనుగు
- పెంచికలపేట మండలం కొండపల్లి గ్రామంలో ఘటన
- వాకింగ్‌కెళ్లిన మరో వ్యక్తిని 2 కి.మీ. వెంబడించిన వైనం
- పలు మండలాల్లో 144 సెక్షన్


కారు పోశన్న (ఫైల్)


పొలాల్లో సంచరిస్తు ఇద్దరిని హతమార్చిన ఏనుగు ఇదే

పెంచికలపేట, బెజ్జూరు, మార్చి 4: మంద నుంచి విడిపోయి.. దారి తప్పి.. వెర్రెత్తిన ఏనుగు కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మరో రైతును బలిగొంది. తెల్లవారుజామున పంట పొలానికి నీరు పెట్టేందుకు వెళ్తున్న అన్నదాత ప్రాణాలు తీసింది. స్థానికులు, అధికారుల వివరాల ప్రకారం.. పెంచికలపేట మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన రైతు కారు పోశన్న (65) గురువారం ఉదయం 5 గంటల ప్రాంతంలో పొలానికి వెళ్తుండగా ఏనుగు ఒక్కసారిగా దాడిచేసింది. తొండంతో కొట్టి ఛాతీపై తొక్కడంతో అతడు అక్కడికక్కడే చనిపోయాడు. ఇదే సమయంలో ఉదయం వాకింగ్‌కు వెళ్తున్న ఎల్కరి సుధాకర్ కు ఏనుగు తారసపడింది. సుమారు రెండు కిలోమీటర్ల వరకు అతడిని వెంబడించింది. సుధాకర్ చివరికి ఇంటికి చేరుకుని ప్రాణాలు కాపాడుకున్నాడు. కాగా, పోశన్న మృతదేహాన్ని కొండపల్లి యువకులు గమనించి గ్రామస్థులకు సమాచారం అందించారు. కాగా, బుధవారం ఆసిఫాబాద్ జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగు చింతలమానేపల్లి మండలంలోని బూరెపల్లిలో వ్యవసాయ పనులు చేస్తున్న శంకర్ అనే రైతుపై దాడి చేసి చంపిన సంగతి తెలిసిందే. 24 గంటల్లో మరో ఘటన జరగడంతో జిల్లాలో కలకలం రేగుతోంది. ప్రజలు ఆందోళన చెందుతుండడంతో పెంచికలపేట, బెజ్జూరు, చింతలమానేపల్లి తదితర మండలాల్లో 144 సెక్షన్ విధించారు. మరోవైపు అటవీ ప్రాంతంలో ఏనుగు జాడ కోసం డ్రోన్లతో అధికారులు గాలిస్తున్నారు. పోశన్న కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, అతడి ఇంట్లో ఒకరికి ఉద్యోగం, ఐదెకరాల వ్యవసాయ భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏనుగు దాడిలో మృతి చెందిన వ్యక్తుల కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు.

రాత్రివేళ బస్సుకు ఎదురుగా వచ్చిన ఏనుగు

ఏనుగు గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో కాగజ్‌నగర్ నుంచి బెజ్జూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు ఎదురుగా వచ్చింది. లోడ్పల్లి- సులుగుపల్లి మధ్యలో జరిగిన ఈ ఘటనతో బస్సులోని ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. కొంత సమయం రోడ్డు పైనున్న ఏనుగు అనంతరం సమీప అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోవడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం తెలుసుకున్న సీఎఫ్ శాంతారం సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

ప్రజల రక్షణకు పటిష్ఠ చర్యలు

- పీసీసీఎఫ్ పర్గేయన్

ఏనుగుల గుంపు ఛత్తీస్‌గఢ్ నుంచి మహారాష్ట్రకు నిత్యం రాకపోకలు సాగిస్తుందని.. రెండు నెలల క్రితం 60-70, రెండు రోజుల కిందట 20-30 ఏనుగులు మహారాష్ట్రకు వచ్చాయని వైల్డ్ లైఫ్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) మోహన్‌చంద్ర పర్గేయన్ తెలిపారు. ఈ గుంపు నుంచే ఒక ఏనుగు ఆసిఫాబాద్ జిల్లాకు చేరిందని చెప్పారు. ప్రజల రక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టామని, మరో దాడి జరగకుండా చూస్తామన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏనుగుకు ప్రజలు ఎలాంటి హాని తలపెట్టవద్దని, అలాగైతేనే అది ఇక్కడినుంచి వెళ్లిపోతుందన్నారు. ఏనుగులను నియంత్రించే విధానం తెలుసుకునేందుకు కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ అటవీ అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు.

ఎస్‌బీ ఆర్గానిక్స్ ప్రమాదం..
శిథిలాల కింద మరో మృతదేహం

ఆరుకు చేరిన మృతుల సంఖ్య.. పరిశ్రమ వద్ద బాధిత కుటుంబాల రోదనలు

- సంగారెడ్డి-నర్సాపూర్ రహదారిపై రాస్తారోకో
- మృతుల కుటుంబాలకు రూ.41 లక్షల చొప్పున పరిహారం: యాజమాన్యం
- కుటుంబానికి ఒక ఉద్యోగం కూడా..
- చొరవ చూపిన మంత్రి రాజనర్సింహ


బాధితులకు న్యాయం చేయాలని పరిశ్రమ ఎదుట రాస్తారోకో చేస్తున్న కార్మికులు

హత్నూర/హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్ గ్రామ శివారులోని ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో జరిగిన భారీ పేలుడులో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. బుధవారం సాయంత్రం జరిగిన భారీ రియాక్టర్ పేలుడుతో సంఘటన స్థలంలోనే నలుగురు దుర్మరణంపాలయ్యారు. చందాపూర్‌కు చెందిన విష్ణు ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందారు. ఈ ఘటనలో కొన్యాలకు చెందిన వడ్డేపల్లి రమేశ్(32) గల్లంతవ్వగా.. గురువారం ఉదయం శిథిలాల కింద రమేశ్ మృతదేహాన్ని గుర్తించారు. తీవ్రంగా గాయపడ్డ మరో 19 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. బుధవారం వీరిని సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా.. గురువారం పరిస్థితి విషమించిన ముగ్గురిని హైటెక్‌సిటీ సమీపంలోని యశోద ఆస్పత్రికి తరలించారు. "34 ఏళ్ల ఓ బాధితుడికి ఛాతీ, కాళ్లపై గాయాలయ్యాయి. శరీరంలోకి దూసుకుపోయిన అనేక పదునైన వస్తువులను తొలగించాం. ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమంగా ఉంది" అని ఆస్పత్రి సీవోవో డాక్టర్ ఎం.రవికిరణ్ తెలిపారు. మృతుల కుటుంబాలకు, క్షతగాత్రుల వైద్య ఖర్చుల కోసం రూ.కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలంటూ బాధితుల కుటుంబసభ్యులు, స్థానికులు గురువారం పరిశ్రమ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టారు. ఆ తర్వాత బాధితుల కుటుంబీకులతో కలిసి స్థానికులు సంగారెడ్డి-నర్సాపూర్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. పోలీసులు నచ్చజెప్పడంతో వారు ఆందోళనను విరమించారు. కాగా.. మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, తదితరులు గురువారం ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమను సందర్శించారు. బీఆర్ఎస్ తరఫున మృతుల కుటుంబాలకు రూ.50 వేల చొప్పున ఆర్థికసాయం అందజేస్తామని హరీశ్‌రావు ప్రకటించారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.41 లక్షల చొప్పున పరిహారం అందజేసేందుకు ఎస్‌బీ ఆర్గానిక్స్ యాజమాన్యం అంగీకరించింది. మంత్రి దామోదర రాజనర్సింహా ప్రత్యేక చొరవతో.. యాజమాన్యం, కార్మికుల కుటుంబాలు చర్చలు జరిపాయి. పరిశ్రమ డైరెక్టర్ రవి శర్మ మినహా.. మిగతా ఐదుగురు కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.41 లక్షల పరిహారం అందజేయడంతోపాటు.. వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చేందుకు పరిశ్రమ యాజమాన్యం అంగీకరించింది. కాగా, పరిశ్రమ యాజమాన్యంపై కేసు నమోదు చేశామని, దర్యాప్తు ప్రారంభమైందని హైదరాబాద్ జోన్ ఐజీ సుధీర్‌బాబు వివరించారు.

మృతుల కుటుంబాలకు.. 50 లక్షల పరిహారమివ్వాలి

- క్షతగాత్రులకు రూ.25 లక్షలు చెల్లించాలి
- ఎస్‌బీ ఆర్గానిక్స్ ఘటనపై హరీశ్‌రావు


క్షతగాత్రుడితో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 4: ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో రియాక్టర్లు పేలిన ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున పరిహారమివ్వాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. క్షతగాత్రుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున చెల్లించాలన్నారు. గురువారం ఆయన సంగారెడ్డిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రాణాలు పోతున్నా కాంగ్రెస్ సర్కారు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఘటనాస్థలికి ఇద్దరు మంత్రులు వచ్చినా.. నయాపైసా సాయం చేయలేదని విమర్శించారు. ఆరుగురు చనిపోయినా.. 19 మంది క్షతగాత్రులైనా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని మండిపడ్డారు. ప్రమాదానికి కారణమైన ఎస్‌బీ ఆర్గానిక్స్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. "మృతదేహాలను తీసుకెళ్లడానికి కూడా నయాపైసా లేదని వారి కుటుంబసభ్యులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి కూడా ఎలాంటి సాయం అందడం లేదు" అని సర్కారుపై మండిపడ్డారు. కొన్యాలకు చెందిన రమేశ్ మృతదేహం శిథిలాల మధ్య ఉంటే.. ఎవరూ పట్టించుకోలేదని, గ్రామస్థులు రాత్రంతా శ్రమించి, వెలికితీశారని వివరించారు. ఆపద సమయంలో కూడా ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉండటం శోచనీయమన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇజ్రాయెల్ ఉన్మాదం

యుద్ధానికి కూడా హద్దులుంటాయి, నీతినియమాలుంటాయి. హమాస్‌తో పోరులో ఇజ్రాయెల్ నానావిధ అతిక్రమణలకూ పాల్పడుతోంది, అత్యంత అమానవీయంగా వ్యవహరిస్తోంది. గాజాలో ఆపన్నులకు కాస్తంత సాయాన్ని అందిస్తున్న ఏడుగురు వర్కర్లను ఇజ్రాయెల్ దళాలు కాల్చివేయడం, మిగిలివున్న ఆ ఒక్క ప్రధాన ఆస్పత్రిని కుప్పకూల్చడం, పొరుగుదేశంలోని మరోదేశం కాన్సులేట్ మీద దాడిచేసి కీలకమైన వ్యక్తులను చంపివేయడం వంటి చర్యలు ఇజ్రాయెల్ మిగతాప్రపంచానికి ఎంతమాత్రం జడవడం లేదనడానికి నిదర్శనం. ఈ వరుస సంఘటనలపట్ల ఇజ్రాయెల్ ప్రతిస్పందన చూసినప్పుడు అది శత్రువులకూ, మిత్రులకూ కూడా జవాబుదారీగా ఉండదల్చుకోలేదని అర్థమవుతుంది.

స్వచ్ఛంద సంస్థ 'వరల్డ్ సెంట్రల్ కిచెన్'కు చెందిన ఏడుగురు సహాయకులను సోమవారం ఇజ్రాయెల్ చంపివేయడం పొరపాటున జరిగిందని ఎవరూ అనుకోవడం లేదు. యుద్ధం అన్నాక ఇటువంటివి సహజం అని ఇజ్రాయెల్ అధినేత బెంజమీన్ నెతన్యాహూ ఎంతో తేలికగా ఈ ఘటనను తీసిపారేశారు. కానీ, ఉద్దేశపూర్వకంగానే ఇజ్రాయెల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) తమ వాహనం మీద దాడిచేశాయని ఈ చారిటీ సంస్థ అధినేత ఆరోపిస్తున్నారు. ఆ వాహనం ఒక సహాయక సంస్థదని తెలియచెప్పే గుర్తులు దాని మీద స్పష్టంగా ఉన్నాయి. పైగా ఐడీఎఫ్‌తో సమన్వయం చేసుకుంటూ ఘర్షణలేని ప్రాంతం గుండా అది ప్రయాణిస్తున్నప్పుడు ఈ దాడి జరిగింది. మూడుసార్లు కాల్పులు జరపడం, కొందరు చనిపోగా, పారిపోతున్న మిగతా సహాయకసిబ్బందిని కూడా వదిలిపెట్టకుండా హతమార్చడం వంటివి గమనించినప్పుడు ఇజ్రాయెల్ దళాలు పొరపాటుపడ్డాయని అనుకోలేం. మరణించినవారిలో బ్రిటన్, అమెరికా పౌరులు ఉన్నందువల్ల కాబోలు, నెతన్యాహూ ఈ ఘటనను అంగీకరించారు కానీ, అది ఉద్దేశపూర్వకమైనది కాదన్నారు.

ఇంతటి ఘోరమైన సంఘటమీద కూడా అమెరికా, బ్రిటన్‌లు తీవ్రంగా స్పందించలేకపోయాయి. జరిగిన దానిమీద లోతైన దర్యాప్తు చేయించమని బ్రిటన్ తిరిగి ఇజ్రాయెల్‌నే అడిగిందంటే అగ్రదేశాలు ఎంతగా సాగిలబడ్డాయో అర్థమవుతుంది. పచ్చి అబద్ధాలు, మోసాలతో యుద్ధాన్ని సాగిస్తున్న ఇజ్రాయెల్ నుంచి నిజాలు బయటకురావని వాటికి మాత్రం తెలియదా? పారదర్శకతకు పాతరేసి, నిర్లక్ష్యంగా, బాధ్యతారాహిత్యంగా ముప్పైమూడువేల మంది పాలస్తీనియన్లను ఊచకోతకోసి, గాజాను నేలమట్టంచేసి, లక్షమందిని నిరాశ్రయులుగా మార్చిన ఇజ్రాయెల్ ఇకమీదట తన తప్పులు బయటకు పొక్కకుండా, క్షేత్రస్థాయి సమాచారాన్ని తెలియనివ్వకుండా మరిన్ని అదనపు జాగ్రత్తలు తీసుకుంటోంది. గాజాలో ఘోరాలను బయటి ప్రపంచానికి తెలియచెబుతున్న అల్ జజీరా చానెల్‌మీద అది ప్రత్యేకంగా కక్షకట్టింది. నచ్చని విదేశీ చానెళ్ళను గెంటివేసే అధికారాలను నెతన్యాహూ తన మంత్రులకు కట్టబెట్టారు. విదేశీ సహాయకులమీద ఉద్దేశపూర్వకంగా జరిపిన ఈ దాడిద్వారా పాలస్తీనియన్లకు అందుతున్న ఆ కాసింత సాయాన్ని కూడా అడ్డుకోవాలని ఇజ్రాయెల్ ఉద్దేశం. హమాస్ అభిమానులతోనూ, ఉగ్రవాదులతోనూ ఐక్యరాజ్యసమితి సహాయక సంస్థ 'యుఎన్ఆర్‌డబ్లుఏ' నిండిపోయిందని ఆరోపిస్తూ, దానికి సరఫరాలు జరగకుండా అడ్డుపడుతూ పాలస్తీనాలో దాని ఉనికే లేకుండా చేయాలన్నది ఇజ్రాయెల్ ఆలోచన. తద్వారా మరిన్ని వేలమంది తమకు తాముగా చనిపోయేట్టు చేస్తున్నది.

ఇక, ఏప్రిల్ ఒకటిన సిరియా రాజధాని డమాస్కస్‌లోని ఇరాన్ కాన్సులేట్ భవనంమీద క్షిపణి దాడిచేసి, రివల్యూషనరీ గార్డ్స్ ఉన్నతస్థాయి కమాండర్లను ఇజ్రాయెల్ చంపివేయడం ప్రమాదకరమైన చర్య. ప్రతీకారం తీర్చుకొని తీరుతానని ఇరాన్ వెంటనే హెచ్చరించింది. ఆ దేశం కానీ, దాని అండదండలతో దాడులు చేస్తున్న హౌతీ, హిజ్‌బుల్లా ఇత్యాది సంస్థలు కానీ తనను ఏమీ చేయలేవని ఇజ్రాయెల్‌కు గట్టినమ్మకం ఉన్నట్టుంది. కానీ, ఇరాన్ అధినేత హెచ్చరికల నేపథ్యంలో ప్రతీకారం ఏదో ఒక స్థాయిలో ఉంటుందన్నది వాస్తవం. ప్రతిదాడులు జరిపే హక్కు తనకు ఉందని భద్రతామండలి సమావేశంలో ఇరాన్ విస్పష్టంగా ప్రకటించింది. హమాస్‌ను సమూలంగా నిర్మూలించేవరకూ యుద్ధం కొనసాగుతుందని చెబుతూ చిత్తంవచ్చినట్టు వ్యవహరిస్తున్న ఇజ్రాయెల్‌ను వెంటనే దారికితెచ్చి కాల్పుల విరమణకు ఒప్పించకపోతే, యుద్ధం విస్తరించి, చర్చలకు కూడా వీల్లేని పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉంది.

అక్కడా, ఇక్కడా అనైతిక రాజకీయం

ఢిల్లీకి చెందిన ఒక సర్వే సంస్థ రాజకీయాల్లో యువత ఆసక్తిపై సర్వే నిర్వహిస్తే, 80 శాతం మంది రాజకీయాలంటే ఏహ్యభావం ఉన్నట్లు తెలిపారు. రాజకీయాలంటే పదవులు, ఫిరాయింపులే కదా అని చాలామంది అభిప్రాయపడ్డారు. భావిభారత పౌరులకు రాజకీయాలపై ఇలాంటి విరక్తి ఉండడం ప్రమాదకరం. దేశంలోని రాజకీయ పరిణామాలు, ఎన్నికల సమయంలో పార్టీల వైఖరులు ప్రజాస్వామ్యానికి కళంకం తెచ్చేవిగా ఉన్నాయి.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనలో ఉండగా, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు భారాస ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న సమయంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్టు చేశారు. ఈ రెండు అరెస్టులు రాజకీయ ప్రమేయంతోనేననేది సుస్పష్టం. ఎన్నికల్లో బీజేపీ ప్రయోజనాల కోసమే కేంద్ర ప్రభుత్వ యంత్రాంగాలు పనిచేస్తున్నాయి. అమెరికా తదితర దేశాల్లో అధికార పార్టీ అయినా, విపక్షమైనా నేరం చేస్తే ఏ మాత్రం వివక్ష లేకుండా అరెస్టులుంటాయి. మన దేశంలో విపక్ష పార్టీలకు చెందిన వారి మీదనే ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు జరుగుతున్నాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, దాని మిత్రపక్షాలకు చెందిన ఒక్క నేతపైనా కేసు నమోదు కాలేదు, అరెస్టు జరగలేదు. రాజకీయ ప్రత్యర్థులను కేసుల్లో ఇరికించి దెబ్బతీయడం, భయపెట్టి తమ దారికి తెచ్చుకోవడం, ప్రత్యర్థుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయడానికి కేసులు, జైళ్ల వ్యూహం పన్నుతున్నారనేది జగద్విదితం. ఆ పార్టీకి అనుకూలంగా లేకపోతే ముఖ్యమంత్రులు, మంత్రుల పైనా కేసులు పెడుతున్నారు. మనీలాండరింగ్ లాంటి కఠిన చట్టాలను ప్రయోగిస్తున్నారు. అదాని వంటి సన్నిహితులపై ఎన్ని ఆరోపణలు వచ్చినా ఇలాంటి చట్టాలేమీ ఉపయోగించకుండా రక్షణ కల్పించడం పాలకుల పక్షపాతనైజాన్ని చాటుతోంది. కేంద్రం మనీలాండరింగ్ వాడుతున్న తీరుతో ఆ చట్టం మూలస్వరూపమే మారిపోయి, రాజకీయం కోసమేనని తేలిపోయింది.



జాతీయ పార్టీలైనా, ప్రాంతీయ పార్టీలైనా కక్ష సాధింపులు, దాడులు, కేసులు, ఫిరాయింపుల వంటి పంథాలతో రాజకీయాలను అపవిత్రం చేయరాదు. విపక్షాలు ఖాళీ కావాలనే సంప్రదాయాన్ని ప్రోత్సహించడం ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీస్తుంది. ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై పోరాడేందుకు బలమైన ప్రతిపక్షాలు ఉండాల్సిందే. వాటిని అధికారబలంతో దెబ్బతీసి, ఏకఛత్రాధిపత్యం, నియంతృత్వం కొనసాగాలనుకోవడం సహేతుకం కాదు.

కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రణాళికను తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విపక్ష భారాసపై ప్రయోగిస్తోంది. ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల సంస్థలపై దాడులు, కేసులు, భవనాల కూల్చివేతలు భారీఎత్తున జరుగుతున్నాయి. ఆస్తులు కోల్పోతారనే భయం భారాసలో కలిగిస్తే ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరతారనే నమ్మకం కాంగ్రెస్ నేతల్లో ప్రబలంగా ఉన్నట్లు అవగతమవుతోంది. ప్రతీ అంశంలోనూ అవినీతి ఉందని, దానిని తమ రాజకీయానికి ఆయుధంగా వాడుకోవాలనే తపన కాంగ్రెస్‌లో కనిపిస్తోంది.

జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణలో పోటీకి అభ్యర్థులకు సొంత పార్టీ వారిని ఎంచుకోలేక దయనీయస్థితిని చాటుకున్నాయి. కేంద్రంలో బీజేపీ పదేళ్లుగా అధికారంలో ఉంది. కాంగ్రెస్ తెలంగాణలో పదేళ్ల తర్వాత మళ్లీ అధికారంలోకి వచ్చింది. తమదే తిరుగులేని ఆధిపత్యం అని చెప్పుకునే ఈ రెండు పార్టీలు 17 స్థానాలకు అభ్యర్థుల ఎంపికకు ఆపసోపాలు పడ్డాయి. బీఆర్ఎస్ నుంచి ఈ రెండు పార్టీలు పోటీపడి ఎంపీలను, ఎమ్మెల్యేలను, మాజీలను చేర్చుకొని టికెట్లు ఇస్తూ తమ రాజకీయ డొల్లతనాన్ని చాటుకున్నాయి. బీజేపీ, కాంగ్రెస్‌లు పోటీపడి ఫిరాయింపులను ప్రోత్సహించాయి. ఈ పరిణామాలు లోక్‌సభ ఎన్నికల అనంతరం ఎక్కడికి దారితీస్తాయోనన్న అంచనాలు మొదలయ్యాయి. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండే సీఎం అయినట్లుగా తెలంగాణలో కూడా అలాంటి పరిణామాలు వస్తాయనే ప్రచారం మొదలైంది. ప్రస్తుత ఫిరాయింపుల జోరు చూస్తే ఎన్నికల తర్వాత ఎమ్మెల్యేలు, ఎంపీలు సైతం అటూ ఇటూ మారిపోతారనే భావం అప్పుడే ఏర్పడింది. ఒక పార్టీ తరఫున అయిదేళ్ల పాటు పనిచేసేందుకు ప్రజలు ఎన్నికల్లో గెలిపిస్తే సదరు ఎమ్మెల్యేలు, ఎంపీలు పదవుల కోసం, ఆస్తులను కాపాడుకోవడానికి, ఇతర ప్రయోజనాల కోసం పార్టీలు మారి ప్రజాస్వామ్య స్ఫూర్తికి, నైతిక విలువలకు విఘాతం కలిగిస్తున్నారు. తెలంగాణలో పోలింగ్ ఫలితం వచ్చిన రోజే ఓటేసిన ప్రజల వేళ్ల మీది సిరా మరక పోకముందే ఒక ఎమ్మెల్యే ప్రత్యర్థి పార్టీనేతను కలిసి అందులో చేరతానని చెప్పడం ఫిరాయిపుల పతనావస్థకు పరాకాష్ఠగా నిలిచింది. లోక్‌సభ ఎన్నికల బరిలో ఎక్కువ మంది ఫిరాయింపుదారులే పోటీ చేస్తున్నారు. తమను గెలిపిస్తే చాలు ఆ తర్వాత తమ దారి తాము చూసుకుంటాం తప్ప, ప్రజల గురించి ఆలోచించాలనే తపన వారికి ఏ మాత్రం లేకపోవడం శోచనీయం. ఇలాంటి వారిని ప్రజలు ముందే గుర్తించి వారికి ఇప్పుడే కీలెరిగి వాతపెట్టాలి.

జాతీయ పార్టీలైనా, ప్రాంతీయ పార్టీలైనా కక్ష సాధింపులు, దాడులు, కేసులు, ఫిరాయింపుల వంటి పంథాలతో రాజకీయాలను అపవిత్రం చేయరాదు. విపక్షాలు ఖాళీ కావాలనే సంప్రదాయాన్ని ప్రోత్సహించడం ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీస్తుంది. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై పోరాడేందుకు బలమైన ప్రతిపక్షాలు ఉండాల్సిందే. వాటిని అధికారబలంతో దెబ్బతీసి, ఏకఛత్రాధిపత్యం, నియంతృత్వం కొనసాగాలనుకోవడం సహేతుకం కాదు. దీనివల్ల ప్రజల్లో రాజకీయాలంటేనే విముఖత ఏర్పడే ప్రమాదం ఉంది. అటల్ బిహారీ వాజపేయి లాంటి వ్యక్తి రాజకీయ విలువల కోసం ప్రధాని పదవిని త్యజించారు. ప్రజలు ఇచ్చిన తీర్పునే శిరోధార్యంగా భావించిన ఎందరో ప్రముఖులు విపక్షాల్లోనే సుదీర్ఘంగా కొనసాగారు తప్ప, పదవుల కోసం అర్రులు చాచలేదు. అలాంటి మహనీయుల ప్రతిరూపాలు మళ్లీ రావాలన్నదే ప్రజల ఆకాంక్ష.

■ డాక్టర్ బీఎస్ రావు
చైర్మన్-బీఎస్ రావు ఫౌండేషన్

మోదీకి ఎమర్జెన్సీ అవసరమే లేదు!

ఢిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో ప్రతిపక్షాలు జరిపిన 'సేవ్ డెమాక్రసీ' ర్యాలీలో 2024 ఎన్నికలకు ఒక ఎజెండాను నిర్దేశించే లక్ష్యంతో 'బీజేపీ వెర్సస్ డెమాక్రసీ' అనే పెద్ద బ్యానర్‌ను ప్రదర్శించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష నేతలందరూ ఇలా ఏకమయ్యారు. 'నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్యాన్ని రక్షించటం' అన్నమాట ఇక్కడ పలుమార్లు వినిపించింది. అచ్చంగా ఇదే నినాదంమీద చారిత్రాత్మక 1977 ఎన్నికల్లో ప్రతిపక్షాలన్నీ ఏకమయ్యాయి. ఇందిరాగాంధీ అంతటి బలమైన శక్తిని ఓడించాయి. కానీ కాస్త లోతుగా పరిశీలిస్తే, 2024కీ 1977కీ చాలా తేడా ఉంది, నరేంద్ర మోదీకీ ఇందిరాగాంధీకీ పోలిక లేదు.



ఇందిరాగాంధీ ఏదో కంగారులో, కొడుకు సంజయ్‌గాంధీ బృహత్ ఆకాంక్షల ప్రోద్బలంతో, దేశంలో అత్యవసరస్థితిని ప్రకటించారు. ఇందిరాగాంధీతో పోలిస్తే మోదీ రాజకీయంగా మరింత తెలివైనవాడు, మరింత నిర్దయగలవాడు. ప్రస్తుతం ఉన్న చట్టాలతోనే ప్రతిపక్షాన్ని భయపెట్టగలిగినప్పుడూ, ఎలా చెప్తే అలా లొంగి నడుచుకునే మీడియా చుట్టూ ఉన్నప్పుడూ ఇక ఎమర్జెన్సీని వాడాల్సిన పనేముంది?

మొదటి విషయమేమిటంటే– ఇరవై ఒక్క నెలల పాటు సాగిన ఎమర్జెన్సీ కాలంలో వందలాది మంది రాజకీయ నేతల, ఉద్యమకారుల అరెస్టుతో, ఇప్పుడు ఇద్దరు ప్రతిపక్ష ముఖ్యమంత్రుల అరెస్టును పోల్చలేం. ప్రతిపక్షాలను అణచివేయటానికి ప్రభుత్వ సంస్థలను ఆయుధాలుగా వాడటమన్నది నాటి పదవీ దుర్వినియోగాన్ని గుర్తుకు తెచ్చినా, దీన్ని ఎమర్జెన్సీ కాలంతో పోల్చటమంటే మరీ దూరం వెళ్ళినట్టే. ప్రభుత్వానికి ఏ మాత్రం పోటీ ఇవ్వలేని బలహీనమైన ప్రతిపక్షమే ఉన్నప్పటికీ, మరీ 'ప్రతిపక్ష రహిత భారతం' అన్న మాట వాడే దశలో ఇంకా లేము. దీనికి మహారాష్ట్రలో ప్రతిపక్షం ఇస్తున్న బలమైన పోటీ ఒక ఉదాహరణ.

రెండో విషయం– అతుకులబొంత లాంటి నేటి ప్రతిపక్ష కూటమి 'ఇండియా'తో పోలిస్తే, 1977ల నాటి ప్రతిపక్షం ఎంతో రాజకీయ అనుభవాన్ని, ప్రతిష్ఠను కలిగి ఉండేది. నాడు సోషలిస్ట్, జనసంఘ్ వంటి విభిన్న శక్తులు తీవ్రమైన కాంగ్రెస్ వ్యతిరేకత పునాదిగా ఏకమై రాత్రికి రాత్రి జనతా పార్టీకి పోత పోశాయి. స్వాతంత్ర్య సమరయోధుడైన జయప్రకాష్ నారాయణ్ ఆ కూటమికి ఒక నైతికమైన వెన్నెముకగా నిలిచారు. మొన్న రామ్‌లీలా మైదాన్‌లో గుమికూడిన వారిలో ఒక్కరైనా జయప్రకాష్ నారాయణ్ లాంటి నీతిబద్ధమైన నాయకత్వాన్ని గుర్తు తేగలరా? మోదీపై వ్యతిరేకత నేటి ప్రతిపక్షాల్ని పైస్థాయిల్లో ఏకం చేస్తున్నప్పటికీ, కింది స్థాయిల్లో వాటి మధ్య ఘర్షణ వాతావరణం ఇంకా సమసిపోలేదు. పంజాబ్‌లో ఆప్ – కాంగ్రెస్ వైరం, బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌తో కాంగ్రెస్ కమ్యూనిస్ట్ పార్టీల వైరం, మరో పక్క కేరళలో కాంగ్రెస్ కమ్యూనిస్ట్ పార్టీల మధ్య వైరం కొనసాగుతూనే ఉంది.

మూడో విషయం– ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడవేయటం అనే అంశంలో ఈ ప్రతిపక్షాలేవీ తక్కువ తినలేదు. నియంతల్లా ప్రవర్తించిన ముఖ్యమంత్రులు ప్రతిపక్షంలో చాలామంది ఉన్నారు. వెస్ట్ బెంగాల్, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర (వికాస్ అగాఢీ పాలన)ల్లో భిన్నాభిప్రాయం వెల్లడించిన గొంతులు కఠిన శిక్షలను ఎదుర్కొన్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను ఒక ఆయుధంగా వాడుకున్నట్టే ఈ రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక పోలీస్ యంత్రాంగాన్ని వాడుకున్నాయి.

నాలుగో విషయం– ప్రజాస్వామ్య విలువల్ని కాపాడాల్సిన ఆవశ్యకత కాలక్రమేణా ప్రజల దృష్టిలో ఏమంత ప్రాధాన్యత గల విషయం కాకుండా పోయింది. ఇందుకు భిన్నంగా 1977లో ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు సన్నగిల్లడంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం పెల్లుబికింది. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో ఇందిరాగాంధీ ప్రభుత్వం అమలు చేసిన బలవంతపు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు దీనికి కారణమయ్యాయి. ఎమర్జెన్సీ చర్యల ప్రభావం అంతగా పడని దక్షిణాది నుంచి మాత్రం కాంగ్రెస్‌కు మద్దతు లభించింది. పైపెచ్చు ప్రజాస్వామిక విలువలు మనగలిగేందుకు బలమైన చోదక శక్తిగా నిలిచే పట్టణ మధ్యతరగతి వర్గం 1970ల నాటితో పోల్చి చూస్తే ఇప్పుడు ఎంతో భిన్నమైన సామాజిక – ఆర్థిక వర్గంగా మారింది. వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ ఆధారిత ఆర్థిక వ్యవస్థలో పట్టణాల్లో ప్రమాణాలూ, విలువలూ సన్నగిల్లుతాయి. 'నాకు నేను ముఖ్యం' తరహా జీవన శైలికి అలవాటుపడిన పౌరులు రాజకీయ ఉద్యమాలకు దూరం జరుగుతారు. స్వలాభానికి నష్టం వాటిల్లే పరిస్థితి ఉన్నప్పుడు మాత్రమే వారు ఉద్యమాల వైపు అడుగులు వేస్తారు. పేపర్ లీకేజీలకు నిరసనగా రోడ్డెక్కిన యువతను, రైతు చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన రైతాంగాన్నీ ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఇక మిగిలిన ప్రజా బాహుళ్యమంతా ఆన్‌లైన్ ఉద్యమాలకే పరిమితం అవుతుంది. దేశంలో నియంతృత్వం గురించి ధ్రువ్ రాఠీ అనే యూట్యూబర్ చేసిన వీడియోను ఆవేశంగా షేర్ చేయటంతోనే రాజ్యాంగ స్వేచ్ఛలను పరిరక్షించే పోరాటంలో వీరి పాత్ర ముగిసిపోతుంది. 1970ల్లోని పరిస్థితి వేరు. అప్పటికింకా ట్రేడ్ యూనియన్లు, పౌర హక్కుల సంఘాలు, ఆదర్శవాద రాజకీయాలు సజీవంగా ఉన్నాయి. ప్రజాస్వామిక ఆవరణ కోసం పోరాడటం అనేది అప్పటికి ఎంతో ముఖ్యమైన అంశం. ఇప్పుడు పరిస్థితి వేరు. ఇప్పుడు అంతా వాట్సాప్ మెసేజీలకే పరిమితం.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

చిత్రమేమిటంటే, పట్టణ మధ్యతరగతి ఆగ్రహావేశాలతో ఉప్పొంగి, రాజకీయ వర్గాల్ని కుదిపివేసిన ఆఖరు ఘట్టంలో కేజ్రీవాల్ కూడా ఉన్నారు. 2011లో కేజ్రీవాల్, ఆయన బృందం కలిసి అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని మొదలు పెట్టిన సందర్భమది. మొత్తం రాజకీయ వర్గమంతటికీ వ్యతిరేకంగా రాజకీయాల్ని శుద్ధి గావించే ఉద్యమంగా అది పేరుమోసింది. 'నేతలందరూ దొంగలే' (సబ్ నేతా చోర్ హై) అన్న నినాదంతో పాలక వర్గాల తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నవారంతా రోడ్ల మీదకొచ్చి ప్రదర్శనలు చేశారు. అప్పటికి కేజ్రీవాల్ వ్యవస్థలను వ్యతిరేకిస్తున్న ఒక బైటి మనిషి. ఆయన ఏ శక్తులపై అప్పుడు దాడి చేశారో అదే శక్తులతో ఇప్పుడు జట్టు కట్టారు. నాడు 'అవినీతి వ్యతిరేక' ఉద్యమానికి నాయకత్వం వహించిన మనిషి కాలచక్రం గిర్రున తిరిగేసరికి నేడు ఢిల్లీ లిక్కర్ పాలసీ మచ్చను చెరిపివేసుకోవటానికి తాను అవినీతి ఆరోపణల్ని ఎక్కుపెట్టినవారితోనే కలిసి ప్రయత్నిస్తున్నాడు. ఇలా స్వీయరక్షణ కోసం ఏర్పాటైన రాజకీయ అమరికకు విశ్వసనీయత ఎలా వస్తుంది, అది ఎన్నాళ్ళని కొనసాగుతుంది?

మరో పరస్పర విరుద్ధమైన విషయం ఏమిటంటే– రాజకీయ నేతలపై తీవ్ర వ్యతిరేకత సృష్టించిన కేజ్రీవాల్ 'అవినీతి వ్యతిరేక ఉద్యమం' నుంచి అతిపెద్ద లబ్ధి పొందింది ఎవరంటే ప్రస్తుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ. మన్మోహన్ సింగ్ ప్రభుత్వం కుప్పకూలిన శిథిలాల మధ్య నుంచి మోదీ అధికారం వైపు అడుగులు వేశారు. ఆయన ఇందిరాగాంధీ దగ్గర నుంచి కొన్ని కిటుకులు అరువు తెచ్చుకున్నారు. ముఖ్యంగా రాజ్యాంగ వ్యవస్థలపై పూర్తి నియంత్రణ కోసం అన్ని రకాల వ్యవస్థాగతమైన అడ్డంకులను నిర్మూలించటంలో.

ఇందిరాగాంధీతో పోలిస్తే మోదీ రాజకీయంగా మరింత తెలివైనవాడు, మరింత నిర్దయగలవాడు. ఇందిరాగాంధీ ఏదో కంగారులో, కొడుకు సంజయ్‌గాంధీ బృహత్ ఆకాంక్షల ప్రోద్బలంతో, దేశంలో అత్యవసరస్థితిని ప్రకటించారు. కానీ మోదీ రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యానికి తలొగ్గి పని చేస్తున్నానని ప్రకటిస్తూనే దాన్ని ఎన్నికల నియంతృత్వంవైపు, మెజారిటేరియన్ మతస్వామ్యంవైపు ఒక క్రమ పద్ధతిలో ముందుకు నెడుతున్నారు.

ప్రస్తుతం ఉన్న చట్టాలతోనే ప్రతిపక్షాన్ని భయపెట్టగలిగినప్పుడూ, ఎలా చెప్తే అలా లొంగి నడుచుకునే మీడియా చుట్టూ ఉన్నప్పుడూ ఇక ఎమర్జెన్సీని వాడాల్సిన పనేముంది? ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్‌కు బెయిల్ ప్రొవిజన్ సవరణలను పార్లమెంటులో మనీ బిల్లుగా ప్రవేశపెడితే, దానికి అనూహ్యంగా సుప్రీంకోర్ట్ బెంచ్ నుంచి ఆమోదం లభించింది. పదవీ విరమణకు దగ్గర్లో ఉండి ఆ బెంచ్‌కు నేతృత్వం వహించిన జడ్జి ఇప్పుడు లోక్‌పాల్! అవినీతి వ్యతిరేకత ముసుగులో రాజకీయ వైరాల్ని లెక్క తేల్చుకోవటానికి ఇలా ఒక అమానుషమైన చట్టాన్ని వాడుకున్నారు. ఈ క్రమంలో 'జెయిల్ కాదు బెయిల్' అనే ప్రాథమిక సూత్రం మరుగున పడిపోయింది. ప్రతీకార రాజకీయాలు చట్టబద్ధత పొందాయి. అందుకే చెప్పేది– స్వాతంత్ర్యానంతర భారతదేశంలో ఇదివరకెన్నడూలేని ఎన్నికల యంత్రాంగం మద్దతుతో నిలబడిన ఈ రాజకీయ నాయకుడిని ఎదుర్కోవటానికి ప్రతిపక్షాలు చేపడుతున్న 'ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం' లాంటి ప్రదర్శనలు చాలవు, అంతకుమించి కావాలి.

తాజా కలం: ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన ఒక సర్వే ప్రకారం 67శాతం మంది భారతీయులు 'పార్లమెంట్ జోక్యం గానీ కోర్టుల జోక్యం గానీ లేకుండా ఒక బలమైన నాయకుడు నిర్ణయాలు తీసుకోగలిగే వ్యవస్థ దేశానికి అవసరం' అని కోరుకుంటున్నారు. ఇలా కోరుకునేవారి సంఖ్య 2017లో 55శాతం ఉండేది. మరి ఇక ప్రజాస్వామ్యానికి దిక్కేది?

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

భారతరత్నతో గౌరవించాలి

ఒకవైపు దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూనే, మరోవైపు సామాజిక సమానత్వం కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం అలుపెరగని సమరం సాగించిన రాజకీయ, సామాజిక విప్లవ యోధుడు బాబూ జగ్జీవన్‌రామ్. జాతి జనులను విద్యావంతులుగా, ఆత్మాభిమానులుగా చేయాలన్నదే ఆయన లక్ష్యం. బిహార్‌లోని షాబాద్ జిల్లా, చాంద్వా గ్రామంలో 1908 ఏప్రిల్ 5న శోభిరామ్, బసంతి దేవిలకు జగ్జీవన్ రామ్ జన్మించాడు. ఆయన చదువుకున్న పాఠశాలలో మొదటిసారిగా అంటరానితనాన్ని అనుభవించాడు. ఆ పాఠశాలలో విద్యార్థుల కోసం మంచినీటి సదుపాయాన్ని కల్పిస్తూ రెండు కడవలపై 'హిందూ పానీ', 'ముస్లిం పానీ' అని రాసి ఉంచేవారు. జగ్జీవన్‌రామ్ హిందూ పానీ కడవలో మంచినీరు తాగారని హిందూ విద్యార్థులు ఆ కుండలోని నీరు తాగేవారు కాదు. ఈ ఉదంతంతో ఆగ్రహించిన ఆయన ఒక



రాయి విసిరి ఆ కుండను ముక్కలు చేశాడు. అప్పుడు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు 'హరిజన పానీ' అనే మరో కుండను ఏర్పాటుచేశాడు. జగ్జీవన్‌రామ్ ఆ కుండని కూడా పగులకొట్టాడు. ఇక చేసేదేమీ లేక ఆ పాఠశాల వారు ఒకే కుండను ఏర్పాటుచేశారు. ఈ సంఘటనలో గెలిచినా ఆయన గుండె ఆవేదనతోనూ, కోపంతోనూ నిండిపోయింది. ఆ అనుభవాలే ఆయన దళిత జనుల జాగృతివైపు ముందుకు సాగడానికి ప్రేరణనిచ్చాయి.

విద్యార్థి దశలోనే గాంధీజీ అహింసా మార్గానికి ఆకర్షితుడై 1930లో సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్నారు. కేవలం 27 ఏళ్ల వయస్సులోనే శాసనమండలి సభ్యునిగా ఎన్నికయ్యారు. 57 ఏళ్లపాటు పార్లమెంటును ఏలిన మహా అనుభవశీలి ఆయన. వ్యవసాయ, రక్షణ, ఆరోగ్య, రైల్వే శాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా ఆయన సేవలు అందించారు. జగ్జీవన్‌రామ్ తాను చేపట్టిన ప్రతీ బాధ్యతలోనూ తనదైన ముద్రవేసిన కార్యదక్షుడు. బ్రిటీష్ రైల్వే వ్యవస్థను ప్రక్షాళన చేసి భారతీయ ముద్ర వేశారు. 1967–70లో ఆహార, వ్యవసాయ శాఖ మంత్రిగా హరిత మండలాలను అభివృద్ధి చేసి మొదటిసారి భారతదేశం ఆహార స్వయం ప్రతిపత్తి సాధించే విధంగా చేసి, దేశాన్ని కరువు బారి నుంచి కాపాడారు. 1970–74లో రక్షణ శాఖ మంత్రిగా పాకిస్తాన్ నుంచి బంగ్లాదేశ్‌ను విముక్తి చేసి, పాకిస్తాన్ సేనలు బేషరతుగా లొంగిపోయేలా చేశారు.

జగ్జీవన్‌రామ్‌లో ఉన్న తన వారికి చేయాలనే ఆరాటం... పోరాటం ఇప్పుడు ఉన్న దళిత ఎంపీ, ఎమ్మెల్యేలు అలవరుచుకోవాలి. దళితుల హక్కులను రాజ్యాంగంలో అంబేడ్కర్ పొందుపరిస్తే, వాటిని చట్ట రూపంలో అమలుచేయడానికి జగ్జీవన్‌రామ్ చేసిన కృషి ఎప్పటికీ మరిచిపోలేనిది. అవమానాలు, ఆటంకాలను విజయాలుగా మలుచుకున్న నిజమైన దేశ నాయకుడు జగ్జీవన్‌రామ్. అందుకే ఆయన భవిష్యత్తు తరాలకు కూడా ఆదర్శవంతుడు. ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేసిన ఆయన 1986 జూలై 6న కన్నుమూశారు. ఆయన జన్మదినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా సమతా దినోత్సవంగా జరుపుతోంది. దేశం కోసం.. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనడమే కాకుండా, సాంఘిక సమానత్వం కోసం అణగారిన వర్గాల కోసం చివరి శ్వాస వరకూ కృషి చేసిన జగ్జీవన్‌రామ్‌ను భారతరత్నతో గౌరవించాలి.

– సంపత్ గడ్డం

విషమిస్తున్న మన విశ్వగురుత్వం!

ప్రపంచానికి భారత్ విశ్వగురువుగా మారుతోంది! నమ్మినా నమ్మకపోయినా ఇది నిజం! ఎన్నింటిలో మనకు గురుపీఠం దక్కుతోందంటే టక్కున చెప్పలేం. ఒక విషయంలో మాత్రం అది కఠోర వాస్తవంగా మారింది. విశ్వగురు ప్రచారకర్తలు మాత్రం దీనిపై మౌనం వహిస్తున్నారు. కనీసంగా కూడా ప్రస్తావించటం లేదు. చర్చకూ ఆ విషయాన్ని రానివ్వటం లేదు. ఆదాయం, సంపద అనేవి సమాజ స్థాయిని అంచనా వేయటానికి కొలమానాలు. ఈ రెండూ దండిగా ఉండటం గొప్పే! కాదనలేం! కానీ అవి వివిధ ప్రజల మధ్య ఏ స్థాయిలో పంపకం అవుతున్నాయన్నది అంతకంటే కీలకమైంది. గౌరవప్రద జీవితానికి, మౌలిక అవసరాలు తీర్చుకోటానికి ఆ పంపకం ఎక్కువమందికి తోడ్పడుతుంటే దాన్ని న్యాయబద్ధంగా ఉందని అంటాం. ఈ న్యాయబద్ధతకు మనం ఎంత దూరంలో ఉన్నాం? ప్రభుత్వాల విధానాలు అందుకు తోడ్పడుతున్నాయా? 1950ల తర్వాత మనతో పాటే అభివృద్ధి దిశగా అడుగులు వేసిన దేశాలతో పోల్చితే మనం ఎక్కడ ఉన్నాం? వీటిని పరిశీలిస్తే విస్తుబోయే నిజాలు కనపడతాయి. ప్రపంచంలోని వివిధ దేశాల ఆర్థిక అసమానతలను ఎంతో లోతుగా విశ్లేషిస్తున్న వారిలో ఫ్రెంచ్ ఆర్థికవేత్త థామస్ పికెటీ ఒకరు. మరో ముగ్గురు ఆర్థికవేత్తలతో కలిసి ఆయన భారత్‌లోని అసమానతలపై ఇటీవల ఒక నివేదికను రూపొందించారు. 1922 నుంచి 2023 వరకూ దేశంలో నెలకొన్న అసమానతలను మన కళ్లముందు ఉంచారు. 'భారత్‌లో ఆదాయం-సంపద అసమానతలు' అన్న పేరుతో రూపొందించిన ఆ నివేదిక పెద్దదేమీ కాదు. అంతా కలిసి 86 పేజీలే ఉంది.

ఆదాయం అంటే అందరికీ తెలిసిందే. ఉద్యోగం, వృత్తి, వ్యాపారం చేయటం ద్వారా డబ్బు రూపంలో మనకు లభించేది. సంపద అంటే భూములు, భవనాలు, షేర్లు, బంగారం, మ్యూచువల్ ఫండ్స్ రూపంలో ఉండేది. ఆదాయం, సంపద అనేవి మనుషుల జీవితాలను శాసిస్తాయి. మన సౌకర్యాలను అవే నిర్దేశిస్తాయి. ఈ రెండూ సమాజంలో అన్ని వర్గాల ప్రజలకూ ఒకేలా అందవు. ఇప్పుడే కాదు నాగరికత మొదలైన నాటి నుంచి ఈ పరిస్థితే ఉంది. యుగయుగాల్లో ఉద్యమాలు, పోరాటాలు, ప్రవక్తల బోధనలు, మత సంస్కరణలు ఏదో విధంగా వీటి చుట్టూనే తిరిగాయి. పంపిణీలో సముచిత వాటాల కోసం వివిధ రూపాల్లో చరిత్ర అంతా పెనుగులాటలు జరుగుతూనే ఉన్నాయి. వివిధ వర్గాలకు అందే ఆదాయాన్ని, సంపదని నిర్దేశించటంలో తొలి నుంచీ ప్రభుత్వ వ్యవస్థే (స్టేట్) కీలకపాత్ర పోషిస్తూ వస్తోంది. అందుకే ఈ రెండింటి పంపకాల విషయంలో తీసుకునే చర్యలను, విధానాలను బట్టి ప్రభుత్వ స్వభావాన్ని అంచనా వేయవచ్చు. పికెటీ విశ్లేషణ ప్రకారం భారత్‌లో ప్రస్తుతం బిలియనీర్ రాజ్ నడుస్తోంది. ప్రభుత్వ చర్యలూ విధానాలూ బిలియనీర్ల చేతుల్లో ఆదాయం, సంపద పోగుపడేలా చేస్తున్నాయి.

ఆదాయం, సంపదలను లెక్కించటానికి ప్రధానంగా వయోజనులనే పరిగణనలోకి తీసుకుంటారు. వీరిలో పైమెట్టున ఉన్న ఒక శాతం (టాప్ 1%) జనాభా పరిస్థితినే చూద్దాం. 2022–23 మొత్తం ఆదాయంలో 22.6 శాతం వాటా ఈ వర్గం ప్రజలకు ఉంది. ఇక సంపదలో ఈ వర్గం వాటా 40.1 శాతానికి చేరుకుంది. గతంలో ఎన్నడూ ఒక శాతం ప్రజల చేతుల్లో ఇంతగా ఆదాయ, సంపద కేంద్రీకరణ జరగలేదు. ఈ వైపరీత్యానికి ఇంకో కోణం కూడా ఉంది. అదే మనకు విశ్వగురువు స్థానాన్ని ఖాయం చేస్తోంది. ఒక శాతం జనాభాకు ఆదాయపరంగా భారత్‌లో ఉన్నంత వాటా ఏ దేశంలోనూ లేదు. ఆదాయ అసమానతల్లో కొంతకాలం కిందటి వరకూ దక్షిణాఫ్రికా, బ్రెజిల్, అమెరికాలు అగ్రభాగాన ఉండేవి. వీటిని భారత్ దాటేసింది. బ్రిటిషు వలస పాలన విపరీత ఆదాయ అసమానతకు పెట్టింది పేరు. ఆ పాలనలో సైతం 1922 నాటికి ఒక శాతం ధనికుల వాటా ఆదాయంలో 13 శాతం మాత్రమే ఉండేది. ఈ ఒక శాతం జనాభాని పక్కనబెట్టి.. పైమెట్టులోని మొత్తంగా 10 శాతం (టాప్ 10%) జనాభా ఆదాయ-సంపద లెక్కలు తీసుకున్నా పరిస్థితి ఘోరంగానే కనపడుతుంది. జాతీయ ఆదాయంలో 10 శాతం ప్రజల వాటా 2020 నాటికి 60 శాతానికి చేరింది. ఇక సంపదలోనూ 65 శాతం వాటా వారిదే.

మార్కెట్ అనుకూల ఆర్థిక సంస్కరణలతో వృద్ధిరేటు పెరిగింది. ఆదాయాలూ సంపదలూ పెరిగాయి. తలసరి ఆదాయం, కొనుగోలు శక్తిలో ఎదుగుదల కనపడింది. నాణేనికి ఇది ఒకవైపు చిత్రమే. మరోవైపు చూస్తే సంస్కరణల వల్ల అసమానతలూ విపరీతంగా పెరిగాయి. 1980ల మధ్యకాలం వరకూ ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వ నియంత్రణలు కఠినంగానే ఉండేవి. పన్నుల భారమూ ఆనాడు అధికమే. వీటివల్ల ఇతర ఇబ్బందులు కలిగినా అసమానతలు కొంత అదుపులో ఉండేవి. ఉదాహరణకు 1950ల్లో పైమెట్టున ఉన్న 10 శాతం ధనికుల ఆదాయం 40 శాతం ఉంటే, 1980 నాటికి అది 30 శాతానికి తగ్గింది. ఆ తర్వాత నుంచి పెరగటమే తప్ప తగ్గిన దాఖలాల్లేవు.

పదిశాతం ధనికులకు సంబంధించిన గణాంకాల్లో ఈ విపరీత ధోరణిని చూసిన తర్వాత మిగతా 90 శాతం జనాభా ఆదాయ-సంపదల పరిస్థితి ఏమిటి? అన్న ప్రశ్న తలెత్తకమానదు. 2022–23 నాటి పరిస్థితిని చూస్తే 50 శాతంగా (బాటమ్ 50%) ఉన్న కిందిస్థాయి ప్రజలకు ఆదాయంలో దక్కింది 15 శాతం వాటానే. గతంలో ఎన్నడూ ఇంత ఘోరమైన పరిస్థితి లేదు. 1990ల నాటికి ఈ వర్గానికి 22.6 శాతం వాటా ఉండేది. అంటే ఏడున్నర శాతం వాటా నికరంగా తగ్గిపోయింది. సంపద విషయాన్నే చూద్దాం. 1961–1981 మధ్య సంపదలో ఈ వర్గం వాటా 11.10 శాతం ఉంటే 2020 నాటికి అది 6–7 శాతానికి పడిపోయింది.

ఇక 40 శాతంగా ఉన్న మధ్యతరగతి (మిడిల్ 40%) విషయంలోనూ ఆదాయ వాటా తగ్గుదల స్పష్టంగా కనపడుతుంది. 1990ల నాటికి ఈ వర్గానికి ఉన్న 44.1 శాతం వాటా 2022 నాటికి 27.3 శాతానికి పడిపోయింది. సంపద వాటాలోనూ ఇదే ధోరణి కనపడుతుంది. 1981 నాటికి 40–45 శాతం వాటా ఉంటే 2023 నాటికి అది 29 శాతానికి దిగజారింది.



■ రాహుల్ కుమార్

అసమానతలపై గత కొన్నేళ్లుగా పికెటీ చేస్తున్న విశ్లేషణతో విభేదించే అర్థికవేత్తలు చాలామందే ఉన్నారు. ఆయన గణాంకాలను మెచ్చుకుని విశ్లేషణను, పరిష్కారాలను వదలివేసే వారూ ఉన్నారు. అలాగే పైవర్గాలపై గణనీయ స్థాయిలో సూపర్ ట్యాక్స్ విధించాలన్న ఆయన ప్రతిపాదనలను అంగీకరించని వారూ ఉన్నారు. కానీ మానవాళి భవిష్యత్తునూ, సుదీర్ఘ మనుగడనూ దృష్టిలో పెట్టుకుని పికెటీ లేవనెత్తిన ప్రశ్నలకు సాధికారికంగా జవాబులిచ్చే వారి సంఖ్య మాత్రం బహు స్వల్పం!



చైనాను, భారత్‌ను పోల్చిచూడటం ఈ మధ్య చాలా పెరుగుతోంది. సాంకేతిక పరిజ్ఞానంలోనే గాక వస్తూత్పత్తిలో కూడా చైనాని అధిగమించాలన్న తపన కనపడుతోంది. ఇది ఎప్పటికి సాధ్యమో ఇప్పుడే చెప్పలేకపోయినా ఆదాయ అసమానతల్లో మాత్రం మనం చైనాను అధిగమించేశాం. ఒక శాతం ధనికుల ఆదాయం చైనాతో పోల్చితే భారత్‌లో 50 శాతం ఎక్కువ. పైమెట్టున ఉన్న 10 శాతం ధనికులతో పోల్చితే ఆ తేడా 35 శాతం ఉంది. ఇక్కడో మినహాయింపు ఉంది. సంపదలో మాత్రం చైనాలో 2011 నుంచి పదో వంతు జనాభా వాటా భారత్‌ను మించిపోవటం మొదలైంది.

అసమానతల ప్రభావం తెలుసుకోటానికి కొన్ని రంగాలకు సంబంధించిన విశేషాలను కూడా పికెటీ బృందం ప్రస్తావించింది. వాటిల్లో కొన్నిటినైనా చూడాలి. విమాన ప్రయాణాల్లో ఒక శాతం ప్రజల వాటా 46 శాతం ఉంది. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టే భారతీయుల సంఖ్య 2.6 శాతమే. 44 శాతం డిజిటల్ నగదు లావాదేవీలను 6.5 శాతం మందే చేస్తున్నారు. మూడో వంతు జొమాటో ఆర్డర్లు 5 శాతం మంది నుంచే వస్తున్నాయి.

మోదీ హయాంలోని వృద్ధిరేటుపై వివాదాలు చాలానే ఉన్నాయి. 2014 నుంచే దేశంలో స్వర్ణయుగం ప్రారంభమైందనే ప్రచారం ఊపందుకున్నా పికెటీ బృందం ఇచ్చిన లెక్కలు దానికి పూర్తి భిన్నంగా ఉన్నాయి. 2015లో వాస్తవిక వృద్ధిరేటు 6 శాతం ఉంటే 2016కి వచ్చేటప్పటికి అది 4.7 శాతానికి పడిపోయింది. 2017–18లో అది 4.2 శాతానికి తగ్గింది. కరోనా సంవత్సరంలో 1.6 శాతానికే పరిమితమైంది. 2020లో మైనస్ 9 శాతానికి పడిపోయింది. 2021లో అది 9.1 శాతంగా కనపడినా దాన్ని సాధారణ వృద్ధిరేటుగా పరిగణించలేం. కిందటి ఏడాది మైనస్ వృద్ధిరేటు వల్ల ఆ ఎదుగుదల కనిపించింది. 2022లో పరిస్థితులు కుదురుకున్న తర్వాత వృద్ధిరేటు 4.7 శాతానికే పరిమితమైంది.

2014 తర్వాత బలపడుతున్న మరో పరిణామం గురించి ఇక్కడ చెప్పుకోవాలి. అసమానతలపై పట్టింపు తగ్గిపోవటం మొదలైంది. అంతకుముందులాగా చర్చలు దీనిపై జరగటం లేదు. దీంతో అసమానతలు సృష్టించే దీర్ఘకాలిక సామాజిక, రాజకీయ ప్రభావాల పరిశీలనలు సైతం మందగిస్తున్నాయి. గణాంకాలను లోపభూయిష్టంగా రూపొందించటం, రాజకీయంగా రుచించని గణాంక సమాచారాన్ని జనంలోకి రానీయకుండా చేయటం 2014 తర్వాత బాగా పెరిగిన విషయాన్ని పికెటీ బృందం ప్రస్తావించింది.

విపరీత ఆదాయ-సంపద వ్యత్యాసాలు ప్రభుత్వం, సమాజంపై పైవర్గాలకు అనుచిత ఆధిపత్యాన్ని కలగచేస్తాయి. ఆదాయం-సంపదలో అగ్రభాగాన ఉన్న వర్గం.. ధనబలంతో రాజకీయాలను శాసించటం 1980ల తర్వాత విపరీతంగా పెరిగింది. పైమెట్టున ఉన్న 10 శాతం ప్రజల నుంచి వచ్చే ఎంపీలు, ఎమ్మెల్యేల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రజాప్రతినిధుల ఈ నేపథ్యం ప్రభుత్వ ఆర్థిక విధానాలను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. వీటికి తోడు అసమానతలను ప్రశ్నించే పౌరసమాజ బృందాలను కట్టడి చేయటం బాగా పెరిగింది. ఇవన్నీ కలిసి దేశాన్ని ధనస్వామ్య భారత్‌గా మార్చివేస్తున్నాయి. విపరీత అసమానతల నుంచి వస్తున్న అసలు ప్రమాదం ఇదే. ఆర్థిక, సామాజిక న్యాయానికి విఘాతంగా పరిణమిస్తున్న వీటిని కట్టడి చేయాల్సిన ప్రభుత్వాలు పూర్తి విరుద్ధబాటలో నడుస్తున్న దృశ్యమే మనముందు మెదలుతోంది. ప్రజలకు ఇచ్చే తాయిలాలు, ఉచితాలు, జనాకర్షణ పథకాలు, నగదు పంపిణీలు.. ఏవీ కూడా ఆదాయ, సంపద అసమానతలపై ప్రభావం చూపలేకపోతున్నాయి.

అసమానతలపై గత కొన్నేళ్లుగా పికెటీ చేస్తున్న విశ్లేషణతో విభేదించే అర్థికవేత్తలు చాలామందే ఉన్నారు. ఆయన గణాంకాలను మెచ్చుకుని విశ్లేషణను, పరిష్కారాలను వదలివేసే వారూ ఉన్నారు. అలాగే పైవర్గాలపై గణనీయ స్థాయిలో సూపర్ ట్యాక్స్ విధించాలన్న ఆయన ప్రతిపాదనలను అంగీకరించని వారూ ఉన్నారు. కానీ మానవాళి భవిష్యత్తునూ, సుదీర్ఘ మనుగడనూ దృష్టిలో పెట్టుకుని పికెటీ లేవనెత్తిన ప్రశ్నలకు సాధికారికంగా జవాబులిచ్చే వారి సంఖ్య మాత్రం బహు స్వల్పం!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
శుక్రవారం 5 ఏప్రిల్ 2024


విద్యుత్ దీపాల వెలుగుల్లో నిట్ పరిపాలన భవనం

సందడే.. సందడి

నేటి నుంచి నిట్‌లో వసంతోత్సవం

- మూడురోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించనున్న 'టెక్నోక్రాట్స్'
- సాయంత్రం ప్రారంభించనున్న డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి
- భావిభారత ఇంజనీర్ల కల్చరల్ ఫెస్ట్‌కు ముస్తాబైన ప్రాంగణం
- హాజరుకానున్న పది వేలమంది విద్యార్థులు

వివరాలు : 7 లో..

నిర్మానుష్యంగా వెంకటరమణ జంక్షన్

గురువారం ఉష్ణోగ్రత | గరిష్ఠం : 39.9°C | కనిష్ఠం : 22.0°C





భగభగ..

రారెత్తిస్తున్న ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరి

హనుమకొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎండలు ఠారెత్తిస్తున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో సగటున 40 డిగ్రీలకు పైనే నమోదవుతుండటం, వడగాలులు, ఉక్కపోత ప్రారంభం కావడంతో జనం బెంబేలెత్తుతున్నారు. ఉదయం 9గంటలకే సూరీడు సుర్రుమంటుండగా.. మధ్యాహ్నం సమయంలో జనం ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. దీంతో రహదారులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే కూడళ్లు వెలవెలబోతున్నాయి. గతేడాది కన్నా ఈ సారి ఎండలు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండగా.. మార్చిలో పగటి ఉష్ణోగ్రతలు 30 నుంచి 38 డిగ్రీలు నమోదవగా.. ఏప్రిల్‌లో తీవ్రత పెరుగుతూ వస్తోంది. గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యధిక ప్రగటి ఉష్ణోగ్రత 42 డిగ్రీలకు చేరుకుంది. అత్యధికంగా ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత 42.1 డిగ్రీలు నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా లో 41డిగ్రీలు, జనగామ జిల్లాలో 40.5డిగ్రీలు, వరంగల్ జిల్లాలో 40.3 డిగ్రీలు, హనుమకొండ జిల్లాలో కాస్త తక్కువగా 39.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండు రోజుల్లో ములుగులో మరింతగా 42.9డిగ్రీలు, 42.3డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 42.6డిగ్రీలు, జనగామలో 41.6డిగ్రీలు, వరంగల్‌లో 41.7డిగ్రీలు, హనుమకొండలో 41.5 డిగ్రీలకు పెరగొచ్చని వాతావరణ కేంద్రం తెలిపింది. ఎండలు పెరుగుతుండటంతో జన సంచారం లేక రోడ్ల పక్కన చిరువ్యాపారాలు మంద గించాయి. దీంతో ఆ పేద, చిరు వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలోనే పండ్లు, పండ్ల రసాలు, కొబ్బరి బొండాలు, మజ్జిగ, అంబలి, సోడ తదితర పానీయాలకు డిమాండ్ పెరిగింది.

పెరుగుతున్న వడదెబ్బ బాధితుల సంఖ్య

ఎండల తీవ్రత, ఉక్కపోత, వడగాలుల వల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, అందు వల్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖాధికారులు, వైద్యులు సూచిస్తున్నారు. ఇప్పటికే వడదెబ్బబారిన పడుతున్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా బయట పనులకు వెళ్లే కార్మికులు, ఉపాధి కూలీలు ఎక్కువగా అనారోగ్యం పాలవుతున్నారు. ఉష్ణోగ్రతల తీవ్రత వల్ల వృద్ధులు, పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధడుతున్నవారు అస్వస్థతకు గురవుతున్నారు. ఈ క్రమంలో అన్ని జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వేసవి కాలంలో వచ్చే వ్యాధులపై పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసి ఎండబాధితులకు తక్షణ వైద్యసేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు.



- ఉమ్మడిజిల్లాలో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో అత్యధికం
- బొగ్గగని ప్రాంతాల్లో మరింత వేడిమి
- ఆరెంజ్ అలర్ట్ జారీతో యంత్రాంగాలు అప్రమత్తం


సోడా దుకాణం వద్ద రద్దీ

జన సంచారంలేని కాళోజీ జంక్షన్



అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం

ఎండల తీవ్రతతో ఉమ్మడి జిల్లాలో తరుచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. వేసవి వేళ సంభవించే ఈ అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తం గా ఉండాలి. రహదారుల వెంట పేరుకుపోతున్న చెత్త, రాలిన ఎండు ఆకులు, ప్లాస్టిక్ వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు తొలగించడం లేదు. దీంతో తాగిపడేసిన బీడీ, సిగరెట్ పీకల ద్వారా మంటలు అంటుకుంటున్నాయి. అలాగే ఏసీలు, కూలర్లు వినియోగం ఎక్కువడంతో సామర్థ్యానికి మించి విద్యుత్ వాడకం పెరిగి షార్ట్‌సర్క్యూట్ జరిగి అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల వరంగల్ పోచ మ్మమైదాన్‌లోని ఒక షాపింగ్ కాంప్లెక్సులో షార్ట్ సర్క్యూట్ వల్ల భారీ అగ్నిప్రమాదం జరిగింది తెలిసిందే. ములుగులో ఎండ తీవ్రత వల్ల ఏజెన్సీ ప్రాంతంలోని అడవిలో కార్చిచ్చు చెలరేగింది.

వడదెబ్బ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

వడదెబ్బకు గురైనప్పుడు శరీర ఉష్ణోగ్రత తీవ్రం గా పెరగడం, తీవ్రమైన తలనొప్పి, నాలుక ఎండి పోవడం, శరీరంలో నీటి శాతం కోల్పోవడం, మూ త్రం గాఢ పసుపు రంగులో ఉండి మంట రావ టం, పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితిలోకి వెళ్లే లక్షణాలు కనిపిస్తాయి. వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడ ప్రదేశానికి చేర్చాలి. శరీరాన్ని చల్లని నీటిలో ముంచిన వస్త్రంతో తుడవాలి. ఎండదెబ్బ తగిలినవారికి ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, గ్లూకోజ్, ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలి. సత్వర చర్యల కోసం 108 అత్యవసర సేవలను సంప్రదించాలి. ప్రథమ చికిత్స తర్వాత ఆసుపత్రులకు తరలించాలి. అయితే ఎండ త్రీవంగా ఉన్నప్పుడు బయట తిరగడం, ఆటలాడటం చేయొద్దు. తప్పనిసరి అయితే గొడుగు, టోపీ, తెల్లని రుమాలు ధరించాలి. నీరు, ఇతర ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. మత్తుపానీయాలు తీసుకోవద్దు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు అనారోగ్య సమస్యలతో బాధపడేవారు వేసవిలో జాగ్రత్తగా ఉండాలి. బయట పనికి వెళ్లేవారు ఉదయం, సాయంత్రం వేళల్లో పని చేసుకొని మధ్యాహ్న సమయలో విశ్రాంతి తీసుకోవాలి.

నిప్పుల కుంపటిగా బొగ్గుగనులు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని బొగ్గుగని ప్రాంతాలైన భూపాలపల్లి టౌన్, తాడిచెర్ల, గణపురం మండలంలోని మాధవరావుపల్లె ఓపెన్ కాస్టులు, వాటి పరిసరాలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. సహజంగా బొగ్గునిల్వలు, ఓపెన్‌కాస్టులు ఉన్న చోట వేడిమి ఎక్కువగా ఉంటుంది. దీని కితోడు ఎండలు మండిపోతుండడంతో స్థానికులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఉష్ణోగ్రతలు ఇలాగే పెరుగుతూ పోతే నీటితో ఈ ప్రాంతాలను చల్లబరచాల్సి ఉంటుంది. అలాగే సిబ్బందికి సెలవులు ప్రకటించాల్సిన పరిస్థితి వస్తుంది. ఉద్యోగులకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. బయట 40 డిగ్రీలు ఉంటే ఓపెన్ కాస్టులలో 45 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రత ఉండే అవకాశం ఉండటంతో సంస్థ అధికారులను అప్రమత్తం చేస్తోంది.

ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలి

- శాంతిభద్రతల పరిరక్షణలో బ్లూకోల్ట్స్ పాత్ర కీలకం
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



వరంగల్ క్రైం, ఏప్రిల్ 4 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సిబ్బంది అప్రమత్తంగా విధులను నిర్వర్తించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న బ్లూకోల్ట్స్ సిబ్బందితో పాటు సెక్టార్ విభాగం ఎస్ఐలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పరిశీలించడంతో పాటు, వారికి అప్పగించిన పనులపై కమిషనర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించాల్సిన బాధ్యత బ్లూకోల్ట్స్‌పై ఉందన్నారు. ఫిర్యాదుపై క్షుణ్ణంగా దర్యాప్తు చేసి, పోలీస్ అధికారులకు నివేదిక ఇవ్వడం ద్వారా బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో బ్లూకోల్ట్స్ పాత్ర కీలకమన్నారు. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే పనితీరుపై అధికారుల పర్యవేక్షణ ఉంటుందని వివరించారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ రవి, ఏసీపీలు జితెందర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సీఐలు సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


రంజాన్ వేళలు

ఇఫ్తార్ : శుక్రవారం సా:6.35గం..

సహర్ : శనివారం ఉ:4.44 గం..


జడ్పీ సమావేశంలో చైర్ పర్సన్ గండ్ర జ్యోతి, సీఈవో రాంరెడ్డి తదితరులు

కోరం లేక వరంగల్.. జడ్పీ సమావేశం వాయిదా

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 4 : వరంగల్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. పాలకవర్గ సభ్యుల కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి వెల్లడించారు. బుధవారం సమావేశ ప్రారంభ సమయానికి చైర్‌పర్సన్‌తో పాటు వివిధ శాఖల అధికారులు అదాలత్ ప్రాంతంలోని జడ్పీ కార్యాలయానికి చేరుకున్నారు. చైర్‌పర్సన్‌తో పాటు సీఈవో రాంరెడ్డి తదితర అధికారులు సమావేశ మందిరానికి చేరుకున్నారు. అయితే మొత్తం 16 మంది జడ్పీటీసీల్లో వర్ధన్నపేట జడ్పీటీసీ మార్గం బిక్షపతి ఒక్కరే హాజరయ్యారు. సభ నిర్వహణకు కనీసం 5 సభ్యులు పాల్గొనాలి. ఒక్క జడ్పీటీసీ మాత్రమే సమావేశానికి హాజరు కావడంతో నిబంధనల మేరకు సభను వాయిదా వేశారు. లోక్‌సభ ఎన్నికల క్రమంలో కేవలం శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహణకే సభ పరిమితమే, ఆ మేరకు నిర్వహణ జరపాలని ముందే నిర్ణయించారు. అయితే కోరం లేకపోవడంతో మొత్తం సమావేశమే వాయిదా పడడంతో వచ్చిన అధికారులు వెళ్లిపోయారు.


కేవలం అధికారులే పాల్గొనగా సభ్యులు లేక ఖాళీగా కనిపిస్తున్న సమావేశ మందిరం

వరంగల్ ఆర్డీవో ఆఫీసు జప్తునకు హైకోర్టు ఆదేశం

- టెక్స్‌టైల్ పార్కు భూమి పరిహారం విషయంలో రైతుకు అనుకూలంగా ఉత్తర్వులు
- రూ.2.40 కోట్లు చెల్లించాలని గతంలోనే చెప్పినా పట్టించుకోని అధికారులు


వరంగల్ ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న హైకోర్టు నుంచి వచ్చిన అధికారులు

వరంగల్ సిటీ, ఏప్రిల్ 4 : టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు కోసం సేకరించిన భూమిలో ఓ రైతుకు పరిహారం చెల్లించకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడంపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. సదరు రైతుకు రూ.2.40కోట్లు చెల్లించాలని చెప్పినా పట్టించుకోలేదని, ఇకనైనా ఆ సొమ్మును అతడికి చెల్లించాలని లేదంటే వరంగల్ ఆర్డీవో కార్యాలయాన్ని ఆ రైతుకు జప్తు చేయాలని ఉత్తర్వులిచ్చింది. భూమి పరిహారం విషయంలో తనను ఆశ్రయించిన రైతుకు అనుకూలం హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ నేపథ్యంలో గురువారం హైకోర్టు నుంచి వచ్చిన ప్రత్యేకాధికారి సంజయ్, రైతు తరపు న్యాయవాది నాగేంద్రచారి వరంగల్ కలెక్టరేట్‌కు చేరుకుని ఆర్డీవోను కలిసేందుకు ప్రయత్నించగా ఆయన సెలవులో ఉండటంతో డీఆర్వోను కలిసి విషయాన్ని తెలపగా తాము ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కొంత గడువు కావాలని కోరారు. దీంతో హైకోర్టు నుంచి వచ్చిన ప్రత్యేకాధికారి సంజయ్ ఉత్తర్వుల కాపీని వరంగల్ ఆర్డీవో కార్యాలయ గోడకు అంటించి వెళ్లిపోయారు.

వివాదానికి సంబంధించిన వివరాలివీ..

వరంగల్‌లో ఆజంజాహి మిల్లు మూతపడి భూములను సైతం అమ్ముకోవడంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ఆ తర్వాత జిల్లాలో అంత పెద్ద పరిశ్రమ మరొకటి లేకుండా పోవడంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అంతకంటే పెద్ద పరిశ్రమను నెలకొల్పాలని సంకల్పించింది. 2016లో నగరానికి సమీపంలో పరకాల నియోజకవర్గ పరిధిలోని గీసుగొండ మండల శాయంపేట సమీపంలో సుమారు 1400 ఎకరాల భూమిలో టెక్స్‌టైల్ పార్క్ నిర్మించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో ప్రభుత్వ భూమితో పాటు పలువురు రైతుల నుంచి భూములను సేకరించింది. రైతుల నుంచి తీసుకున్న భూమికి గాను ఎకరానికి నష్టపరిహారంగా రూ.9.90 లక్షల ధర నిర్ణయించి చెల్లింపులు చేసింది. ఈ క్రమంలో శాయంపేటకు చెందిన సముద్రాల యాకస్వామి, ఆయన కూతురు వెన్నెలకు సంబంధించిన 20 ఎకరాల భూమిని కూడా సేకరించింది. కానీ అందరిలా కాకుండా వారికి నష్టపరిహారం తక్కువ ఇచ్చేందుకు ప్రయత్నించారు. ముఖ్యంగా యాకస్వామికి చెందిన 12ఎకరాలకు ఎకరానికి రూ.8.90లక్షల చొప్పున మాత్రమే చెల్లిస్తామని అధికారులు చెప్పడంతో యాకస్వామి అంగీకరించలేదు. తన భూమిని టెక్స్‌టైల్ పార్కుకు ఇవ్వనని భీష్మించినా.. అధికారులు మాత్రం స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులను కలిసినా పట్టించుకోకపోవడంతో.. యాకస్వామి 2022లో న్యాయవాది నాగేంద్రచారి ద్వారా హైకోర్టును ఆశ్రయించారు. పలుమార్లు వాదనలు, ప్రతివాదనలు విన్న హైకోర్టు ఆరు నెలల క్రితం యాకస్వామికి సంబంధించిన భూమికి గాను రూ.2.40కోట్లు చెల్లించాలని వరంగల్ ఆర్డీవోను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులను తీసుకుని రైతు యాకస్వామి పలుమార్లు ఆర్డీవోతో పాటు జిల్లా ఉన్నతాధికారులు, కలెక్టర్‌ను కలిసినా ఫలితం లేకపోవడంతో.. తన న్యాయవాది ద్వారా మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఆర్డీవో, ఇతర అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన హైకోర్టు సదరు రైతుకు వెంటనే డబ్బులు చెల్లించాలని లేదంటే ఆర్డీవో కార్యాలయాన్ని అయనకు జప్తు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది.


వరంగల్ ఆర్డీవో కార్యాలయం



భూమి తీసుకున్నారు డబ్బులు చెల్లించలేదు : యాకస్వామి

టెక్స్‌టైల్ పార్క్ కోసం నాది, నా కూతురు వెన్నెలకు కలిపి ఉన్న 20ఎకరాల భూమిని 2016లో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందరి రైతుల్లా పరిహారం ఇవ్వమని అడిగితే నిర్లక్ష్యం చేస్తున్నారు. హైకోర్టును ఆశ్రయిస్తే ఇరువర్గాల వాదనలు విని అధికారులు మాకు రూ.2.40కోట్లు చెల్లించాలని ఆదేశించింది. ఆ ఆదేశాలిచ్చి ఆరు నెలలయినా అధికారులు స్పందించడం లేదు. దీంతో మరోసారి హైకోర్టును ఆశ్రయించగా ఆర్డీవో కార్యాలయాన్ని మాకు జప్తు చేయాలని అధికారులను ఆదేశించింది.


హనుమకొండ నయీంనగర్‌లో కరీంనగర్ ప్రధాన రహదారి

నేడు నయీంనగర్ నాలా బ్రిడ్జి కూల్చివేత

3 నెలల పాటు వాహనాల రాకపోకలు బంద్

రూ.15 కోట్లతో చేపట్టనున్న కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు


నయీంనగర్‌లో కొనసాగుతున్న నాలా వెడల్పు పనులు

నయీంనగర్, ఏప్రిల్ 4 : హనుమకొండ నయీంనగర్‌లో ప్రధాన రహదారిలో ఉన్న నాలా పాతబ్రిడ్జిని శుక్రవారం మునిసిపల్ అధికారులు కూల్చనున్నారు. దీని స్థానంలో రూ.15 కోట్లతో కొత్త వంతెనను కట్టనున్నారు. మూడునెలల్లో వర్షాకాలం రానుండటంతో ఈలోపే పను లు పూర్తిచేసేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ కొత్త బ్రిడ్జి పూర్తయితే వరదముంపు సమస్య నుంచి ప్రజలు బయటపడే అవకాశం ఉంది. ఎన్నో సంవత్సరాలుగా నయీంనగర్ నాలా చుట్టుపక్కల ప్రాంతంలో ఉన్న కాలనీలు చిన్నపాటి వర్షానికే వరద ముంపునకు గురవుతున్నాయి. చుట్టూ ఉన్న ప్రజలు వరదతో ఎన్నోసార్లు ఆస్తినష్టాలకు గురయ్యారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చొరవతో నయీంనగర్ నాలావెడల్పు,

మిగతా 8వ పేజీలో..

గొర్రెల మందపైకి దూసుకుపోయిన కారు

ధర్మసాగర్ (హనుమకొండ జిల్లా), ఏప్రిల్ 4 : అతివేగంతో కారు గొర్రెల మందపైకి దూసుకుపోవడంతో ఏడు గొర్రెలు మృతి చెందాయి. ఈ సంఘటన దిన ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి గ్రామ శివారులో గురువారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం... ధర్మసాగర్‌కు చెందిన గొర్రెలకాపరులు గంటి రమేష్, గంటి సంపత్, గంటి సాంబరాజు, అల్లాడి పెద్దపురం, గంటి పెద్ద కొంరయ్య, చిన్న కొంరయ్యలకు చెందిన గొర్రెలను మేతకు తోలుకుపోయారు. శాయిపేట్ వైపు నుంచి గొర్రెలను మేపుకొని తిరిగి ధర్మసాగర్‌కు వస్తుండగా ఎలుకుర్తి క్రాస్ వద్దకు రాగానే కారు అతివేగంతో వచ్చి గొర్రెల మందపైకి దూసుకుపోయింది. దీంతో ఏడు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో తొమ్మిది గొర్రెలకు గాయ్యాలయ్యాయి. కాగా, మృతి చెందిన గొర్రెల విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన నిందితులను గొర్రెలకాపరులు పోలీసులకు అప్పగించారు.


ఎలుకుర్తి క్రాస్ వద్ద గొర్రెలపైకి కారు దూసుకుపోవడంతో మృతి చెందిన, గాయపడిన గొర్రెలు

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


వస్కుల రాజు(ఫైల్)

మడికొండ, ఏప్రిల్ 4 : అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కాజీపేట మండలం మడికొండలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై రాజబాబు తెలిపిన వివరాలప్రకారం. ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామానికి చెందిన వస్కుల రాజు (37)కు మడికొండ ఎస్సీ కాలనీలోని రజితతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. కుటుంబంతో మడికొండలో నివాసముంటున్నాడు. వీరికి ఒక కుమార్తె ఉంది. గతంలో ఆటో నడుపుకునే రాజు కొంతకాలంగా అప్పుల బాధతో ఇబ్బంది పడుతున్నాడు. గతంలో అతను ఒకసారి ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. మంగళవారం రాత్రి ఇంట్లో పడుకున్న అతడు ఉదయం వేళ ఇంట్లో వారు లేచి చూసే సరికి ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్డులో ఉరి వేసుకుని కనిపించాడు. అతడిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

రైలులో బాలుర తరలింపు
పట్టుకుని చైల్డ్‌లైన్‌కు అప్పగించిన పోలీసులు

కాజీపేట, ఏప్రిల్ 4 : రైలులో తరలిస్తున్న బాలకార్మికులను పోలీసులు పట్టుకుని చైల్డ్‌లైన్‌కు అప్పగించారు. కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎం. సంజీవరావు తెలిపిన ప్రకారం. గోరఖ్‌పూర్-సికింద్రాబాద్ మధ్య నడిచే గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో గురువారం వివిధ ప్రాం తాల నుంచి బాలురను తరలిస్తున్నారన్న సమాచారంతో కాజీపేటలో ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో 11 మంది బాలురు, వారిని తరలిస్తున్న ఐదుగురిని పట్టుకున్నారు. విచారించగా వేసవి సెలవులు ఉన్నందున బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ నుంచి హైదరాబాద్‌లో పని చేయించేందుకు బాలురలను తరలిస్తున్నట్లు రవాణాదారులు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుకున్న బాలురను చైల్డ్‌లైన్‌కు అప్పగించినట్లు చెప్పారు. తనిఖీలల్లో రైల్వే సీఐ రామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌కు 5రోజుల వరుస సెలవులు

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 4 : వరంగల్ (ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా ఐదు రోజులు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి కె.సంగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం బాబూజగ్జీవన్‌రామ్ జయంతి, శనివారం వారాంతపు సెలవు, ఆదివారం సాధారణ సెలవు, సోమవారం అమావాస్య సందర్భంగా సెలవు, మంగళవారం ఉగాది పండగను పురస్కరించుకుని సెలవు ప్రకటించినట్లు తెలిపారు. బుధవారం నుంచి యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి రైతులు, వ్యాపారులు, కార్మికులు మార్కెట్ కమిటీకి సహకరించాలని కార్యదర్శి ఆ ప్రకటనలో కోరారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్ష తేదీలు ఖరారు

హనుమకొండ టౌన్ / కేయూ క్యాంపస్, ఏప్రిల్ 4 : ఎంపీఈడీ, బీపీఈడీ పరీక్ష తేదీలను గురువారం కేయూ పరీక్షల విభాగం ప్రకటించింది. ఈనెల 18, 20, 23, 25 తేదీల లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎంపీఈడీ మొదటి సెమిస్టర్, ఈనెల 16, 19, 22, 24 తేదీలలో ఎంపీఈడీ థర్డ్ సెమిస్టర్ పరీక్షలు, అదే విధంగా ఈనెల 16, 18, 20, 22 తేదీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక తెలిపారు.

ముగిసిన ఇంటర్ స్పాట్

వరంగల్ ఎడ్యుకేషన్ మార్చి 4 : ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ గురువారంతో ముగిసింది. మార్చి 16 నుంచి హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న స్పాట్ క్యాంపు ముగిసిందని క్యాంపు ఆఫీసర్ ఎ.గోపాల్, అదనపు క్యాంపు అధికారి కె. మాధవరావులు పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి జనరల్ విభాగంలో 7.5 లక్షల జవాబు పత్రాలు రాగా, వొకేషనల్ విభాగంలో 1.5 లక్షల జవాబు పత్రాలు వచ్చాయి. వీటన్నింటి మూల్యాంకన ప్రక్రియ పూర్తియ్యిందని తెలిపారు. స్పాట్ క్యాంపులో 361 మంది సీఈలు, 1,838 మంది ఏఈలు, 361 మంది స్క్రుటినీ సిబ్బంది పాల్గొన్నట్లు వారు తెలిపారు. మూల్యాంకన ప్రక్రియ పూర్తి కావడంతో మరో పది రోజుల్లో బోర్డు మార్కుల పోస్టింగ్‌ను పూర్తి చేసి ఫలితాలు ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది.

జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం

ఈనెల 12వ తేదీ వరకు నిర్వహణ

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 : జేఈఈ మెయిన్స్ పరీక్ష హనుమకొండ నగరంలో ఏర్పాటు చేసిన మూడు కేంద్రాల్లో ప్రశాంతంగా ప్రారంభమైంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన షిఫ్ట్-1 పరీక్షకు మొత్తం 790 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 716 మంది హాజరు కాగా 74 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 90.63 శాతం మంది విద్యార్థులు మొదటి షిఫ్ట్‌లో హాజరయ్యారు. ఇక మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన రెండవ షిఫ్ట్ పరీక్షకు మొత్తం 790 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 713 మంది హాజరు కాగా 77 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 90.25 శాతంమంది విద్యార్థులు మొదటిషిఫ్ట్‌లో హాజరయ్యారు. కాగా నగరంలోని అయాన్ డిజిటల్ జోన్, ఎర్రగట్టు గుట్ట, నోబుల్ టెక్నాలజీస్, చింతగట్టు, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల బొల్లికుంటలో గురువారం జేఈఈ మెయిన్స్-2024 పరీక్షలు ప్రారంభమయ్యాయి. నగరంలో ఏర్పాటు చేసిన నాలుగు కేంద్రాల్లో ఈనెల 12 వరకు రెండు షిఫ్టుల్లో జరిగే పరీక్షకు 8,627 మంది పరీక్ష రాయనున్నారు.

భార్యకు దూరంగా ఉంటున్న భర్తపై దాడి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 4 : విడాకుల కేసు కోర్టులో కొనసాగుతోండగానే భార్య కుటుంబసభ్యులు భర్తపై దాడి చేశారు. ఈ ఘటనకు సంబంధించి గురువారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండలోని రాయపురాకు చెందిన గుండెబోయిన మహేశ్ ఆయన భార్య అపర్ణకు సంబంధించి విడాకుల కేసు గత రెండేళ్ల నుంచి కోర్టులో కొనసాగుతోంది. ఈ క్రమంలో అపర్ణ కుటుంబసభ్యులు మ్యాదరబోయిన రాజేందర్, మ్యాదరబోయిన రాజ్‌కుమార్, రవి ఈనెల 1న రాయపురలోని మహేశ్ ఇంట్లోకి చొరబడి వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు మనుషులపై దాడి చేశారు. బాధితుడు బుధవారం ఫిర్యాదు చేయగా నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు వరం.. బీసీ గురుకులం..


ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎంజేపీ కళాశాలలో విద్యార్థులకు పాఠాన్ని బోధిస్తున్న లెక్చరర్

కేసముద్రం, ఏప్రిల్ 4 : పదో తరగతి పూర్తిచేసి.. ప్రతిభావంతులైన వెనుకబడిన తరగతుల విద్యార్థులకు ఇంటర్ విద్యను అందించేందుకు మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఎంజేపీటీబీసీడబ్ల్యూ) ఆధ్వర్యంలో నిర్వహించే రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు వరంగా మారాయి. వెనుకబడిన తరగతుల విద్యార్థుల్లోని ప్రతిభకు వెలికితీస్తూ వారి బంగారు భవిష్యత్‌కు ప్రభుత్వ గురుకుల కళాశాలలు బాటలు వేస్తున్నాయి. పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు ఇంటర్ విద్యతో పాటు ఐఐటీ, ఎంసెట్, నీట్ ప్రవేశపరీక్షల్లో ఆంగ్ల మాధ్యమంలో విద్యనందిస్తూ రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 29 మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల జూనియర్ కళాశాలలను రాష్ట్రప్రభుత్వం నెలకొల్పింది. వీటిలో 15 బాలురకు, 14 బాలికల కోసం ఏర్పాటు చేశారు. 2024-2025 విద్యా సంవత్సరానికి ఇంటర్ అడ్మిషన్ కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు పదో తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ప్రైవేటు కళాశాలలు, హాస్టళ్లలో ఫీజులు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ గురుకులాల్లో చేర్పించేందుకు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఇంటర్మీడియట్, ఒకేషనల్ కోర్సుల్లో ఆంగ్లమాధ్యమంలో విద్యతోపాటు ఉచితంగా భోజన, వసతి, ఇతర సౌకర్యాలు కల్పిస్తారు. ప్రవేశపరీక్షలోని మార్కులు, రిజర్వేషన్లను అనుసరిస్తూ సీట్లను భర్తీ చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో 2,480 సీట్లు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 29 మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల జూనియర్ కళాశాలల్లో 2480 సీట్లున్నాయి. వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఏడు కళాశాలల చొప్పున, మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో ఐదు చొప్పున, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో మూడు చొప్పున మొత్తం 29 కళాశాలలున్నాయి. ఈ 29 కళాశాలల్లో 15 బాలురకు, 14 బాలికలకు కేటాయించగా బాలురకు 1,360 సీట్లు, బాలికలకు 1,120 సీట్లు మొత్తం 2,480 సీట్లు ఉన్నాయి. ఈ గురుకులాల్లో బీసీలకు 75 శాతం సీట్లు కేటాయించగా ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 5శాతం ఓసీ లేదా ఈ బీసీలకు 2శాతం, అనాథలకు 3 శాతం సీట్లు కేటాయించారు. ఆయా రిజర్వేషన్లలోనే 3శాతం దివ్యాంగులకు, 25 శాతం సీట్లను జ్యోతిబా పూలే బీసీ గురుకులాల్లో, బీసీ సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు కేటాయించారు. ప్రవేశ పరీక్షకు 2024లో పదో తరగతి రెగ్యులర్‌లో పూర్తి చేసిన వారే అర్హులు. గతంలో పాసైన వారు, సప్లమెంటరీ రాసిన వారు ప్రవేశానికి అనర్హులుగా పరిగణిస్తున్నారు.


జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లిలోని జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాల ప్రాంగణం

- ఇంటర్‌లో ఉచిత వసతి, విద్య
- ఐఐటీ, నీట్, ఎంసెట్‌లో శిక్షణ
- 'సూపర్-100' పేరుతో ప్రత్యేక కోచింగ్
- బీసీలకు 75 శాతం సీట్లు రిజర్వు
- ఉమ్మడి జిల్లాలో 29 కళాశాలలు 2,480 సీట్లు
- ప్రవేశ పరీక్ష కోసం 12వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

గురుకుల కళాశాలల ప్రత్యేకతలు, సౌకర్యాలివే..

- కళాశాలల్లో ఉచిత విద్యతోపాటు వసతి, భోజనం
- ఆంగ్ల మాధ్యమంలోనే బోధన
- ప్రతీ తరగతి గదిలో డిజిటల్ క్లాసులు
- విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం.
- ఉదయం వ్యాయామంతో ప్రారంభించి 7.30 నుంచి 9గంటల వరకు బోధన కార్యక్రమాలు
- మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, ఆట స్థలాల సౌకర్యం
- ఉచిత బెడ్డింగ్ మెటీరియల్, యూనిఫాం, నోట్ బుక్స్ పాఠ్యపుస్తకాలు
- కాస్మెటిక్ చార్జీల చెల్లింపు
- విద్యార్థులపై 24గంటల పాటు అధ్యాపకుల పర్యవేక్షణ
- ఇంటర్‌తో పాటు ఐఐటీ, నిట్, ఎంసెట్, నీట్‌లో శిక్షణ.
- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో ప్రవేశపరీక్ష ద్వారా ఎంపిక చేసి 'సూపర్-100' బ్యాచ్‌గా ఏర్పాటు చేసి ప్రత్యేకంగా ఐఐటీ, నీట్, ఎంసెట్‌లలో శిక్షణ.

జిల్లాల వారీగా కళాశాలలు..

ఉమ్మడి జిల్లాల్లోని జనగామ జిల్లాలో బచ్చన్నపేటలో బాలికలు, బాలురకు వేర్వేరు గురుకులాలున్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్‌లో బాలురు, రఘునాథపల్లిలో బాలికలు, మొండ్రాయిలో బాలికలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొగుళ్లపల్లిలో బాలురు, గాంధీనగర్ ఘన్‌పూర్‌లో బాలికలు, భూపాలపల్లిలో బాలురు, ములుగు జిల్లా వెంకటాపురంలో బాలురు, పాకాల కొత్తగూడలో బాలికలు, మహబూబాబాద్ జిల్లా మరిపెడలో బాలికలు, గుమ్మడూరులో బాలురు, పెద్దవంగరలో బాలురు, పెద్దగూడూరులో బాలికలు, దంతాలపల్లిలో బాలురు, వరంగల్ జిల్లా నెక్కొండలో బాలికలు, నల్లబెల్లిలో బాలురు, సంగెంలో బాలురు, వరంగల్‌లో బాలికలు, ఖిలా వరంగల్‌లో బాలురు, తిమ్మాపూర్‌లో బాలికలు, వర్ధన్నపేటలో బాలికలు, హన్మకొండ జిల్లా శాయంపేటలో బాలురు, ఆత్మకూరులో బాలికలు, హన్మకొండలో బాలురు, కాజీపేటలో బాలికలు, ఐనవోలులో బాలురు, కమలాపూర్‌లో బాలురు, బాలికలకు వేర్వేరుగా కళాశాలలున్నాయి.



ఎంజేపీ గురుకుల కళాశాల బాగుంది..

- సందిరి రవి, విద్యార్థి తండ్రి, కేసముద్రం స్టేషన్

మహబూబాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో నా కుమారుడు జగదీశ్వర్ ఇంటర్ సీఈసీ పూర్తి చేశాడు. నాణ్యమైన విద్య, బోధన ఈ కళాశాలలో అందుతాయి. పేద, మధ్య తరగతి వర్గాల తల్లిదండ్రులకు ఈ గురుకుల కళాశాలలు ఒక వరంగా మారాయి. ప్రతీ ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.



విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి..

- వై.మనోహర్‌రెడ్డి, ఆర్‌సీవో, ఎంజేపీ గురుకులాల ఉమ్మడి వరంగల్ జిల్లా

వెనుకబడిన తరగతుల విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో ఉచిత బోధన కల్పించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. గత ఏడాది ఇంటర్ ప్రవేశపరీక్షను ఉమ్మడి జిల్లాలో 6 వేల మంది విద్యార్థులు రాశారు. ఈ గురుకులాల్లో అన్ని అర్హతలు గల లెక్చరర్లతో విద్యాబోధన ఉంటుంది. ఇంటర్‌తో పాటు ఎంసెట్, ఐఐటీ, నీట్ తదితర ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఉటుంది. మెరుగైన విద్యార్థులకు 'సూపర్-100' గ్రూప్‌కు ఎంపిక చేసి సీవోఈ కళాశాలలో ప్రత్యేకంగా ఐఐటీ, నీట్ తదితర ప్రవేశ పరీక్షలకు శిక్షణనిస్తారు.

బాలికను వేధించిన యువకుడి అరెస్టు

శాయంపేట(హనుమకొండ జిల్లా), ఏప్రిల్ 4 : ప్రేమపేరుతో ఓ బాలికను వేధింపులకు గురిచేసిన యువకుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ ప్రమోద్‌కుమార్ తెలిపారు. కొప్పులకు చెందిన పసుల శివరాజ్ ఓ బాలికను నెలరోజులుగా ప్రేమపేరుతో వేధిస్తున్నాడని చెప్పారు. ఈక్రమంలో ఈనెల 2న రాత్రి గ్రామంలో కిరాణంషాపుకు వెళ్తున్న బాలికను వేధించాడు. దీంతో ఆ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసింది. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేయడంతో శివరాజ్‌పై కేసు నమోదు చేశారు. గురువారం నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

110 ఏళ్ల అమ్మకు అన్నీ తానై..

ఆస్తుల్లేకపోయినా సాకుతున్న వృద్ధురాలు

నర్సంపేట టౌన్, మార్చి 4 : ఆస్తులు లేవు.. పనులు చేసుకునేందుకు సత్తువ లేదు. ప్రభుత్వం నుంచి వచ్చే వృద్ధాప్య పించనే ఆసరాగా నూరేళ్ల వయసుపైబడిన తల్లిని సాకుతోంది 80ఏళ్ల వృద్ధురాలు. ఆరోగ్యం సహకరించకపోయినా, ఓ కన్ను కనిపించకపోయినా కని పెంచిన అమ్మ బాగోగులు చూస్తోంది. ఆస్తులు పంచి ఇచ్చిన తల్లిదండ్రులను కూడా వదిలేస్తున్న వారున్న ప్రస్తుత పరిస్థితుల్లో కష్టాలెన్ని ఎదురైనా తల్లిని కంటికిరెప్పలా కాపాడుకుంటోంది నర్సంపేట మండలం జీజీఆర్ పల్లె గ్రామానికి చెందిన నానబోయిన వెంకటమ్మ. దీనికి సంబంధించిన వివరాలివీ.. జీజీఆర్‌పల్లె గ్రామానికి చెందిన వేల్పుల మలమ్మకు 110 ఏళ్లు. మల్లమ్మ భర్త మల్లయ్య కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. వీరికి ఇద్దరు కూతుర్లు కాగా వారికి వివాహాలయ్యాయి. ఓ కూతురును వేరే ఊరు ఇవ్వగా.. వెంటకమ్మను తమ స్వగ్రామంలోనే ఇచ్చారు. అయితే వెంకటమ్మ భర్త కూడా గతంలోనే మృతిచెందడం.. ఆమె ఇద్దరు కుమారులు కూడా వివాహాలై వేర్వేరుగా ఉంటుండగా వారి ఆర్థిక పరిస్థితి కూడా అంతంతమాత్రమే. ఈ క్రమంలో ఒంటరిగా ఉన్న వెంకటమ్మ.. 110ఏళ్లు పైబడిన తల్లి మల్లమ్మను ఒంటరిని చేయకుండా తనకున్న గుడిసెలోనే ఉంచి సపర్యలు చేస్తోంది. అయితే వెంకటమ్మ వయసు 80 సంవత్సరాలు కాగా ఆరోగ్యం సహకరించకపోయినా.. ఓ కన్ను సరిగా కనిపించకపోయినా తల్లి ఆలనాపాలనా మాత్రం మరవలేదు. ఉండడానికి పూరిగుడిసె తప్ప ఎలాంటి ఆస్తులు, ఆదాయం లేకపోవడంతో తల్లీకూతుళ్లకు ప్రభుత్వం నుంచి వస్తున్న వృద్ధాప్య పింఛనుతోనే బతుకీడుస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, దాతులు తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.


తల్లితో కూతురు వెంకటమ్మ

నేడు బాబు జగ్జీవన్‌రాం జయంతి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 4: భారత తొలి ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రాం 116వ జయంతి వేడుకలను మార్చి5న శుక్రవారం ఉదయం నిర్వహిస్తామని కేయూ ఎస్సీ,ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ తుమ్మల రాజమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దూరవిద్య కేంద్రం వద్ద గల బాబు జగ్జీవన్‌రాం కాంస్య విగ్రహనికి పూలమాలతో నివాళులర్పిస్తాని వెల్లడించారు. అనంతరం కేయూ సెనెట్ హాల్‌లో కంటెపవరీ ఇష్యూష్ ఆఫ్ ఇండియా సొసైటీ అనే అంశంపై జరిగే సదస్సులో మాజీ తెలంగాణ, ఏపీ హైకోర్టు జడ్జీ బి. చంద్రకుమార్ కీలక ప్రసంగం చేస్తారన్నారు.

రేగులగూడెం వాసికి డాక్టరేట్



కాటారం, ఏప్రిల్ 4: భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధి బూడిదపల్లి గ్రామానికి చెందిన పొన్న మహేష్‌కుమార్ డాక్టరేట్(డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ) పట్టా సాధించారు. కాకినాడ జేఎన్‌టీయూ ద్వారా కంప్యూటర్ సైన్స్ ఆఫ్ ఇంజనీ రింగ్(సీఎస్ఈ) విభాగంలో డాక్టర్ ఫిలాసఫీ అవార్డు పొందారు. 'ఎఫీషియంట్ అప్రోచెస్ ఫర్ డిరైవింగ్ హై యుటిలిటీస్ ఫ్రం డాటా స్ట్రీమ్స్' అనే సిద్ధాంత వ్యాసాన్ని ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ సీఎస్ఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సమర్పించడంతో మహేష్ కుమార్ పీహెచ్‌డీ సాధించారు.



క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ప్రోషోల ఫ్లెక్సీ



స్ప్రింగ్ స్ప్రీకి ముస్తాబైన నిట్ ప్రధాన గేట్ తోరణం

నేటి నుంచి నిట్‌లో వసంతోత్సవం

- మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించనున్న 'టెక్నోక్రాట్స్'
- సాయంత్రం ప్రారంభించనున్న డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి
- భావిభారత ఇంజనీర్ల కల్చరల్ ఫెస్ట్‌కు ముస్తాబైన ప్రాంగణం
- హాజరుకానున్న 10 వేలమంది విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 : కాజీపేటలోని నిట్ ప్రాంగణంలో సందడి నెలకొననుంది. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు 'టెక్నోక్రాట్స్' సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు దుమ్మురేపనున్నారు. ఈ ఏడాది 'సృజనాత్మకత శక్తితో కూడిన పండుగను వాగ్దానం చేయడం, పాల్గొనే వారి గత పరిమితులను అధిగమించి వారిలో దాగిఉన్న శక్తిని బయటకు తీయడం (ఙుఖిఘూఎఙా)' అనే థీమ్‌తో వసంతోత్సవాన్ని అర్థవంతంగా తీర్చిదిద్దారు. భావిభారత ఇంజనీర్లు సాంస్కృతిక సంబరాల్లో మునిగి తేలనున్నారు. ఈ స్ప్రింగ్‌స్ప్రీలో నిట్‌లోని విద్యార్థులతో పాటు మొత్తం 10 వేలమంది స్టూడెంట్స్ కేరింతలు కొట్టనున్నారు. నేడు సాయంత్రం నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని నిట్ స్టూడెంట్స్ డీన్ వెల్ఫేర్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షిస్తున్నారు.

స్ప్రింగ్ స్ప్రీ కార్యక్రమాలు ఇలా..

● మొదటి రోజు

అన్ సాల్వ్‌డ్ నుక్కడ్ నాటకం, నిట్ వరంగల్ గాట్ టాలెంట్, ఫిల్మ్ ట్రెజర్ హంట్, ఫిల్మ్ క్విజ్, కొరియో నైట్, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, ఫుడ్ హంట్‌తో పాటు ప్రోషోలో ప్రముఖ గాయకుడు హరిచరణ ఆధ్వర్యంలో చౌరస్తా బ్యాండ్ కార్యక్రమం ఉర్రూతలూగించనుంది.

రెండోరోజు..

నిట్ వరంగల్ సోలో ఐడల్, డైరెక్టర్స్ కట్, ఫిల్మ్‌క్విజ్, హంగ్‌గేమ్స్, ఫొటో పజిల్‌తో పాటు నకాష్ అజీజ్, లాహోర్ ద బ్లాక్ స్మిత్ బృందం ప్రోషోలో విద్యార్థులను తన్మయత్వంలో ముంచనున్నారు.

మూడోరోజు..

జనరల్ క్విజ్, డైరెక్టర్స్ కట్, సీపీఆర్ రిలేతో స్ప్రింగ్ స్ప్రీ కార్యక్రమం ముగియనుంది.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో కేజీబీవీ విద్యార్థినికి బంగారు పతకం


స్రవంతిని అభినందిస్తున్న డీఈవో

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 : జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో బంగారు పథకం సాధించిన వేలేర్ కేజీబీవీ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని సీహెచ్. స్రవంతిని డీఈవో అబ్దుల్‌హై అభినందించారు. జీసీడీవో సునిత ఆధ్వర్యంలో బంగారు పతకం సాధించిన స్రవంతిని డీఈవో కార్యాలయంలో డీఈవో అబ్దుల్ హై పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. కాగా గత నెల 29 నుంచి ఏప్రిల్ 1 వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర బాలికల జట్టు తరఫున పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభను కనబరిచి బంగారు పతకాన్ని సాధించింది. జీసీడీవో సునిత, పీఈటీ కిరణ్మయి, ఎస్‌వో స్రవంతి, హనుమకొండ సాఫ్ట్‌బాల్ సెక్రెటరి తాబేటి రాజేందర్ తదతరులు స్రవంతిని అభినందించారు.



కాంస్య పతకం, ప్రశంసా పత్రం


సాంబమూర్తి

చిత్రకళలో సాంబమూర్తికి కాంస్య పతకం

కరీమాబాద్, ఏప్రిల్ 4 : రంగ్-23 2వ నేషనల్ వైడ్ ఆర్ట్ అండ్ పెర్ఫామెన్స్ కాంపిటీషన్‌లో ఉర్సు కుమ్మరివాడ ప్రాంతానికి చెందిన ఆవునూరి సాంబమూర్తి కాంస్య పతకం సాధించాడు. ఆజాదికా అమృత్ మహోత్సవ్ వేడుకల సందర్భంగా మినిస్ట్రీ ఆఫ్ కల్చరల్ ఆధ్వర్యంలో ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన చిత్రకళ పోటీలను కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ముంబాయిలోని వెర్సోవా వెల్ఫేర్ అసోసియేషన్ హైస్కూల్‌లో గత ఫిబ్రవరి 10, 11వ తేదీల్లో నిర్వహించారు. సాంబమూర్తి 'సర్వాంతర్యామి భారత్' అనే సందేశం చిత్రాన్ని పోస్టు ద్వారా కాంపిటీషన్‌కు పంపించాడు. 40నుంచి 60 ఏళ్ల కేటగిరీలో ఆయనకు తృతీయ బహుమతిని లభించింది. నిర్వాహకులు సాంబమూర్తికి సమాచారం అందించి, కాంస్య పతకాన్ని, ప్రశంసా పత్రాన్ని పోస్టుద్వారా పంపించగా గురువారం ఉదయం తనకు చేరినట్లు సాంబమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.

అక్కంపేటలో తాగునీటికి కటకట

- వారం రోజులుగా ప్రజల ఇబ్బందులు
- వ్యవసాయ బావుల వద్దకు పరుగులు

ఆత్మకూరు (హనుమకొండ జిల్లా), ఏప్రిల్ 4 : మండుతున్న ఎండలకు ప్రజల దాహార్తిని తీర్చాల్సిన అధికారులు పత్తాలేకుండా పోవడంతో నల్లానీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అక్కంపేట గ్రామంలో వారం రోజుల క్రితం మిషన్ భగీరథ పైపులైన్ పగిలిందని గుంతలు తీయించారు. వారం రోజులు గడిచినా మరమ్మతులు చేయకపోవడంతో తాగునీరు లేక ప్రజలు వ్యవసాయ బావులను ఆశ్రయిస్తున్నారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకూడదని ప్రభుత్వం ఎన్నిసార్లు హెచ్చరించినా అధికారుల తీరు మారడం లేదు. పలుమార్లు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీరు అందించాలని వేడుకుంటున్నారు. లేని పక్షంలో ఖాళీ బిందెలతో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

పట్టించుకోని అధికారులు..

సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యతను ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో అధికారులు పత్తాలేకుండా పోవడంతో నీటి సమస్యను ఎవరు పరిష్కరించాలని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ప్రత్యేక అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని స్థానిక కాంగ్రెస్ నాయకులు తెలిపారు.


మరమ్మతుల కోసం గుంత తవ్వి వదిలిన దృశ్యం



'నిబంధనలు పాటించని కళాశాలలపై చర్య తీసుకోవాలి'

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 : వేసవి సెలవుల్లో నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండలోని సంఘ కార్యాలయంలో నరేష్ మాట్లాడుతూ... ఇంటర్మీడియెట్ బోర్డు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ సెకండ్ ఇయర్ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి 40 శాతం ఫీజులు వసూల్ చేసి ప్రైవేటు కళాశాలు తరగతులు నిర్వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇంకా ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కాకుండానే పీఆర్వోలతో పరోక్షంగా ప్రవేశాలు చేస్తున్నారని అలాంటి కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండానే అకాడమీల పేరిట అందినకాడికి దోచుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బన్నీ, రాహుల్, ప్రసాద్, తేజ, కృష్ణ, రవీందర్, ప్రమోద్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిపై కేటీఆర్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంజన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న అంజన్‌రావు

కాళోజీ జంక్షన్, ఏప్రిల్ 4: రాష్ట్ర పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సోమిడి అంజన్‌రావు అన్నారు. హనుమకొండలోని హరిత హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ బీసీ, మహిళా మంత్రిని కేటీఆర్ తాటతీస్తా అనడం సరికాదన్నారు. ఆయన వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. అగ్రవర్ణ అహంకారంతో మాట్లాడడం సరికాదని ఆయన హితవు పలికారు. సమావేశంలో ఐక్య వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధిరాజు మాధవ్, బీసీ యువత రాష్ట్ర అధ్యక్షుడు గోదాసి చిన్న పాల్గొన్నారు.

ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో అశ్రితారెడ్డి ప్రదర్శన



విద్యార్థినికి షీల్డ్ అందజేస్తున్న నిర్వాహకులు

కాజీపేట, ఏప్రిల్ 4: కాజీపేటలోని తాళ్ల పద్మావతి ఒలంపియాడ్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని అశ్రితారెడ్డి బుధవారం మధ్యప్రదేశ్‌లోనిఇండోర్‌లో ఉన్న ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో జరిగిన కళా ప్రదర్శనలో ఉత్తమ ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా ఉజ్జయిని ఎంపీ అనిల్ ఫిరోజియా, రాజ్యసభ ఎంపీ యోగి మేష్‌నాథ్, రామ్‌నాథ్ ఐ బాబాలు అశ్రితారెడ్డికి షీల్డ్, నగదు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా గురువారం తాళ్ల పద్మావతి ఒలంపియాడ్ స్కూల్‌లో ప్రతిభ కనబరిచిన అశ్రితారెడ్డిని తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం అభినందించారు.

అనుమతి లేని వాటర్ ప్లాంటుకు జరిమానా



హనుమకొండలో వాటర్ ప్లాంటు నిర్వాకులకు నోటీసులు ఇస్తున్న బల్దియా సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 4 : వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో అనుమతి లేని వాటర్ ప్లాంట్లకు బల్దియా అధికారులు జరిమానా విధించారు. గురువారం బల్దియా సిబ్బంది పలు చోట్ల పర్యటించారు. నగర పాలక సంస్థ ఈఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్ ఆధ్వర్యంలో ఉదయం33, 50 వ డివిజన్‌లలో క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. నాణ్యతలు పాటించని నాలుగు వాటర్ ప్లాంట్లకు రూ. 30 వేల జరిమాన విధించినట్టు రాజేశ్ వెల్లడించారు. కొన్ని ప్లాంట్లకు నోటీసులు అందించినట్టు చెప్పారు. ఈ తనిఖీలలో శానిటరి సూపర్‌వైజర్ మాదాసి సాంబయ్య, నరేందర్, శానిటరి ఇన్‌స్పెక్టర్ అనీల్ ఉన్నారు.

ఓటు ప్రాముఖ్యతపై అవగాహన



ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 4:లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో ఓటు హక్కు వినియోగం, ప్రాముఖ్యతపై స్వీప్- 2024 అవగాన కార్యక్రమం గురువారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కౌన్సిల్ కార్యాలయంలో గురువారం జరిగింది. అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్ పర్సన్‌లకు నిర్వహించిన అవగహన కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్ గొడిశాల హజరై మాట్లాడారు. ఓటు మన భవితవ్యాన్ని నిర్ణయిస్తుందని, ప్రజాస్వామ్యానికి ఆయువు పట్టుగా నిలుస్తుందన్నారు. ఓటు హక్కును సామాజిక బాధ్యతగా భావించి అందరూ ఓటు వేయడంతో పాటు ఓట్లు వేయించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్ పర్సన్‌లు క్షేత్రస్థాయిలో ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ ఓటు నమోదు శాతం పెంచడానికి కృషి చేయాలన్నారు. అనంతరం ఓట్లు వేయిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈఈ రాజయ్య, డీఎం రజితరాణి, డీఈ శివానంద్, ఏఈలు హరికుమార్, విజలక్ష్మి, శ్రీకాంత్, మేనక, వెంకటేశ్వర్లు, రామన్న పాల్గొన్నారు.

నేడు బీజేపీ ఆధ్వర్యంలో రైతు సత్యాగ్రహ దీక్ష

మిల్స్‌కాలనీ, ఏప్రిల్ 4: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి సర్కిల్‌లో రైతు సత్యాగ్రహ దీక్షను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలం అయ్యిందని, సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు రూ. 25 వేలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ రైతు సత్యాగ్రహ దీక్షను చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని రైతులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపునివ్వాలి



అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిని సత్కరిస్తున్న పీఆర్టీయూ నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్, 4 : పార్లమెంట్ ఎన్నికల విధుల నుంచి కొంత మంది ఉపాధ్యాయులకు మినహాయింపునివ్వాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం. తిరుపతిరెడ్డి, పి. శ్రీహరిలు కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ఎ. వెంకట్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులు, పదవీ విరమణకు దగ్గరగా ఉన్నవారు, విదేశాలకు వెళుతున్నవారు, దీర్ఘకాలిక సెలవులో ఉన్నవారు, గర్భిణీలు, బాలింత ఉపాధ్యాయులను ఎన్నికల విధుల నుంచి మినహాయింపునివ్వాలని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన వెంకటర్‌రెడ్డి సమీక్షించి కలెక్టర్ దృష్టికి తీసుకెళతానని హామి ఇచ్చినట్లు వారు తెలిపారు. ఇటీవలే నూతనంగా విధుల్లో చేరడంతో అదనపు కలెక్టర్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు మాలకొండారెడ్డి, రాజిరెడ్డి, జానీసింగ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఆశీస్సులు తీసుకున్న అరూరి



అరూరికి శుభాకాంక్షలు తెలుపుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 4 : బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్ తన 58వ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆ పార్టీ రాష్ట్ర నాయకుల ఆశీస్సులను తీసుకున్నారు. గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను కలవగా, అరూరితో కేక్‌కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అరూరి వెంట బీజేపీ నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఉన్నారు.

ఏ పార్టీకి మద్దతిచ్చేది నిర్ణయించుకోలేదు

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్

కాళోజీ జంక్షన్, ఏప్రిల్ 4: లోక్‌సభ ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతు ఇచ్చేది తాము ఇంకా నిర్ణయించుకోలేదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు కేదాసి మోహన్ అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగ జాతి సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి మాదిగలకు జరిగిన నష్టం, ఇక ముందు ప్రభుత్వం ప్రకటించే నామినేటెడ్, కార్పొరేషన్, ఎమ్మెల్సీ రాజ్యసభ పదవుల్లో మాదిగలకు న్యాయం చేయాలని చర్చించిన తర్వాతే తమ నిర్ణయాన్ని ప్రకటించనున్నట్లు వివరించారు. సీఎం రేవంత్‌రెడ్డి నుంచి ఖచ్చితమైన హామీ వచ్చాకే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షు డు మేడి పాపయ్య నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏ పార్టీకి మద్దతు ఇచ్చేది ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ హనుమకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పొలుమారి బాలస్వామి, వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బొట్ల రమేష్, వరంగల్ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి వక్కల కుమార్ పాల్గొన్నారు.

సమ్మర్ స్టోరేజి ట్యాంకులు నిర్మించాలి

వడ్డేపల్లి, ఏప్రిల్ 4: వరంగల్ నగరంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు సమ్మర్ స్టోరేజి ట్యాంకులను నిర్మించాలని కేఎంఆర్ కన్‌స్ట్రక్షన్స్ చైర్మన్, కొత్తపల్లి మాజీ సర్పంచ్ కీసర ముత్యంరెడ్డి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని మల్కాపూర్ రిజర్వాయర్ పనులను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ రిజర్వాయర్ పూర్తయితే వరంగల్ త్రినగరితో పాటు వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, జనగామ నియోజకవర్గాల ప్రజలకు సాగు, తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందని అన్నారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు సురేందర్‌రావు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 4: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి 10.30 వరకు వినాయక నగర్, నక్కలగుట్ట మెయిన్‌రోడ్డు, సర్క్యూట్ హౌస్‌రోడ్డు, అశోకకాలనీ, గోకుల్‌నగర్, డిస్ట్రిక్ట్ కోర్టు ఏరియా, రాంనగర్, పోలీస్ హెడ్‌క్వార్టర్స్, భవాని నగర్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

ఓవరాల్ చాంపియన్‌షిప్ కేఎంసీకి

ముగిసిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు



ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను వీసీ కరుణాకర్‌రెడ్డి చేతుల మీదుగా స్వీకరిస్తున్న కేఎంసీ విద్యార్థులు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్, 4: కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియనషిప్ పోటీల్లో ఆతిథ్య వరంగల్ జిల్లా కేఎంసీ విద్యార్థుల జట్టు ప్రథమ స్థానంలో నిలిచి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానంలో మమత మెడికల్ కాలేజ్, తృతీయ స్థానంలో హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కాలేజ్‌లు నిలిచాయి. ఈ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ వైద్య విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొటం రాంకుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 4 : నిబంధనలు ఉల్లఘించిన 26 మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ షూకూర్ తెలిపారు. 26 మందిని గురువారం కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రమేశ్ డ్రంక్‌అండ్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ 17 మందికి 16,900, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ 9 మందికి 6,000 రూపాయలను జరిమానాగా విధించారన్నారు

బెల్టు షాపులపై దాడులు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 4 : బెల్టుషాపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. గురువారం పలుచోట్ల నిర్వహించిన ఈ దాడిలో రూ.15వేల విలువచేసే అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని, ఇద్దరిపై కేసు నమోదు చేశారు. కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వినాయక నగర్‌లో రూ.6400, పాలకుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నరసింగారావు తండాలో రూ.8180 విలువ కలిగిన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూధన్ తెలిపారు.

● ఐనవోలు: మండలంలోని పంథిని గ్రామంలో బెల్టు షాపు ద్వారా విక్రయిస్తున్న మద్యంను పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎస్సై అనిల్‌కుమార్ తెలిపిన ప్రకారం.. పుల్లూరి మల్లికార్జున్ తన ఇంట్లో అనుమతి లేకుండా రూ.3800 విలువ గల మద్యాన్ని నిల్వచేసి విక్రయిస్తున్నాడు. ఈ మేరకు మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

● రోగులకు వైద్యసేవలు



రోగులకు ఉచిత వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

హనుమకొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ విజయటాకీస్ రోడ్డులోని పద్మాక్షి పాలిక్లినిక్‌లో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. సుమారు 150 మంది షుగర్, థైరాయిడ్, గుండె వ్యాధులకు సంబంధించిన రోగులు ఈ శిబిరానికి వచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ ఈ.లక్ష్మణ్‌కుమార్ (ఎండోక్రైనాలజిస్టు), డాక్టర్ వీపీ అనిల్‌కుమార్ (కార్డియాలజిస్టు) రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజు నడకగాని, జీమ్‌కు వెళ్లడం ద్వారా శారీరక శ్రమతో ఇలాంటి వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. ఆహారపు అలవాట్లు కూడా శారీరక సమస్యలకు, వ్యాధులకు కారణమన్నారు. సాధ్యమైనంత వరకు బయట తినడం మానుకోవాలని ఇంటిభోజనం మంచిదని అన్నారు. ఈ శిబిరంలో మేనేజ్‌మెంట్ ఎం రఘునాథ్‌రావు, మహేందర్, ధర్మరాజు తదితరులు తమ సేవలను అందించారు.

43 కిలోల ఎండు గంజాయి పట్టివేత

పరకాల, ఏప్రిల్ 4: ఆంధ్ర, ఒడిశా సరిహద్దుల నుంచి ముంబయికి తరలిస్తున్న 43 కిలోల ఎండు గంజాయిని స్టేట్ టాస్క్‌ఫోర్స్, పరకాల ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. వరంగల్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు గురువారం పరకాల ఎక్సైజ్ స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. ఆత్మకూరు మండలం గుడెప్పాడ్ క్రాస్ వద్ద రూట్ వాచ్ నిర్వహిస్తున్న టాస్క్‌ఫోర్స్ సీఐ వెంకటేశ్వర్లు, పరకాల సీఐ తాతాజీ ఓ కారును పట్టుకున్నారు. కారులో గంజాయిని గమనించిన వారు పరకాల స్టేషన్‌కు తరలించి విచారించారు. మహారాష్ట్రకు చెందిన శుభమ్‌పాల్ జూమ్ యాప్ ద్వారా గంజాయి రవాణాకు ఓ ప్రైవేట్ కారును బుక్ చేసుకున్నారు. ఈ కారులో మహారాష్ట్ర, ఛత్తీస్‌గడ్‌కు చెందిన రెండు నెంబర్ ప్లేట్‌లు ఉండడం గమనార్హం. పట్టుకున్న గంజాయి విలువ రూ.10.75 లక్షలు ఉంటుందని నాగేందర్‌రావు తెలిపారు. గంజాయిని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పర కాల ఎక్సైజ్ సీఐ, ఎస్ఐలను ఏసీ అభినందించారు.

రంగస్థల పద్యనాటక ప్రదర్శనను జయప్రదం చేయాలి

వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు తిరుమలయ్య



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ కాజీపేట తిరుమలయ్య

వడ్డేపల్లి, ఏప్రిల్ 4: వరంగల్ జెమిని థియేటర్ ప్రాంతంలో గల పోతన విజ్ఞాన పీఠంలో మే 14, 15, 16 తేదీల్లో నిర్వహించే రంగస్థల పద్యనాటక ప్రదర్శనను జయప్రదం చేయాలని వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ కాజీపేట తిరుమలయ్య కోరారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎస్ఆర్ మూర్తి, ఉపాధ్యక్షుడు కళా రాజేశ్వర్‌రావు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ నుంచి మూడు, తెలంగాణ రాష్ట్రం నుంచి మూడు నాటకాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ప్రదర్శించిన ప్రతీ నాటికకు రూ.15వేలు పారితోషికం, పోటీల్లో గెలుపొందిన నాటకాలకు ఉత్తమ బహుమతి కింద రూ.10వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.5వేలతో పాటు జ్ఞాపికలతో సత్కరించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొన్న కళాకారులకు వ్యక్తిగత బహుమతులను ప్రదానం చేయడంతో పాటు కళాకారులకు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఐక్యవేదిక ప్రతినిధులు వేముల ప్రభాకర్, జేఎన్ శర్మ, సాదుల సురేష్, కుసుమ సుధాకర్, పాల్గొన్నారు.

నేడు నయీంనగర్ నాలా బ్రిడ్జి కూల్చివేత

(5వ పేజీ తరువాయి)

కొత్త బ్రిడ్జిలకు రూ.15 కోట్లు మంజూరు చేయించి, పనులు చేపడుతున్నారు. హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఎదురుగా ఉన్న రెడ్డి చికెన్‌సెంటర్ నుంచి లష్కర్‌సింగారం మెయిన్ రోడ్డు వద్ద గల రంగ్‌బార్ వరకు నయీంనగర్ కొత్త బ్రిడ్జి పనులు చేపడుతున్నారు. ఈకొత్త బ్రిడ్జి పూర్తయితే వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

నేటి నుంచి ట్రాఫిక్ మళ్లింపు..


నయీంనగర్ నాలాక్రొత్త బ్రిడ్జి పనులు నేడు ప్రారంభం కానున్నాయి. దీంతో హనుమకొండలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ఎదురుగా ఉన్న రెడ్డి చికెన్ సెంటర్ వద్ద నుంచి లష్కర్‌సింగారం రంగ్‌బార్ వరకు దాదాపు అర కిలోమీటరుకుపైగా రోడ్డు మధ్యలో నుంచి తవ్వకాలు జరుపనున్నారు. ప్రయాణికులు, వాహనదారులు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా శుక్రవారం నుంచి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అధికారులు సూచించారు.

- కరీంనగర్ నుంచి ఖమ్మం, నర్సంపేట, వరంగల్ వైపునకు భారీ వాహనాలు కేయూసీ జంక్షన్ నుంచి పెగడపల్లి డబ్బాలు, పెద్దమ్మగడ్డ, ఆటోనగర్ మీదుగా వెళ్లాలి.
- కరీంనగర్ నుంచి వచ్చే ఆర్‌టీసీ బస్సులు కేయూసీ జంక్షన్ నుంచి పెగడపల్లి డబ్బాలు, పెద్దమ్మగడ్డ, ములుగు రోడ్డు జంక్షన్, అమృత జంక్షన్, హనుమకొండ చౌరస్తా మీదుగా బస్టాండ్ చేరుకోవాలి.
- ఖమ్మం నుంచి కరీంనగర్ వైపు భారీ వాహనాలు వరంగల్ ఉర్సుగుట్ట, కడిపికొండ, మడికొండ, ఓఆర్ఆర్ మీదుగా వెళ్లాలి.
- వరంగల్, నర్సంపేట వైపునుంచి కరీంనగర్ వైపునకు భారీ వాహనాలు ఎంజీఎం, ములుగు రోడ్డు జంక్షన్, పెద్దమ్మగడ్డ, పెగడపల్లి డబ్బాలు, కేయూసీ జంక్షన్ మీదుగా పోవాల్సిఉంది.
- హనుమకొండ నుంచి కరీంనగర్ వైపువెళ్లు ఆర్‌టీసీ బస్సులు హనుమకొండ చౌరస్తా, అమృత జంక్షన్, ములుగురోడ్డు జంక్షన్, పెద్దమ్మగడ్డ, పెగడపల్లి డబ్బాలు, కేయూసీ జంక్షన్ మీదుగా వెళ్లవలెను.

రాజ్యసభ సభ్యుడిగా రవిచంద్ర ప్రమాణస్వీకారం

మట్టెవాడ, ఏప్రిల్ 4: తెలంగాణ రాష్ట్ర సమితి రాజ్యసభ సభ్యుడిగా రెండోవ దఫా ఏకగ్రీవంగా ఎంపికైన వద్దిరాజు రవిచంద్ర గురువారం పార్లమెంట్ ప్రాంగణంలో ప్రమాణస్వీకారం చేశారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన రవి చంద్రను ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీష్ ఘట్కర్, గురువారం ఢిల్లీలోని పార్లమెంట్ ప్రాంగణంలో ప్రమాణం చేయించారు. రవిచంద్రకు రాజ్యసభ చైర్మన్ జగదీశ్ ఘట్కర్, పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి పియుష్ గోయల్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ కేసీఆర్ ఆదేశాలతో తెలంగాణ నుంచి రెండోవ దఫా రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. అనంతరం రవిచంద్ర మాజీ సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఈతకు వెళ్లి.. నీట మునిగి యువకుడి మృతి



రంజిత్ (ఫైల్)

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 4: ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి గురువారం యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ మండిబజార్‌కు దుప్పటి రంజిత్(బంటి) (28) దేశాయిపేట ఎంహెచ్ నగర్‌లో నివాసముం టూ సెంట్రింగ్ పని చేస్తున్నాడు. బుధవారం ఏనుమాముల ప్రాంతంలోని ముసలమ్మకుంటలో ఈతకు కొడుతూ గల్లంతయ్యాడు. గురువారం ఉదయం మృతదేహం బయటకు తేలడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా మృతదేహాన్ని బయటకు తీసి రంజిత్‌గా గుర్తించారు. మృతుడి భార్య కీర్తన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. రంజిత్‌కు ఏడాది క్రితమే వివాహమైంది.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం


ఐనవోలు, ఏప్రిల్ 4: మండలంలోని నందనం సొసైటీ ఆధ్వర్యంలో కక్కిరాలపల్లి, పెరమాండ్లగూడెం, పంథని, షన్నేలు, ఒంటిమామిడిపల్లి, వెంకటాపురం, గరిమిళ్లపల్లి, ఉడుతగూడెం గ్రామాల్లో గురువారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీటీవో జి.నాగేశ్వర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ-గ్రేడ్ రకానికి రూ.2203, సాధారణ రకానికి రూ.2185 మద్దతు ధర ఖరారు చేసినట్లు తెలిపారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఈవో కోతి సంపత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నివేదన

శుక్రవారం • 5 ఏప్రిల్ 2024

శివ తత్త్వం కలిగిన క్రోధి నామ సంవత్సరంలో... శుభుడైన శివుణ్ణి దర్శించి, శరణు వేడుకుంటే... ఏడాదంతా శుభమయంగా, మంగళకరంగా ఉంటుంది. క్రోధి నుంచి వసంత నవరాత్రులు ఆరంభమవుతాయి. ఇది శక్తి ఆరాధన. ప్రకృతి (శక్తి), పురుషుల (శివుడు) సమాగమం. వారిని ఆరాధిస్తే శివశక్తుల అండ, అనుగ్రహం మనకు లభిస్తాయి.

మహా శివతత్త్వమే క్రోధి



9న క్రోధి నామ ఉగాది

కాలచక్ర భ్రమణంలో... చాంద్రమానాన్ని అనుసరించి మరో సంవత్సరం ముగియబోతోంది. రెండేళ్ళ క్రితం ప్రపంచాన్ని కరోనా మహమ్మారి కబళించింది. తరువాత శుభకృత్, శోభకృత్ సంవత్సరాలు కొంత ఉపశమనం కలిగించాయి. ఇప్పుడు రాబోయే సంవత్సరం పేరు క్రోధి. గడచిన రెండు సంవత్సరాల పేర్లకు విరుద్ధంగా కనిపించే పేరున్న కొత్త ఏడాది... ప్రజలను మరింత భయభ్రాంతులకు గురిచేస్తుందనే భావన సహజమే. కానీ అది వాస్తవం కాదు. క్రోధి శివస్వరూపం. శివుడు శుభుడు, మంగళకరుడు. శివుని విభూది సర్వసంపత్కరం. ధర్మం కోసం, ధర్మబద్ధంగా... లోకకళ్యాణార్థం అధర్మాన్ని నిర్మూలించే ఈశ్వర తత్త్వం క్రోధి. ఈ తత్త్వం భగవంతుడి కారుణ్యానికి మరొక రూపం... కాబట్టి ఇది ఉపశాంతిని కలిగిస్తుంది. అందుకే ప్రత్యేకమైనది. పండుగ చేసుకోవడానికి ఇంతకన్నా కావలసినది ఏముంది? కాలరూపుడైన శివుణ్ణి ఉగాది ఉషోదయ వేళ భక్తి ప్రపత్తులతో స్వాగతిద్దాం.

బ్రహ్మ సృష్టి ఆరంభించిన రోజు ఇదేనని 'సూర్య సిద్ధాంతం' అనే జ్యోతిష గ్రంథం తెలుపుతోంది. సృష్టి ప్రభవించిన రోజు 'ప్రభవ' అని జ్యోతిష సిద్ధాంత గ్రంథాలు చెబుతున్నాయి. కాలచక్రం అరవై సంవత్సరాలు పరిభ్రమించి... తిరిగి ప్రభవకు చేరుకుంటుంది. ఈ అరవై సంవత్సరాలకు అరవై పేర్లు. ఈ ఏడాది పేరు శివ స్వరూపమైన క్రోధి. సంవత్సర కాలంలో రెండు ఆయనాలు, ఆరు ఋతువులు, పన్నెండు మాసాలు, ఇరవై ఏడు నక్షత్రాలు, రెండు పక్షాలు... ఇలా సూర్య చంద్ర గ్రహాల ప్రమాణాలను అనుసరించి ప్రాచీన జ్యోతిష శాస్త్రవేత్తలు ఒక పద్ధతిని నిర్దేశించారు. చాంద్రమానాన్ని అనుసరించేవారికి ఈ పద్ధతిలో విశిష్టత కనిపిస్తుంది. బ్రహ్మ సృష్టిని ప్రారంభించిన రోజు... ప్రభవ. ఉత్తరాయణం, ఋతువులలో మొదటిది వసంత ఋతువు, చైత్రమాసం తొలిమాసం, పక్షాలలో మొదటిది శుక్ల పక్షం, పాడ్యమి తొలి తిథి. అంటే ఉగాది నాడు అన్నీ సంవత్సరంలో మొదటివే. ఏ నామ సంవత్సర ఉగాది అయినా ఈ పద్ధతిలో మార్పు ఉండదు. ఇదే విజ్ఞానశాస్త్రపరంగా మన పూర్వ ఋషుల ఔన్నత్యం. ఇప్పుడు రాబోతున్న క్రోధి... ప్రభవ నుంచి క్షయ వరకూ వచ్చే అరవై ఉగాదుల్లో ముప్పై ఎనిమిదోది.

ఉగాది రాబోయే సంవత్సరానికి పునాది. ఆ సంవత్సరంలో మన ఆశలు, ఆకాంక్షలు సఫలీకృతం కావడానికి విధివిధానాలను పెద్దలు నిర్దేశించారు. అవి అభ్యంగన స్నానం, ఇష్టదేవతారాధనం, దేవీప్రసాదంగా నింబకుసుమ భక్షణం, దేవాలయాల సందర్శనం, పంచాంగశ్రవణం. ఈ అయిదూ తప్పక ఆచరించాలి.

అభ్యంగనస్నానం: బ్రహ్మీ ముహూర్తాన లేచి, కాలకృత్యాల అనంతరం... శరీరానికి నలుగు పెట్టుకొని తలంటు స్నానం చేయాలి. తిలకం పెట్టుకొని, నూతన వస్త్రాలను ధరించాలి. సంకల్పం చెప్పుకొని సూర్యారాధన చేయాలి. పెద్దల ఆశీర్వచనం తీసుకోవాలి. ఇష్ట దేవతను భక్తిశ్రద్ధలతో ఆరాధించాలి.

నింబకుసుమ భక్షణం: ఇదే ఉగాది పచ్చడి. షడ్రుచుల కలబోత. దాన్ని ఎలా చేయాలో శాస్త్రాలే వివరించాయి. వేప పూత, కొత్త బెల్లం, కొత్త చింతపండు, మామిడి ముక్కలు, ఆవునెయ్యి, కారానికి మిరియాల పొడి, ఉప్పు... ఇంకా తేనె, అరటి పండ్ల ముక్కలు కలిపి చేసిన ఉగాది పచ్చడిని దైవానికి నివేదించి... పరగడుపున ప్రసాదంగా స్వీకరించాలి. అందరికీ పంచాలి. ఆయుర్వేద శాస్త్ర రీత్యా ఈ ప్రసాదం శరీరాన్ని రుగ్మతలకు దూరంగా ఉంచుతుంది.

పంచాంగశ్రవణం: ఉగాది నాడు ఆలయాల్లో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఆలయంలో దైవాలను దర్శించి, పూజించిన తరువాత... రాబోయే సంవత్సర ఫలాలను వివరించే పంచాంగాన్ని వినాలి. పంచాంగం అంటే తిథి, వారం, నక్షత్రం, కరణం, యోగం అనే అయిదు అంగాలు కలిగినది. ఏడాది కాలాన్ని ప్రమాణంగా తీసుకొని... ఆ కాలంలో గ్రహాల సంచారం, వాటివల్ల కలిగే శుభాశుభ పరిణామాలు, వివిధ నక్షత్ర జాతకులు పొందే ఫలితాలను అది సవివరంగా చెబుతుంది. ఉపద్రవాలను, అశుభాలను నివారించుకొనే మార్గాన్ని సూచిస్తుంది.

• ఆయపిళ్ళ రాజపాప

సందేశం

ఈద్... ఆధ్యాత్మిక ఆరాధన

ఈద్ (పండుగ) అంటే కరుణామయుడైన అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలియజేయడం. ఆయన ప్రసాదించిన వరాలను గుర్తించడం. ప్రభువు కరుణానుగ్రహాలను తలచుకోవడం, విశ్వాసాన్ని స్థిరపరుచుకోవడం, ధర్మాన్ని బలపరచడం. ఉపవాసాలలో జరిగిన పొరపాట్లకు బదులుగా... పండుగ రోజున నిరుపేదలకు జకాతుల్ ఫిత్రా దానం ఖచ్చితంగా చెల్లించి, పేదల్లో సంతోషాన్ని నింపడం విశ్వాసుల కర్తవ్యం. ఈద్ అనేది అల్లాహ్ తరఫున బహుమతులను అందుకొనే రోజు. నెల రోజులు సాగే ఈద్ ఉపవాస దీక్ష... పవిత్రమైన రంజాన్ నెలవంక కనిపించిన తరువాత ప్రారంభమవుతుంది. ఆ మాసం ముగిశాక... షవ్వాల్ నెలవంక దర్శనమిచ్చిన తరువాత చేసే నమాజ్‌తో ముగుస్తుంది. పరిపూర్ణమైన నమ్మకంతో, పుణ్యఫలాన్ని ఆశించి ఉపవాసాలు పాటించేవారికి... ఈ పండుగ ఒక గొప్ప బహుమానం. దీనికి భిన్నంగా ఉపవాస సమయంలో పాపాలు చేసి, అల్లాహ్ నిర్దేశించిన నియమాలను అతిక్రమించి, ఆయన ఆజ్ఞలను నిర్లక్ష్యం చేసిన వారు తమ తప్పు తెలుసుకొని పశ్చాత్తాపం చెందాల్సిన రోజు కూడా ఇదే.

ఈదుల్ ఫిత్ర్ (రంజాన్) పర్వదినాన చేయవలసిన పనులను పెద్దలు ప్రత్యేకంగా నిర్దేశించారు. అవి: పొద్దున్నే నిద్రలేవాలి. కాలకృత్యాలు తీర్చుకోవాలి. ఫజ్ర్ నమాజ్ కచ్చితంగా చదవాలి. తలంటు స్నానం చేయాలి. ఉన్నవాటిలో మంచి దుస్తులను ధరించాలి. అత్తరులాంటి సుగంధాలు పూసుకోవాలి. కళ్ళలో సుర్మా పెట్టుకోవాలి. ఈద్ నమాజ్‌కు ముందే జకాత్, ఫిత్రా చెల్లించాలి. తీపి పదార్థాన్ని స్వీకరించాలి. ఒకటి, మూడు, అయిదు, ఏడు... ఇలా బేసి సంఖ్యలో ఖర్జూర పండ్లను తినాలి. ఈద్గా మైదానానికి ఒక మార్గంలో వెళ్ళి, వేరే మార్గంలో తిరిగి రావాలి. నమాజ్‌కు వెళ్తున్నప్పుడు తక్బీర్‌ను మెల్లగా చదువుతూ ముందుకు సాగాలి. కాలి నడకన వెళ్ళడం వల్ల మరింత పుణ్యం లభిస్తుంది. పండుగ నమాజ్ తరువాత పరస్పరం సలామ్ చెప్పుకోవాలి. పిల్లలకు 'ఈదీ' (బహుమతులు) ఇవ్వాలి. బంధువుల ఇళ్ళకు వెళ్ళి, వారికి శుభాకాంక్షలు తెలపాలి. ఇరుగుపొరుగువారికి తీపి పదార్థాలను ఇవ్వాలి. సాహిల్ (అడిగేవారు, అర్థించేవారు) ఇంటికి వస్తే... కచ్చితంగా దానం ఇచ్చి పంపాలి. అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకొంటూ... సంతోషంగా గడపాలి. పండుగ నమాజ్‌ను ఇరుకైన జనావాసాలలో కాకుండా... విశాలమైన బహిరంగ ప్రదేశాలలో (ఈద్‌గాహ్) వద్ద నిర్వహించడం ఉత్తమం. దైవ ప్రవక్త మహమ్మద్ సంప్రదాయం కూడా అదే. దగ్గరలో ఈద్‌గాహ్ లేనప్పుడు... స్థానికంగా ఉండే పెద్ద మసీదుల్లో ఈద్ నమాజ్ చేయాలి. ఈద్... ఒక ఆధ్యాత్మిక ఆరాధన. చిత్తశుద్ధితో ఆచరించే ఆ ఆరాధన అల్లాహ్ కటాక్షాన్ని, సర్వ శుభాలను కలుగజేస్తుంది.

• మహమ్మద్ వహీదుద్దీన్

సుభాషితం

సాటిలేని సంపద



విద్యానామ నరస్య రూపమధికం ప్రచ్ఛన్నగుప్తం ధనం
విద్యా భోగకరీ యశస్సుఖకరీ విద్యాగురూణాం గురుః
విద్యా బంధుజనో విదేశగమనే విద్యా పరం లోచనం
విద్యా రాజసుపూజ్యతే నహి ధనం విద్యావిహీనః పశుః...

అంటూ విద్య విలువను, గొప్పతనాన్ని భర్తృహరి తన నీతి శతకంలో వివరించాడు.
దాన్ని ఏనుగు లక్ష్మణకవి...

విద్య నిగూఢగుప్త మగు విత్తము రూపము పూరుషాళికిన్
విద్య యశస్సు భోగకరి విద్య గురుండు విదేశబంధుడున్
విద్య విశిష్ట దైవతము విద్యకు సాటి ధనంబు లే దిలన్
విద్య నృపాలపూజితము విద్య నెఱుంగనివాడు మర్త్యుడే... అని తెలుగువారికి అందించాడు.

భావం: మనుషులకు విద్యే అందం, అది ఎవరికీ కనిపించని సంపద. చదువు కీర్తిని, సుఖాన్ని, భోగాన్ని కలిగిస్తుంది. విద్య గురువులకు గురువు. ఇతర దేశాలకు వెళ్ళినప్పుడు అక్కడ మనకు అండగా నిలిచే బంధువులాంటిది. అది మనకు మరో కన్ను లాంటిది. విద్యాధనాన్ని మించిన ధనం ఈ ప్రపంచంలో మరేదీ లేదు. సభలలో, సదస్సులలో విద్యకు గౌరవం దక్కుతుంది తప్ప ధనానికి కాదు. అంతటి గొప్పదైన విద్యను పొందని మనిషి పశువుతో సమానం.

దర్మపథం


శూన్యవాదం అంటే...

బౌద్ధ దార్శనిక సిద్ధాంతమైన శూన్యవాదం... ప్రపంచ దార్శనిక చరిత్రలోనే ఒక అద్భుత సిద్ధాంతం అని చెప్పవచ్చు. కానీ చాలామందికి ఈ శూన్యం అంటే ఏమిటో అర్థం కాక... దాన్ని రకరకాలుగా వ్యాఖ్యానించారు. బుద్ధుడు ఆత్మను, పరమాత్మను నిరాకరించాడనీ, అందుకే దాన్ని శూన్యవాదం అంటారని కొందరు అంటే... "ప్రపంచంలో అంతే శూన్యమే, ఏమీ లేదు" అంటూ దీని గురించి మరికొందరు వ్యాఖ్యానించారు. ఇంకొందరు అర్థం లేని మాటలను శూన్యవాదంతో పోలుస్తూ "ఇక నీ శూన్యవాదం ఆపుతావా?" అని కూడా అంటారు. నిజానికి శూన్యవాదం బౌద్ధ దర్శనంలో అద్భుతమైన సిద్ధాంతం. దాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించకుండా ఇలా వ్యాఖ్యానించడం విడ్డూరం. శూన్యం అనాత్మకు పర్యాయపదం కాదు. 'స్వతంత్ర అస్థిత్వం లేనిది' అని అర్థం. వాస్తవానికి శూన్యత అనేది గణితంలో సున్నా లాంటిది. గణితంలో సున్నాకు విలువ లేనట్టే అనిపిస్తుంది. కానీ అదే గణితానికి పునాది. సున్నా ఉంది కాబట్టే మనం పది, ఇరవై, వంద, వెయ్యి, పదివేలు, లక్ష లాంటి వాటిని లెక్కించగలుగుతున్నాం. ఆసక్తికరమైన విషయమేమిటంటే... గణితంలో సున్నా, శూన్యవాద తాత్త్విక సిద్ధాంతం... ఈ రెండూ భారతదేశంలోనే ఉద్భవించాయి.

అదే విధంగా శూన్యత అంటే మనం అనుకుంటున్నట్టు అభావం కాదు. ఇంకా కొంచెం స్పష్టంగా చెప్పాలంటే... ప్రపంచంలోని అన్ని ధర్మాలు (వస్తువులు) అస్తిత్వం కలిగినవి. కానీ ధర్మాలు (వస్తువులు) స్వతంత్రంగా ఉన్నా అస్తిత్వంలో ఉండాలి, లేదా అవి పరస్పర ఆధారితాలై ఉన్నా అస్తిత్వంలో ఉండాలి. విశ్వంలో ఈ రెండు మార్గాలు మాత్రమే ఉన్నాయి. ఒకటి ఆధారిత అస్తిత్వం, రెండోది స్వతంత్రాస్తిత్వం. ఇవికాకుండా మూడో వాదానికి తావులేదు. ఇలా అన్ని ధర్మాలు ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. అంటే ధర్మాలు పరస్పర ఆధారితాలు. మరి వాటికి స్వతంత్రమైన సత్తా ఎలా సాధ్యం? అందుకే దాన్ని 'శూన్యత' అన్నారు. శూన్యత, ప్రతీత్య సముత్పాదం అనే రెండు సిద్ధాంతాలూ ఒకే నాణేనికి చెందిన రెండు వైపుల వంటివి.

నాగార్జునుడి సిద్ధాంతాన్ని అనుసరించి... అస్తి అనేది ఆస్తిక దృష్టి, నాస్తి అనేది నాస్తిక దృష్టి. కాబట్టి పండితులు ఈ రెండు వాదాలనూ ఆశ్రయించరు. ఇక్కడ శాశ్వతవాదం అంటే... లోకాత్మలు శాశ్వతమని నమ్మే దృక్పథం. ఉచ్ఛేద వాదం అంటే లోకాత్మలు అశాశ్వతమైనవని అంగీకరించే దృక్పథం. శాశ్వతవాదం, ఉచ్ఛేదవాదం... ఈ రెండిటి మధ్యా ఉన్న మార్గాన్ని సమర్థించడం వల్ల... ఈ సిద్ధాంతాన్ని 'మధ్యమ ప్రతిపద' అని అంటారు.

తథాగతుడు ఋషి పట్టణంలో పంచవర్గీయ భిక్షువులకు మధ్యమ మార్గాన్ని బోధించి... అద్భుతమైన ధర్మచక్రాన్ని ప్రారంభించాడు. ధర్మచక్రం అంటే... సద్ధర్మాన్ని నలు దిశలా ప్రచారం చేయడం. మన ఆచార్య నాగార్జునుడు ఈ మధ్యమ మార్గంపైనే తన భవ్య తాత్త్విక సౌధాన్ని నిర్మించాడు. నాగార్జునుడి అభిప్రాయంలో... ఒక వస్తువుకు అస్తిత్వం ఉందని నమ్మడం ఒక అంతమైతే... దానికి అస్తిత్వమే లేదని నమ్మడం మరో అంతం. ఈ రెండు అంతాలను శాశ్వతవాదం, ఉచ్ఛేదవాదం అంటారు. బుద్ధుడు ఈ రెండిటినీ కాదని మధ్యమ మార్గాన్ని అవలంబించాడు. అది శూన్యవాదానికి పునాది వంటిది.





ఆచార్య చౌడూరి ఉపేంద్ర రావు
జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం

సహజయోగ

నవ జీవనానికి నాంది

నూతన సంవత్సరానికి మొదటి రోజైన ఉగాదికి చాలా విశిష్టత ఉంది. రాబోతున్నది క్రోధి నామ సంవత్సరం. కొత్త సంవత్సరం మొదలైన తరువాత... శ్రీ ఆదిశక్తి ఆగమన సూచికగా తొమ్మిది రోజులు సంప్రదాయబద్ధంగా సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీ. ఇదే రోజున ఆదిశక్తి సృష్టి కార్యాన్ని మొదలుపెట్టింది. శ్రీ గణేశుణ్ణి సృష్టించింది. కాలమానం మొదలయింది ఈ రోజునే. కాబట్టి సంవత్సరాన్ని ఆ దినం నుంచే లెక్కిస్తాం.



విక్రమాదిత్య మహరాజు చైత్రశుద్ధ పాడ్యమిని సంవత్సరాదిగా వేడుక చేసుకొనేవాడనీ, శాలివాహన రాజులు కూడా అదే రోజును సంవత్సరాదిగా లెక్కించడం ఆరంభించారనీ చెబుతారు. బభ్రువాహన అనే శాలివాహన రాజు చేతిలో విక్రమాదిత్యుడు పరాజయం పొందాడు. వారి విజయోత్సవాలను పురస్కరించుకొని... చైత్ర శుద్ధ పాడ్యమి నాడు శాలివాహన శకం మొదలయింది. శాలివాహన శకం, విక్రమ నామ శకం ఆరంభమైన సంవత్సరాలు వేరు కావచ్చు... కానీ అవి ప్రారంభమైన రోజు మాత్రం ఒక్కటే. శాలివాహనులు కూడా అదే రోజున తమ కొత్త సంవత్సరానికి నాంది పలికారు. అంతటి సుదినం కాబట్టి... మన పంచాంగాలను, ముఖ్యంగా పండుగలను దాని ప్రకారం లెక్కిస్తారు. మన దేశంలో కొన్ని ప్రాంతాలలో చాంద్రమానాన్ని, మరికొన్ని ప్రాంతాల్లో సూర్యమానాన్ని అనుసరిస్తారు. శాలివాహన పంచాంగాన్ని చాంద్రమానం ప్రకారం గుణించారు. చంద్రుడి కళల ఆధారంగా తిథులు ఏర్పడ్డాయి. ఇక శాతవాహన (సత్వాహన) అంటే సప్తవాహికలు (చక్రాలు). మనలోని కుండలినీ శక్తి ప్రయాణించే ఏడు చక్రాలుగా వారు పరిగణించి ఉండవచ్చు.

ఇది రబీ పంటల కోత కాలం. కొత్త పంటల కాలానికి ఆరంభం. ఉదాహరణకు ఉత్తరభారతదేశంలోని మీరట్ ప్రాంతంలో... వ్యవసాయానికీ, పంటలకూ దేవీశక్తి అవసరమైనప్పుడు... ఆమెను శాకంబరీదేవిగా సంభావించి.. ఆమె శక్తిని ఉపయోగించాల్సి వచ్చింది. ఆకుకూరలు, కాయగూరలు, పండ్ల సాగులో మనం శాకంబరీ దేవి శక్తిని వినియోగించుకోవాలి. సహజయోగ సాధన ద్వారా వెలువడే చైతన్య తరంగాల శక్తి సహకారంతో... సహజ కృషి పద్ధతుల ద్వారా వ్యవసాయ దిగుబడిని పెంపొందించే ప్రక్రియను శ్రీమాతాజీ నిర్మలాదేవి అందుబాటులోకి తీసుకువచ్చారు.

ఈ పండుగను తెలుగువారు, కన్నడిగులు ఉగాదిగాను, మహారాష్ట్రలో గుడిపడ్వాగాను జరుపుకొంటారు. పల్లె సీమల్లో ఉగాదిని ఆనందంగా నిర్వహిస్తారు. వసంతఋతువు ఈ రోజు నుంచే ప్రారంభమవుతుంది. ఈ పండుగకు, ప్రకృతికి అవినాభావ సంబంధం ఉంది. కాబట్టే నూతన జీవితానికి నాందిగా ఉగాదిని పరిగణిస్తారు. ఈ పండుగలో అత్యంత పవిత్రమైన సంప్రదాయం గుడి జెండాను తయారు చేయడం. మహారాష్ట్రుల నిర్వహించే గుడిపడ్వాలో 'గుడి' అనే పదానికి జెండా, శాలువ అనే అర్థాలు ఉన్నాయి. శాలివాహనులు దేవీ భక్తులు. ఆ రోజులలో వారు దేవికి శాలువను బహూకరించేవారట. మన శరీరం మీద ఆచ్ఛాదనకు, వెచ్చదనానికి, వినయానికి సంకేతం శాలువ. శాలివాహనులకు గుర్తుగా కుంభంపై జెండా ఉండేది. విశిష్టమైన ఆకారంలో ఉండే ఆ కుంభం కుండలినికి సంకేతం, ఆధ్యాత్మికతకు చిహ్నం. ఆనాడే వారు కుండలినీ శక్తిని పూజించేవారు. ఆ ప్రాంతంలో ప్రతి ఇంటివారు పసుపు లేదా ఎరుపు రంగు వస్త్రంతో గుడి జెండాను తయారు చేస్తారు. దాన్ని కర్రకు తగిలించి, జెండా పైభాగంలో వెండి లేదా రాగి పాత్రను (కుంభాన్ని) బోర్లిస్తారు. గుడి జెండా చెడుపై విజయాన్ని సూచిస్తుంది. దీన్ని కుటుంబ శ్రేయస్సుకు, అదృష్టానికి చిహ్నంగా భావించి, ఇంటి బయట ఉంచుతారు. ఇలా ఉంచడం వల్ల అది దుష్టశక్తులను దూరంగా ఉంచి, ఇంట్లోకి శుభాలను తెస్తుందని నమ్ముతారు. ప్రపంచవ్యాప్తంగా సహజయోగ సాధకులు మత, ప్రాంత, దేశాలకు అతీతంగా... శాలివాహన పంచాంగం ఆధారంగా... చైత్ర శుద్ధ పాడ్యమి రోజున దేవీ పూజ నిర్వహించి, ఉగాది పండుగను ఘనంగా నిర్వహించుకుంటారు.

ప్రతి రుచీ ఒక ప్రతీక



తెలుగు రాష్ట్రాలలో ఉగాది రోజున ముఖ్యమైనది షడ్రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడి. దీనికి ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉంది. ఈ పచ్చడిలో ఒక్కో పదార్థం ఒక్కొక్క భావానికి, అనుభూతికి ప్రతీక. బెల్లం... తీపి అంటే ఆనందానికి ప్రతీక. ఉప్పు... జీవితంలో ఉత్సాహానికి, రుచికి సంకేతం. వేప పువ్వు చేదు... అంటే బాధ కలిగించే అనుభవాలను, చింతపండు (పులుపు)... నేర్పుగా వ్యవహరించడాన్ని సూచిస్తాయి. పచ్చి మామిడి ముక్కలు (వగరు)... కొత్త సవాళ్ళకు సంకేతం. కారం... సహనం కోల్పోయేలా చేసే అనుభూతికి చిహ్నం.

శతాయుష్యం వజ్రదేహం దదాత్యర్థం సుఖానిచ
సర్వారిష్టవినాశంచ నింబకందళ భక్షణమ్

వేపపూతతో కూడిన ఉగాది పచ్చడిని తినడం వల్ల దేహం వజ్రసదృశమై, సర్వారిష్టాలూ తొలగిపోతాయనీ, నూరేళ్లు సుఖంగా జీవిస్తారనీ ఈ శ్లోకం అంతరార్థం.

ఇక ఉగాది ప్రాశస్త్యాన్ని గురించి చెప్పే మరో శ్లోకం కూడా 'ధర్మసింధు' గ్రంథంలో ఉంది:

అబ్దాదౌ నింబకుసుమం... శర్కరామ్ల ఘృతైర్యుతమ్
భక్షితం పూర్వయామేస్యా... తద్వర్షం సౌఖ్యదాయకమ్

ఉగాదినాడు వేపపూత, పంచదార (బెల్లం), చింతపండు, నెయ్యితో కూడిన పచ్చడిని తింటే... రాబోయే సంవత్సరం అంతా సౌఖ్యంగా సాగిపోతుందని అర్థం.



డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

హరేకృష్ణ

కష్ట సుఖాల్లో సంయమనం

అదే ఉగాది సందేశం

'యుగాది' లేదా 'ఉగాది' అనే పదం... 'యుగ, ఆది' అనే సంస్కృత పదాల కలయిక.. నూతన యుగానికి నాంది అయిన తిథే యుగాది పర్వదినం. 'యుగం' అంటే రెండు లేదా జంట అనే మరొక అర్థం కూడా ఉంది. ఉత్తరాయణ, దక్షిణాయనాలు అనే ఆయన ద్వయం కలిగినది యుగం (సంవత్సరం). ఆ యుగానికి ఆది... యుగాది అయింది. అదే సంవత్సరాది. వివిధ కాలాలకు చెందిన ఋషులు 'యుగం' అనే పదాన్ని పలు విధాలుగా నిర్వచించారు. 'యుగ' అన్న ఒక్క పదమే వివిధ కాల పరిమాణాలను సూచిస్తుంది.

వేదాలను అపహరించిన సోమకుణ్ణి మత్స్యావతారం ధరించి వధించిన విష్ణువు... ఆ వేదాలను బ్రహ్మకు అప్పగించిన శుభ తరుణానికి చిహ్నంగా... ఉగాది ఆచరణలోకి వచ్చిందని పురాణాలు చెబుతున్నాయి. చైత్ర శుక్ల పాడ్యమి అయిన ఉగాది రోజునే సృష్టి జరిగిందని కూడా పేర్కొంటున్నాయి. అందుకనే మనకు చైత్ర మాసంతో... కొత్త ఏడాది ప్రారంభమవుతుంది. ఆ కొత్త ఏడాది తొలి రోజే ఉగాది. జడప్రాయమైన (అచేతనమైన) ఈ జగత్తులో చైతన్యాన్ని రగిలించి, మానవాళిలో నూతన ఆశయాలను అంకురింపజేసే శుభ దినమే ఉగాది. ఉగాది నుంచే తెలుగు సంవత్సరం ప్రారంభమవుతుంది కాబట్టి... ఇది తెలుగువారి మొదటి పండుగ. ఉగాది రోజున కొత్త పనులను ప్రారంభించడం ఆనవాయితీ. ఈ రోజున ప్రాతఃకాలాన లేచి... ఇళ్ళు, వాకిళ్ళు శుభ్రపరుచుకుంటారు. ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి అలంకరిస్తారు. తలంటి స్నానం చేసి, కొత్త దుస్తులు ధరించి... ఉగాది పచ్చడి సేవనంతో దినచర్య ప్రారంభిస్తారు. తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు, చేదు అనే ఆరు రుచులు కలిసిన ఉగాది పచ్చడి తెలుగువారికే ప్రత్యేకమైనది. ఏడాది పొడుగునా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సంయమనంతో స్వీకరించాలనే సందేశాన్ని ఉగాది పండుగ, ఉగాది పచ్చడి మనకు తెలియజేస్తాయి.

కలహ, కల్మషాలతో కూడిన కలియుగాన్ని ఒక ఇనుప యుగంగా పూర్వులు వర్ణించారు. అయితే ఈ యుగం ఎన్నో దుఃఖాలకు నిలయమైనప్పటికీ, దీనికి అద్భుతమైన లక్షణం ఒకటి ఉందంటూ... "కలియుగం దోషసాగరమే అయినప్పటికీ... దీనిలో ఉన్న మహా గుణం ఏమిటంటే... కేవలము 'హరే కృష్ణ' మహా మంత్రాన్ని జపించినంత మాత్రాన మానవుడు భవబంధ విముక్తుడై, పరంధామాన్ని చేరుతాడు" అని శ్రీమద్భాగవతం పేర్కొంది. కలియుగ ధర్మం హరినామ సంకీర్తనం. దాన్ని స్థాపించడానికి... అయిదువందల ఏళ్ళ క్రితం... పశ్చిమ బెంగాల్‌లోని నవద్వీప మాయాపూర్ ధామంలో... సాక్షాత్తూ భగవంతుడే శ్రీ చైతన్య మహాప్రభువుగా అవతరించారు. హరినామ సంకీర్తన ఉద్యమానికి నాంది పలికారు.

ఉగాది పర్వదినాన ఆచరించవలసినవి: శ్రీకృష్ణునికి ఉగాది పచ్చడి నివేదించి, దాన్ని ప్రసాదంగా ఇంటిల్లిపాదీ స్వీకరించండి. 'హరే కృష్ణ' మంత్రాన్ని రోజూ జపించడం ప్రారంభించండి. శ్రీకృష్ణ మందిరాన్ని దర్శించి, భగవంతుడి ఆశీస్సులను పొందండి. అన్నదానం, గోసేవ తదితర ధార్మిక కార్యక్రమాలలో పాలుపంచుకోండి.



శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్, హైదరాబాద్, 9396956984



ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
శుక్రవారం • 5 ఏప్రిల్ 2024
cinema@andhrajyothy.com



ఇదొక ఎక్స్‌ట్రార్డినరీ చిత్రం

నవీన్ యెర్నేని

మలయాళంలో ఘనవిజయం అందుకున్న సర్వైవల్ థ్రిల్లర్ 'మంజుమ్మల్ బాయ్స్'. అక్కడ రూ. 200 కోట్ల రూపాయల వసూళ్లు అందుకుంది. ఈ చిత్రం తెలుగు వెర్షన్‌ను మైత్రీ మూవీ మేకర్స్ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తోంది. ఈ నెల 6న తెలుగు రాష్ట్రాల్లో విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా దర్శకుడు చిదంబరం మాట్లాడుతూ 'మైత్రీ మూవీ మేకర్స్‌కు నా ధన్యవాదాలు. తెలుగు ప్రేక్షకులు మా 'మంజుమ్మల్ బాయ్స్' చిత్రాన్ని ఆదరించాలి. సరికొత్త వినోదాన్ని పంచే చిత్రమిది' అని అన్నారు నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ 'ఇదొక ఎక్స్‌ట్రార్డినరీ ఫిల్మ్. ఈ మధ్యకాలంలో నేను చూసిన గొప్ప చిత్రం కూడా. తెలుగులోనూ పెద్ద విజయాన్ని సాధిస్తుంది. మన ప్రేక్షకులు తప్పకుండా ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు. యువతను మెప్పించే అన్ని అంశాలూ ఈ చిత్రంలో ఉన్నాయని నటుడు శ్రీనాథ్ భాసి చెప్పారు.

కెరీర్‌లో బిగ్గెస్ట్ యాక్షన్ సీక్వెన్స్

నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'తండేల్'. చందు మొండేటి దర్శకత్వంలో గీతా ఆర్ట్స్ బేనర్‌పై బన్నీవాసు నిర్మిస్తున్నారు. నిర్మాత అల్లు అరవింద్ సమర్పిస్తున్నారు. శ్రీకాకుళం సాగరతీరం నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నాగచైతన్య యాక్షన్ రోల్‌లో అలరించనున్నారు. ఈ చిత్రం తాజా షెడ్యూల్ గురువారం హైదరాబాద్‌లో మొదలైంది. భారీ ఖర్చుతో నిర్మించిన సెట్‌లో పోరాట ఘట్టాలను దర్శకుడు తెరకెక్కిస్తున్నారు. పలువురు ఫైటర్లు పాల్గొంటున్నారు. 'యానిమల్' చిత్రానికి ఫైట్స్ రూపకల్పన చేసిన సుప్రీం సుందర్ సరికొత్తగా పోరాట ఘట్టాలను తీర్చిదిద్దుతున్నారు. యాక్షన్ సీన్లలో నాగచైతన్యను సరికొత్తగా చూపించబోతున్నారు, ఆయన కెరీర్‌లోనే ఇది బిగ్గెస్ట్ యాక్షన్ సీక్వెన్స్ అవుతుందని యూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.



యువరాణి పాత్రలో...



'నన్ను దోచుకుందువటే' చిత్రంతో తెలుగులో అడుగుపెట్టి కుర్రకారు మది దోచేశారు నభానటేశ్. ఆ తర్వాత వరుస ఆఫర్లతో పలు చిత్రాల్లో నటించిన నభా..ఓ ప్రమాదంలో గాయపడి సినిమాలకు రెండేళ్ల విరామమిచ్చారు. ఇటీవలే కోలుకున్న ఆమె తిరిగి నటించడానికి సిద్ధమయ్యారు. ప్రస్తుతం ఆమె నిఖిల్ సిద్ధార్థ్ పాన్ ఇండియా చిత్రం 'స్వయంభు'లో సెకండ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇందులో నభా ఓ పవర్‌ఫుల్ రోల్‌ను పోషిస్తున్నారు. చిత్రబృందం గురువారం ఆమె పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌ను చూస్తుంటే ఆమె యువరాణి పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. భరత్‌కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది. ఇందులో నిఖిల్ పోరాట యోధుడి పాత్రను పోషిస్తున్నారు. ఈ పాత్ర కోసం ఆయన గుర్రపుస్వారీ, మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకోవడం విశేషం.

నేను బతికుండగా అంగీకరించను



అతిలోక సుందరి శ్రీదేవిని ప్రేమించి పెళ్లాడారు బోనీకపూర్. దురదృష్టవశాత్తు శ్రీదేవి 2018లో మరణించారు. పలు సందర్భాల్లో ఆమె జ్ఞాపకాలను గుర్తుచేసుకుని భావోద్వేగానికి లోనవుతుంటారు బోనీకపూర్. ప్రస్తుతం 'మైదాన్' చిత్రం ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న ఆయనను ఓ ఆంగ్ల మీడియా ప్రతినిధి శ్రీదేవి బయోపిక్ ఉంటుందా అని అడగగా, బోనీకపూర్ సమాధానమిచ్చారు. "శ్రీదేవి వ్యక్తిగత స్వేచ్ఛను కోరుకునే వ్యక్తి. బతికున్నంత కాలం ఆమె తన వ్యక్తిగత జీవితంలో జరిగే విషయాలలో ఎంతో గోప్యతను పాటించింది. భర్తగా నేను ఆమె ఆలోచనల్ని గౌరవించాలి. నేను బతికున్నంత వరకూ ఆమె బయోపిక్‌కు అంగీకరించను" అని చెప్పారు.



నా టాలెంట్ కారణం కాదు

అడుగుపెట్టిన ప్రతి చోటా విజయఢంకా మోగించడం అంత ఈజీ కాదు. కానీ రష్మిక అది సాధ్యమని నిరూపిస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ సినిమాలతో పాటు హిందీలో క్రేజీ ప్రాజెక్ట్స్ కూడా చేస్తూ హిట్లు తన సొంతం చేసుకున్నారు. విక్కీ కౌశల్ సరసన నటిస్తున్న 'ఛావా' అనే హిందీ చిత్రాన్ని పూర్తి చేశారు రష్మిక. 'పుష్ప2' చిత్రీకరణలో పాల్గొంటున్నారు. అలాగే ధనుష్, నాగార్జున నటిస్తున్న చిత్రంలోనూ కథానాయికగా నటిస్తున్నారు. హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రం 'గర్ల్‌ఫ్రెండ్'లో నటిస్తున్నారు. నేడు రష్మిక పుట్టినరోజు. కథానాయికగా తన ప్రయాణం గురించి మాట్లాడుతూ 'విభిన్న భాషల్లో కథానాయికగా ప్రేక్షకులను మెప్పించగల అవకాశం దక్కుతుందనీ, కెరీర్ ఆరంభంలో అస్సలు అనుకోలేదు. నా టాలెంట్ దీనికి కారణం అనుకోను. ఎంతో మంది ప్రతిభావంతులు ఉన్నా నాకు మాత్రమే ఇంత గొప్ప ఆదరణ దక్కడానికి అవకాశాలే కారణం. నా కష్టంతో పాటు మంచి పాత్రలు సృష్టించిన రచయితలు, దర్శకుల వల్లే ఇది సాధ్యమైంది' అన్నారు రష్మిక.

కీర్తన ప్రేమకథ



చిమటా రమేశ్‌బాబు స్వీయ దర్శకత్వంలో హీరోగా నటిస్తున్న చిత్రం 'నేను-కీర్తన'. రిషిత, మేఘన హీరోయిన్లు. చిమటా లక్ష్మీకుమారి నిర్మాత. ఇటీవలే చిత్రబృందం ఫస్ట్‌లుక్, టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ "నేను-కీర్తన' కొత్త తరహా చిత్రం. ఈ ఏడాది బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో దీనికి స్థానం దక్కుతుందని భావిస్తున్నా. కులు, మనాలీలో చిత్రీకరించిన పాటలు, రోప్ ఫైట్స్ ఈ చిత్రానికి ప్రత్యేకాకర్షణ' అని తెలిపారు. 'నేను-కీర్తన' చిత్రం ఘన విజయం సాధించాలని దర్శకుడు వీరశంకర్, యాటా సత్యనారాయణ ఆకాంక్షించారు. సంధ్య, జీవా, జబర్దస్త్ అప్పారావు కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: ఎం. ఎల్ రాజా. సినిమాటోగ్రఫీ: కె. రమణ.

సహజత్వానికి దగ్గరగా సత్య



అమరేశ్, ప్రార్థన సందీప్ జంటగా నటించిన 'రంగోలి' తమిళ చిత్రం 'సత్య' పేరుతో తెలుగులో వస్తోంది. వాలి మోహన్‌దాస్ దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని శివ మల్లాల తెలుగులో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో టీజర్, పాట విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వాలి మోహన్‌దాస్ మాట్లాడుతూ 'ఇదే నా మొదటి సినిమా. నాకు ఎదురైన సంఘటనల నుంచి పుట్టిన కథతో సినిమా రూపుదిద్దుకుంది' అని తెలిపారు. 'సినిమాలో ఒకరిద్దరు తప్ప మిగిలిన వారంతా కొత్త వారే. ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్నాయి సహజత్వానికి దగ్గరగా సినిమా ఉంటుంది' అని సంభాషణల రచయిత విజయ్‌కుమార్ చెప్పారు. హీరో అమరేశ్ మాట్లాడుతూ 'తమిళంలో ఈ సినిమా మంచి విజయం సాధించింది. తెలుగులో కూడా సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉంది' అన్నారు. 'ఈ సినిమాను చాలా మంది నిర్మాతలు తెలుగులో చేస్తామని అడిగినా నా మీద అభిమానంతో నాకు ఇచ్చిన తమిళ నిర్మాత సతీశ్‌కు కృతజ్ఞతలు. ఎన్నో సినిమాలకు రివ్యూలు రాసిన నేను కచ్చితంగా మీ ముందుకు ఓ మంచి సినిమాతోనే వస్తున్నాను' అని నిర్మాత శివ మల్లాల చెప్పారు. తమిళ నిర్మాత సతీశ్ మాట్లాడుతూ ' విక్రమ్ హీరోగా నటించిన 'నాన్న' సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా హమరేశ్ నటించాడు. నటన అంటే ఎంతో ప్యాషన్ అతనికి. అందుకే అతను హీరోగా 'రంగోలి' చిత్రాన్ని నిర్మించాను, మంచి హిట్ అయింది. తెలుగులో కూడా విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అన్నారు.

శ్రీరంగనీతులు... కొత్తగా..



సుహాస్, కార్తీక్‌రత్నం, రుహానీ శర్మ, విరాజ్ అశ్విన్ ముఖ్య తారలుగా నటించిన 'శ్రీరంగనీతులు' చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ప్రవీణ్‌కుమార్ దర్శకుడు. వెంకటేశ్వరరావు బల్మూరి నిర్మించిన ఈ చిత్రాన్ని ప్రముఖ పంపిణీదారుడు ధీరజ్ మొగిలినేని విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో ఆసక్తికరమైన కథ, కథనాలు ఉన్నాయి. కొత్తదనంతో పాటు కమర్షియల్ అంశాలతో చిత్రం రూపుదిద్దుకొంది' అని తెలిపారు. ఈ మధ్యకాలంలో ఇలాంటి సినిమా చూడలేదని సెన్సార్ సభ్యులు అభినందించడం ఆనందాన్ని కలిగించిందని దర్శకుడు చెప్పారు.

జొన్నల కొనుగోళ్లకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- సేకరణకు నోడల్ ఏజెన్సీగా తెలంగాణ మార్క్‌ఫెడ్
- 46 చోట్ల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి కనీస మద్దతు ధరకు జొన్నలు కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం.. మార్క్‌ఫెడ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మార్క్‌ఫెడ్‌ను స్టేట్ నోడల్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్‌రావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. అదే క్రమంలో మార్క్‌ఫెడ్‌కు రూ.328 కోట్ల బ్యాంకు గ్యారెంటీ ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. 2023-24 యాసంగి సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 2,07,603 ఎకరాల్లో జొన్న పంటను రైతులు సాగుచేశారు. 1,83,729 టన్నుల జొన్నలు ఉత్పత్తి అవుతాయని అధికారులు అంచనావేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. అయితే జొన్నల కనీస మద్దతు ధర రూ.3,180 కాగా.. మార్కెట్‌లో రూ.2,400 చొప్పున ప్రైవేటు ట్రేడర్లు కొనుగోలు చేస్తున్నారు. ఎమ్మెస్పీతో పోలిస్తే క్వింటాకు రూ.780 నుంచి రూ.800 వరకు రైతులు నష్టపోతున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కనీస మద్దతు ధరకు జొన్నలు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే 1,83,729 టన్నుల జొన్నల్లో 50 శాతం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదిలాబాద్, జోగులాంబ గద్వాల, కామారెడ్డి, కుమ్రంభీం ఆసిఫాబాద్, మెదక్, నిర్మల్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో 46 చోట్ల జొన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మార్క్‌ఫెడ్ ఎండీ సత్యనారాయణరెడ్డి, ప్రొక్యూర్మెంట్ మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. రైతులు తక్కువ ధరకు ప్రైవేటు ట్రేడర్లకు విక్రయించకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో జొన్నలు విక్రయించి ఎమ్మెస్పీ పొందాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు విజ్ఞప్తి చేశారు.

సాక్షులపై ఒత్తిడి తెచ్చారు

(మొదటిపేజీ తరువాయి)

వాదనలు విన్న ఈడీ ప్రత్యేక కోర్టు న్యాయాధికారి కావేరీ బవేజా తీర్పును రిజర్వు చేసి, ఏప్రిల్ 8న వెలువరిస్తామని తెలిపింది. కాగా కవితకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసే విషయంపై ఈ నెల 20 నుంచి వాదనలు వింటామని బవేజా పేర్కొన్నారు.



పలు ఆధారాలు మా వద్ద ఉన్నాయి: ఈడీ

ఢిల్లీ మద్యం కేసులో కవిత కీలకపాత్ర పోషించినందున, ఈ దశలో ఆమెకు బెయిల్ మంజూరు చేయడం సబబు కాదని ఈడీ తరఫున న్యాయవాది జోహెబ్ హుస్సేన్ వాదించారు. మనీ లాండరింగ్ వంటి అవినీతి కార్యకలాపాలకు పాల్పడిన రాజకీయ నేతలకు.. మహిళలు అన్న మినహాయింపుతో బెయిల్ ఇవ్వొద్దన్నారు. ఈ కేసులో ముడుపులు తరలించడంలో ప్రధాన పాత్ర పోషించిన కవిత.. మద్యం వ్యాపారంలో లబ్ధి కూడా పొందారని, సాక్ష్యాలను ధ్వంసం చేశారని తెలిపారు. నగదు మళ్లించినట్లు రుజువు చేసే బ్యాంకు ఖాతాలు, వాట్సాప్ డాక్యుమెంట్లు తమ వద్ద ఆధారాలుగా ఉన్నాయన్నారు. ఈడీకి తన మొబైల్ ఫోన్లను అందజేసే ముందు వాటిలోని సమాచారాన్ని కవిత తొలగించారని, ఇతర నిందితులు కూడా ఇదే పని చేశారని, మొత్తంగా వందకు పైగా మొబైళ్లలో సమాచారాన్ని తుడిచిపెట్టి, ధ్వంసం చేశారని తెలిపారు. దర్యాప్తులో కీలకమైన సమాచారాన్ని రాబట్టే దశలో ఉన్నామని, కవితకు మధ్యంతర బెయిల్ ఇవ్వటం వల్ల దర్యాప్తునకు ఆటంకం కలుగుతుందన్నారు. తన సీఏ బుచ్చిబాబుతోపాటు పలువురు సాక్షులు తమ స్టేట్‌మెంట్లను మార్చుకోవలసిందిగా కవిత ఒత్తిడి చేశారని తెలిపారు. ఈ మేరకు కవిత బినామీ అరుణ్ పిళ్లై తన స్టేట్‌మెంట్‌ను వెనక్కి తీసుకున్న విషయాన్ని హుస్సేన్ గుర్తు చేశారు. కవిత కుమారుడు పరీక్షల కారణంగా ఆందోళనకు గురవుతున్నారని అనడానికి ఎలాంటి సాక్ష్యాలు లేవని, ఒక్క మెడికల్ డాక్యుమెంట్ కూడా ఈ విషయంలో తమకు సమర్పించలేదని తెలిపారు. కవిత కుటుంబసభ్యులు, ఆమె ముగ్గురు సోదరీమణులు.. ఆమె కుమారుడికి పరీక్షల సమయంలో అవసరమైన మానసిక మద్దతు ఇవ్వగలరని ఆయన చెప్పారు.

విచక్షణ మేరకు బెయిల్ ఇవ్వొచ్చు: సింఘ్వీ

కవిత తరఫున వాదించిన అభిషేక్ మను సింఘ్వీ.. ప్రత్యేక కోర్టు తన విచక్షణ ప్రకారం బెయిల్ మంజూరు చేయవచ్చన్నారు. కవిత 16 ఏళ్ల కుమారుడి పరీక్షలు జరుగుతున్నాయని, ఇటువంటప్పుడు అతడికి నైతిక, భావోద్వేగపరమైన తల్లి మద్దతు అవసరమని చెప్పారు. ఇంట్లో తండ్రి, బంధువులు, ఇంకెవరు ఉన్నా తల్లితో సమానం కాదన్నారు. ఒక నెలరోజులు కవితకు బెయిల్ మంజూరు చేస్తే నష్టమేమీ లేదని, ఆమె ఎక్కడికీ వెళ్లరని, ఈడీ కూడా తన దర్యాప్తును కొనసాగించుకోవచ్చని తెలిపారు. కవితను ఇప్పట్లో ఈడీ ప్రశ్నించే అవకాశం కూడా లేదని.. కాబట్టి, ఆమెకు బెయిల్ ఇవ్వాలని అభ్యర్థించారు. ప్రధాని మోదీ కూడా విద్యార్థుల పరీక్షల సన్నద్ధత గురించి పరీక్షా పే చర్చ కార్యక్రమంలో అనేక విషయాలు చెప్పారని సింఘ్వీ గుర్తు చేశారు.

24 నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాఠశాలలకు 24వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా 15 నుంచి వార్షిక పరీక్షలను (సమ్మేటివ్ అస్సెస్‌మెంట్- ఎస్‌ఏ-2) నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యా శాఖ అధికారులు పరీక్షల షెడ్యూల్‌ను జారీ చేశారు. రాష్ట్రంలో 10వ తరగతి వార్షిక పరీక్షలు పూర్తయ్యాయి. దాంతో 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఎస్‌ఏ-2 పరీక్షలను 15 నుంచి నిర్వహించాలని అధికారులు షెడ్యూల్‌ను జారీ చేశారు. గతంలో ఖరారు చేసిన షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసి, తాజాగా రీ-షెడ్యూల్‌ను విడుదల చేశారు. దీని ప్రకారం ఎస్‌ఏ-2 పరీక్షలు ఈ నెల 15వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరుగనున్నాయి. 23న ఈ పరీక్షల ఫలితాలను వెల్లడించనున్నారు. అదే రోజు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించనున్నారు. అనంతరం ఈ నెల 24వ తేదీ నుంచి వేసవి సెలవులను ఇవ్వనున్నారు. 1 నుంచి 7వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు, 8వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి 11.45 గంటల వరకు, 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ ఎస్‌ఏ-2 పరీక్షలను నిర్వహించనున్నారు.

కార్మిక రాజ్య బీమా సంస్థ

కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం

క.రా.బీ.సి. ESIC

ప్రాంతీయ కార్యాలయం, 5-9-23, హిల్ ఫోర్ట్ రోడ్, ఆదర్శ్‌నగర్, హైదరాబాద్, తెలంగాణ-63. ఫోన్: 040-23232357/58/59,
ఇ-మెయిల్ ఐడి: ins3.ts@esic.nic.in

ప్రకటన

జారీ చేయబడిన సి-18 ప్రకటనల కొరకు సంబంధిత అధికారి ముందు స్వయం విచారణకు హాజరు కావలసిందిగా దిగువ యజమానికి ఇందుమూలముగా ప్రకటన ఇవ్వడమైనది.

క్ర. సం.	కోడ్ నంబర్	ఫ్యాక్టరీ/Estt. పేరు	యూనిట్ చిరునామా	సి-18 ఆదేశ ప్రకటన తేదీ	కాలం	విరాళాల క్లెయిమ్ మొత్తం	స్వయం విచారణ కొరకు అధీకృత అధికారి
1.	52000421770001018	శ్రీ కామాఖ్య సెక్యూరిటీ ఫోర్స్	ఇ.నం.8-382/1, ప్లాట్ నం.54, ఫేజ్-2, న్యూ మానిక్య నగర్, చింతల్, హెచ్ఎమ్‌టి, టౌన్‌షిప్ 500054.	06-12-19	అక్టోబర్-14 నుండి మార్చి-19	రూ.3,47,491	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్, ESIC
2.	52000425090000606	వాల్యు-టెక్ ఇంజనీరింగ్ ఇండస్ట్రీస్	ప్లాట్ నం.22, ఫేజ్-5, ఐడిఏ, పటాన్‌చెరు, మెదక్ జిల్లా-502319	13-07-20	జనవరి-15 నుండి డిసెంబర్ - 19	రూ.1,14,494	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
3.	52000425930000699	రేణుక ఇంజనీర్స్	17-227, జెఎల్ఎన్ ఎస్ నగర్, నార్త్ లాలాగూడ, సికింద్రాబాద్-500017	13-01-20	డిసెంబర్-14 నుండి మార్చి - 19	రూ.3,36,334	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
4.	52000430800001001	శ్రీ హనుమాన్ లేబర్ కాంట్రాక్ట్ P.S.S.S.LTD	ఇ.నం.7-150, వెల్చూర్, ఘన్‌పూర్, వరంగల్-506168	23-07-19	జూన్-2014 నుండి మార్చి - 19	రూ.4,79,623	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
5.	52000434140000999	కెసిఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ PVT. LTD.	301 శ్రీ తేజ రెసిడెన్సీ, వెంగల్‌రావ్ నగర్ కాలనీ, హైదరాబాద్-500038	04-12-19	అక్టోబర్-14 నుండి మార్చి - 19	రూ.6,25,483	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
6.	52000438790001399	స్పార్క్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ PVT. LTD.	డి.నం.5-5-708/8, ఉదయానందన్ హైట్స్, అభ్యుదయాకాలనీ, చింతల్ కుంట, హైదరాబాద్-500070	08-08-19	డిసెంబర్-2014 నుండి మార్చి-19	రూ.6,39,854	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
7.	52000439190000999	ఒరిజిన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ.	ప్లాట్ నం.3, డైనమిక్స్ కాలనీ, ఆర్.సి.పురం, 502032	09-05-19	ఏప్రిల్-2014 నుండి మార్చి-19	రూ.28,85,454	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
8.	52000439210000902	లక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్	ఫ్లాట్‌నం.102, ప్లాట్ నం.27, డ్రీమ్ రెసిడెన్సీ, పుప్పాలగూడ, ఫ్రెండ్స్ కాలనీ, మణికొండ, రంగారెడ్డి జిల్లా 500089	11-02-20	డిసెంబర్-14 నుండి మార్చి-19	రూ.3,36,766	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
9.	52000439900001301	సొసైటీ ఆఫ్ ఇండియన్ ఫ్రెండ్స్ & ప్రమోటర్స్ ఆఫ్ టర్కీ & సెంట్రల్ ఏసియన్ కల్చర్స్	ప్లాట్ నం.84ఏ, రోడ్ నం.12, ఎమ్ఎల్ఏ కాలనీ బంజారా హిల్స్, హైదరాబాద్-500034	17-12-19	అక్టోబర్-14 నుండి మార్చి-19	రూ.9,72,972	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
10.	52000440540001009	తేజస్వరమ్ ఇంజనీర్స్ & కాంట్రాక్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్	3-5-590, ఫ్లాట్ నం.303, శారదా ఎడిఫైస్, నారాయణగూడ, 500029	30-05-19	ఏప్రిల్-2015 నుండి మార్చి-19	రూ.63,064	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
11.	52000443790001099	శ్రీనిధి ఎలక్ట్రికల్స్	ఇ.నం.16-75, ఆల్విన్ కాలనీ, పటాన్‌చెరు-502319	6-09-19	ఆగస్టు-14 నుండి మార్చి-19	రూ.7,16,430	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
12.	52000444650001399	హిమబిందు సెక్యూరిటీ సర్వీసెస్ & ట్రైనింగ్ సెంటర్	7-1-213, మంకమ్మతోట, కరీంనగర్ 505001	04-12-19	జనవరి-17 నుండి మార్చి-19	రూ.2,02,703	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
13.	52000445380001009	ఎస్‌విఆర్ ప్రాజెక్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్	డి.నం.7-1-397/13, బి-47, కమ్యూనిటీ హాల్ దగ్గర, ఎస్.ఆర్. నగర్, హైదరాబాద్-500038	29-10-19	ఏప్రిల్-18 నుండి మార్చి-19	రూ.27,027	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
14.	52000445620000699	కె. మల్లికార్జునరెడ్డి	ఇ.నం.5-1-962, పత్తర్ మస్జీద్ ఎదురుగా, గౌలిగూడ 500012	25-10-19	ఏప్రిల్-18 నుండి మార్చి-19	రూ.99,099	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESI
15.	52000461660001016	శ్రీ సాయితేజ ఎంటర్ ప్రైజెస్	ఐటిసి ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్, 8/13/3, శాంతినగర్, MYL, 500077	08-07-19	మే-2014 నుండి మార్చి-19	రూ.4,49,163	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
16.	52000461870001009	దత్తు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్	ప్లాట్ నం.13/8, అడ్డగుట్ట, భాగ్యనగర్ కాలనీ, కూకట్‌పల్లి, 500072	13-01-20	సెప్టెంబర్-15 నుండి మార్చి-19	రూ.1,73,102	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
17.	52000462400000999	జి ఎస్ ఆర్ ఫ్యుమెన్స్ వరల్డ్	13-1/2, సాయిపురి కాలనీ, యాదవపూర్, మల్కాజ్‌గిరి, హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్-500047	08-07-19	మే-2014 నుండి మార్చి-2019	రూ.3,74,303	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
18.	52000462430000205	కోదండ పాలిప్యాక్స్ ప్రైవేట్ లిమిటెడ్	ప్లాట్ నం.232, ఐడిఏ, ఫేజ్-2, ఐటి పాషమైలారం, పటాన్‌చెరు, మెదక్ - 502307	22-11-19	జూన్-19 నుండి మార్చి-19	రూ.40,541	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
19.	52000462440001001	వి అరుణ్‌కుమార్ ఎంటర్‌ప్రైజెస్	ఇ.నం.21-21, బాంబే కాలనీ, రామచంద్రాపురం, మెదక్ (జిల్లా), 502032	04-12-19	ఆగస్టు-17 నుండి మార్చి-19	రూ.2,10,210	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
20.	52000466600001019	శ్రీ కృష్ణ ఎంటర్‌ప్రైజెస్	నెహ్రూనగర్, ఎన్ఎఫ్‌సి దగ్గర, హెచ్‌సిఎల్ క్రాస్ రోడ్, కుషాయిగూడ, ఇసిఐఎల్, హైదరాబాద్-500062	13-01-20	డిసెంబర్-14 నుండి మార్చి-19	రూ.3,36,766	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
21.	52000466870000606	కె కిరణ్ కుమార్	ఫ్లాట్ నం.బి-505, మోడీ బిల్డర్స్, అపురూప కాలనీ, జీడిమెట్ల, హైదరాబాద్-500055	04-12-19	అక్టోబర్-14 నుండి మార్చి-19	రూ.7,64,479	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
22.	52000470260000999	రక్ష సెక్యూరిటీ సర్వీసెస్	ఫ్లాట్ నం.31 & 32, రాంకీ సెలేనియమ్ టవర్స్, టవర్ - ఎ, గ్రౌండ్ ఫ్లోర్, ఫైనాన్షియల్ జిల్లా, నానక్‌రామ్‌గూడ, HYD 500032	04-12-19	నవంబర్-17 నుండి మార్చి-19	రూ.2,04,204	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
23.	52000471270000999	నవ్య ఉప్పలైన్స్	ఫ్లాట్ నం.131, ఇందిర రెడ్డి ఆల్విన్ కాలనీ, మియాపూర్ క్రాస్ రోడ్ 500049	02-08-19	జూన్-2014 నుండి మార్చి-2019	రూ.3,68,941	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
24.	52000471380001099	శ్రీ బాలాజీ సర్వీసెస్	ఇ.నం.9-68/1, సంజయ్ గాంధీ నగర్, షాపూర్‌నగర్, జీడిమెట్ల, 500055	02-08-19	జూన్-2016 నుండి మార్చి-2019	రూ.1,68,169	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
25.	52000471720001009	శ్రీ కృష్ణ కన్‌స్ట్రక్షన్స్	ఇ.నం.14-1-90/400, గ్రౌండ్ ఫ్లోర్, అల్లాపూర్, గాయత్రినగర్, బోరబండ, హైదరాబాద్ 500018	08-07-19	మే-2014 నుండి మార్చి-2019	రూ.7,48,605	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
26.	52000472490001018	ఎ-1 సెక్యూరిటీ ఫోర్స్	1-2-597/22-ఎ, భారత్ బాగ్, దోమల్‌గూడ, హైదరాబాద్-500029	10-07-19	జూన్-2014 నుండి మార్చి-2019	రూ.3,68,941	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
27.	52000474500000099	పరాశరా ఈవెంట్స్ & సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్	ఫ్లాట్ నం.70, డి.నం.30-294/3/1, సంతోషిమానగ, ఓల్డ్ సఫిల్‌గూడ, సికింద్రాబాద్, 500047	19-02-20	డిసెంబర్-14 నుండి మార్చి-19	రూ.3,36,766	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
28.	52000475560001102	నాగ సాయి హాస్పిటాలిటీ సర్వీసెస్	ప్లాట్ నం.479బి, రాఘవేంద్ర కాలనీ, కొండాపూర్, రంగారెడ్డి, 500084	13-01-20	డిసెంబర్-14 నుండి మార్చి-19	రూ.3,70,442	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
29.	52000475660000911	సేమంటిక్ బిట్స్ ఇండియా PVT LTD	101-ఎ, 2-56/33/40/ఎ, సిఎస్ఆర్ కమర్షియల్, గురుకుల్ ట్రస్ట్, మెరిడియన్ స్కూల్ దగ్గర, మాదాపూర్, హైదరాబాద్-500081	03-03-20	జనవరి-16 నుండి మార్చి-19	రూ.1,06,821	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
30.	52000475880000699	భవిత్ ఎలక్ట్రికల్స్	ఇ.నం.5-12-215, రహమత్‌నగర్, బిటిఎస్, నల్గొండ-508001	04-07-19	ఆగస్టు-2017 నుండి మార్చి-19	రూ.5,10,510	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
31.	52000476730000999	ఎమ్ మేనేజ్‌మెంట్ & మ్యాన్‌పవర్ సర్వీసెస్	5-127, ఎస్ఆర్ నాయక్ నగర్, ఐడిఏ జీడిమెట్ల, కుత్బుల్లాపూర్ మండల్, రంగారెడ్డి జిల్లా, 500055	09-12-19	ఏప్రిల్-15 నుండి మార్చి-19	రూ.3,46,847	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
32.	52000476930000999	హనీ వెల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్	సి-23, మహేశ్వరీ టవర్స్, రోడ్ నం.1 బంజారాహిల్స్, హైదరాబాద్-500034	26-08-19	జులై-2014 నుండి మార్చి-2019	రూ.2,90,862	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
33.	52000477700000999	REX సొల్యూషన్స్	13-4-600/1, కార్వాన్, సుల్తాన్‌బజార్, హైదరాబాద్, 500006	29-10-19	ఏప్రిల్-18 నుండి మార్చి-2019	రూ.54,054	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
34.	52000478160000606	JIREH ఇంజనీరింగ్ వర్క్స్	ఇ.నం.1-33-3-8, కైలాస్‌నగర్, చందానగర్, హైదరాబాద్-500050	05-12-19	అక్టోబర్-14 నుండి మార్చి-19	రూ.6,94,980	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
35.	52000478610001009	శ్రీ బాలాజీ ఇంజనీరింగ్ & కన్‌స్ట్రక్షన్స్	ఇ.నం.6-280/5/506, మల్లికార్జున నగర్, చింతల్ జీడిమెట్ల, హైదరాబాద్-500054	05-09-19	జూన్ 2015 నుండి మే 2018, జులై 2018 నుండి మార్చి 2019	రూ.2,25,548	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
36.	52000479640001099	డి. శ్రీనివాసరావ్ కాంట్రాక్టర్	క్యా.నం.S 2/11, ఎయిర్‌ఫోర్స్ అకాడమీ, దుండిగల్, కుత్బుల్లాపూర్ 500043	17-07-19	మే 2015 నుండి మార్చి 2019	రూ.1,32,561	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
37.	52000480630000699	శివరామ ఇంజినీర్స్	ఫ్లాట్ నం.943, మాతృశ్రీ నగర్, చందా నగర్, హైదరాబాద్,రంగారెడ్డి, తెలంగాణ, 500050.	07-05-19	ఆగస్టు 2014 నుండి మార్చి 2019	రూ.2,26,620	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
38.	52000480770001401	నెస్ట్ విల్లాస్ హాస్పిటల్ (శ్రీ సాయి వెంకటేశ్వర అసోసియేట్స్	ఫ్లాట్ నం.ఎ7, విక్రంపురి కాలనీ, ఖార్ఖానా, సికింద్రాబాద్, 500009	04-07-19	జులై 2014 నుండి మార్చి 2019	రూ.1,81,790	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
39.	52000480810000999	కె ఆర్ ఎస్ చక్రవర్తి ప్రాజెక్ట్స్	ఎమ్ఐజి:158, IV ఫేజ్, ఏపిహెచ్‌బి డిఎల్ ఎఫ్ వెనుక, రంగారెడ్డి, 500019	05-08-19	ఆగస్టు 2014 నుండి మార్చి 2019	రూ.3,58,216	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
40.	52000481220001008	ఎటిఎస్ ట్రాన్స్‌లోజిక్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్	6-3-1113/4, మొదటి అంతస్తు, బేగంపేట్, హైదరాబాద్ 500016	27-11-19	అక్టోబర్-15 నుండి మార్చి-19	రూ.2,83,141	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
41.	52000481820001099	స్నేహదీప్ ఫైనాన్షియల్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్	ప్లాట్ నం.47, గ్రౌండ్ ఫ్లోర్, కంఫర్ట్ ప్లాజా, 5వ ఫేజ్, కెపిహెచ్‌బి కాలనీ, 500072	05-08-19	జులై-2015 నుండి మార్చి-2019	రూ.2,55,757	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
42.	52000483770001099	శ్రీ వెంకటేశ్వర కన్‌స్ట్రక్షన్స్	ఇ.నం.10-126/2, ప్రశాంతి నగర్, మీర్‌పేట్ విలేజ్, బాలాపూర్ క్రాస్ రోడ్, సరూర్‌నగర్,(మం).రంగారెడ్డి జిల్లా 500092	25-10-19	డిసెంబర్-14 నుండి మార్చి-19	రూ.3,36,766	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
43.	52000484180001018	అను సెక్యూరిటీ సర్వీసెస్	186, ఆదిత్యానగర్, కూకట్‌పల్లి, 500072	23-10-19	సెప్టెంబర్-14 నుండి మార్చి-19	రూ.3,52,853	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
44.	52000485010001099	లక్ష్యా సర్వీసెస్	ఇ.నం.4-19/80, లక్ష్మి నగర్, దొమ్మాయిగూడ, కీసరమండల్, రంగారెడ్డి జిల్లా 500083	05-12-19	సెప్టెంబర్-14 నుండి మార్చి-19	రూ.6,09,180	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
45.	52000485090000799	పివిఆర్ ట్రావెల్స్	ఇ.నం.8-2-269/19/432, ఇందిరానగర్, రోడ్ నం.2, బంజారా హిల్స్, హైదరాబాద్, 500034	25-10-19	నవంబర్-14 నుండి మార్చి-19	రూ.3,42,128	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
46.	52000485570001099	బి.మనోహర్ గౌడ్ (కాంట్రాక్టర్)	తలమడ్ల, భిక్నూర్ మండల్, 503102	06-09-19	సెప్టెంబర్-14 నుండి మార్చి-19	రూ.3,52,853	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
47.	52000485880000699	మెసర్స్ కెఎమ్ఎస్ ఫ్యాబ్రికేటర్స్	# 7-144/10, లక్ష్మి నగర్, నాగారం, కీసర మండలం 500081	16-12-19	సెప్టెంబర్-18 నుండి మార్చి-19	రూ.31,532	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
48.	52000487310000999	ఎస్ఎవిఎస్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్	ఫ్లాట్ నం.బి4 త్రివేణి సంగం అపార్ట్‌మెంట్స్ రోడ్ నం.3, హైదరాబాద్, 500034	17-06-20	ఫిబ్రవరి-15 నుండి డిసెంబర్-19	రూ.3,76,283	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
49.	52000487350001018	క్రిట ఎంటర్ ప్రైజెస్	ఫ్లాట్ నం.404-పార్ట్, 4వ ఫ్లోర్, కుబేర టవర్స్, డి బ్లాక్, తిరుమలగిరి, 500015	05-12-19	సెప్టెంబర్-14 నుండి మార్చి-19	రూ.3,52,853	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
50.	52000487800000999	ఎమ్‌వివి సత్యనారాయణ కాంట్రాక్టర్	ఫ్లాట్ నం.201, రునాదు కాలనీ, మారుతి హోమ్స్, వివేకానందనగర్ కాలనీ, కూకట్‌పల్లి, హైదరాబాద్ 500072	29-10-19	సెప్టెంబర్-14 నుండి మార్చి-19	రూ.6,95,695	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
51.	52000487930001099	ఎ కె ఎలెక్ట్రో & ఫ్యాబ్రికేటర్స్ జాబ్ వర్క్స్	డి.నం.1-45 బాలానగర్, మహబూబ్‌నగర్ జిల్లా 509202	13-01-20	డిసెంబర్-14 నుండి మార్చి-19	రూ.3,36,706	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
52.	52000488190000799	మల్లవరపు లుర్దు రాజు, కాంట్రాక్టర్	ఫ్లాట్ నం.1014, సాయి కృష్ణ అపార్ట్‌మెంట్స్ సుభాష్‌నగర్, నిజామాబాద్.503002	24-10-19	అక్టోబర్-14 నుండి మే-15 & డిసెంబర్-15 నుండి మార్చి-19	రూ.2,64,172	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
53.	52000488650000999	NUE టెక్ ఫైబర్ ఇండస్ట్రీ	3-13-100, బాబానగర్, మల్లాపూర్, హైదరాబాద్, 500078	05-12-19	మార్చి-15 నుండి మార్చి-19	రూ.2,56,542	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
54.	52000488810000999	SSS ఎంటర్ ప్రైజెస్	ఫ్లాట్ నం.77, దేవి రాయల్ అపార్ట్‌మెంట్స్, వెంకటేశ్వర నగర్, సాయినాథ్‌పురం, ఇసిఐఎల్, హైదరాబాద్ 500062 500062	05-12-19	జనవరి-15 నుండి మార్చి-19	రూ.3,64,543	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
55.	52000488930000999	బజరంగ్ ప్రతాప్ సెక్యూరిటీ ఫోర్స్	ఫ్లాట్ నం.23/ఏ, ఇ.నం.7-10, భాగ్యలక్ష్మి కాలనీ, సుభాష్‌నగర్, కుత్బుల్లాపూర్, రంగారెడ్డి, 501505	05-12-19	అక్టోబర్-14 నుండి మార్చి-19	రూ.3,45,934	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
56.	52000491470000999	శ్రీ వెంకటేశ్వర సోషల్ వెల్ఫేర్ సొసైటీ	ఫ్లాట్ నం.39, ఇ.నం.4-7-146/39, శాంతినగర్, హయత్‌నగర్, రంగారెడ్డి, 500070	17-09-19	అక్టోబర్-14 నుండి మార్చి-19	రూ.3,42,647	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
57.	52000491700000909	హైటెక్ ఇండస్ట్రీస్	11-12/56, వెంకటరెడ్డి కాలనీ, నాగారం, రంగారెడ్డి జిల్లా, 500083	31-07-19	సెప్టెంబర్-2014 నుండి మార్చి-2019	రూ.3,52,853	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
58.	52000492240000699	హెచ్ ఆర్ స్పైర్ స్టాఫ్ సొల్యూషన్స్, ప్రైవేట్ లిమిటెడ్	1-10-209, 2వ అంతస్తు, కమలాటవర్స్, ఓటిసి బ్యాంక్‌మీద, అశోక్‌నగర్ సిగ్నల్స్, అశోక్‌నగర్, హైదరాబాద్ 500020	13-11-19	ఏప్రిల్-15 నుండి మార్చి-19	రూ.63,064	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
59.	52000493400001102	పూర్ణిమ కేటరింగ్ & స్మార్ట్ సొల్యూషన్స్	1-10-104/41/2, ఎస్‌జెఆర్ రెసిడెన్సీ, మయూర్‌మార్గ్, బేగంపేట్,హైదరాబాద్-16	06-02-20	నవంబర్-14 నుండి మార్చి-19	రూ.3,42,128	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
60.	52000494480000911	MOSYS ఇండియా ప్రైవేట్ లిమిటెడ్	ద్వారక హైట్స్, 8-2-594/ఎ/1, 4వ అంతస్తు.	19-11-19	జనవరి-17 నుండి మార్చి-19	రూ.40,541	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
61.	52000494590000999	స్టోన్‌హెంజ్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్	ఇ.నం.1-102/2, ప్లాట్ నం.58, శ్రీ సాయి నగర్, మాదాపూర్, హైదరాబాద్ 500081	19-02-20	డిసెంబర్-14 నుండి మార్చి-19	రూ.7,07,208	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
62.	52000494610001009	భవిత ప్రాజెక్ట్స్	F502, అంజన రెసిడెన్సీ, DRs కాలనీ, సరూర్‌నగర్, హైదరాబాద్,500035, రిజిస్టర్డ్, 01-11-2024,01-11-2014,0,0,0,0,0,s_ padureddy@rediffmail.com, 9160025666, హైదరాబాద్,ESIC 52000494-620000999, బాలాజీ డెవలపర్స్,ఆర్‌ఓ-తెలంగాణ,బిఓ-పటాన్‌చెరు, ఐపి-ఆర్.సి.పురం డివిజన్, ఇ.నం.22-116/2/52	06-02-20	నవంబర్-14 నుండి మార్చి-19	రూ.3,42,128	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
63.	52000494890000999	ప్రవల్లిక అలయన్సెస్	10-5/2/7/G/3/2, ఆనంద్‌నగర్, మాసాబ్‌ట్యాంక్, హైదరాబాద్-500028	19-02-20	డిసెంబర్-15 నుండి మార్చి-19	రూ.2,11,714	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
64.	52000494910000999	ఎక్సెల్ ప్రాజెక్ట్స్	ఇ.నం.106 ప్రైమ్ రోజ్, పిఎస్ఆర్ కొంపల్లి, సికింద్రాబాద్.రంగారెడ్డి-500014	06-02-20	నవంబర్-14 నుండి మార్చి-19	రూ.3,42,128	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
65.	52000496170000999	ప్రకాష్ సర్వీసెస్	20-2/64, గణేష్ నగర్ కాలనీ, ఉప్పల్ రంగారెడ్డి, 500039.	27-02-20	జనవరి-15 నుండి మార్చి-19	రూ.3,31,403	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
66.	52000496330000699	శ్రీ శివాంజనేయ ఇంజనీరింగ్ ఫ్యాబ్రికేటర్స్	2-11-26, చాకలి బస్తీ, ఉప్పల్ హైదరాబాద్ 500039	27-02-20	జనవరి-15 నుండి మార్చి-19	రూ.3,31,403	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
67.	52000496640000999	ప్రైమ్ సెక్యూరిటీ సర్వీసెస్	ప్లాట్ నం.15, ఫ్లాట్ నం.102, ఎస్ఎమ్ఆర్ కాంప్లెక్స్, సుచిత్ర క్రాస్ రోడ్, కుత్బుల్లాపూర్, 500055	08-07-20	జనవరి-15 నుండి మార్చి-19	రూ.6,62,805	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
68.	52000496760000999	శ్రీసాయిరామ్ సెక్యూరిటీ సర్వీసెస్	ఫ్లాట్ నం.7, హాశమాబాద్, బండ్లగూడ రోడ్, చంద్రాయణ్‌గుట్ట, హైదరాబాద్ 500005	27-02-20	జనవరి-15 నుండి మార్చి-19	రూ.3,31,403	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
69.	52000498130000999	బ్లాక్ డాగ్ సెక్యూరిటీ & హౌస్ కీపింగ్ సర్వీసెస్	48-465 గణేష్‌నగర్, షా థియేటర్ ప్రక్కన, చింతల్, రంగారెడ్డి కుత్బుల్లాపూర్, 500054, 500054	19-02-20	డిసెంబర్-14 నుండి మార్చి-19	రూ.6,73,530	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
70.	52000501560001099	పిఎస్ఆర్ ఇంజనీరింగ్ వర్క్స్	ఇ.నం.2-109/1, పృథ్వి సాయి హోమ్స్, సాయినగర్, చైతన్యపురి, హైదరాబాద్ 500060	04-12-19	నవంబర్-16 నుండి జులై-18 & అక్టోబర్-18 నుండి మార్చి-19	రూ.86,658	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
71.	52000505240000999	సేఫ్టీ పెస్ట్ కంట్రోల్ సర్వీసెస్	ప్లాట్ నం.21బి, ఖార్ఖానా రోడ్, విక్రంపురి కాలనీ, సికింద్రాబాద్, హైదరాబాద్ 500009	08-08-19	మే-15 నుండి జులై-15 & ఆగస్టు-17 నుండి మార్చి-19	రూ.1,16,903	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
72.	52000506760000999	ఎస్ఎవిఎస్‌జి ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్	పి.నం.60, మున్సిపల్ నం.948, డాన్ బాస్కో హై స్కూల్ వెనుక, బిఎస్‌పి కాలనీ, మోతీనగర్, ఎర్రగడ్డ, హైదరాబాద్ తెలంగాణ స్టేట్, 500018	30-08-19	మార్చి 2015 నుండి మార్చి-19	రూ.68,621	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
73.	52000507720001019	ఎమ్ఎస్ తిరుపతి రెడ్డి & కో.	ఫ్లాట్ నం.304, మధువిహార్ అపార్ట్‌మెంట్ నల్లగండ్ల శేరిలింగంపల్లి 500091	13-02-20	సెప్టెంబర్-16 నుండి మార్చి-19	రూ.2,24,153	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
74.	52000507940000999	SSBV LCCS లిమిటెడ్	3-5-316/24/1ఎ, అయోధ్యనగర్, రామగుండం, 505208	28-08-19	ఏప్రిల్-2015 నుండి మార్చి-2019	రూ.3,15,316	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
75.	52000508530001002	డిజిటల్ ఎక్విప్‌మెంట్స్	6/3/606, హిల్ టాప్ కాలనీ, ఎర్రమంజిల్ కాలనీ, 500082	01-08-19	ఏప్రిల్-2015 నుండి మార్చి-2019	రూ.3,15,316	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
76.	52000512920001099	ఆశా ఎంటర్‌ప్రైజెస్	37-93/137/9, జాగృతి బ్యాంక్ దగ్గర మధురానగర్, రామకృష్ణాపురం పోస్ట్, సికింద్రాబాద్, 500056	30-10-19	ఫిబ్రవరి-18 నుండి మార్చి-19	రూ.3,67,931	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
77.	52000516670000999	EXCELSIOR హాస్పిటాలిటీ & కేటరింగ్ సర్వీసెస్	8-2-608/1/4 & 5, రోడ్ నం.10, NAIM మంజిల్, బంజారాహిల్స్, హైదరాబాద్, 500034	10-12-19	సెప్టెంబర్-15 నుండి అక్టోబర్-15 & మార్చి-16 నుండి మార్చి-19	రూ.3,18,318	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
78.	52000517960000999	ZEESHAN సెక్యూరిటీ ఫోర్స్ & ప్లేస్‌మెంట్ సర్వీసెస్	షాప్ నం.9-22/1, ఎస్‌బిహెచ్, కాలనీ, రాజేష్ పెట్రోల్‌పంప్ ఎదురుగా, ఆర్‌సిఎమ్ షాప్ కాంప్లెక్స్, జహీరాబాద్, మెదక్ 500020	17-06-20	జులై-15 నుండి జనవరి-20	రూ.3,52,534	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
79.	52000518010000999	జాబ్ ఫైండర్ హెచ్ ఆర్ సొల్యూషన్స్	106, ఫస్ట్ ఫ్లోర్, మాతా కాంప్లెక్స్, షాపూర్ నగర్, కుత్బుల్లాపూర్, 500055	27-02-20	జులై-15 నుండి అక్టోబర్-19	రూ.3,40,230	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
80.	52000520900000999	వై ఆర్ ఎంటర్‌ప్రైజెస్	ప్లాట్ నం.72, చంద్రానగర్, వాటర్ ట్యాంక్ దగ్గర, మేడ్చల్, రంగారెడ్డి, 501401	05-07-19	ఆగస్టు-2015 నుండి మార్చి-2019	రూ.5,86,347	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
81.	52000523240000606	ఫైన్ కోట్	ప్లాట్ నం.952 & 953, రామి రెడ్డి నగర్, ఐడిఏ జీడిమెట్ల, కుత్బుల్లాపూర్, మండలం, రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ 500055	13-12-19	సెప్టెంబర్-15 నుండి మార్చి-19	రూ.2,88,503	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
82.	52000525780000999	చంద్రకళ ఇంజనీరింగ్ వర్క్స్ & కాంట్రాక్టర్స్	ఇ.నం.16/ఏ బి కె గూడ రోడ్, ఎస్ఆర్ నగర్, హైదరాబాద్,500038	13-12-19	అక్టోబర్-15 నుండి మార్చి-19	రూ.5,66,280	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
83.	52000530800000306	జయంత్ ఎంటర్‌ప్రైజెస్	ప్లాట్ నం.1287/ఎ, గోకుల్ ప్లాట్స్, వెంకటరమణ కాలనీ, హఫీజ్‌పేట్ విలేజ్, శ్రీలింగంపల్లి, రంగారెడ్డి, తెలంగాణ, ఇండియా, 500072	20-02-20	సెప్టెంబర్-15 నుండి జులై-19	రూ.1,22,075	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
84.	52000536300001002	SSREE ఎలక్ట్రికల్స్	9-10/బి, మొదటి అంతస్తు, లలితానగర్, కోణార్క్ థియేటర్ ఎదురుగా, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్, 500060	13-12-19	డిసెంబర్-15 నుండి మార్చి-19	రూ.2,72,416	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC
85.	52000538460000999	యం. శ్రీకృష్ణ	ఇ.నం.42-50/ఎ, సాయినగర్ కాలనీ, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లా 509103	19-02-20	ఏప్రిల్-16 నుండి మార్చి-19	రూ.1,25,484	లాల్‌సన్ ఖోంగ్సాయ్, అసిస్టెంట్ డైరెక్టర్,ESIC

* వార్తా పత్రికలో ప్రచురణ తేదీ నుండి 10 రోజులకు లేదా ఆలోగా స్వయంగా విచారణకు ఆఖరి తేదీగా ఉంటుంది.

* సంబంధిత రికార్డులు/దాఖలుతో స్వయంగా విచారణకు హాజరు కావల్సిందిగా యజమానులకు సూచించడమైనది. లేనిచో సెక్షన్ 45-ఎ క్రింద ఈ కార్యాలయంలో లభించే రికార్డులతో ఉత్తర్వు జారీచేయబడుతుంది.

సం/- లాల్‌సన్ ఖోంగ్సాయ్,
రీజినల్ డైరెక్టర్ (ఇంచార్జ్) తరఫున, ప్రాంతీయ కార్యాలయం తెలంగాణ.

తేది 04.04.2024

స్పోర్ట్స్



నేటి మ్యాచ్
హైదరాబాద్ x చెన్నై
రా.7.30 నుంచి



పరుగుల వరద ఖాయమేనా?

కింగ్స్‌ను రైజర్స్ నిలువరించేనా!

హైదరాబాద్: ఐపీఎల్‌లో మరో పసందైన మ్యాచ్‌కు వేళైంది. డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ సొంత మైదానంలో శుక్రవారం తలపడేందుకు సిద్ధమైంది. అయితే టోర్నీలో ఇప్పటి వరకు ఏడు వికెట్లు తీసి జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించిన పేసర్ ముస్తాఫిజుర్ రహ్మాన్ సేవలు లేకపోవడం చెన్నైకి ఒకింత దెబ్బే. ముస్తాఫిజుర్ బంగ్లాదేశ్ వెళ్లడంతో..అతడి స్థానంలో శార్దూల్‌ను తీసుకొనే చాన్సుంది. ఎప్పుడు ఎలా ఆడుతుందో తెలియని హైదరాబాద్‌ను ఎదుర్కోవాలంటే సీఎస్‌కే ఆల్‌రౌండ్ నైపుణ్యాలకు పదును పెట్టాల్సి ఉంటుంది. ఆర్సీబీ, గుజరాత్ జట్లను తొలి రెండు మ్యాచ్‌ల్లో మట్టికరిపించిన సీఎస్‌కే.. గత పోరులో ఢిల్లీ చేతిలో కంగుతిన్నది. ఢిల్లీపై మెరుపులు మెరిపించిన ధోనీ బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుగా వచ్చి అలరించాలన్నది ఫ్యాన్స్ కోరిక. మరోవైపు స్వస్థలంలో ఉండే అనుకూలతలను పూర్తిగా వినియోగించుకోవాలని సన్‌రైజర్స్ భావిస్తోంది. ముంబైపై రికార్డు స్కోరు చేయడంతో బ్యాటింగ్ విభాగం రెట్టించిన ఉత్సాహంతో ఉంది. అయితే గత మ్యాచ్‌లో గుజరాత్ చేతిలో ఓటమి..హైదరాబాద్ నిలకడ లేని ఆటకు అద్దం పట్టింది. ఈ స్టేడియంలో ముంబైతో మ్యాచ్‌లో 500కు పైగా పరుగులు నమోదయ్యాయి. దాంతో ఈ మ్యాచ్‌లోనూ పరుగుల వరద పారే చాన్సుంది.

పంజాబ్ బల్లే బల్లే


గుజరాత్‌పై ఉత్కంఠ విజయం

ఆదుకున్న శశాంక్, అశుతోష్ ▪ గిల్ ఇన్నింగ్స్ వృథా



అహ్మదాబాద్: పంజాబ్ కింగ్స్ రెండు వరుస ఓటముల తర్వాత గెలుపు బాట పట్టింది. భారీ ఛేదనలో వరుస వికెట్లు కోల్పోతున్నా.. ఎవరి అంచనాల్లో లేని శశాంక్ సింగ్ (29 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 61 నాటౌట్), అశుతోష్ శర్మ (17 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 31) కదం తొక్కారు. టైటాన్స్ బౌలర్లపై ఎదురుదాడికి దిగి ఆఖరి ఓవర్‌లో మ్యాచ్‌ను గుజరాత్ నుంచి లాగేశారు. అటు టైటాన్స్ ఫీల్డింగ్ వైఫల్యం కూడా కలిసి వచ్చింది. దీంతో గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ 3 వికెట్లతో నెగ్గింది. ఈ సీజన్‌లో ఏ జట్టుకైనా ఇదే అత్యధిక ఛేదన. ముందుగా గుజరాత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 199 పరుగులు చేసింది. శుభ్‌మన్ గిల్ (48 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 89 నాటౌట్), సాయి సుదర్శన్ (19 బంతుల్లో 6 ఫోర్లతో 33), రాహుల్ తెవాటియా (8 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 23 నాటౌట్) రాణించారు. రబాడకు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో పంజాబ్ 19.5 ఓవర్లలో 7 వికెట్లకు 200 రన్స్ చేసి గెలిచింది. ప్రభ్‌సిమ్రన్ (24 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 35) పర్వాలేదనిపించాడు. నూర్ అహ్మద్‌కు 2 వికెట్లు లభించాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా శశాంక్ నిలిచాడు.

కలిసికట్టుగా..: భారీ ఛేదనను పంజాబ్ ఆత్మవిశ్వాసంతో ఆరంభించింది. వికెట్లు కోల్పోయినా రన్‌రేట్ తగ్గకుండా చూసుకుంది. మధ్య ఓవర్లలో శశాంక్, చివర్లో అశుతోష్ బ్యాటింగ్ తీరు జట్టును కాపాడింది. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ బెయిర్‌స్టో (22) మూడు ఫోర్లతో 13 రన్స్ రాబట్టాడు. మరో ఓపెనర్ ధవన్ (1)ను రెండో ఓవర్‌లోనే పేసర్ ఉమేశ్ బౌల్డ్ చేసినా.. ప్రభ్‌సిమ్రన్ దాటిని కనబర్చి నాలుగో ఓవర్‌లో 6,4తో ఆకట్టుకున్నాడు. అయితే టీనేజ్ స్పిన్నర్ నూర్ అహ్మద్ తన తొలి ఓవర్‌లోనే బెయిర్‌స్టోను అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 35 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. నూర్ తన తర్వాతి ఓవర్‌లోనే ప్రభ్‌సిమ్రన్‌ను అవుట్ చేయగా.. ఆ వెంటనే సామ్ కర్రాన్ (5)ను అజ్మతుల్లా వెనక్కి పంపాడు. ఈ దశలో శశాంక్ సింగ్ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. 11వ ఓవర్‌లో వరుసగా 4,6,4తో 17 రన్స్‌తో స్కోరుబోర్డులో కదలిక తెచ్చాడు. ఇక జితేశ్ శర్మ (16) వరుస రెండు సిక్సర్లతో జోరు చూపినా తర్వాతి బంతికే రషీద్‌కు చిక్కాడు. 18 బంతుల్లో 41 పరుగులు కావాల్సి వేళ ఎవరి అంచనాల్లో లేని అశుతోష్ ఎడాపెడా బౌండరీలతో చెలరేగాడు. అటు 25 బంతుల్లోనే శశాంక్ తొలి ఐపీఎల్ ఫిఫ్టీ సాధించాడు. 19వ ఓవర్‌లో అశుతోష్ రెండు సిక్సర్లతో 18 రన్స్ సాధించి, ఆఖరి ఓవర్‌లో సమీకరణం 7 పరుగులకు తెచ్చాడు. అయితే 20వ ఓవర్ తొలి బంతికే అతడిని పేసర్ నల్కండే అవుట్ చేసినా.. శశాంక్ ఓ ఫోర్‌తో విజయాన్ని తేలిక చేశాడు.



గిల్ అజేయంగా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ శుభ్‌మన్ గిల్ అజేయ అర్ధసెంచరీతో తుదికంటా నిలిచాడు. మధ్య ఓవర్లలో సాయి సుదర్శన్, చివర్లో తెవాటియా జోరుతో జట్టు భారీ స్కోరు అందుకుంది. తొలి ఓవర్‌లోనే గిల్ సిక్సర్ బాదగా, అటు సాహా ఫోర్లతో ఆకట్టుకున్నాడు. మూడో ఓవర్‌లోనే సాహా (11) వికెట్ కోల్పోయినా అప్పటికే జట్టు స్కోరు 29 పరుగులకు చేరింది. వన్‌డౌన్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ (26) ఉన్న కాసేపు వేగం చూపాడు. నాలుగు ఫోర్లతో ఆకట్టుకున్నా హర్‌ప్రీత్ బ్రార్ బౌన్సర్‌కు వెనుదిరిగాడు. రెండో వికెట్‌కు 40 పరుగులు జత చేరాయి. అయితే సాయి సుదర్శన్ రాకతో స్కోరులో వేగం పెరిగింది. 12వ ఓవర్‌లో అతడి రెండు ఫోర్లు, గిల్ ఓ ఫోర్‌తో 14 పరుగులు వచ్చాయి. చక్కగా కుదురుకున్న ఈ జోడీని పేసర్ హర్షల్ విడదీశాడు. 14వ ఓవర్‌లో సుదర్శన్‌ను అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 53 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తర్వాతి ఓవర్‌లోనే గిల్ ఫోర్‌తో 31 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాడు. 18వ ఓవర్‌లో గిల్ చెలరేగి 6,4 బాదినా విజయ్ శంకర్ (8) వికెట్‌ను రబాడ తీసి నాలుగో వికెట్‌కు 42 పరుగుల భాగస్వామ్యానికి తెర దించాడు. అయితే తెవాటియా వచ్చీ రాగానే బ్యాట్‌కు పనిజెప్పాడు. చివరి రెండు ఓవర్లలో ఓ సిక్సర్, 3 ఫోర్లతో 33 పరుగులందించడంతో స్కోరు 200కి చేరువగా వచ్చింది.

స్కోరుబోర్డు

గుజరాత్: సాహా (సి) ధవన్ (బి) రబాడ 11, గిల్ (నాటౌట్) 89, విలియమ్సన్ (సి) బెయిర్‌స్టో (బి) బ్రార్ 26, సాయి సుదర్శన్ (సి) జితేశ్ (బి) హర్షల్ 33, విజయ్ శంకర్ (సి) బ్రార్ (బి) రబాడ 8, తెవాటియా (నాటౌట్) 23, ఎక్స్‌ట్రాలు: 9; **మొత్తం: 20 ఓవర్లలో 199/4; వికెట్ల పతనం:** 1-29, 2-69, 3-122, 4-164; **బౌలింగ్:** హర్‌ప్రీత్ బ్రార్ 4-0-33-1, అర్షదీప్ 4-0-33-0, రబాడ 4-0-44-2, కర్రాన్ 2-0-18-0, హర్షల్ 4-0-44-1, సికందర్ 2-0-22-0.

పంజాబ్: ధవన్ (బి) ఉమేశ్ 1, బెయిర్‌స్టో (బి) నూర్ అహ్మద్ 22, ప్రభ్‌సిమ్రన్ (సి) మోహిత్ (బి) నూర్ 35, కర్రాన్ (సి) విలియమ్సన్ (బి) అజ్మతుల్లా 5, సికందర్ రజా (సి) సాహా (బి) మోహిత్ 15, శశాంక్ సింగ్ (నాటౌట్) 61, జితేశ్ శర్మ (సి) నల్కండే (బి) రషీద్ 16, అశుతోష్ శర్మ (సి) రషీద్ (బి) నాల్కండే 31, హర్‌ప్రీత్ (నాటౌట్) 1, ఎక్స్‌ట్రాలు: 13; **మొత్తం: 19.5 ఓవర్లలో 200/7; వికెట్ల పతనం:** 1-13, 2-48, 3-64, 4-70, 5-111, 6-150, 7-193; **బౌలింగ్:** అజ్మతుల్లా 4-0-41-1, ఉమేశ్ 3-0-35-1, రషీద్ 4-0-40-1, నూర్ అహ్మద్ 4-0-32-2, మోహిత్ 4-0-38-1, నల్కండే 0.5-0-6-1.

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లీ (బెంగళూరు)	మోహిత్ శర్మ (గుజరాత్)
203 పరుగులు	7 వికెట్లు

ఐపీఎల్ వీక్షణలో రికార్డు

న్యూఢిల్లీ: తాజా ఐపీఎల్ సీజన్‌ను క్రికెట్ ప్రేమికులు తెగ ఆదరిస్తున్నారు. తొలి పది మ్యాచ్‌లను టీవీల్లో 30 కోట్ల మంది వీక్షించినట్టు అధికారిక బ్రాడ్‌కాస్టర్ డిస్నీ స్టార్ గ్రూప్ వెల్లడించింది. ఇది ఇప్పటిదాకా జరిగిన అన్ని సీజన్లలోనూ అత్యధికం కావడం విశేషం. అలాగే బార్క్ డేటా ప్రకారం ఓవరాల్‌గా వాచ్ టైమ్ 8028 కోట్ల నిమిషాలు. ఇది గతేడాదికన్నా 20% అధికం. ఐపీఎల్ మ్యాచ్‌లను స్టార్ గ్రూప్ పది భాషల్లో అందిస్తోంది. ఆరంభ మ్యాచ్‌ను కూడా 16.8కోట్ల మంది వీక్షించిన విషయం తెలిసిందే.

పంత్‌కు రూ. 24 లక్షల జరిమానా



విశాఖపట్నం: ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు రెండోసారి ఓవర్ రేట్ నిబంధనను అతిక్రమించడంతో జట్టు కెప్టెన్ రిషబ్ పంత్‌కు రూ. 24 లక్షల భారీ జరిమానా విధించారు. కోల్‌కతాతో బుధవారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ బౌలర్లు స్లో ఓవర్ రేట్ తప్పిదానికి పాల్పడ్డారు. దీంతో నిబంధల ప్రకారం రిషబ్‌కు రూ. 24 లక్షలు.. జట్టు సభ్యుల మ్యాచ్‌ల ఫీజులో 25 శాతం కోత విధించినట్టు ఐపీఎల్ గురువారం తెలిపింది. కాగా, ఈ మ్యాచ్‌లో 272 పరుగుల భారీ స్కోరు చేసిన కోల్‌కతా.. 106 రన్స్‌తో ఢిల్లీని ఓడించింది. అయితే, కొండంత స్కోరు కారణంగా క్యాపిటల్స్ ఓటమి ముందుగానే ఖరారైందని టీమిండియా మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ అన్నాడు. కానీ, అర్ధ శతకం చేసిన రిషబ్.. తన వికెట్‌ను పారేసుకోకుండా మరింత సమయం క్రీజులో నిలిచి సెంచరీ చేయాల్సిందని అభిప్రాయపడ్డాడు.

డోపింగ్‌లో భారత్ టాప్

న్యూఢిల్లీ: డోపింగ్‌లో భారత్ మరోసారి అగ్రరాజ్యాలనే అధిగమించింది. అత్యధిక శాతం డోపింగ్ కేసులు పట్టుబడిన జాబితాలో దేశం టాప్‌లో నిలవడం భారత క్రీడారంగానికి ఆందోళన కలిగిస్తోంది. వరల్డ్ డోపింగ్ నిరోధక ఏజెన్సీ (వాడా) తాజాగా విడుదల చేసిన 2022 నివేదిక ప్రకారం జాతీయ డోపింగ్ ఏజెన్సీ (నాడా) పరీక్షించిన 3,865 (మూత్రం, రక్త) నమూనాల్లో 3.2 శాతం.. అంటే 125 శాంపిల్స్‌లో నిషేధిత ఉత్ప్రేరక ఆనవాళ్లు కనుగొన్నట్టు పేర్కొంది. 2.9 శాతంతో దక్షిణాఫ్రికా రెండో స్థానంలో, 1.9 శాతంతో కజకిస్థాన్ మూడో స్థానంలో నిలిచాయి. నార్వే, అమెరికాకు ఆ తర్వాతి స్థానాలు దక్కాయి. ఓవరాల్‌గా శాంపిళ్ల పరీక్షల్లో భారత్ 11వ స్థానంలో నిలిచినా.. కేసుల్లో మాత్రం రష్యా (85), అమెరికా (84), ఇటలీ (73), ఫ్రాన్స్ (72)లను దాటేయడం గమనార్హం. భారత్ కంటే ఎంతో ఎక్కువగా 19,228 శాంపిళ్లను పరీక్షించిన చైనాలో డోపింగ్ శాతం ఎంతో తక్కువగా 0.2గా ఉండడం గమనార్హం.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	3	3	0	0	6	2.518
రాజస్థాన్	3	3	0	0	6	1.249
చెన్నై	3	2	1	0	4	0.976
లఖ్‌నవూ	3	2	1	0	4	0.483
పంజాబ్	4	2	2	0	4	-0.220
గుజరాత్	4	2	2	0	4	-0.580
హైదరాబాద్	3	1	2	0	2	0.204
బెంగళూరు	4	1	3	0	2	-0.876
ఢిల్లీ	4	1	3	0	2	-1.347
ముంబై	3	0	3	0	0	-1.423

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

ఉబెర్ కప్ నుంచి వైదొలగిన సింధు

గాయత్రి, అశ్విని జోడీలు కూడా



న్యూఢిల్లీ: డబుల్ ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు.. ఉబెర్ కప్ జట్టు నుంచి తప్పుకొంది. ఆమెతోపాటు డబుల్స్‌లో గాయత్రి పుల్లెల, అశ్విని పొన్నప్ప జంటలు కూడా టోర్నీకి దూరమయ్యాయి. అయితే, థామస్‌కప్ డిఫెండింగ్ చాంప్ అయిన భారత పురుషుల జట్టు బలమైన బృందంతో బరిలోకి దిగుతోంది. చైనాలోని చెంగ్డూలో ఈనెల 27 నుంచి జరిగే థామస్, ఉబెర్ కప్ కోసం భారత జట్లను గురువారం ప్రకటించారు. గాయం నుంచి కోలుకొని రీఎంట్రీ ఇచ్చిన సింధు ఫామ్ కోసం తంటాలు పడుతోంది. ఈ నేపథ్యంలో కొంత విశ్రాంతితోపాటు రానున్న టోర్నీల్లో మెరుగైన ప్రదర్శనతో పారిస్ టికెట్‌ను ఖరారు చేసుకోవాలనుకొంటోంది. ట్రీసా జాలీ-గాయత్రి, అశ్విని-తనీషా జంటలు కూడా ఇదే ఉద్దేశంతో టోర్నీకి దూరమయ్యాయి.

థామస్ కప్ జట్టు: హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్, శ్రీకాంత్, ప్రియాన్షు రజావత్, కిరణ్ జార్జ్; డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్, అర్జున్-ధ్రువ్, సాయి ప్రతీక్ (బ్యాకప్).

ఉబెర్ కప్: అన్‌మోల్, తన్వీ శర్మ, అస్మిత, ఇష్రానీ; డబుల్స్‌లో శృతి మిశ్రా, ప్రియ కొంజెంగబమ్, సిమ్రన్ సింగ్, రితిక థాకర్.

ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత్ మరింత కిందకు

న్యూఢిల్లీ : ప్రపంచ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) తాజా ర్యాంకింగ్స్‌లో భారత పురుషుల జట్టు నాలుగు స్థానాలు దిగజారింది. దీంతో 121వ ర్యాంక్‌లో నిలిచిన భారత జట్టు.. ఇటీవలి సంవత్సరాల్లో చెత్త స్థానాన్ని చేరినట్టయ్యింది. 2026 ఫిఫా వరల్డ్ కప్ రెండో రౌండ్ క్వాలిఫయర్స్‌లో అఫ్ఘానిస్థాన్ చేతిలో 1-2 ఓటమితో ఓడడం భారత జట్టు ర్యాంకింగ్‌పై బాగా ప్రభావం చూపింది. గతంలో 173వ ర్యాంకుల్లో ఉన్న మనోళ్లు.. మార్చి ర్యాంకుల్లో 117వ స్థానం దక్కించుకున్నారు.

బిజినెస్



బ్లూ స్టార్ నుంచి సరికొత్త శ్రేణి డీప్ ఫ్రీజర్లు

హైదరాబాద్: బ్లూ స్టార్ లిమిటెడ్ మార్కెట్లోకి సరికొత్త శ్రేణి డీప్ ఫ్రీజర్లను విడుదల చేసింది. వివిధ రంగాల వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా 60 నుంచి 600 లీటర్ల సామర్థ్యంతో ఈ డీప్ ఫ్రీజర్లను తీసుకువచ్చినట్లు గురువారం నాడిక్కడ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ బీ త్యాగరాజన్ వెల్లడించారు. డెయిరీ, ఐస్‌క్రీమ్, ఫ్రోజెన్ ఫుడ్, రెస్టారెంట్స్, సూపర్ మార్కెట్స్ సహా ఇతర విభాగాల్లోని కస్టమర్ల అవసరాలను ఈ డీప్ ఫ్రీజర్లు తీరుస్తాయని తెలిపారు. ఈ డీప్ ఫ్రీజర్ల ధర రూ.16,000 నుంచి ప్రారంభమవుతాయన్నారు. మహారాష్ట్రలోని వాడాలో రూ.480 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో ఈ డీప్ ఫ్రీజర్లను ఉత్పత్తి చేస్తున్నట్లు కంపెనీ వైస్ ప్రెసిడెంట్ (కమర్షియల్ రిఫ్రిజిరేషన్ బిజినెస్) ఎం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

రూ.350 కోట్లతో శ్రీసిటీ ప్లాంట్ విస్తరణ

కాగా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీ ప్లాంట్‌ను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.350 కోట్లతో విస్తరించనున్నట్లు ఎండీ త్యాగరాజన్ వెల్లడించారు. శ్రీసిటీ ప్లాంట్‌లో కంపెనీ రూమ్ ఏసీలను తయారు చేస్తోంది. ప్రస్తుతం ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 3 లక్షల యూనిట్లుగా ఉండగా తాజాగా చేపట్టనున్న విస్తరణతో మొత్తం ఉత్పత్తి సామర్థ్యం 6 లక్షల యూనిట్లకు చేరుతుందని తెలిపారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	70,470 ▲	64,600 ▲	85,300 ▲
ముంబై	69,902 ▲	64,030 ▲	79,337 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

5వ తేదీ

హైదరాబాద్	375	విజయవాడ	403
చిత్తూరు	458	విశాఖపట్నం	415
గోదావరి	403	వరంగల్	377
		దజను గుడ్లు రూ.60	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	139	గోదావరి	138
వరంగల్	139	విజయవాడ	138
కరీంనగర్	139	గుంటూరు	139
మహబూబ్‌నగర్	139	ఒంగోలు	139
కర్నూలు	139	చిత్తూరు	140
విశాఖపట్నం	124		

క్వాలిటీ కేర్ గ్రూప్ చైర్మన్‌గా డాక్టర్ హరిప్రసాద్



హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి): భారత్, బంగ్లాదేశ్‌ల్లో కేర్ హాస్పిటల్స్, కిమ్స్ హెల్త్, ఎవర్‌కేర్ పేరుతో వైద్య సేవలు అందిస్తున్న క్వాలిటీ కేర్ గ్రూప్ చైర్మన్, నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా డాక్టర్ హరిప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్‌గా వరుణ్ ఖన్నా నియమితులయ్యారు. వైద్య సేవల రంగంలో 30 ఏళ్లకు పైగా అపార అనుభవం ఉన్న హరి ప్రసాద్ నేతృత్వంలో గ్రూప్ మరింత బలోపేతం కానుందని క్వాలిటీ కేర్ వెల్లడించింది. హరి ప్రసాద్ ఇటీవలి వరకు అపోలో గ్రూప్ హాస్పిటల్స్ ప్రెసిడెంట్‌గా వ్యవహరించారు. ఈయన హయాంలోనే అపోలో గ్రూప్ హాస్పిటల్స్ పడకల సంఖ్య 1,200 నుంచి 10,000 స్థాయికి చేరుకుంది. అంతేకాకుండా హైదరాబాద్‌లో అపోలో హెల్త్ సిటీ ఏర్పాటు లోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. ఆసియాలో మొదటి అపరేషనల్ హెల్త్ సిటీ ఇదే. అలాగే సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్, ఇండియాకు కూడా హరిప్రసాద్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా పని చేశారు. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఎమర్జెన్సీ మెడిసిన్, బ్రిటన్‌కు చెందిన రాయల్ కాలేజ్ ఆఫ్ ఎమర్జెన్సీ మెడిసిన్ హరిప్రసాద్‌ను ఫెలోషిప్‌తో సత్కరించాయి. వీటికి తోడు ఆస్ట్రేలియాకు చెందిన మక్వేరీ యూనివర్సిటీ తన గ్లోబల్ ఎండీ ప్రోగ్రామ్‌కు హరి ప్రసాద్‌ను క్యాంపస్ డీన్‌గా నియమించింది.

ఈ సందర్భంగా హరి ప్రసాద్ మాట్లాడుతూ.. భారత్ సహా దక్షిణాసియాలోని వెనుకబడిన నగరాల్లో నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించే గ్రూప్ బాధ్యతలను తాను స్వీకరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. మెరుగైన క్లినికల్ ఫలితాలతో క్వాలిటీ కేర్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లడానికి, నాణ్యతను పెంపొందించడానికి క్లినికల్, మేనేజ్‌మెంట్ టీమ్‌తో కలిసి పని చేయడానికి సంతోషిస్తున్నట్లు హరి ప్రసాద్ చెప్పారు. కాగా ఎండీగా నియమితులైన వరుణ్ ఖన్నాకు హెల్త్‌కేర్ రంగంలో 14 ఏళ్లకు పైగా అనుభవం ఉంది.

ఏలియన్స్ డెవలపర్స్ ప్రాజెక్టుల్లో రూ.145 కోట్ల పెట్టుబడులు

నిసస్ ఫైనాన్స్

న్యూఢిల్లీ: హైదరాబాద్ రియల్టీ రంగం ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలనూ ఆకర్షిస్తోంది. హైదరాబాద్‌లో ఏలియన్స్ డెవలపర్స్ అభివృద్ధి చేస్తున్న రెండు రియల్టీ ప్రాజెక్టుల్లో నిసస్ ఫైనాన్స్ రూ.145 కోట్లు పెట్టుబడి పెట్టింది. ఇందులో ఒకటి 272 ఎకరాల్లో అభివృద్ధి చేసే ఏలియన్స్ హబ్ ప్రాజెక్టు. మరొకటి 15 ఎకరాల్లో అభివృద్ధి చేసే ఏలియన్స్ స్పేస్ స్టేషన్ ప్రాజెక్టు అని నిసెస్ ఫైనాన్స్ తెలిపింది. తమ కంపెనీకి చెందిన రియల్ ఎస్టేట్ స్పెషల్ ఆపర్చునిటీస్ ఫండ్-1 (రెసో-1) ద్వారా ఈ పెట్టుబడి పెట్టినట్టు నిసస్ పేర్కొంది.

రికార్డు గరిష్ఠాలకు సూచీలు

ఇంట్రాడేలో 74,500 ఎగువకు సెన్సెక్స్



ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు గురువారం ట్రేడింగ్‌లో సరికొత్త రికార్డు గరిష్ఠాలకు చేరాయి. ఆరంభంలో లాభ, నష్టాల మధ్య తీవ్ర ఊగిసలాటలకు లోనైనప్పటికీ, మధ్యాహ్నం నుంచి ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఆర్థిక సేవల రంగ షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో సూచీలు ఇంట్రాడే కనిష్ఠ స్థాయిల నుంచి భారీగా పుంజుకున్నాయి. సెన్సెక్స్ 350.81 పాయింట్ల లాభంతో 74,227.63 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు స్థాయిని నమోదు చేసింది. కాగా, 74,501.73 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డు నమోదైంది. నిఫ్టీ విషయానికొస్తే, 80 పాయింట్ల పెరుగుదలతో 22,514.65 వద్ద స్థిరపడింది. సూచీకిది కొత్త రికార్డు ముగింపు స్థాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 17 లాభపడ్డాయి.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు 3.06 శాతం లాభంతో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. టైటాన్, టెక్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, టీసీఎస్, మారుతి సుజుకీ షేర్లు 1.89 శాతం వరకు పెరిగాయి. ఎస్‌బీఐ, ఎయిర్‌టెల్ షేర్లు మాత్రం ఒకటిన్నర శాతానికి పైగా నష్టపోయాయి. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 0.59 శాతం పెరగగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.11 శాతం నష్టపోయింది. రంగాల వారీ సూచీలో ఐటీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్, యుటిలిటీస్, ఆర్థిక సేవలు, బ్యాంకింగ్, టెక్, ఆటో 0.93 శాతం వరకు పెరిగాయి.

- డీమార్ట్ సూపర్ మార్కెట్ల నిర్వహణ సంస్థ అవెన్యూ సూపర్‌మార్ట్ షేరు 4.20 శాతం పెరిగి రూ.4,647.15 వద్దకు చేరుకుంది. ఇంట్రాడేలో దాదాపు 6 శాతం వరకు లాభపడి రూ.4,715 వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసింది. మార్చితో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 20 శాతం వృద్ధి చెందడం ఇందుకు దోహదపడింది.
- కేఈసీ ఇంటర్నేషనల్ షేరు దాదాపు 6 శాతం పెరిగి రూ.769.60 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో నైతే 13.51 శాతం వరకు పెరిగింది. కంపెనీ రూ.816 కోట్ల విలువైన ఆర్డర్లు లభించిన నేపథ్యంలో షేర్లు ర్యాలీ తీశాయి.
- డాలర్‌తో రూపాయి మారకం విలువ 14 పైసలు పెరిగి రూ.83.39 వద్ద ముగిసింది. డాలర్ బలహీనపడటంతో పాటు మన ఈక్విటీ మార్కెట్ లాభాల్లో పయనించడం, సానుకూల స్థూల ఆర్థికాంశాలు రూపాయికి అండగా నిలిచాయి.
- సరఫరా కొరత ఆందోళనలతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మళ్లీ ఎగబాకుతున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ ఫ్యూచర్స్ (జూన్‌లో డెలివరీ) కాంట్రాక్టు రేటు ఒక దశలో 89.35 డాలర్లకు ఎగబాకింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు బ్రెంట్ క్రూడ్ రేటు 16 శాతం పెరిగింది.

పసిడి సరికొత్త రికార్డు

- 70 వేలు దాటిన తులం బంగారం
- 85,000 ఎగువకు కిలో వెండి

హైదరాబాద్: విలువైన లోహాల ధరలు సరికొత్త జీవితకాల గరిష్ఠ స్థాయికి పెరిగాయి. హైదరాబాద్‌లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర గురువారం మరో రూ.600 పెరిగి రూ.70,470కి చేరుకుంది. 22 క్యారెట్ల స్వచ్ఛత లోహం కూడా రూ.500 పెరుగుదలతో రూ.64,600 పలికింది. కిలో వెండి సైతం రూ.1,300 ఎగబాకి రూ.85,300గా నమోదైంది. అంతర్జాతీయంగా బంగారం, వెండి ధరలు వేగంగా పెరుగుతుండటమే ఇందుకు ప్రధాన కారణం. ఇంటర్నేషనల్ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ తొలిసారిగా 2,300 డాలర్లు దాటింది. సిల్వర్ సైతం 27 డాలర్ల పైన ట్రేడవుతున్నది. అమెరికన్ సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చన్న అంచనాలు ఊపందుకోవడం ఇందుకు కారణమైంది. ఫెడరల్ రిజర్వ్ జూన్ సమీక్ష నుంచే రేట్ల కోతను ప్రారంభించవచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. సాధారణంగా ఫెడ్ రేట్లు పెరుగుతున్న సమయంలో అమెరికన్ డాలర్, బాండ్ల రేట్లు పెరుగుతూ పోతే.. బంగారం తగ్గుతూ వస్తుంది. ఫెడ్ రేట్లు తగ్గింపు సమయంలో డాలర్, బాండ్లు బలహీనపడటంతో పాటు బంగారం ధర పుంజుకుంటుంది.

కరెన్సీ డెరివేటివ్స్ నిబంధనల అమలు మే 3కు వాయిదా

ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ కరెన్సీ డెరివేటివ్స్ (ఈటీసీడీ) నిబంధనల అమలును మే 3కు వాయిదా వేస్తున్నట్లు ఆర్‌బీఐ గురువారం ప్రకటించింది. మార్కెట్ వర్గాల నుంచి అందుకున్న సూచనలు, అభిప్రాయాలతో పాటు ఈ మధ్య చోటుచేసుకున్న పరిణామాల ఆధారంగా ఈ నిబంధనల అమలును ఆర్‌బీఐ నెల రోజుల పాటు వాయిదా వేసింది. మార్కెట్లో స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌ను అరికట్టేందుకు ఆర్‌బీఐ కరెన్సీ డెరివేటివ్స్ నిబంధనలను కఠినతరం చేస్తూ జనవరి 5న సర్క్యులర్ జారీ చేసింది. దాని ప్రకారం కొత్త నిబంధనలు ఈ నెల 5 నుంచి అమల్లోకి రావాల్సి ఉంది.

ఇళ్ల అమ్మకాలు అదుర్స్

- మార్చి త్రైమాసికంలో 9 శాతం అప్
- రూ.కోటి పైన ఉండే ఇళ్లకు డిమాండ్
- 43 శాతం పెరిగిన ఆఫీస్ స్పేస్ లీజింగ్
- నైట్ ఫ్రాంక్ ఇండియా



న్యూఢిల్లీ: రియల్ ఎస్టేట్ జోరు కొనసాగుతోంది. ఈ ఏడాది జనవరి-మార్చి మధ్య కాలంలో హైదరాబాద్‌తో సహా దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో 86,345 ఇళ్లు అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది తొమ్మిది శాతం ఎక్కువని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా తన తాజా నివేదికలో తెలిపింది. ఇదే సమయంలో 162 లక్షల ఎస్ఎఫ్‌టీ ఆఫీస్ స్పేస్ లీజు ఒప్పందాలు నమోదయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 43 శాతం ఎక్కువ. 'నివాస గృహాల అమ్మకాలు, ఆఫీసు లీజుల జోరుతో ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో రియల్ ఎస్టేట్ రంగం అద్భుత పనితీరు కనబరిచింది' అని నైట్ ఫ్రాంక్ ఇండియా సీఎండీ శిశిర్ బైజాల్ తెలిపారు. రూ.కోటి పైన ఉండే ఇళ్లకూ మంచి డిమాండ్ ఉందని బైజాల్ చెప్పారు.

హైదరాబాద్‌లో మరింత పైకి

మార్చిత్రైమాసికం హైదరాబాద్ రియల్టీ మార్కెట్‌కీ బాగా కలిసొచ్చింది. గత మూడు నెలల్లో హైదరాబాద్‌లో 9,550 నివాస గృహాలు అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 15 శాతం ఎక్కువ. కాగా ఈ కాలంలో కొత్త ఇళ్ల ధరలు గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే 13 శాతం పెరిగాయని పేర్కొంది. ఇదే సమయంలో హైదరాబాద్‌లో 30 లక్షల ఆఫీస్ స్పేస్ లీజు ఒప్పందాలు నమోదయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది మూడింతలు ఎక్కువని నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది. దేశంలో మరే నగరంలోనూ ఆఫీసు స్పేస్ లీజులు హైదరాబాద్‌లో పెరిగినంతగా పెరగలేదని కూడా తెలిపింది. హైదరాబాద్‌లో కార్యాలయ స్థలాలను లీజుకు తీసుకోవటంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీ) కీలకంగా ఉన్నాయని నైట్ ఫ్రాంక్ పేర్కొంది.

సేవల రంగం 14 సంవత్సరాల గరిష్ఠం

న్యూఢిల్లీ: వ్యాపార కార్యకలాపాలు జోరందుకోవడంతో పాటు సేవలకు డిమాండ్ భారీగా పెరగడంతో సేవల రంగం మార్చి నెలలో 13 సంవత్సరాల ఆరు నెలల గరిష్ఠానికి దూసుకుపోయింది. మార్చిలో హెచ్ఎస్‌బీసీ సేవల రంగ వ్యాపార కార్యకలాపాల సూచీ 61.2 పాయింట్లుగా నమోదైంది. ఫిబ్రవరిలో ఇది 60.6 పాయింట్లుంది. 14 సంవత్సరాల కాలంలో అంటే 2010 జూన్ తర్వాత నమోదైన గరిష్ఠ వృద్ధి ఇదేనని నెలవారీ సర్వే నివేదికలో పేర్కొన్నారు. మార్చిలో కొత్త ఆర్డర్లు గణనీయంగా పెరిగాయని సర్వేలో పాల్గొన్న కంపెనీలు తెలిపాయి.

జీఈ ఏరోస్పేస్ రూ.240 కోట్ల పెట్టుబడి

పుణె: పుణెలోని తమ తయారీ కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేయడానికి రూ.240 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్టు జీఈ ఏరోస్పేస్ ప్రకటించింది. కొత్త యంత్రసామగ్రి, పరికరాలు, స్పెషలైజ్డ్ పరికరాల కొనుగోలుపై ఈ నిధులు వ్యయం చేయనున్నట్టు తెలిపింది. 2015 సంవత్సరంలో ప్రారంభమైన ఈ కేంద్రంలో వాణిజ్య జెట్ ఇంజన్లకు అవసరం అయిన విడిభాగాలు తయారుచేస్తారు. ఈ ప్లాంట్‌లో తయారుచేసిన విడిభాగాలను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న జీఈ ప్లాంట్లకు సరఫరా చేయనున్నట్టు తెలిపింది.

కార్మిక పక్షపాతి బాబూ జగ్జీవన్‌రామ్: సీఎం

హైదరాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): తొలి కార్మిక శాఖ మంత్రిగా కార్మికుల సంక్షేమానికి పాటుపడి, కార్మిక పక్షపాతిగా గుర్తింపు పొందిన మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఏప్రిల్ 5న బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని పురస్కరించుకొని ఆయన సేవలను సీఎం కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా దేశానికి బాబూజీ అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. నెహ్రూ మంత్రివర్గంలో కార్మిక మంత్రిగా సేవలందించిన ఆయన.. రెండు పర్యాయాలు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా హరితవిప్లవం విజయవంతంలోనూ, రైల్వే, జాతీయ రవాణా శాఖ మంత్రిగానూ కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. బాబూజీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగిస్తున్నామన్నారు.

మీకు నేనున్నా.. భయపడకండి..

- పిల్లలూ మీరు ఎంత చదివితే.. అంత వరకూ చదివిస్తా
- ఓ కుటుంబానికి మంత్రి కోమటిరెడ్డి హామీ



హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): "మీకు నేనున్నా.. భయపడకండి.. పిల్లలూ మీరు ఎంత చదివితే అంతవరకు చదివిస్తా" అంటూ ఓ కుటుంబానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అభయమిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం ముషిపట్ల గ్రామానికి చెందిన ఓ మహిళ.. మంత్రి కోమటిరెడ్డిని కలిసేందుకు తన ముగ్గురు పిల్లలను తీసుకొని హైదరాబాద్‌లోని మంత్రి నివాసానికి వచ్చింది. లోపలికి వెళ్లేందుకు భయపడి పిల్లలతో మంత్రి ఇంటి బయటే కూర్చుంది. అదే సమయంలో కారులో బయటకు వెళ్తున్న మంత్రి కోమటిరెడ్డి వారిని గమనించి "మీరెవరు.. ఎందుకొచ్చారు.." అంటూ మహిళను ఆరా తీశారు. తన భర్త బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించాడని, ఆస్తులన్నీ అమ్మి వైద్యం చేయించినా తన భర్త దక్కలేదని మంత్రికి చెప్తూ ఆ మహిళ కన్నీరుమున్నీరయింది. పిల్లలను పోషించేందుకు కూడా పైసలు లేవని, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం ఇప్పించాలని వేడుకుంది. దాంతో మహిళను, పిల్లలను మంత్రి స్వయంగా తన ఇంట్లోకి తీసుకెళ్లి, పిల్లలకు చాక్లెట్లు ఇచ్చారు. అనంతరం వారితో మాట్లాడారు. అప్పుడు పిల్లలు తమకు చదువుకోవాలని ఉందని చెప్పగా.. "మీరు ఎంతవరకు చదువుకుంటే అంతవరకు చదివిస్తా.. మీ బాధ్యత నాది" అంటూ హామీ ఇచ్చారు. అంతే కాకుండా వారి కుటుంబానికి అప్పటికప్పుడే రూ.1 లక్ష ఆర్థిక సాయం అందించారు. సీఎంవోలో సీఎంఆర్ఎఫ్ విభాగం వ్యవహారాలు చూసే అధికారికి ఫోన్ చేసి సదరు మహిళ భర్త వైద్యానికి అయిన ఖర్చు మొత్తం అందించేలా చూడాలని కోమటిరెడ్డి సూచించారు.

పట్టణ స్థానిక సంస్థలకు రూ.250 కోట్లు

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ స్థానిక సంస్థల పరిధిలో ఉండే జలవనరుల సంరక్షణ, పునరుజ్జీవం కోసం కేంద్రం నుంచి రూ.250 కోట్ల నిధులు విడుదలయ్యాయి. సీఎం రేవంత్ రెడ్డి, పురపాలక శాఖ సంచాలకులు దివ్య దేవరాజన్ చొరవతో ఈ నిధులు మంజూరయ్యాయి. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి వ్యవహారాల శాఖ నేతృత్వంలో మునిసిపాలిటీలకు ప్రత్యేక సాయం కింద ఈ నిధులు విడుదల చేసింది. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ నుంచి విడుదలైన రూ.250 కోట్లలో రూ.125 కోట్లు హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డుకు కేటాయించగా.. బోర్డు పరిధిలోని జల వనరుల సంరక్షణతోపాటు కీలక ప్రాజెక్టులకు మరమ్మతులు, ఇతర పనులకు ఈ నిధులు ఖర్చు చేయనున్నారు. జీహెచ్ఎంసీకి రూ.75 కోట్లు, మిగిలిన నిధులను ఈఎన్‌సీకి కేటాయించారు.

మునిసిపాలిటీల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటోంది. పట్టణ స్థానిక సంస్థల పరిధిలో వచ్చే రెండు నెలల్లో తాగునీటికి కొరత లేకుండా చూసేందుకు 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన 142 మునిసిపాలిటీలకు పురపాలక శాఖ సంచాలకులు దివ్య దేవరాజన్ గురువారం నిధులు కేటాయించారు. ఈమేరకు పట్టణ ప్రాంతాల్లో నివాసముంటున్న 77,43,146 మందికి రూ.30 కోట్లు కేటాయించారు.

15.60 లక్షల బాలింతల కిట్ల పంపిణీ

- కిట్ల సేకరణను నిలిపివేయలేదు: వైద్య శాఖ
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

రాష్ట్రంలో పథకాన్ని ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 15.60 లక్షల 'మదర్ అండ్ చైల్డ్ హెల్త్ (ఎంసీహెచ్)' కిట్లను బాలింతలకు పంపిణీ చేశామని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు. ఈ కిట్ల సేకరణను నిలిపివేయలేదని వారు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, తెలంగాణ రాష్ట్ర వైద్య సేవల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్ఎంఎస్ఐడీసీ) మేనేజింగ్ డైరెక్టర్ వేర్వేరు ప్రకటనల్లో వివరించారు. 'బాలింతల కిట్లకు బ్రేక్' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి వారు వివరణ ఇచ్చారు. ఈ కిట్ల పథకంలో భాగమైన 'ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ)' కింద 13.91 లక్షల మంది లబ్ధి పొందారని తెలిపారు. 90 శాతం మేర పథకాన్ని కవర్ చేశామని, సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో మరో 10 శాతం దరఖాస్తులను తిరస్కరించామని వివరించారు. ఒక్కో న్యూట్రిషన్ కిట్‌ను టీఎస్ఎంఎస్ఐడీసీ రూ.2000కు కొనుగోలు చేసినట్లు కథనంలో పేర్కొన్నారని, ఇది అవాస్తవమని పూర్తి పారదర్శకతతో టెండర్లను నిర్వహించామని చెప్పారు. కిట్-1కు రూ.1889.56, కిట్-2కు రూ.1,632.60 రేట్లను నిర్ధారించామని వారు తెలిపారు.

భద్రాచలంలో సీఎం సెక్టార్ వీవీఐపీ టికెట్ ధర రూ.10 వేలు

భద్రాచలం, ఏప్రిల్ 4: శ్రీరామనవమిని పురస్కరించుకుని భద్రాచలంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 17న నిర్వహించనున్న శ్రీ సీతారాముల కల్యాణంలో సీఎం సెక్టార్‌లో ప్రవేశానికి వీవీఐపీ, వీఐపీ టిక్కెట్ ధరలను దేవస్థానం అధికారులు నిర్ణయించారు. సీఎం సెక్టార్‌లో వీవీఐపీ టికెట్ ధరను రూ.10 వేలుగా, వీఐపీ టికెట్ ధరను రూ.5 వేలుగా నిర్ణయించారు. 18న శ్రీరామ మహా పట్టాభిషేక మహోత్సవంలో వీవీఐపీ టికెట్ ధరను రూ.5 వేలుగా, వీఐపీ టికెట్ ధరను రూ.2,500గా నిర్ణయించారు.

'చూస్తుంటే చెంప పగలగొట్టాలని ఉంది'

- మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుపై డీసీసీ మహిళా అధ్యక్షురాలి ఆక్రోశం

పటాన్‌చెరు, ఏప్రిల్ 4: పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లోని అసంతృప్తులు బయటపడ్డాయి. కాంగ్రెస్ తరఫున మెదక్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నీలం మధును చూస్తుంటే చెంప పగలగొట్టాలని ఉందని డీసీసీ మహిళా అధ్యక్షురాలు, పటాన్‌చెరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ సతీమణి కాట సుధారాణి అన్నారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, మంత్రి కొండా సురేఖ సమక్షంలో నీలం మధు ఎదుటే ఆమె ఇలా ఆక్రోశం వెళ్లగక్కారు. నిజానికి, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ దక్కకపోవడంతో పార్టీకి రాజీనామా చేసిన నీలం మధు బీఎస్పీ తరఫున పటాన్‌చెరు బరిలోకి దిగారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కాట శ్రీనివాస్‌గౌడ్ స్వల్ప తేడాతో బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్ రెడ్డి చేతిలో ఓడిపోయారు. అయితే, 40 వేల ఓట్లు సాధించిన నీలం పరోక్షంగా కాంగ్రెస్ ఓటమికి కారణమయ్యారని కాట వర్గీయులు అప్పట్నించి రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో నీలం మధు ఎంపీ టికెట్ పొందగా.. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో బుధవారం ఇరువురు నాయకుల మధ్య సయోధ్య కుదిరింది. అయితే, స్థానిక నేతలతో సయోధ్య కుదిర్చేందుకు నీలం మధును వెంటబెట్టుకుని మంత్రి కొండా సురేఖ బుధవారం కాటా నివాసానికి వెళ్లారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ, నీలం మధు విజయానికి సహకరించాలని మంత్రి సురేఖ కాటా దంపతులను కోరారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు కాట సుధారాణి మంత్రి ఎదుటే నీలం మధుపై ఆక్రోశం వెళ్లగక్కి కన్నీళ్లు పెట్టుకున్నారు. గెలవాల్సిన సీటును మధు వల్ల ఓడిపోయామని, అతని చెంప పగలకొట్టాలని ఉండేదని పేర్కొన్నారు. అయినా, సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కోసం లోక్‌సభ ఎన్నికల్లో నీలం మధు గెలుపునకు కృషి చేస్తామని మంత్రికి హామీ ఇచ్చారు. ఇదంతా నీలం మధు ముందే జరగడం గమనార్హం.

బీఆర్ఎస్ కార్యాలయంలో వాస్తు మార్పులు

(మొదటిపేజీ తరువాయి)

సాగనున్నాయి. తెలంగాణ భవన్ ఉత్తరాభిముఖంగా ఉంది. కార్యాలయంలోకి వాహనాలు, నేతలు, కార్యకర్తలు, సామాన్య ప్రజలు లోపలికి ప్రవేశించేందుకు గాను ప్రధానమైన గేటును పడమర వాయవ్య దిశగా ఏర్పాటు చేశారు. ఇప్పటిదాకా రాకపోకలన్నీ ఈ గేటు ద్వారానే సాగాయి. అయితే ఇది వాస్తుపరంగా సరికాదనే భావనతో తూర్పు ఈశాన్యం వైపు ఉన్న గేటును పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తున్నారు. ఈ గేటును గతంలోనే లాంఛనంగా ఏర్పాటు చేసినా ఉపయోగించేవారు కాదు. ప్రస్తుతం వాస్తు మార్పు దృష్ట్యా ఈ గేటులోంచి రాకపోకలకు అనువుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాలు లోపలికి వచ్చేందుకు వీలుగా ఆ గేటు వద్ద ర్యాంపు నిర్మాణం జరుగుతోంది. అలాగే తూర్పు వైపు పార్కింగ్ అనువుగా ఉంటుందనే ఉద్దేశంతో అక్కడే వాహనాలు నిలిపే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే తూర్పు ఈశాన్యం గేటు వద్ద వీధి పోటును దృష్టిలో ఉంచుకొని లక్ష్మీ నరసింహ స్వామి చిత్రంతో కూడిన ఫ్లెక్సీని కూడా గేటుకు ఏర్పాటు చేశారు. వీటితోపాటు ప్రాంగణం లోపల కూడా అవసరమైన మేరకు స్వల్ప మార్పులు చేర్పులు చేస్తున్నారు. అయితే ఈశాన్యం వైపు గేటును పూర్తిస్థాయిలో సిద్ధం చేయడానికి ట్రాఫిక్ సమస్య కూడా ఓ కారణం అని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఉన్న వాయవ్యం గేటు బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12 ప్రధాన రహదారి వైపు ఉంది. ఈ మార్గంలో వాహనాల రాకపోకలు పెరిగాయని, పార్టీ కార్యాలయం వద్దకు అధికసంఖ్యలో వాహనాలు వచ్చే సందర్భాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు చెబుతున్నారు. వాయవ్య గేటు ముందు కొద్ది సేపు కూడా వాహనాలను నిలిపే పరిస్థితి లేదని, దీంతో ఈశాన్యం గేటును రాకపోకలకు ఉపయోగించడం ద్వారా ట్రాఫిక్ సమస్యను అధిగమించే అవకాశం ఉందని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. ఈశాన్యం వైపు గేటును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు ట్రాఫిక్ చలానాల సమస్య కూడా కారణం అని ఆ పార్టీ నేతలు అంటున్నారు. బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి నుంచి తెలంగాణ భవన్ వరకు రోడ్డుకు ఒక పక్క వాహనాలు నిలపడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడేది. ఇటీవల కాలంలో రోడ్డు పక్కన ఏ వాహనాన్ని నిలిపినా.. ట్రాఫిక్ పోలీసులు భారీగా చలానాలు వేస్తున్నారని, ఇదే విషయాన్ని పార్టీ పెద్దల దృష్టికి తీసుకువెళ్లినట్లు పలువురు బీఆర్ఎస్ నేతలు చెప్పారు. ఫలితంగా తెలంగాణభవన్ ఎదురుగా తూర్పువైపు ఉన్న ఖాళీ ప్రదేశంలో వాహనాలు నిలిపేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసినట్లు వారు చెబుతున్నారు.

ధూం ధాం..!

(మొదటిపేజీ తరువాయి)

జన సమీకరణను చేయాలని పావులు కదుపుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, పార్టీ సీనియర్ నేతలు సభ ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉంటున్న కాంగ్రెస్ దేశంలోని పలు విపక్ష పార్టీలను కలుపుకొని ఇండియా కూటమిని ఏర్పాటు చేయడంతోపాటు దానికి నాయకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. మోదీ పదేళ్ల పాలనకు తెరదించి దేశంలో ప్రజాస్వామ్య వాతావరణాన్ని పునరుద్ధరించాలని భావిస్తోంది. ఇందుకు తుక్కుగూడ సభనే వేదికగా మార్చాలని భావిస్తోంది. తాము అధికారంలోకి వస్తే ఏం చేయబోతున్నామో తెలియజేసే మ్యానిఫెస్టోను ఈ వేదిక నుంచి విడుదల చేయనుంది. దీంతో ఈనెల 6న నిర్వహించే తుక్కుగూడ సభపై తెలంగాణ ప్రజలతోపాటు దేశంలోని ఇతర ప్రాంతాలు, రాజకీయ పార్టీల్లోనూ ఆసక్తి నెలకొంది. అలాగే, తెలంగాణపై కాంగ్రెస్ పార్టీ భారీ ఆశలు పెట్టుకున్న విషయం తెలిసిందే. ఇక్కడ 14 లోక్‌సభ సీట్లను గెలుచుకోవాలని వ్యూహాలు రచిస్తోంది. మూడు నెలల కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయ బావుటా ఎగుర వేసినట్లే.. లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆ జైత్రయాత్రను కొనసాగించాలని భావిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం కొనసాగిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, ప్రజాస్వామ్యయుతమైన పాలనతో రాష్ట్రంలో కాంగ్రెస్‌కు సానుకూలత ఏర్పడిందని పార్టీ పెద్దలు అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు, 30 వేల ఉద్యోగ నియామకాలు, 65 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు బంధు జమతోపాటు ఇతర అనేక కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువైనట్లు అంచనా వేస్తున్నారు. దీనిని తమకు అనుకూలంగా మలచుకునేందుకు తుక్కుగూడ సభను వేదిక చేసుకోవాలని భావిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తున్న పథకాలతోపాటు దేశవ్యాప్తంగా అమలు చేయాలని భావిస్తున్న పాంచ్ న్యాయ్‌ను తుక్కుగూడ వేదిక నుంచి దేశ ప్రజలకు ఆ పార్టీ అగ్ర నాయకత్వం తెలియజేయనుంది.



తుక్కుగూడలో జనజాతర సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్, కాంగ్రెస్ నేతలు

ఇదే కాంగ్రెస్ తొలి భారీ బహిరంగ సభ

ఇండియా కూటమికి నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికలకు ముందు సొంతంగా ఏర్పాటు చేస్తున్న భారీ బహిరంగ సభ తుక్కుగూడ జన జాతర సభనే కావడం విశేషం. రాహుల్ గాంధీ న్యాయ్ యాత్ర ముగింపు సభను ముంబైలో నిర్వహించారు. దానికి కాంగ్రెస్‌తోపాటు ఇండియా కూటమిలోని ఇతర పార్టీల నేతలు హాజరయ్యారు. అనంతరం, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టు నేపథ్యంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే పేరిట ఇండియా కూటమి మార్చి 31న ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించింది. ఈ రెండూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో జరిగిన సభలే. వీటి తర్వాత దేశవ్యాప్తంగా ఇండియా కూటమిపై ప్రజల విశ్వాసం మరింత పెరిగిందని కాంగ్రెస్ నేతలు అంచనా వేస్తున్నారు. ఆ విశ్వాసాన్ని రెట్టింపు చేసేలా జన జాతర సభను నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. దాంతో, ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సభను విజయవంతం చేయడంపై పీసీసీ అధ్యక్షునిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే రెండుసార్లు ఆయన సభ ప్రాంగణాన్ని పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయన ఆదేశాలతో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, పార్టీ నాయకులంతా సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పది లక్షలకు తగ్గకుండా ప్రజలు హాజరయ్యే అవకాశం ఉందని, దాంతో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూసేందుకు ప్రతి అంశంపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని నిర్ణయించారు. మూడు నెలల కిందట ప్రజల మనసులు గెలుచుకున్న తమ ప్రభుత్వం.. ఈ కొద్ది కాలంలోనే వారి మన్ననలు మరింతగా పొందిందనే విషయాన్ని నిరూపించుకునేందుకు, తమ బలం, బలగం చాటుకునేందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారు. జన జాతర వేదికగా తమ బలం చాటి చెప్పి దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీలో సమరోత్సాహం నింపేందుకు కృషి చేయాలని నిర్ణయించారు.



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న భట్టి విక్రమార్క

కదం తొక్కుదాం.. తడాఖా చాటుదాం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- తుక్కుగూడ 'జనజాతర' ఏర్పాట్ల పరిశీలన

ఇబ్రహీంపట్నం/మహేశ్వరం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): "రాష్ట్రం నలుమూలల నుంచి తుక్కుగూడ జనజాతర సభకు కదం తొక్కుదాం. కాంగ్రెస్ తడాఖాను దేశానికి చాటుదాం" అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం తుక్కుగూడలో జరగనున్న తెలంగాణ కాంగ్రెస్ జనజాతర సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై మండిపడ్డారు. "బీఆర్ఎస్ నాయకులు ప్రతిపక్షంలో ఉండడానికి కూడా పనికిరారు. రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసి.. నిస్సిగ్గుగా అబద్ధాలు చెబుతున్నారు" అని విమర్శించారు. జనజాతర వేదిక నుంచి ఏఐసీసీ నాయకత్వం తెలంగాణ మోడల్‌గా సందేశం ఇవ్వబోతుందని భట్టి వివరించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఏఐసీసీ చీఫ్ ఖర్గే, పార్టీ అధినేత్రి సోనియాగాంధీ, అగ్రనాయకులు రాహుల్, ప్రియాంకలు ఇదే వేదిక నుంచి ఆరు గ్యారెంటీలను ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధినాయకత్వం లోక్‌సభ ఎన్నికల మ్యానిఫెస్టోను కూడా ఇక్కడి నుంచే ప్రకటించనున్నట్లు తెలిపారు. పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిన బీఆర్ఎస్.. మతం పేరుతో దేశంలో వైషమ్యాలను సృష్టిస్తున్న బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో తగిన శాస్తి తప్పదని.. ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమని అన్నారు.

ఎండలు పెరిగినా విద్యుత్తు కోతలుండవు

ఖమ్మం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎండలు పెరుగుతుండడంతో విద్యుత్తు వినియోగం పెరుగుతోందని భట్టి విక్రమార్క వెల్లడించారు. అయినా.. విద్యుత్తు కోతలు ఉండబోవని పేర్కొన్నారు. బొగ్గు ఉత్పత్తి ఉన్నచోట పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. గత ప్రభుత్వం యాదాద్రి పవర్‌ప్లాంట్ వంటి ప్రాజెక్టులను మొదలు పెట్టాయని, ఆ ప్లాంట్‌కు బొగ్గు తరలింపునకే అధిక వ్యయం అవుతుందని విమర్శించారు.

పది లక్షలకు మించి..!

జన జాతర సభకు భారీగా తరలించాలి

- తెలంగాణలో కాంగ్రెస్ గాలి.. అత్యధిక సీట్లు ఖాయం
- అప్పుడు రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అవుతారు
- ఇన్‌చార్జులు, అభ్యర్థులతో సమీక్షలో సీఎం రేవంత్
- తుక్కుగూడలో జన జాతర సభ ఏర్పాట్ల పరిశీలన

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

తుక్కుగూడలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న జన జాతర సభకు పది లక్షలకు మించి జన సమీకరణ చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆయా పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా కార్యకర్తలను సమన్వయం చేసుకుని జనాన్ని సమీకరించే బాధ్యతను అభ్యర్థులు స్వీకరించాలని చెప్పారు. తుక్కుగూడలో జన జాతర బహిరంగ సభ నిర్వహించనున్న రాజీవ్ గాంధీ సభా ప్రాంగణాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలతో కలిసి గురువారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం 14 లోక్‌సభ నియోజకవర్గాల ఇన్‌చార్జులు, 12 మంది అభ్యర్థులతో సుమారు రెండు గంటలపాటు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపరచనున్న ఐదు గ్యారంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని చెప్పారు. "ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలి. అభ్యర్థులు ప్రజలతో మమేకం కావాలి. నాయకులు, కార్యకర్తలతో కలిసిపోవాలి. అత్యధిక ఎంపీ స్థానాలను కైవసం చేసుకునేందుకు పట్టుదలతో పని చేయాలి. రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో బీజేపీ గాలి లేదు. అక్కడ ఇండియా కూటమికి అధిక స్థానాలు వచ్చే అవకాశాలున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ గాలి వీస్తోంది. అత్యధిక ఎంపీ స్థానాలను దక్కించుకుంటే రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయం" అని దిశానిర్దేశం చేశారు. పార్టీ అగ్ర నేతలు ఖర్గే, రాహుల్, ప్రియాంక గాంధీ ఉపన్యాసాలపై గ్రామాల్లో చర్చించేలా చేయాలని, తద్వారా, పార్టీకి ఓటింగ్ శాతం పెరిగే అవకాశాలు ఉంటాయని తెలిపారు. జాతీయ స్థాయిలో రికార్డు నెలకొల్పే విధంగా జన సమీకరణ జరగాలన్నారు. "రాజధాని పరిసరాల్లోని ఏడు లోకసభ నియోజక వర్గాల నుంచి భారీ ఎత్తున జన సమీకరణ జరగాలి. ఒక్కో సెగ్మెంట్ నుంచి కనీసం 50 వేల మంది చొప్పున, ఇతర ప్రాంతాల్లో శాసనసభ నియోజకవర్గం నుంచి ఐదు వేల మందికి తగ్గకుండా జనాన్ని తరలించాలి. రాష్ట్రంలోని సుమారు 30 వేల పోలింగ్ బూత్‌ల పరిధిలోని సమన్వయకర్తలు ఒక్కొక్కరు ఒక్కో వాహనంలో కనీసం పది మందికి తగ్గకుండా తీసుకురావాలి" అని కోరారు. సమీక్ష సమావేశంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ, సీతక్క, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటలకు సీఎం మీడియా సమావేశం ఉందని సమాచారం ఇచ్చారు. మీడియా ప్రతినిధులు మూడు గంటలపాటు ఎదురు చూశారు. చివరకు ప్రెస్ మీట్ నిర్వహించకుండానే సీఎం వెళ్లిపోయరు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు ప్రెస్‌మీట్ పెట్టి వివరాలను అందించారు. కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన అన్నారు. తుక్కుగూడలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీ అధినేత్రి సోనియా గాంధీ విడుదల చేసిన ఆరు గ్యారంటీలకు ఎంతో ఆదరణ లభించిందని, ప్రజల ఆశీర్వాదంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, అదే సెంటిమెంటుతో పాంచ్ న్యాయ్‌కు శ్రీకారం చుట్టనున్నామని చెప్పారు. తాట తీస్తామంటూ కేటీఆర్ చేసిన హెచ్చరికలపై మండిపడ్డారు. ఎన్నికలు ముగిశాక ఎవరు తాటతీస్తారో ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై చట్టపరంగా, న్యాయపరంగా ఎలా వ్యవహరించాలో తమకు తెలుసన్నారు.

నేతన్నలపై కక్ష కట్టిన ప్రభుత్వం

వారి ఆత్మహత్యలపై కాంగ్రెస్ సర్కారు పట్టించుకోదా?

- బీఆర్ఎస్ పాలనలో నేతన్నలకు ప్రాధాన్యమిచ్చాం
- వారిని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ



హైదరాబాద్/సిరిసిల్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నేతన్నలపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షకట్టిందని, రైతన్నల మాదిరిగా.. నేతన్నలు కూడా ఆత్మహత్యలకు పాల్పడుతుంటే.. పట్టించుకోరా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. నాలుగు నెలలుగా నేతన్నలు అధిక సంఖ్యలో చేనేత పనులకు దూరం అయ్యారన్నారు. పవర్ లూమ్స్ పూర్తిగా నిలిచిపోయాయని, దీంతో పవర్ లూమ్ ఆసాములతోపాటు కార్మికులు రోడ్డునపడ్డారని పేర్కొన్నారు. తమకు పని కల్పించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు ధర్నా, నిరసనలకు దిగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఆదుకోవాల్సిన అధికార పార్టీ నేతలే కార్మికులను అవమానించేలా మాట్లాడటం తగదని, ఇటీవల కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు కార్మికులను బాధకు గురిచేశాయని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తడుక శ్రీనివాస్ అనే నేత కార్మికుడు ఉరేసుకున్నాడని, ఇది ఆత్మహత్య కాదు.. ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన హత్యగానే నేతన్నలు భావిస్తున్నారన్నారు. తెలంగాణలో పదేళ్ల పాటు పండుగలా మారిన వస్త్ర పరిశ్రమ చుట్టూ కాంగ్రెస్ రాగానే చిమ్మ చీకట్లు కమ్ముకున్నాయని, పరిశ్రమను దెబ్బతీయడంతోపాటు.. కార్మికుల జీవితాలతో చెలగాటమాడే విధంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ సర్కారు తీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల నేతన్నలు తమ పొట్టకొడుతున్న కాంగ్రెస్ పార్టీని ఎప్పటికీ క్షమించరని ఆయన హెచ్చరించారు. గడిచిన పదేళ్లలో కేసీఆర్ పాలనలో నేతన్నలకు, వస్త్ర పరిశ్రమకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి, వారిని సంక్షోభంనుంచి గట్టెక్కించేందుకు కీలక నిర్ణయాలు తీసుకొని అమలు చేశామని కేటీఆర్ ఆ లేఖలో వివరించారు. ప్రతి కార్మికుడు నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు సంపాదించుకొని గౌరవంగా జీవించేందుకు పటిష్ఠమైన కార్యాచరణను రూపొందించామన్నారు. భేషజాలకు వెళ్లకుండా గత ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలను కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు.

టెస్లా ప్లాంట్‌ను రాష్ట్రానికి తెచ్చేలా కృషి చేయండి

భారత్‌లో టెస్లా కంపెనీ తన కార్యకలాపాలను ప్రారంభించేందుకు నిర్ణయం తీసుకొందని, ఆ కంపెనీ ఫ్యాక్టరీని రాష్ట్రానికి తెచ్చే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. ఈ కంపెనీని తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం తన శక్తియుక్తులన్నింటినీ ఉపయోగించాలని గురువారం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

ఏఐ సిటీ కోసం 200 ఎకరాలు

- హైదరాబాద్ శివారులో భూమిని కేటాయిస్తున్నాం
- టెస్లాను రాష్ట్రానికి తెప్పించేందుకు కృషి: శ్రీధర్‌బాబు



హైదరాబాద్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ఏఐ టెక్నాలజీలో తెలంగాణ ప్రపంచంతో పోటీపడేలా ఉండాలన్న లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. దీనికోసం ప్రత్యేకంగా ఏఐ సిటీ కోసం హైదరాబాద్ శివారులో 200 ఎకరాలు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. గురువారం సైబర్ టవర్లో నిర్వహించిన కార్యక్రమంలో పీఎస్ఆర్ గ్లోబల్ డెలివరీ సెంటర్ టెక్‌హబ్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏఐ రాకతో టెక్నాలజీ రూపురేఖలు సమూలంగా మారిపోయాయని, భవిష్యత్తులో ఈ రంగంలో భారీ ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. జూలైలో నగరంలో ఏఐ అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఏఐ కంపెనీలను ఆహ్వానిస్తున్నామని వెల్లడించారు. సాఫ్ట్‌వేర్ రంగంలో బెంగళూరు తర్వాత రెండోస్థానంలో ఉన్న నగరాన్ని ప్రథమస్థానం సాధించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజ సంస్థ టెస్లాను రాష్ట్రానికి తెచ్చేందుకు గత డిసెంబరు నుంచి విశేషంగా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమల అనుకూల వాతావరణం ఉందని, టెస్లా కంపెనీ ఇక్కడ పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తుందని ఆశిస్తున్నామని చెప్పారు.

సీఎం రేవంత్ నరసింహావతారంలో కేటీఆర్, హరీశ్‌ను మట్టికరిపిస్తారు

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 4: ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. అధికారం కోల్పోయి అక్కసుతో మాట్లాడుతున్న మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావును మట్టి కరిపించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. నరసింహస్వామి అవతారం ఎత్తుతారని అన్నారు. వారి పేగులను మెడలో వేసుకుని మట్టికరిపిస్తారని అయిలయ్య వ్యాఖ్యానించారు. ఈ మేరకు యాదగిరిగుట్టలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం ఆరు గ్యారంటీలను అమలు చేస్తుంటే మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు అక్కసు వెళ్లగక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ చేసిన అక్రమాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయని అయిలయ్య పేర్కొన్నారు.

నేడు కరీంనగర్ జిల్లాకు కేసీఆర్

- ఎండిపోయిన పంటల పరిశీలన

హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కరీంనగర్ జిల్లాలో శుక్రవారం పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు కరీంనగర్ రూరల్ మండలం ముగ్ధుమ్‌పూర్ గ్రామ సమీపంలోని పంటలను ఆయన పరిశీలిస్తారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసానికి చేరుకుని మధ్యాహ్న భోజన ముగించుకున్న తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు బోయినపల్లి మండల కేంద్రం పరిసరాల్లో పర్యటిస్తారు. ఎండిపోయిన వరి పొలాలను పరిశీలించి రైతులను పరామర్శిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు శాభాష్‌పల్లి వద్ద మధ్యమానేరు ప్రాజెక్టును పరిశీలించి, సాయంత్రం నాలుగు గంటలకు సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడతారు.



పల్లా.. ఫోన్ ట్యాపింగ్ చేసి గెలిచారు

- ఎన్నికల టైంలో జనగామ, చేర్యాలలో నా ఇళ్లకు వంద మీటర్ల దూరంలోనే ఆఫీసులు తెరిచారు
- ఆయనపై అనర్హత వేటు వేయాలి: కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి
- పల్లాకు వ్యతిరేకంగా ప్లకార్డులతో కాంగ్రెస్ నేతల నిరసన
- ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు మిలీనియం జోక్: పల్లా

జనగామ, హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జనగామ నియోజకవర్గంలో ప్రతిపక్ష నేతల ఫోన్లను ట్యాపింగ్ చేసి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారని కాంగ్రెస్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో జనగామ, చేర్యాలలో తన ఇళ్లకు 100 మీటర్ల దూరంలోనే పల్లా ఆఫీసులు ఏర్పాటు చేశారని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ చేసేందుకే తన ఇళ్లకు సమీపంలోనే కార్యలయాలు తెరిచారని, ఎన్నికలు అయిపోగానే ఆఫీసులను వేరే చోటకు మార్చాడని ఆరోపించారు. తాము ఎవరెవరితో మాట్లాడుతున్నామనేది ట్యాపింగ్ ద్వారా వింటూ తమ పార్టీ నాయకులను ప్రలోభాలకు గురిచేసి పల్లా కొనుగోలు చేశారని ఆరోపించారు. పల్లాపై విచారణ చేసి ఆయనపై అనర్హత వేటు వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, పల్లా కలిసి వివిధ చోట్ల 25 వేల నుంచి 30 వేల దొంగ ఓట్లు నమోదు చేయించారని, ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడ్డారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల అఫిడవిట్‌లో ఆస్తులు, ఆదాయాలను పల్లా సరిగ్గా చూపించలేదని, దీనిపై తాను హైకోర్టులో పిటిషన్ వేశానని, త్వరలోనే విచారణకు వస్తుందని తెలిపారు. ఆరు నెలలు, ఏడాదిలోగా కోర్టులో పల్లా బండారం రుజువై ఇంటికి వెళ్లడం ఖాయమని పేర్కొన్నారు. దొంగ ఓట్లు, ఫోన్ ట్యాపింగ్‌తో పల్లా గెలిచిరాని ఆరోపిస్తూ.. ఆయనపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేస్తూ జనగామలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నేతలు ప్లకార్డులతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఫోన్‌ను తాను ట్యాపింగ్ చేయించానని ఆయన ఆరోపణలు చేయటం మిలీనియం జోక్ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గెలిచిన ప్రతి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మీద ఫోన్ ట్యాపింగ్ ఫిర్యాదు చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకున్నట్లుగా కనిపిస్తోందని చెప్పారు. కొమ్మూరి ఆరోపణల్లో ఎంతమాత్రం వాస్తవంలేదని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని కౌంటర్ ఇంటలిజెన్స్ డిపార్ట్‌మెంట్ చూస్తుందని... ఆ విషయం కేంద్ర, రాష్ట్రాల హోంశాఖలకు తెలుస్తుందని... కొన్నిసార్లు ముఖ్యమంత్రికి కూడా తెలియదని పల్లా అన్నారు. గత ప్రభుత్వంలో తాను మంత్రివర్గంలో కూడా లేనని... ఫోన్ ట్యాపింగ్‌చేయించే అవకాశం, అధికారం రెండూ తనకు లేవని అన్నారు.

ట్యాపింగ్‌తో పసిగట్టి.. స్టింగ్ ఆపరేషన్!

(మొదటి పేజీ తరువాయి)

గుర్తించినట్లు ఇప్పుడు చర్చ జరుగుతోంది. దాంతో.. పక్కాగా స్కెచ్‌వేసి, ఆ నలుగురు ఎమ్మెల్యేలతోనే ప్రధాన నిందితుడు నందకుమార్, సింహయాజి, రామచంద్ర భారతిలను ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. అప్పట్లో అతి కొద్ది మంది పోలీసు ఉన్నతాధికారులతో ఈ పథకాన్ని అమలు చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.



ఒక్కరోజు ముందు కెమెరాలు ఫిక్స్

ఎమ్మెల్యేల కొనుగోలుకు బేరసారాలు జరగడానికి ఒకరోజు ముందు ఎస్ఐబీ అధికారులు ఫామ్ హౌస్‌కు వెళ్లి.. 72 కెమెరాలను ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. రామచంద్ర భారతి, నందకుమార్, సింహయాజి స్వామీజీల సీటింగ్ ఏర్పాట్లు కూడా ప్రణీత్ అండ్ కో డైరెక్షన్‌లోనే జరిగినట్లు.. అందుకు తగ్గట్లుగా ఎమ్మెల్యేలకు తర్ఫీదునిచ్చినట్లు సమాచారం. ఈ ఆపరేషన్‌లో అప్పటి సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. ఈ ఆపరేషన్ తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ ఫుటేజీలను రాజకీయ లబ్ధికోసం ఉపయోగించుకుని, బీజేపీ ప్రముఖులను టార్గెట్‌గా చేసుకుంది. 2022 నవంబరు 3న అప్పటి సీఎం కేసీఆర్ స్వయంగా ప్రగతిభవన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, ఫుటేజీలను మీడియాకు విడుదల చేశారు. ఎమ్మెల్యేల కొనుగోలుకు జరిగిన కుట్రను గురించి విలేకరులకు వివరించారు. సుప్రీంకోర్టు సహా.. దేశంలోని అన్ని హైకోర్టుల జడ్జిలకు ఈ ఫుటేజీలను పంపినట్లు వెల్లడించారు. "ఢిల్లీ పెద్దల సంగతి చూస్తాం" అని ఘాటుగా హెచ్చరించారు. దర్యాప్తు అధికారులు ఓ దశలో ఈ కేసులో ఢిల్లీ పెద్దల తలుపుతట్టేదాకా పరిస్థితి వెళ్లింది.

దర్యాప్తు అధికారులకు స్పెషల్ ఫ్లైట్!

ఈ కేసును దర్యాప్తు చేసిన అధికారుల కోసం స్పెషల్ ఫ్లైట్‌ను బుక్ చేసినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. వారు ఢిల్లీతోపాటు.. కేరళలోని కొన్ని ప్రాంతాలకు వెళ్లారు. అక్కడ పలువురికి నోటీసులు జారీ చేసి, విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. అయితే.. దర్యాప్తు అధికారులకు స్పెషల్ ఫ్లైట్‌లను అరేంజ్ చేసిందెవరు? అందులో ప్రయాణించిన అధికారులెవరు? అనే కోణంపైనా ఇప్పుడు ఫోన్‌ట్యాపింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న అధికారులు దృష్టి సారించారు.

నందకుమార్ ఫిర్యాదు చేశాకే..!

ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు సందర్భంగా పలువురు బాధితులు పోలీసులకు వేర్వేరుగా ఫిర్యాదులు చేసిన విషయం తెలిసిందే.! ఇదే క్రమంలో ఎమ్మెల్యేల కొనుగోలు కుట్ర కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న నందకుమార్ ఇటీవల డీజీపీ రవిగుప్తాను కలిశారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసుకు ముందు తన ఫోన్‌ను ట్యాప్ చేశారని పేర్కొంటూ ఫిర్యాదు చేశారు. అప్పట్లో డీఎస్పీ ప్రణీత్‌రావు, టాస్క్‌ఫోర్స్ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్‌రావు ట్యాపింగ్‌లో కీలకంగా వ్యవహరించారని ఆరోపించారు.

స్టీఫెన్ రవీంద్రపై డీఎస్పీ ఫిర్యాదు

ప్రస్తుతం అదనపు డీజీపీగా ఉన్న స్టీఫెన్ రవీంద్రపై డీజీపీ కార్యాలయంలో పనిచేసే డీఎస్పీ గంగాధర్ నేరుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఓ స్థలం విషయంలో తనపై అకారణంగా సస్పెన్షన్ వేటు వేశారని, దానివల్ల తన పదోన్నతిలో జాప్యం జరిగిందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను సైబరాబాద్ పరిధిలోని నార్సింగ్ ఠాణాకు ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న సమయంలో.. ఓ స్థల వివాదం విషయంలో అప్పటి సీపీ స్టీఫెన్ రవీంద్ర ఏకపక్షంగా అవతలివైపు వారి వాదనలను విని.. ఎలాంటి విచారణ జరపకుండానే తనపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిపారు. ఈ విషయంలో పునరాలోచించి, విచారణ జరిపించాక నిర్ణయం తీసుకోవాలని తాను విన్నవించినా పట్టించుకోలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. "ఈ చర్య వల్ల గుండెపోటుతో నేను ఆస్పత్రిలో చేరాను. ఈ మొత్తం ఎపిసోడ్ కారణంగా ఇన్‌స్పెక్టర్ నుంచి డీఎస్పీ పదోన్నతిలో తీవ్ర జాప్యం జరిగింది" అని ఆ ఫిర్యాదులో డీజీపీకి విజ్ఞప్తి చేశారు. 1988లో ఎస్సైగా సర్వీసులోకి వచ్చిన తాను.. కఠిన సేవాపతకం, ఉత్తమ సేవాపతకం, ముఖ్యమంత్రి సర్వోన్నత పతకాలను అందుకున్నానని, ఇన్నేళ్ల సర్వీసులో ఒక్క చార్జ్‌మెమోను కూడా అందుకోలేదని, అలాంటి క్లీన్ రికార్డు ఉన్న తనను అకారణంగా సస్పెండ్ చేశారని ఆయన వాపోయారు. ఇదే అంశంపై ఆ డీఎస్పీ పరిపాలన ట్రైబ్యునల్‌ను ఆశ్రయించేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.

పోలీస్ కస్టడీకి రాధాకిషన్ రావు

ఫోన్ ట్యాపింగ్ కేసులో టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావును పంజాగుట్ట పోలీసులు గురువారం కస్టడీకి తీసుకున్నారు. వారం రోజుల పాటు కస్టడీకి కోర్టు అనుమతినిచ్చిన నేపథ్యంలో.. పశ్చిమ మండలం పోలీసులు రాధాకిషన్‌ను విచారిస్తున్నారు. ప్రణీత్‌రావు ఎస్ఐబీలో ధ్వంసం చేసిన హార్డ్‌డిస్కుల శకలాలను పారవేయడంలో రాధాకిషన్ కీలక పాత్ర పోషించినట్లు దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో స్వామికార్యంతోపాటు.. స్వకార్యం(వ్యాపారుల ఫోన్ల ట్యాపింగ్‌లు, బెదిరింపులు) పూర్తిచేసుకున్న ఈ బృందం.. తమ గుట్టు బయటపడకుండా ఉండేందుకే.. హార్డ్‌డిస్కులను ధ్వంసం చేసినట్లు సమాచారం. దాంతోపాటు.. అరెస్టు సమయంలో జరిపిన ప్రాథమిక దర్యాప్తులో బీఆర్ఎస్ కోసం టాస్క్‌ఫోర్స్ వాహనాల్లో డబ్బును తరలించినట్లు అంగీకరించిన నేపథ్యంలో.. ఆ కోణంపై మరింత సమాచారాన్ని సేకరించనున్నారు. ఎన్నికల సమయంలో సైబరాబాద్‌కు వేణుగోపాల్‌రావు, హైదరాబాద్‌కు తిరుపతన్న, రాచకొండకు భుజంగరావు, నల్లగొండకు ప్రణీత్‌రావును ఇన్‌చార్జిగా పెట్టి, సీక్రెట్‌గా చేసిన 'స్పెషల్ ఆపరేషన్' ఏమిటనే కోణంలోనూ రాధాకిషన్‌ను ప్రశ్నించనున్నారు. మరోవైపు.. మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో ఎమ్మెల్యేల కొనుగోలు కుట్ర కేసులోనూ రాధాకిషన్‌రావు పాత్ర కీలకమని వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో.. ఆ కోణంలోనూ విచారించే అవకాశాలున్నాయి.

లీగల్ నోటీసుల పేరిట కేటీఆర్ బెదిరింపులు

- ట్యాపింగ్‌తో అధికార దుర్వినియోగం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరినీ అనర్హులుగా ప్రకటించాలి: ఎమ్మెల్యే యన్నెం



హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి కేటీఆర్ లీగల్ నోటీసులు పంపడంపై మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యన్నెం శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లీగల్ నోటీసుల పేరిట కేటీఆర్ బెదించాలని చూస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి రూ.2,500 కోట్లు కప్పం కట్టారని అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్‌కే తాము లీగల్ నోటీసులు పంపాలని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడి అధికార దుర్వినియోగం చేసినందుకు బీఆర్ఎస్‌కు చెందిన 39 మంది ఎమ్మెల్యేలను డిస్‌క్వాలిఫై చెయ్యాలని యెన్నం డిమాండ్ చేశారు. ఈ మేరకు గాంధీ భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన ఫోన్ ట్యాపింగ్ జరిగిందనే అనుమానంతో డీజీపీకి ఫిర్యాదు చేశానని ఈ సందర్భంగా తెలిపారు. బీఆర్ఎస్ నేతలు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వార్ రూమ్‌లు ఏర్పాటు చేసి ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారంటూ మీడియాలో వచ్చిన కథనాలపైనే తాను మాట్లాడానని స్పష్టం చేశారు. అసలు కేటీఆర్‌కు ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం, చట్టం, పరిపాలన అంటే తెలియవని ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే కొందరు అధికారులు సస్పెండ్ అయ్యారని తెలిపారు. ఆధారాలు లేకుండా అలాంటి చర్యలు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీలతోపాటు సొంత పార్టీ నేతల ఫోన్లు ట్యాపింగ్ చేశారని, హైకోర్టు జడ్జిల ఫోన్లనూ వదలేదని మీడియాలో కథనాలు వచ్చాయని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అప్పటి సీఎం కేసీఆర్ మీడియా సమక్షంలోనే ట్యాపింగ్ చేసినట్టు చెప్పారని, వీడియోలు కూడా ప్రదర్శించారన్నారు. ప్రగతి భవన్ వేదికగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం జరిగిందని యన్నెం ఆరోపించారు. డీజీపీకి తెలియకుండా స్పెషల్ టీం ఏర్పాటు చేసి ట్యాపింగ్‌కు పాల్పడ్డారని పేర్కొన్నారు.

ట్యాపింగ్‌కు బాధ్యత కేసీఆర్‌దే

(మొదటి పేజీ తరువాయి)

జరిగిందని ఆరోపించారు. రిటైర్డ్ అధికారిని ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమించి, ఆయన నేతృత్వంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని నడిపించారని తెలిపారు. "ఫోన్ ట్యాపింగ్ అత్యంత సీరియస్ విషయం. పరిణామాలు కూడా అలాగే ఉంటాయి. కేంద్ర ఎన్నికల సంఘ నియమాలను కేసీఆర్ ప్రభుత్వం యధేచ్ఛగా ఉల్లంఘించింది. ప్రతిపక్ష నేతల ఫోన్‌లను అక్రమంగా ట్యాప్ చేసింది. ప్రజాస్వామ్యాన్ని హత్య చేసింది. వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించింది. ఇది రాజకీయ కక్ష సాధింపు చర్య మాత్రమే కాదు. వ్యక్తిగత గోప్యతను కూడా దెబ్బతీసింది. 2018 అసెంబ్లీ, 2019 లోక్‌సభ ఎన్నికలతోపాటు ఆ తర్వాత జరిగిన దుబ్బాక, హుజురాబాద్, మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు పోలీసు అధికారులే వెల్లడించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను తుంగలో తొక్కి, అధికార యంత్రాంగాన్ని పూర్తిగా తమకు అనుకూలంగా మలచుకుని ప్రత్యర్థి పార్టీలను దెబ్బతీసేలా వ్యవహరించింది. ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని బీఆర్ఎస్ పార్టీ గుర్తింపుపై పునరాలోచన చేయాలి" అని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో ట్యాపింగ్‌పై ఫిర్యాదు చేస్తామని, సుమోటోగా స్వీకరించి కఠినంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఎలక్షన్ కమిషన్‌పై ఉందని స్పష్టం చేశారు. "చట్టాలు, కోర్టులను గౌరవించకుండా ఆటవిక రాజ్యంగా, ప్రైవేటు లిమిటెడ్ కంపెనీగా తెలంగాణను కేసీఆర్ వాడుకున్నారు. ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగించేలా వ్యవహరించారు. ఈ దొంగల ముఠా ఎంతమంది ఫోన్ల ట్యాపింగ్‌కు సంబంధించి అనుమతులు తీసుకుంది? ఎంతమంది ప్రైవేటు వ్యక్తుల జీవితాల్లోకి తొంగి చూసింది!? ఎన్ని కోట్లు వసూళ్లు చేసింది అన్నవి తేలాలి" అని వ్యాఖ్యానించారు. నాడు షాడో సీఎంగా కేటీఆర్ వ్యవహరించారని, ఇప్పుడు మాత్రం ఒకరిద్దరి ఫోన్ల ట్యాపింగ్ జరిగి ఉండొచ్చని అంటున్నారని, అదే సమయంలో ట్యాపింగ్‌తో తనకేం సంబంధమని బుకాయిస్తున్నారని మండిపడ్డారు.



ఫాంహౌజ్ ఫైల్స్ ఓ డ్రామా

నలుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలుకు సంబంధించి ఫాంహౌజ్ ఫైల్స్ పేరిట కేసీఆర్ డ్రామా నడిపారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. "ఈ డ్రామాకు సూత్రధారి, దర్శకత్వం, నిర్మాత కేసీఆర్. పాత్రధారులు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు. మునుగోడు ఉప ఎన్నికలో లబ్ధి పొందేందుకు ఏకంగా మీడియా సమావేశం నిర్వహించి వీడియో ప్రదర్శించారు. ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్‌పై చర్యలు తీసుకోవడానికి ఇంతకంటే ఆధారం ఇంకేం కావాలి?" అని నిలదీశారు. బీఆర్ఎస్ గుర్తింపు రద్దుపై ఎన్నికల సంఘం తక్షణం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఏ డిసెంబరు 9న రుణమాఫీ చేస్తారు

తాము అధికారంలోకి రాగానే డిసెంబరు 9న రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి ప్రకటించారని, ఇప్పటి వరకు దాని ఊసు ఎత్తడం లేదని కిషన్‌రెడ్డి ఆరోపించారు. అసలు ఏ డిసెంబరు 9న రుణమాఫీ చేస్తారో చెప్పాలని నిలదీశారు. దీనిపై కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడ నిలదీయాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పిన కాంగ్రెస్‌కు ఎన్నికల్లో ఓటు అడిగే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. రైతాంగ సమస్యలపై శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు సత్యాగ్రహం నిర్వహిస్తున్నామన్నారు. కేఆర్ఎంబీ సమావేశానికి రాష్ట్రం తరఫున నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు గైర్హాజరు కావడం ప్రభుత్వ బాధ్యతా రాహిత్యమేనని మండిపడ్డారు. ఇంతకంటే పెద్ద సమస్య ప్రభుత్వానికి ఇంకేముందని నిలదీశారు. పార్టీ సమావేశాలు నిర్వహించుకునేందుకు టైం ఉంది గానీ, కీలక సమస్యపై చర్చించేందుకు లేదా అని ప్రశ్నించారు. "సీఎం రేవంత్‌కు వేరే ఎజెండా ఏమీ లేదు. పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహించడమే ఆయన ప్రధాన ఎజెండా" అని కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఫిరాయింపుల నిరోధక చట్టానికి తూట్లు పొడిచిందని, కనీసం రాజీనామా కూడా చేయించకుండానే ప్రభుత్వంలో చేర్చుకుని మంత్రి పదవులు ఇచ్చిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆ దుర్మార్గపు అలవాట్లను కొనసాగిస్తూ ఫిరాయింపులనే ఎజెండాగా పెట్టుకుందని మండిపడ్డారు. కొంతమంది కుక్కలు, నక్కలు పార్టీ ఫిరాయిస్తున్నారని కేసీఆర్ అంటున్నారని, మరి వారిని పార్టీలో చేర్చుకుని, టికెట్లు ఎందుకు ఇచ్చారని నిలదీశారు.



హిల్ కాలనీలో కోతులు మృతి చెందిన మినీవాటర్ ట్యాంకు

కోతుల మృతితో.. ట్యాంక్ కనెక్షన్ తొలగింపు

- సాగర్ కాలనీల్లోని ఇళ్లకు నేరుగా నీటి సరఫరా
- ముగ్గురిపై కేసు, కమిషనర్, ఎన్ఎస్‌పీ ఏఈకి షోకాజ్
- ట్యాంకు నుంచి 9 ఇళ్లకే నీరు: కలెక్టర్
- మునిసిపల్ శాఖ సిగ్గుపడాలి: కేటీఆర్

నాగార్జునసాగర్, ఏప్రిల్ 4: నల్లగొండ జిల్లా నందికొండ (నాగార్జున సాగర్) మునిసిపాలిటీ హిల్ కాలనీ తాగు నీటి ట్యాంకులో పడి 30 కోతులు మృతి చెందిన ఘటనతో అధికారులు అప్రమత్తమయ్యారు. గురువారం ట్యాంక్‌ను శుభ్రం చేయించారు. స్థానిక ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ఎన్ఎస్‌పీ అధికారులతో మాట్లాడారు. ట్యాంకుకు నీటిని పంపించే పైప్‌లైన్‌ను తీసివేయించారు. సాగర్ కాలనీల్లో మినీ ట్యాంకులను తొలగించి ఇళ్లకు నేరుగా పైప్‌లైన్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. ఎండల తీవ్రత రీత్యా వన్యప్రాణులు, మూగజీవాల దాహార్తి తీర్చేందుకు కాలనీల్లో చిన్న చిన్న ట్యాంకులను ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు. కోతులు పడి మృతి చెందిన ఘటనలో ఎన్ఎస్‌పీ నీటి పారుదల ఏఈ భిక్షం, సిబ్బంది నర్సింహ, వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ సంపత్ తెలిపారు. భిక్షం, నందికొండ మునిసిపల్ కమిషనర్ శ్రీనుకు నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన షోకాజ్ నోటీసులిచ్చారు. విచారణ అధికారిగా అదనపు కలెక్టర్ పూర్ణచందర్‌ను నియమించారు. ఆయన ట్యాంకును పరిశీలించి నివేదిక అందజేశారు. దీనిప్రకారం.. కోతులు చనిపోయిన వాటర్ ట్యాంకు నుంచి 9 ఇళ్లకు మాత్రమే నీరు సరఫరా అవుతోందని, వీటిలో 49మంది మాత్రమే ఉంటున్నట్లు తేలిందని కలెక్టర్ తెలిపారు. ఎవరికీ ఆరోగ్య సమస్యలు రాలేదని చెప్పారు. వీరికి తాగునీటి సరఫరా కోసం ప్రత్యామ్నాయ పైపులైన్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తున్నందుకే..

ప్రజారోగ్యాన్ని వదిలి.. రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తున్నందునే ఇలాంటి పరిస్థితి వచ్చిందంటూ.. హిల్ కాలనీ ట్యాంక్‌లో కోతులు పడి మృతి చెందిన ఘటనపై మునిసిపల్ మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు. మునిసిపల్ శాఖ సిగ్గుపడే విధంగా నందికొండ ఘటన ఉందంటూ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై విమర్శించారు. తాగునీటి సరఫరాలో పరిశుభ్రతను పాటించకుండా ప్రజల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందన్నారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రాష్ట్ర ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

ప్రపంచ క్యాన్సర్ రాజధాని భారత్!

- దేశంలో పెరుగుతున్న కేసులు.. చిన్న వయసు వారిలోనూ అధికం
- ఆరోగ్యాన్ని హరిస్తున్న మధుమేహం, గుండెజబ్బులు, స్థూలకాయం
- ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు, నివారణ చర్యలతోనే రక్షణ
- వెల్లడించిన అపోలో 'హెల్త్ ఆఫ్ ది నేషన్' నివేదిక

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్, మధుమేహం, హైపర్ టెన్షన్, హృద్రోగం, మానసిక సమస్యల వంటి అసాంక్రమిక వ్యాధులు దేశంలో ఆందోళనకర స్థాయిలో పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా క్యాన్సర్ కేసుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. ప్రపంచానికి క్యాన్సర్ రాజధానిగా భారత్ తయారైందా అన్న స్థాయిలో పరిస్థితి ఉంది. 'హెల్త్ ఆఫ్ ది నేషన్' (భారతదేశ ఆరోగ్యం) పేరుతో అపోలో హాస్పిటల్స్ గురువారం విడుదల చేసిన నాలుగో వార్షిక నివేదికలో ఈ వివరాలున్నాయి. పలు అసాంక్రమిక వ్యాధులు చిన్న వయసు వారిలో తలెత్తటం ఇటీవలి కాలంలో పెరిగిపోయిందని, దీనిని నివారించటానికి తక్షణం చర్యలు చేపట్టాలని సూచించింది. క్యాన్సర్ విషయంలో కూడా ఇది కనిపిస్తోందని, ఇతర దేశాలతో పోల్చితే భారత్‌లో క్యాన్సర్ బారిన పడుతున్న వారి సగటు వయసు తక్కువగా ఉంటోందని తెలిపింది. రొమ్ము, గర్భాశయం, ఊపిరితిత్తులు, నోటి క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని, అయినప్పటికీ, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవటం భారత్‌లో చాలా తక్కువగా ఉందని ఈ నివేదిక పేర్కొంది. స్థూలకాయం కూడా భారతీయుల్లో పెరిగిపోతోందని, ఇది పలు అసాంక్రమిక వ్యాధులకు కారణమవుతోందని తెలిపింది. మధుమేహం, హైపర్ టెన్షన్‌ల ముప్పును పలువురు భారతీయులు ఎదుర్కొంటున్నారని, యువతలో మానసిక సమస్యలు ముఖ్యంగా కుంగుబాటు (డిప్రెషన్) అధికంగా కనిపిస్తోందని వెల్లడించింది. దీనిపై అపోలో హాస్పిటల్స్ వైస్ చెయిర్‌పర్సన్ డాక్టర్ ప్రీతా రెడ్డి స్పందిస్తూ.. అసాంక్రమిక వ్యాధులను ఎదుర్కోవటానికి తక్షణం సమష్టి కార్యాచరణ అవసరమన్నారు. ప్రజల్లో అవగాహన పెంచటంతోపాటు వ్యక్తిగత స్థాయిలో చికిత్సలను అందుబాటులోకి తీసుకురావాల్సి ఉందన్నారు. ఆ సంస్థ ప్రెసిడెంట్, సీఈఓ డాక్టర్ మధు శశిధర్.. వైద్య చికిత్సలకు సంబంధించి మరిన్ని ఆవిష్కరణలు జరగాల్సిన అవసరం ఉందని, వాటిని ప్రజల వద్దకు విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ మేరకు అపోలో 'ప్రో హెల్త్ స్కోర్' పేరుతో దేశంలోనే తొలి డిజిటల్ ఆరోగ్య మదింపు టూల్‌ను విడుదల చేసింది. దీనిద్వారా ఎవరికి వారు తమ ఆరోగ్యంపై ఒక అంచనాకు వచ్చి, ముందు జాగ్రత్త చర్యలు చేపట్టటానికి అవకాశం లభిస్తుందని అపోలో హాస్పిటల్స్ ఓ ప్రకటనలో వెల్లడించింది. అసాంక్రమిక వ్యాధులు భారతదేశ ఆర్థికవ్యవస్థకు రూ.లక్షల కోట్ల మేర నష్టం కలిగిస్తున్న నేపథ్యంలో, ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచటానికి ఈ టూల్ ఎంతో ఉపకరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది.

కేసీఆర్.. రైతులకు క్షమాపణ చెప్పాలి

- ఆ తర్వాతే కరీంనగర్ రావాలి: బండి సంజయ్



హైదరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీరు 'ఒక మనిషిని చంపేసి, తర్వాత తానే అతని ఫొటోకు దండేసి దండం పెట్టినట్లు'గా ఉందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. 'కేసీఆర్.. మీ హయాంలో పంట నష్టపోయిన రైతులను ఏనాడైనా ఆదుకున్నారా?' అని నిలదీశారు. అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు కేసీఆర్ శుక్రవారం వస్తుండడం శుభ పరిణామమేనన్న సంజయ్.. ఆయన పదేళ్ల పాలనలో ఏనాడైనా రైతులను ఆదుకున్నారా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలో రైతుల దుస్థితికి తానే కారణమని ఒప్పుకొని ముక్కు నేలకు రాసి బహిరంగ క్షమాపణ చెప్పి కరీంనగర్‌కు రావాలని సూచించారు.

ఉప్పల్ గ్రౌండ్‌కు కరెంట్ కట్

- రూ.1.67 కోట్ల మేర బిల్లు బకాయిలు
- ఎట్టకేలకు గురువారం రాత్రి పునరుద్ధరణ

హైదరాబాద్ సిటీ/ఉప్పల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చల్లని సాయంత్రం వేళ శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్ ఎంజాయ్ చేద్దామని ఎదురుచూస్తున్న క్రికెట్ అభిమానులకు తెలంగాణ విద్యుత్ శాఖ షాక్ ఇచ్చింది. ఉప్పల్ గ్రౌండ్ నుంచి రావాల్సిన కరెంటు బకాయిలు చెల్లించలేదనే కారణంతో అధికారులు గురువారం మధ్యాహ్నం స్టేడియానికి కరెంట్ బంద్ చేశారు. ఈ వార్త సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో వైరల్ కావడంతో అభిమానులు ఒకింత ఆందోళనకు గురయ్యారు. అయితే, హెచ్‌సీఏ అధికారులు చర్చలు జరపడంతో ఎట్టకేలకు గురువారం రాత్రి 9 గంటలకు అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. శుక్రవారం ఉప్పల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య మ్యాచ్ ఉంది. అయితే శుక్రవారం సాయంత్రం 7.30 గంటలకు ప్రారంభమయ్యే మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించేందుకు టికెట్లు కొనుగోలు చేసిన అభిమానులకు విద్యుత్ శాఖ నుంచి పిడుగులాంటి వార్త వచ్చింది. హెచ్‌సీఏ ప్రతినిధులు ఉప్పల్ స్టేడియంలో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నారని విద్యుత్ అధికారులు తొమ్మిదేళ్ల క్రితం కేసు పెట్టారు. దీనిపై హెచ్‌సీఏ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ క్రమంలో ఉప్పల్ స్టేడియంలో విద్యుత్ చౌర్యం జరిగిందని తేలింది. దీంతో ట్రాన్స్‌కో అధికారులు ఫిబ్రవరిలో రూ.1.67 కోట్ల బకాయిలు చెల్లించాలని హెచ్‌సీఏకు నోటీసులు అందజేశారు.



ఉప్పల్ స్టేడియంలో వినియోగిస్తున్న జనరేటర్లు

తప్పనిసరి పరిస్థితుల్లోనే కట్..

విద్యుత్ బకాయిలు చెల్లించకుండా స్టేడియం నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని హబ్సిగూడ ఎస్ఈ రాముడు తెలిపారు. 2015లో స్టేడియం నిర్వాహకులపై విద్యుత్ చౌర్యం కేసు నమోదైందని చెప్పారు. గత ఫిబ్రవరి 20న ఒకసారి, 15 రోజుల క్రితం మరోసారి నోటీసులు పంపించామని.. స్పందించకపోవడంతో కరెంట్ కట్ చేశామని పేర్కొన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో బకాయిలు రాబట్టుకునేందుకే విద్యుత్‌ను నిలిపివేసినట్లు విద్యుత్ అధికారులు చెబుతున్నారు. మరోవైపు, విద్యుత్ శాఖ అధికారులు అడిగినన్ని టికెట్లు ఇవ్వకపోవడంతోనే సరఫరాను నిలిపివేసినట్లు ఆరోపణలు వచ్చాయి. కాగా, గురువారం మధ్యాహ్నం నుంచి హెచ్‌సీఏ ప్రతినిధులు జనరేటర్ వినియోగిస్తున్నారు. శుక్రవారం జరిగే మ్యాచ్ కోసం క్రీడాకారులు గురువారం జనరేటర్ వెలుగుల మధ్యనే ప్రాక్టీస్ చేశారు.

ఐపీఎల్‌లో బ్లాక్ టికెట్ల దందా

ఐపీఎల్ టికెట్లలో బ్లాక్ దందా జోరుగా సాగుతోంది. శుక్రవారం సన్‌రైజర్స్ హైదరాబాద్.. చెన్నై సూపర్‌కింగ్స్ మధ్య ఉప్పల్‌లో మ్యాచ్ జరగనుంది. చెన్నై తరఫున ధోనీ ఆడుతుండటంతో.. ఈ మ్యాచ్‌కు ఉన్న క్రేజ్ నేపథ్యంలో టికెట్లు దొరికిన కొంత మంది వాటిని రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. రూ.2వేల టికెట్‌ను రూ.6వేలకు, రూ.10 వేల టికెట్‌ను రూ.20వేలకు అమ్ముతున్నారు. కొంతమంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులు కొని.. వాటిని బ్లాక్‌లో అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84.
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.



ఎస్‌ఆర్‌ఎం వర్సిటీలో ఎంటెక్

ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ(ఏపీ) ఎంటెక్‌లో చేరేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఎంటెక్‌లో అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ట్యూషన్ ఫీజు నుంచి మినహాయింపు ఇచ్చింది. నెలకు రూ.ఆరు వేలు స్టయిపెండ్‌గా లభిస్తుంది. స్టూడెంట్ రీసెర్చ్ ఇంటర్న్‌షిప్, కోర్సు ప్రాజెక్టులతో కలిపి ఇంటిగ్రేటెడ్ కరికులమ్, సీనియర్ థీసిస్ ప్రాజెక్టుకు అవకాశం ఈ కోర్సులో చేరిన అభ్యర్థులకు ఉంటాయి.


స్పెషలైజేషన్లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఏఐ అండ్ ఎంఎల్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ) - సీఎస్ఈ/ఐటీ/ఎస్‌డబ్ల్యూఈలో బీఈ/బీటెక్ లేదా ఎమ్మెస్సీ(సీఎస్ఈ/ఐటీ)లేదా ఎంసీఏ ఉత్తీర్ణత.

- ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఎంబెడెడ్ సిస్టమ్స్ అండ్ ఐఓటీ, వీఎల్ఎస్ఐ) - ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో అంటే ఈసీఈ, ఈఈఈ, ఈఐఈలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- మెకానికల్ ఇంజనీరింగ్(థెర్మల్, మెటీరియల్స్ అండ్ మాన్యుఫాక్చరింగ్) - మెకానికల్, మాన్యుఫాక్చరింగ్, మెటలర్జీ, ప్రొడక్షన్ ఇంజనీరింగ్‌లో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణత

వెబ్‌సైట్: admissions.srmap.edu.in/lp/mtech/

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● శుక్రవారం 5 ఏప్రిల్ 2024
diksuchi@andhrajyothy.com

ఇంద్రప్రస్థ ఇన్‌స్టిట్యూట్‌లో పీహెచ్‌డీ



ఢిల్లీలోని ఇంద్రప్రస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐఐఐటీడీ)- పీహెచ్‌డీ 2024(మాన్‌సూన్ సెషన్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రెగ్యులర్, స్పాన్సర్డ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. స్పాన్సర్డ్ ప్రోగ్రామ్‌ను వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. వీరు స్పాన్సరింగ్ సర్టిఫికెట్‌ను సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అకడమిక్ మెరిట్, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ (ఎస్ఓపీ) ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌కు మాత్రం పీజీక్యాట్ ఎగ్జామ్ ఉంటుంది.

పరిశోధన విభాగాలు: కంప్యూటేషనల్ బయాలజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, సోషల్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్(ఫిలాసఫీ, కమ్యూనికేషన్, గవర్నెన్స్, పాలిటిక్స్), హ్యూమన్ సెంటర్డ్ డిజైన్.

అర్హత: అభ్యర్థులు ఎంచుకొన్న విభాగాన్ని అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లతో ఎంఈ/ఎంటెక్/ఎంఫార్మసీ/ఎండిజైన్/ఎంఎస్/ఎమ్మెస్సీ/ఎంసీఏ/ఎంబీబీఎస్/ఎంస్టాట్/ఎంఫిల్/ఎంఏ/ఎంఎస్‌డబ్ల్యూ/ఎంకాం ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 70 శాతం మార్కులతో బీఈ/బీటెక్/బీఫార్మసీ/బీడిజైన్ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సీఎస్ఐఆర్/యూజీసీ/డీఎస్‌టీ/ఇన్‌స్పయిర్/ఐసీఎంఆర్/డీబీటీ/ఎన్‌బీహెచ్ఎం ఫెలోషిప్ అర్హత తప్పనిసరి. నిర్దేశించిన విభాగాలకు గేట్/జీప్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ఫెలోషిప్: రెగ్యులర్ ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులందరికీ సంస్థ ఫెలోషిప్‌లు అందిస్తుంది. కాంప్రహెన్సివ్ ఎగ్జామ్ పూర్తయ్యేవరకు నెలకు రూ.37,000; తరవాత పీహెచ్‌డీ పూర్తయ్యే వరకు నెలకు రూ.42,000 ఇస్తారు. ప్రతినెలా హెచ్ఆర్ఏ చెల్లిస్తారు. ల్యాప్‌టాప్/డెస్క్‌టాప్ కొనుగోలు నిమిత్తం రూ.50,000; కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.20,000 చెల్లిస్తారు. రీసెర్చ్ వర్క్ నిమిత్తం ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లకు హాజరయ్యేందుకుగాను ప్రోగ్రామ్ మొత్తమ్మీద రూ.రెండున్నర లక్షలు ఇస్తారు. మూడు నుంచి ఆర్నెల్లపాటు విదేశాల్లో పరిశోధనలు చేసేందుకు 12000 యూఎస్ డాలర్లు చెల్లిస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.300; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 14
- **అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 22
- **ఈసీఈ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు:** ఏప్రిల్ 25, 26; మే 10
- **సీఎస్ఈ అభ్యర్థులకు పీజీ క్యాట్ ఎగ్జామ్:** ఏప్రిల్ 28
- **సీఎస్ఈ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు:** మే 2, 3
- **మిగిలిన స్పెషలైజేషన్‌లకు రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూలు:** మే 1 నుంచి 13 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** మే 25
- **వెబ్‌సైట్:** www.iiitd.ac.in



తెలివి తక్కువ కాకి




అడవికి దగ్గరలో ఓ ఊరు ఉండేది. ఆ ఊరిలోని ఓ వేప చెట్టులో ఓ కాకి ఉండేది. అది తెలివైనదని అనుకునేది. తన తెలివి ఎవరికీ లేదనుకునేది. ఆ కాకి మిత్రుడు పావురం. ఆ పావురంతో గొప్పలు చెప్పేది. ఒక రోజు పావురం వేరే ప్రాంతంకు వెళ్లి వస్తోంటే.. ఓ డేగ వెంబడించింది. క్షణాల్లో గాల్లో పల్టీలు కొట్టి పావురం తుర్రుమని తప్పించుకుంది. పావురం ప్రతిభను చూసి కాకి కుళ్లు పడింది. ఇలా నేను చేస్తానని పావురంతో అనేది. ఒక రోజు కాకి, పావురం బయటకి వెళ్లాయి. తిరిగి వస్తోంటే విపరీతమైన గాలి. పావురం గాల్లో పల్టీలు కొట్టి వేగంగా దూసుకొచ్చింది. కాకి కూడా అలా చేయాలని ప్రయత్నించింది. అడవిలోని ముళ్లపొదల్లో పడిపోయింది. ప్రాణం ఉన్నందుకు సంతోషపడింది. ఇతరులను అనుకరించొద్దు అని పావురం చెప్పినా కాకి పట్టించుకోలేదు. పైగా గాలి ప్రభావం అని చెప్పింది.

గద్దలు ఆహారాన్ని సంపాదించటంలో ప్రతిభ ఉన్నవి. ఆకాశ మార్గాన అంత ఎత్తులో ఉండి భూమ్మీద ఉండే ఆహారాన్ని ఇట్టే తీసుకెళ్లటం కాకికి విచిత్రం అనిపించింది. భూమ్మీద ఉడుతలు, ఎలుకలు, పాములు, కుందేళ్లు.. లాంటి చిన్న జంతువులు కనిపిస్తే సరి.. క్షణాల్లో గద్ద వచ్చి తన్నుకుని పోయేది. గద్ద వేటాడే పద్ధతి, తన ఆహారం పట్ల శ్రద్ధను కాకి గమనించింది. తనకంటే తక్కువ ప్రతిభగల పావురంతో తాను పోల్చుకోవటం అసహ్యం అనుకుంది.




గద్ద మాదిరే ఆకాశ మార్గాన పయనిస్తూ ఆహారాన్ని తేలికగా పసిగట్టి తన్నుకు పోవాలని కాకి ప్రయత్నించింది. అయితే తన మిత్రుడు పావురం మాత్రం ఈ చర్య మంచిదికాదని చెప్పింది. అయినా కాకి వినే పరిస్థితి లేదు. గాల్లో ఎత్తుకు ఎగిరి కిందకు చూసింది. వేగంగా రావటానికి ప్రయత్నించింది. అయితే పైనుంచి కింద ప్రాణులు కనుక్కోవటం దానికి ఇబ్బంది అనిపించింది. అయితే పావురంతో పాటు ఓ డేగ, నెమలి కాకి దగ్గరకు వచ్చాయి. వాటిని చూసి మీరంతా చూస్తుంటే గాల్లో నుంచి వేగంగా వచ్చి ఉడుతలను తీసుకెళ్తాను. నా ముందు గద్ద దిగదుడుపే అని చెప్పింది. దీంతో కాకి ప్రతిభను చూడటానికి ఉత్సాహపడ్డారు. చూస్తుండగానే కాకి గాల్లోకి ఎగిరింది. పైకి ఎగిరింది. పైనుంచి క్షణాల్లో కిందకి రావాలని రెక్కలాడించింది. వేగం పట్టుతప్పి చెట్ల మధ్య పడి ముక్కు విరగ్గొట్టుకుంది. ప్రాణం మిగిలింది కదా.. అంటూ బాధతో మూల్గింది. నాకు కాలం కలసి రాలేదనే సాకులు చెప్పింది. 'ఇతరులను అనుకరించొద్దు' అంటూ పావురం మంచి చెప్పినా కాకికి ఎక్కలేదు. అదే తెలివి తక్కువతనం.


సరైన నీడ ఏది?




10 తేడాలు గుర్తించండి



జత ఉన్న బొమ్మ ఏది?



దారి కనుక్కోండి



సీఐఎఫ్ఎన్ఈటీలో ట్రేడ్ కోర్సులు

కేంద్ర ఫిషరీస్ విభాగం ఆధ్వర్యంలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ నాటికల్ అండ్ ఇంజనీరింగ్ ట్రెయినింగ్(సీఐఎఫ్ఎన్ఈటీ)- వెసల్ నావిగేటర్ కోర్సు(వీఎన్‌సీ), మెరైన్ ఫిట్టర్ కోర్సు(ఎంఎఫ్‌సీ)లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇవి ట్రేడ్ కోర్సులు. ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. వీటిలో ఫిషింగ్ వెసల్స్‌పై ప్రాక్టికల్ ట్రెయినింగ్ ఉంటుంది. ఎన్‌సీవీటీ క్రాఫ్ట్‌మెన్ ట్రెయినింగ్ స్కీం కింద న్యూఢిల్లీలోని డీజీఈటీ, ఈ కోర్సులను నిర్వహిస్తోంది. ఇవి కొచ్చి, చెన్నై, విశాఖపట్నం క్యాంపస్‌లలో అందుబాటులో ఉన్నాయి. ఒక్కో క్యాంపస్‌లో వీఎన్‌సీ 20, ఎంఎఫ్‌సీ 20 సీట్లు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ స్కోర్, కౌన్సెలింగ్‌ల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.1500ల స్టయిపెండ్ ఇస్తారు. పోస్ట్ ఇన్‌స్టిట్యూషనల్ ట్రెయినింగ్ సమయంలో నెలకు రూ.20,500ల స్టయిపెండ్ ఇస్తారు. యూనిఫాం అలవెన్స్ కింద రూ.2500 చెల్లిస్తారు.

అర్హత: మేథమెటిక్స్, సైన్స్ ప్రధాన సబ్జెక్టులుగా పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 40 శాతం మార్కులు తప్పనిసరి. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 1 నాటికి 15 నుంచి 20 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు నిబంధనల ప్రకారం వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.

ముఖ్య సమాచారం

- వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని నింపి నిర్దేశిత పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి.
- **జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి, ఇంటర్/పన్నెండో తరగతి మార్కుల పత్రాలు; కుల ధృవీకరణ పత్రాలు, ఫీజుకు సంబంధించిన ఈ రిసిప్ట్
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.350; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.175
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 14
- **టెస్ట్ సెంటర్లు:** కొచ్చి, చెన్నై, విశాఖపట్నం, కోల్‌కతా
- **కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** జూన్ 29
- **ఫలితాలు విడుదల:** జూలై 7
- **కౌన్సెలింగ్:** జూలై 18
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్, సీఐఎఫ్ఎన్ఈటీ, ఫైన్ ఆర్ట్స్ అవెన్యూ, ఫోర్‌షోర్ రోడ్, కొచ్చి-682016
- **వెబ్‌సైట్:** www.cifnet.gov.in



జోధ్‌పూర్ ఎయిమ్స్‌లో ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్

జోధ్‌పూర్‌లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్) ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్- 'పబ్లిక్ హెల్త్ పాలసీ, లీడర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్ 2024(జూలై సెషన్)ని నిర్వహిస్తోంది. హెల్త్, సోషల్ సర్వీసెస్, ఎడ్యుకేషన్, క్లినికల్ రీసెర్చ్, మెడిసిన్, ఫార్మాస్యూటికల్ విభాగాలకు సంబంధించిన కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలతోపాటు ప్రైవేటు ఆర్గనైజేషన్లలో కనీసం అయిదేళ్ల అనుభవం ఉన్న వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ఈ ప్రోగ్రామ్‌ని ఉద్దేశించారు. ఇందులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. మెడికల్ కేటగిరీకి 8, నాన్ మెడికల్ కేటగిరీకి 7, విదేశీ అభ్యర్థుల కేటగిరీకి 5 సీట్లు కేటాయించారు. కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ఇందులో భాగంగా రెండు కాంటాక్ట్ సెషన్స్(సెషన్‌కు మూడు రోజులు); 23 వారాలపాటు వెబ్ బేస్డ్ లెర్నింగ్, ప్రాజెక్టు వర్క్ ఉంటాయి. ప్రోగ్రామ్ మొత్తమ్మీద అభ్యర్థులు ఆన్‌లైన్ మోడ్‌లో 7 క్రెడిట్స్, కాంటాక్ట్ సెషన్స్‌లో 2 క్రెడిట్స్, ప్రాజెక్టు వర్క్‌లో 1 క్రెడిట్ సాధించాల్సి ఉంటుంది. కనీసం 30 గంటల బోధనకు 1 క్రెడిట్ ఇస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్‌లో ఆరు మాడ్యూల్స్ ఉంటాయి. ప్రతి మాడ్యూల్ చివర ఫార్మేటివ్, సమ్మేటివ్ అసెస్‌మెంట్లు పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇంట్రడక్షన్ టూ హెల్త్ పాలసీ, హెల్త్ పాలసీ ఫ్రేమ్ వర్క్, స్టాక్ హోల్డర్ అనాలిసిస్ అండ్ పాలసీ ఇంప్లిమెంటేషన్, హెల్త్ ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్‌లకు ఒక్కోదానికి 1.5 క్రెడిట్లు; అసెస్‌మెంట్ అండ్ స్ట్రాటజిక్ ప్లానింగ్‌కు 1 క్రెడిట్; లీడర్‌షిప్ ఇన్ హెల్త్ పాలసీ అండ్ మేనేజ్‌మెంట్‌కు 2 క్రెడిట్లు, అకడమిక్ ప్రాజెక్ట్‌కు 1 క్రెడిట్ కేటాయించారు.

అర్హత: మెడికల్ కేటగిరీకి ఎంబీబీఎస్/బీడీఎస్/ఆయుష్ డిగ్రీలు పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. నాన్ మెడికల్ కేటగిరీకి కనీసం 55 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ(నర్సింగ్/వెటర్నరీ సైన్స్/ఫిజియోథెరపీ/ఆక్యుపేషనల్ థెరపీ/ఇంజనీరింగ్) లేదా ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పనిచేస్తున్న సంస్థ నుంచి అనుమతి పత్రం, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్‌లను దరఖాస్తుకు జత చేయాలి.

ఎంపిక: అకడమిక్ ప్రతిభ, అనుభవం, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్(ఎస్ఓపీ) ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు పర్సనల్/వెబ్ బేస్డ్ ఇంటర్వ్యూ నిర్వహించి అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రూ.25,000; ప్రైవేట్ ఉద్యోగులకు రూ.1,00,000; విదేశీ అభ్యర్థులకు 1500 యూఎస్ డాలర్లు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 30
- **కోర్సు ప్రారంభం:** జూలై 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.aiimsjodhpur.edu.in

ఢిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ - వివిధ ఖాళీలు

ఢిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలెక్షన్ బోర్డ్... వివిధ శాఖలు/విభాగాలు/స్థానిక సంస్థల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు 414

పోస్టుల వివరాలు


1. డ్రైవర్(డ్రగ్స్ కంట్రోల్): 1 పోస్టు
2. స్టాఫ్ కార్ డ్రైవర్(లా, జస్టిస్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్): 1 పోస్టు
3. స్టాఫ్ కార్ డ్రైవర్(లోకాయుక్త): 1 పోస్టు
4. స్టాఫ్ కార్ డ్రైవర్(డైరెక్టరేట్ ఆఫ్ విజిలెన్స్): 3 పోస్టులు
5. స్టాఫ్ కార్ డ్రైవర్(జనరల్ అడ్మినిస్ట్రేషన్): 12 పోస్టులు
6. డ్రైవర్(ఎల్ఎంవీ): 1 పోస్టు
7. స్టాఫ్ కార్ డ్రైవర్(ఢిల్లీ జైల్స్): 11 పోస్టులు
8. ల్యాబ్ టెక్నీషియన్(గ్రూప్-3)(కార్డియాలజీ తదితరాలు): 38 పోస్టులు
9. ల్యాబ్ టెక్నీషియన్(గ్రూప్-4)(బయోకెమిస్ట్రీ తదితరాలు): 6 పోస్టులు
10. ల్యాబ్ టెక్నీషియన్: 10 పోస్టులు
11. ల్యాబొరేటరీ టెక్నీషియన్: 1 పోస్టు
12. ఫార్మసిస్ట్(డిస్పెన్సర్): 110 పోస్టులు
13. ఫార్మసిస్ట్(అల్లోపతి): 18 పోస్టులు
14. ఆక్సిలరీ నర్స్/మిడ్ వైఫ్(మున్సిపల్ కార్పొరేషన్): 144 పోస్టులు
15. ఆక్సిలరీ నర్స్/మిడ్ వైఫ్(మున్సిపల్ కౌన్సిల్): 8 పోస్టులు
16. డ్రాఫ్ట్స్‌మన్ గ్రేడ్-3(సివిల్): 10 పోస్టులు
17. స్టోర్ కీపర్: 1 పోస్టు
18. స్టోర్ సూపర్‌వైజర్: 1 పోస్టు
19. ఫార్మసిస్ట్(అగ్రి మార్కెటింగ్): 2 పోస్టులు
20. జూనియర్ ఫార్మసిస్ట్: 3 పోస్టులు
21. అసిస్టెంట్ శానిటరీ ఇన్‌స్పెక్టర్: 32 పోస్టులు

అర్హత: పోస్టును అనుసరించి 10వ తరగతి, 10+2, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు, ఎక్స్-సర్వీస్‌మన్, మహిళా అభ్యర్థులకు మినహాయింపు ఉంది.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఏప్రిల్ 19

వెబ్‌సైట్: https://dsssb.delhi.gov.in/notifications



గోవా షిప్‌యార్డులో మేనేజర్లు

గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్...కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు 20

1. డిప్యూటీ మేనేజర్ (మెకానికల్): 8 పోస్టులు
2. డిప్యూటీ మేనేజర్(ఎలక్ట్రికల్): 1 పోస్టు
3. అసిస్టెంట్ మేనేజర్(మెకానికల్): 6 పోస్టులు
4. అసిస్టెంట్ మేనేజర్(ఎలక్ట్రికల్): 4 పోస్టులు
5. అసిస్టెంట్ మేనేజర్(సీఎస్ఆర్): 1 పోస్టు

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, డిప్లొమా, పీజీ ఉత్తీర్ణతతో పాటు అనుభవం ఉండాలి.

వయోపరిమితి: డిప్యూటీ మేనేజర్ పోస్టులకు 33 సంవత్సరాలు, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు.

పే స్కేల్: డిప్యూటీ మేనేజర్ పోస్టులకు రూ.50,000 నుంచి రూ.1,60,000. అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు రూ.40,000 నుంచి రూ.1,40,000.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఏప్రిల్ 6

వెబ్‌సైట్: https://goashipyard.in/notice-board/careers/

ఎన్‌హెచ్‌పీసీలో అప్రెంటిస్‌లు

సురంగని, చంబా(హిమాచల్‌ప్రదేశ్)లోని నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్...కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు 50

పోస్టు: ట్రేడ్ అప్రెంటిస్

ట్రేడులు: ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్(మోటార్ వెహికిల్), టర్నర్, మెషినిస్ట్, వెల్డర్(గ్యాస్, ఎలక్ట్రిక్), సీఓపీఏ

అర్హత: సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణత

వయోపరిమితి: 18-30 ఏళ్ల మధ్య ఉండాలి.

శిక్షణ వ్యవధి: ఏడాది

ఎంపిక ప్రక్రియ: విద్యార్హత మార్కులు, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 10

వెబ్‌సైట్: https://www.nhpcindia.com/welcome/job

జాబ్ కార్నర్



రైల్ కోచ్ ఫ్యాక్టరీలో అప్రెంటిస్‌లు

మొత్తం ఖాళీలు 550

కపుర్తలా(పంజాబ్)లోని రైల్ కోచ్ ఫ్యాక్టరీ(ఆర్‌సీఎఫ్)...కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ట్రేడులు: ఫిట్టర్, వెల్డర్, మెషినిస్ట్, పెయింటర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ అండ్ రిఫ్రిజిరేటర్ మెకానిక్.

అర్హత: మెట్రిక్యులేషన్, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 మార్చి 31 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి

ఎంపిక ప్రక్రియ: అకడమిక్ స్కోర్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 9

వెబ్‌సైట్: https://rcf.indianrailways.gov.in/

డైలీ సుడోకు - 273

3		7						
5	1		3				4	6
9			7			3		2
	4			1				
		1		6		5		
				7			9	
4		2			7			8
7	9				8		3	4
						2		9

సుడోకు - 272 సమాధానం

5	7	6	1	2	9	4	3	8
3	9	1	5	8	4	2	7	6
8	2	4	7	3	6	9	5	1
4	8	7	2	6	1	3	9	5
6	1	3	4	9	5	8	2	7
9	5	2	8	7	3	6	1	4
1	3	5	6	4	2	7	8	9
2	6	8	9	1	7	5	4	3
7	4	9	3	5	8	1	6	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.